
కంచి పరమాచార్య

శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర స్వామి వారి

అమృతవాణి-సప్తమ భాగము

శంకర విజయం



కంచి పరమాచార్య

శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి వారి

అమృతవాణి - సప్తమ భాగము

శంకర విజయం

అనువక్త:

దేవరకొండ శేషగిరిరావు

ప్రకాశకులు

మహా విద్యాపీఠం

హైదరాబాద్

కంచి మహాస్వామి అమృతవాణి సప్తమ భాగము

అనువక్త : దేవరకొండ శేషగిరిరావు

ప్రథమ ముద్రణ : మే 2013

ప్రకాశకులు : మహావిద్యా పీఠం,
ఎయిర్‌ఫోర్స్ అకాడమీ రోడ్, దుండిగల్,
హైదరాబాద్-500 043, సెల్: 98854 44428

వెల : రూ. 125/-

ప్రతులకు : అన్ని ముఖ్యమైన పుస్తక విక్రయ కేంద్రాలు

టైటిల్ డిజైన్ : కె. రామకృష్ణ

ప్రింటింగ్ :కర్తిక్ ఆర్ట్ ప్రింటర్స్, విద్యానగర్, హైదరాబాద్

అనుగ్రహం

శ్రీ కంచి మహాస్వామివారి అమృతవాణిలో ఇది ఏడవభాగం. అంతకుముందు ప్రచురించబడిన వారి అద్వైతసాధన, గురుసంప్రదాయంతో కలిసి ఇది తొమ్మిదవ పుస్తకం.

తెలుగులో ఇంతవరకు రాని వాటిని, అసమగ్రమైన వాటిని సమగ్రంగా అందించడమే లక్ష్యంగా అనువాద కార్యక్రమం ఇంతవరకూ సాగింది.

స్వామివారి ఉపన్యాసాలు ఆంగ్లంలో 'వాయిస్ ఆఫ్ గాడ్' అనే పేరుతో ఏడు సంపుటాలలో అనువదింపబడగా ఐదవ సంపుటంలోని శంకర విజయానికి ఇది అనువాదం. శ్రీ వి. కృష్ణమాచారిగారు దీనిని ఆంగ్లంలో అనువదించారు.

40 సంవత్సరాల వెనుక, తెనాలి సాధన గ్రంథ మండలి వారు ప్రచురించిన జగద్గురు బోధలలోని ఒక సంపుటంలో శంకరుల గురించి 228 పుటలుంది (క్రౌన్ సైజ్‌లో). కాని ఆంగ్లంలో 500 పుటలుంది. దీనిలో ఉపోద్ఘాతమే రెండువందల పుటలు, శంకరుల జీవితకాలంపై 50 పుటలుంది. ఇందనేక శంకర విజయాల తులనాత్మక పరిశీలన కూడా ఉంది. అందువల్ల ఈ అనువాదం చేయవలసి వచ్చింది.

మూడు సంవత్సరాల నుండి శ్రీ స్వామివారి అమృతవాణి సేవించే భాగ్యాన్ని కలిగించినవారు, శ్రీ వావిలాల ఉమాపతి సి.ఎ.గారు. నా రచనలతో బాటు ఈ తొమ్మిది సంపుటాలను ప్రచురించారు. కృతజ్ఞతాభివందనములు అనే మాటకంటె ఏమి వ్రాయగలను? వారి సంప్రదాయ అభిమానానికి, సహృదయత్వానికి మరొక్కసారి వందనములు.

శంకరుల కాలం గురించి ముఖ్యమైన వాటికే అనువదించాను. కాల వివరాలు గురించి పాఠకులేమంటారో అని సందేహించి కొద్దిగా ఆ విషయాన్ని కుదించవలసి వచ్చింది. ఇంకా వివరాలకు కోట వెంకటచలం గారి 'కలిశక విజ్ఞాన సంపుటాల'ను చూడండి.

-అనువక్త

Tel : 044-27222115 E-mail : skmkanci@md3.vsnl.net.in
Fax: 044-27224305, 37290060

Sri Chandramouleeswaraya Namaha:
Sri Sankara bhaghavadpadacharya Paramparagatha Moolamnaya Sarvagnapeeta

His Holiness Sri Kanchi Kamakoti Peetadhipathi
JAGADGURU SRI SANKARACHARYA SWAMIGAL
Srimatam Samsthanam
No. 1, Salai Street, KANCHIPURAM - 631 502

ఆశీర్వచనము

కాంచీపురమ్ **2-2-2013**

రమారమి 2500 సంవత్సములకు పూర్వము కైలాసవాసి అయిన పరమేశ్వరుడు కాలడిలో ఆర్యాంబా శివగురువుల పుత్రునిగా అవతరించినాడు. తమ ఉపదేశములచే లోక శంకరత్వమును పొంది శ్రీ శంకరులనెడి సార్థక నామధేయులయినారు. ఆత్మోపదేశం చేత తాప పాప పీడితులయిన సకల జనులను రక్షించుటకై ఆసేతుహిమాచల పర్యంతము పాదచారులుగా పర్యటించి కర్మభక్తి జ్ఞాన మార్గములను ప్రదర్శించి శైవ శాక్త కౌమార గాణాపత్య సౌర వైష్ణవ పూజాది రూపమైన షణ్మత ప్రతిష్ఠాపనము గావించి మహోపకారమొనరించినారు.

అట్లు స్థాపించబడిన మఠానుష్ఠానములు సర్వదా అభివృద్ధి పొందుటకు సర్వజన హితమును, సర్వజన సుఖమును కలిగించు ఆచరణ మార్గమును . అవిచ్ఛన్నముగా ప్రదర్శించుట కొరకు నాలుగు దిక్కులతోను మఠములను స్థాపించి తాము స్వయముగా శ్రీ కాంచీపురముతో మఠమును అధిష్ఠించి నారన్నదియు, కంచిలో సర్వజ్ఞ పీఠాదిరోహణమును చేసినారన్నదియు బహు ప్రమాణ సిద్ధమైన వృత్తాంతము.

అట్టి మహోన్నతమైన కంచి కామకోటి పీఠము ఆదిశంకరులాదిగా ఇప్పటివరకు మహోన్నతులైన గురు పరంపరతో అవిచ్ఛిన్నముగా కొనసాగుతూ ఉన్నది. ఆ ఆచార్యులందరూ వైదిక ధర్మమార్గము స్వయముగా ఆచరించి బోధించి పరిపుష్టమొనరించినారు.

అట్టి పరంపరలో ౬౮వ ఆచార్యులుగా ఉన్న మా గురుదేవులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామివారు నడిచే దేమునిగా బహుప్రసిద్ధులు. తమ పద మూడేండ్ల చిఱుత ప్రాయములో మహోన్నతమైన కంచి కామకోటి పీఠమునధిష్ఠించి తమ నూరేళ్ళ జీవితకాలంలో మానవాళి పైగల అవ్యాజమైన కరుణ కారణంగా సర్వజన శ్రేయోదాకమైన వేద ధర్మ శాస్త్రాచార పరిపాలన విషయంలో అహర్నిశలూ పరిశ్రమించినారు. నిరంతరమూ ప్రజలను ప్రబోధించినారు.

అపర శంకరులయిన మా గురుదేవులు అది శంకరాచార్యులవారి అవతారోద్దేశ్యము వారి చరిత్రలోని ముఖ్య ఘట్టములను గురించి చేసిన వివరణమే ఈ సంపుటము. వినయ మూర్తులైన ఆచార్యుల వారు తమను గురించి తామెక్కడనూ చెప్పుకొన్నది లేదు. వారి చరిత్రను వివరించుటకు వచ్చిన శంకర విజయములన్నియు తరువాత కాలంలో వచ్చినవే! అందువలన విభిన్నత సహజము. మా గురుదేవులు, సునిశితమైన పరిశీలనా దృష్టి చేతనూ బహుత్ గ్రంథములను పరిశోధించుటవలననూ ఇట్టి భిన్నాభిప్రాయములను వివరించి సమన్వయ పరిచినారు. ఈ సంపుటము శంకరులకు పూర్వమున్న క్షీణదశను వివరించి, ఆచార్యులవారు శివావతారమనుటకు వేదమునుండి పురాణములనుండి ప్రమాణములను చూపి, అద్వైత సిద్ధాంతానుసారము అవతారముల స్థితిని చర్చించినది. శంకరుల పూర్వపు గురు పరంపర, శంకరుల తరువాత వచ్చిన శిష్యులు, శంకరుల కాలము, మొదలైన అనేక సంశయగ్రస్థమైన విషయుల విషయములలో స్పష్టాభిప్రాయమును ఏర్పరచుకొనుటకు మార్గదర్శకమైనది.

ఈ సంపుటమును తెలుగులో అనువదించి ఆంధ్రులకు మహోపకారము చేసినవారు సంస్కృతాంధ్ర పండితులు, వయోవృద్ధులు అయిన శ్రీ దేవరకొండ శేషగిరి రావుగారు. గత మూడు సంవత్సరములుగా మహాస్వామి వారి ఉపదేశములను అనువదించడమనే ఒక మహాతపస్సులో నిమగ్నులయ్యి ఉన్నారు. మహాస్వామివారి ఉపదేశములపైనున్న వీరికి గల అపారమైన మక్కువే వీరికి ఈ ఓపికను ప్రసాదించింది. వీరిని ప్రోత్సహించి పది సంపుటములుగా ఇంతవరకూ తెలుగులోనికి రాని ఉపన్యాసములను ప్రచురించుచున్నవారు మహావిద్యాపీఠం, హైదరాబాద్ వారు.

ఆచార్యుల వారి అనన్య సామాన్యమైన మహోన్నతిని అవగాహన చేసుకోవడానికి ఉపయోగించే ఈ ఉపదేశములను అందుబాటులోనికి తేవడం ద్వారా ఆంధ్రులకు మహోపకారము చేసిన అనువక్తకూ, ప్రచురణ కర్తలకూ మహా త్రిపురం సుందరీ చంద్రమౌళీశ్వరుల అనుకంపా విశేషం చేత సమస్త శ్రేయస్సులూ కలుగవలయుననియూ ఆస్తికులైన ఆంధ్రులు ఈ గ్రంథమును చదివి తరించగలరనియూ నారాయణ స్మృతి పూర్వకముగా ఆశీర్వదించుచున్నాము.

ఇతి నారాయణ స్మృతి.

విషయ సూచిక

సచ్చిదానందమే-65, జీవాత్మ - పరమాత్మల భేదం లేదు-66, ఈశ్వరుడు మాయతో ఉన్నా జ్ఞానియే-68, చెడుతో కలవని మంచి ఉండదు-70, సేవలో కూడా కొందరికి అపకారం-71, అవతారం బోధించేది క్రియాశూన్యాన్నే-74, నిత్య జీవితంలో సత్కర్మ ఫలాలు-75, కర్మల వల్ల కర్మ రహిత స్థితి-76, కర్మలో మునుగుట లక్ష్యము కర్మరహిత స్థితి-76, స్వార్థంతో ఉండడం కాదు-78, పని చేయకపోయినా ప్రపంచానికి మంచి చేసినట్లే-80, శంభువే శంకరుడు-80, అవతార విషయమై ఆధారాలు-83, శంకరులిచ్చిన సాక్ష్యం-93, అచార్య పరంపర-94, వసిష్ఠుని నుండి వ్యాసుని వరకూ-96, శుకబ్రహ్మము-98, పతంజలి చరితం-102, విష్ణుని హృదయంలో శివనర్తనం-103, అజప - హంసనటనం-104, అదిశేషుని అవతారం-106, త్రికరణాలకు శుద్ధి-107, వేయిమంది శిష్యులకు పాఠం-110, బ్రహ్మారాక్షసులు-రాక్షసజాతి-111, విపత్తుతో అంతం -111, శిష్యునిపై అనుగ్రహం-111, జ్ఞానము - భక్తి-113, శంకరుల స్తుతి-114, చంద్రశర్మ వృత్తాంతం-114, గురు పరంపరంలో సన్యాసులు-117, నిర్వాణం-117, సన్యాసి నామము - శంకర నామం గొప్పదనం-122, రామానుజులతో పోలిక-124, గోవిందుల గొప్పదనం-126, ఆచార్య పరంపర యొక్క విశిష్టత-129, ప్రార్థన - వరము-129, దేవతల అవతారం-131, బౌద్ధమత ఖండనలో మీ మాంసకుల సాహాయ్యం-131, బౌద్ధమెట్లా భిన్నం?-132, భగవంతుడున్నాడనుట-133, శంకరుల వర్గీకరణం-136, కర్మవాదుల అవతార కారణం-137, ఇంద్ర సరస్వతుల అవతారాలు, ప్రభుత్వ సాహాయ్యం లేకుండా శంకరుల కృషి-138, కేరళ చరిత్ర-139, కేరళలో తమిళం-140, కంచి మతం - కుంభకోణం-142, అవతార ప్రదేశం - విశిష్టత-146, పుణ్య దంపతులు-146, తిరిచూర్ ప్రశస్తి-147, వర ప్రదానం-148, జయంతి గొప్పదనం-148, ఘనంగా జరపండి-149, కంచితో ప్రత్యేక సంబంధం-149, కామాక్షి ఆలయంలో శంకర జయంతి-150, మనస్సు సమర్పించుట - మౌన ధ్యానం-151, నామకరణం-152, కటపయాది సంఖ్య-152, కటపయాదితో సిద్ధిని పొందిన సంవత్సరం-153, వసంత

శ్రీ కంచి మహాస్వామివారి శంకర విజయం

ప్రవృత్తి - నివృత్తి

వేదాలు ప్రవృత్తి, నివృత్తియని రెండు మార్గాలు చూపించాయి. ప్రపంచ వ్యవహారాలను ధార్మికంగా నిర్వహించడం ప్రవృత్తిమార్గం. ప్రాపంచిక వ్యవహారానికి దూరంగా ఉండి జనన మరణ ప్రవాహం నుండి విముక్తుడగుట, పరమాత్మతో ఐక్యమగుట నివృత్తిమార్గం.

ప్రవృత్తిమార్గం, వేదచోదిత ధర్మంపై ఆధారపడి వర్ణాశ్రమాలతో ఉండి తన శ్రేయస్సునకు, సంఘ శ్రేయస్సునకు తోడ్పడే రీతితో ఉంటుంది. పుణ్య కర్మ ఫలం క్షీణించగా మరల జన్మనెత్తుట జరుగుతుంది. అంటే స్వర్గ సౌఖ్యము శాశ్వతము కాదని తేలినట్లే గదా! లోకంలో గాని, స్వర్గంలో కాని శాశ్వత సుఖం అంటూ లేదు. ఇక్కడా, అక్కడా భయం, దుఃఖం, క్రోధం మామూలే! కన్ను, చెవులు మొదలైన ఇంద్రియాల వల్ల కొంత సౌఖ్యం అనుభవించే మాట నిజమే. కాని లోనున్న ఆత్మకు ఇవి సంతోషాన్ని ప్రసాదిస్తాయా? ఆత్మతృప్తి కల్గుతుందా?

అఖండానందం అనుభవించాలంటే నివృత్తి మార్గాన్నే అనుసరించాలి. సంఘానికి దూరంగా ఉండి ఆత్మనే చింతిస్తూ అదే బ్రహ్మమని భావిస్తూ సమాధి స్థితిలో ఉండిపోవడమే. లౌకిక సుఖాలననుభవిస్తూ ఒక్కొక్కప్పుడు బ్రహ్మానందం అంటూ ఉంటారు. నిజమైన బ్రహ్మానందం నివృత్తి మార్గంలోనే.ఇట్లా అని నేను చెప్పడం కాదు. వేదమే 'అనావృత్తి శబ్దాత్, అనావృత్తి శబ్దాత్' అని చెప్పిందని బ్రహ్మసూత్రాలలో ఉంది.శబ్దమనగా ఇక్కడ వేదం. ఇదే ఛాందోగ్యోపనిషత్ మరల మరల చెప్పింది. నివృత్తి మార్గం వల్లనే పరమ సుఖమని, వీటి తాత్పర్యం.

పెక్కుమందికి పెక్కు మార్గాలు

ఈశ్వరుడాడించే జగన్నాటకంలో మీరందరూ అరణ్యాలకు పోండి సన్యాసాన్ని స్వీకరించండి, ఆత్మ విచారణ చేయండంటే నూటికి 99 మంది వినరు కూడా. అట్టి తీవ్రేచ్ఛ యుండడాన్ని ముముక్షత్వమంటారు. ముముక్షువులే ఈ జ్ఞానమార్గాన్ని అనుసరిస్తారు. ఏ నూటికో, కోటికో ఒక్కనికే పట్టుబడుతుంది. అందరూ ఏదో ఒక పనిలో మునిగి తేలుతూ ఉంటారు. ఇతరుల సాహాయ్యం సాధనాల సాహాయ్యం అపేక్షించకుండా ఉండలేరు. వారినే గీతలో కర్మసంగులని అన్నారు. ఎందుకట్లా ఉన్నారంటే వారిలో కోరిక, కర్మ ఉండడం వల్లనే. ఆ కోరిక నెరవేరాలంటే ఊరకే కూర్చుంటే నెరవేరుతుందా? ఆత్మ సాక్షాత్కారానికే ఏ పని చేయకుండా స్తిమితంగా ఉండగలగాలి. మిగిలిన వాటిని సాధించడానికి నిరంతర కార్యమగ్నులు కావలసిందే.

అంటే పనులు చేస్తున్నామంటే లోనున్న ఆత్మను మరిచి దానికి దూరంగా ఉండి బాహ్యామైన వాటిల్లో తగుల్కొంటున్నామన్నమాట. దానిని ప్రవృత్తి యనే పదమే వెల్లడించింది.

ఆత్మవైపు మళ్ళడం, నివృత్తి పదం సూచిస్తుంది. అనగా ప్రవృత్తిలో కార్యమగ్నత, నివృత్తిలో కార్య విముఖత. కనుక కోరికలతో నున్నవారిని ఆత్మవిచారణ చేయండని నిర్బంధించలేం.

కార్యమగ్నులైన వారిని చెడ్డ కోరికలు కోరకుండా ఉండడానికి, మోసాలు చేయకుండా ఉండడానికి, వేదాలు ప్రవృత్తి మార్గంలో ఉన్నవారికి కొన్ని విధులు నేర్పాటు చేసాయి. ధార్మిక మార్గాలను సూచించాయి. ఋషుల మాటల ద్వారా ప్రవృత్తి మార్గాన్ని సక్రమంగా ఉండేటట్లు భగవానుడే చేసాడు.

యతః ప్రవృత్తిం భూతానాం యేన సర్వమిదం తతం

అని గీత చెప్పింది. అనగా ఈశ్వరుని నుండే జీవులకు ప్రవృత్తి మార్గం వచ్చిందని చెప్పింది. ఈశ్వరుడే జీవులలో ఉండి వారిని ప్రవృత్తి మార్గంలో పెడుతున్నాడని శంకరులు భాష్యంలో వివరించారు.

జీవులు కర్మ సంగులగుటకు ప్రకృతియే కారణమని అదియే మాయయని అన్నారు. అయితే మాయ, తనంతట అది పనిచేస్తుందా? దీనిని నియమించువాడు, ఈశ్వరుడే. ప్రకృతియే మాయయని, దానిని తన ఆధీనంలో ఉంచుకొన్నవాడు ఈశ్వరుడని శ్వేతాశ్వతర ఉపనిషత్తు చెప్పింది. నా మాయను దాటడానికి ఎవ్వరికీ శక్యం కాదని గీతలో 'మమ మాయా దురత్యయా' అన్నాడు. అందరూ నివృత్తి మార్గంలో ఉండగలరా? ఉంటే ఈ జగన్నాటకం ఎట్లా సాగుతుంది? సనకాదులు, నివృత్తి మార్గంలో ఉండడాన్ని గమనించి బ్రహ్మ, ప్రజాపతులను సృష్టించాడని వారివల్ల ప్రజోత్పత్తి అయిందని భాగవతంలో చదువుకొన్నాం కదా! అందరూ జ్ఞానులైతే ఇక నాటకం ఎట్లా సాగుతుంది?

అయితే నాటకంలో ఇష్టం వచ్చినట్లు నటించవచ్చా? కూడదని, వారికిచ్చిన స్వేచ్ఛ కొద్దిపాటిదని విచ్చలవిడిగా వారుపయోగించకూడదని ఈశ్వరుడు, ఋషుల ద్వారా సందేశమిచ్చాడు. తాత్కాలిక భోగాలననుభవిస్తున్నా వారి మధ్యలో ఒక నియతి, ప్రేమ, అందం, పరస్పర సహకారం ఉండాలని, ధర్మంతో అన్నీ కూడి యుండాలని నిర్దేశించాడు. వేదం ద్వారా ప్రవృత్తి మార్గాన్ని అందించాడు. అందే కర్మానుష్ఠాన పద్ధతి యుంటుంది.

జ్ఞాన కాండాన్ని చివరగా ఉపనిషత్తులందించాయి. సంసారం నుండి విముక్తమైతే మోక్షం. పుణ్యకర్మల నిచ్చేది స్వర్గం.

కర్మమార్గం ఇచ్చే రెండు ఫలాలు

నిరంతరం కార్యమగ్నులమై ఉంటాం. తాత్కాలిక సుఖం లభిస్తూ ఉంటుంది. అయినా తృప్తి యుండదు. ఏమిటి ఇదంతా అనే తాత్కాలిక వైరాగ్యం కల్గుతూ ఉంటుంది. ప్రసూతి వైరాగ్యం, శ్మశాన వైరాగ్యం, పురాణ వైరాగ్యాన్ని రుచి చూస్తాం తాత్కాలికంగా. నీటిమీద వ్రాత మాదిరిగా అవీ కలకాలం మనల్ని పట్టుకొని యుండవు. మరల కర్మలలో మునుగుతూ ఉంటాం. ధ్యానాదులను

చేయలేం. కర్మకాండలు చేస్తూ నివృత్తి మార్గంలో పయనించడానికి అందులో రెండు మార్గాలున్నాయి.

కొందరు ఇహలోక సుఖాలు, పరలోక సుఖాలకై వెంపర్లాడుతూ ఉంటారు. అయితే సక్రమ మార్గంలో అనుభవించండని, మీకిచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేయకుండా ఉండండని, శాస్త్రప్రకారమే కర్మకాండలు చేయండని చెప్పడం ఒకటి. ఇందులో పెక్కు నియమాలుంటాయి.

ఇక మరొక మార్గం ఉంది. కొందరు, మాకీ కర్మలూ వద్దు, ఇహ పర సుఖాలూ వద్దు, అయినా నివృత్తి మార్గం పట్టుబడలేదని వాపోతూ ఉంటారు. అట్టివారికి కర్మఫలాల నాశించకుండా నిష్కామంగా కర్మలు చేయండని చెప్పాడు భగవానుడు. దానివల్ల చిత్తశుద్ధి ఏర్పడుతుందని, ఇవి భగవదాజ్ఞగా చేస్తున్నామని అంటే అవి ఇతణ్ణి బంధించవని అన్నాడు. పరమేశ్వర ప్రీత్యర్థం అనే భావనతో చేయాలన్నాడు. అపుడు చిత్తశుద్ధి ఏర్పడిన తరువాత కర్మలను విడిచి పెట్టే స్థితి ఏర్పడుతుంది. క్రమక్రమంగా నివృత్తి మార్గంలోకి పయనిస్తాడు. అనగా అతనిలో ధ్యానం, విచారణ మొదలౌతుంది.

ఇట్లా కర్మమార్గం వల్ల రెండు ఫలాలు లభిస్తాయి. ఒకటి ఇహ పరలోక సౌఖ్యం. రెండవ మార్గంలో చిత్తశుద్ధి. ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలను చేయడం చిత్తశుద్ధితో అంతం కాదు. అది జ్ఞాన మార్గంలో పయనించడానికి అర్హతను సంపాదించి పెడుతుంది.

ఫలాలనాశించేవాడు కూడా వేదమార్గంలో నడిస్తే ఒక క్రమశిక్షణ అతనిలో ఏర్పడి, తనకూ, సంఘానికి మేలు కలుగజేస్తుంది.

ఇంట్లోకి వాడుకోవడానికి కూరలు తోటలో పండిస్తాం. పండిన వాటిని అనుభవిస్తాం. ఒకనికి వాడుకోవడానికి కూరలు అవసరం లేకపోయినా ఏదో వ్యాపారంలో నష్టం వచ్చి బాధపడినపుడు, ఆ బాధను మరిచి పోవడానికి కూరలను పెంచాడనుకోండి. వ్యాపార నష్టం పోతుందా? అది ఉండనే ఉంది. అట్లాగే కర్మ ఫలాలనాశించకుండా కర్మలు చేయడం వల్ల వచ్చిన లాభమేమిటి?

చిత్తానికి శుద్ధి ఏర్పడడం, కర్మఫలం కాదు. కర్మఫలాలనాశించకుండా కర్మానుష్ఠానం చేస్తున్నాడని, నా ఆజ్ఞను పాటిస్తున్నాడని, నడవడికకు భంగం తీసుకొని రావడం లేదని, ఇతనికి చిత్త మాలిన్యం పోగొట్టాలని భగవానుడు భావిస్తాడు. అంటే భగవదనుగ్రహం కావాలన్నమాట.

కర్మ, జడం కనుక అది ఫలాన్నియ్యదు. ఈశ్వరుడే ఫలదాత. చేసిన కర్మలకు ఫలం ఉంటుంది. పవిత్రమైన మనస్సును ప్రసాదించుట పరమాత్మ యొక్క అనుగ్రహం వల్లనే. కర్మయొక్క ఫలం, చిత్త శుద్ధి యని భావించవద్దు. కర్మఫలాన్ని విడిచిపెట్టుటను, ఈ అర్థంలో భావించాలి. కర్మఫలాల త్యాగం వల్లనే చిత్తశుద్ధి ఏర్పడుతుంది.

జ్ఞాన మార్గంలో అడుగు పెట్టలేని వారు కర్మలను విడలలేరు. కనుక కర్మలను చేస్తూ ఉండి, ఫలాలనాశించకండని చెప్పాడు. కర్మలను చేయుట, ఫలత్యాగం నాకోసమే అని చేయండి. దానివల్ల మీకు చిత్తశుద్ధి ఏర్పడుతుంది. అపుడు జ్ఞాన మార్గంలోకి పయనిస్తారు. ఇపుడు కర్మమార్గం, కర్మయోగ మవుతుంది. జ్ఞాన మార్గమెప్పుడూ జ్ఞాన యోగమే అని అన్నాడు గీతలో.

యోగమనగా కలుపుట. జీవుణ్ణి పరమసత్యంతో కలుపుట. అనేక యోగాలు చిన్న చిన్న సందుల వంటివి. ఇవి ప్రధానమైన రహదారితో కలిసి యుంటాయి. ఇట్లా కలపడమూ యోగమే. జ్ఞాన యోగం ఒక్కటే గమ్యాన్ని చేర్చేది. కర్మయోగం పెద్ద రహదారికి తీసుకొని వెళ్ళే సందు వంటిది. కర్మయోగంలో ఉన్నవారనేక జన్మలనెత్తి, ముఖ్యమైన రహదారికి ఏనాటికో చేరుతారు.

కాలగమనంలో కర్మయోగం యొక్క క్షీణదశ

అనాదినుండి కొందరు ప్రవృత్తి మార్గాన్ని, కొందరు నివృత్తి మార్గాన్ని అనుసరిస్తూనే ఉన్నారు. ప్రవృత్తి మార్గమైనా ఈశ్వరునే లక్ష్యంగా చెప్పింది కనుక ఒక హద్దును అతిక్రమించలేదు. కర్మమార్గము, కర్మయోగమై చిత్తశుద్ధిని పొంది నివృత్తి మార్గాన్ని అవలంబించి మోక్షాన్ని పొందుతూ ఉండేవారు.

గృహస్థాశ్రమం తరువాత వానప్రస్థ, సన్యాసాశ్రమాలను ధర్మశాస్త్రాలు విధించాయి. ముందు ఇంద్రియ తృప్తికై కర్మలను చేసినా, కర్మయోగులై అనగా నిష్కామ కర్మయోగులై ప్రాణాలను విడిచిపెట్టేవారు. దానినే కాళిదాసు, రఘువంశంలో రాజులు చివరకు యోగులై శరీరాలను విడిచి పెట్టారని అంటాడు.

ఆనాడు కూడా కర్మను యోగంగా భావించినవారరుదే. కాని కర్మయోగుల పట్ల, జ్ఞానయోగుల పట్ల అధికాదరణ యుండేది. రాను రాను ఫలాల నాశించేవారెక్కువయ్యారు. ఇదే మంచిదని, సన్యాసం తప్పని భావించారు. రానురాను, ఈశ్వరుడు, ఆత్మసాక్షాత్కారం అనే మాటలకు స్వస్తి చెప్పి వేదంలో చెప్పిన కర్మలను చేస్తే అవే ఫలాలనిస్తాయని భావించేరు. ఈశ్వరుడు, ఫలదాత యనే మాటలను విసర్జించారు. కర్మలు చేస్తేనే స్వర్గ ప్రాప్తియనే మాటను గట్టిగా నమ్మారు. మోక్షమనేది, కేవలం జ్ఞాన విచారం వల్ల రాదని భావించారు. స్వర్గం కంటె మోక్షం ఎక్కువని భావించినా అది వస్తే రానీయండి, అనే ధోరణి ప్రబలింది.

వేదం చివర భాగంలో ఉన్న ఉపనిషత్తు జ్ఞాన మార్గం చెప్పగా అది ఉత్తరమీమాంసయని; కర్మ భాగం చెప్పేది పూర్వమీమాంసగా ప్రసిద్ధిని పొందింది.

రెండు మార్గాల ఉపదేశాలు

నివృత్తి మార్గానికి, దక్షిణామూర్తి ముఖ్య గురువు. విష్ణువు కూడా హంస, దత్తాత్రేయ, హయగ్రీవ రూపాలలో అవతరించాడు. అయితే దశావతారాలలో చూపించినట్లుగా పూర్తిగా వీటిల్లో తన శక్తిని ప్రదర్శించలేదు. దక్షిణామూర్తి మౌఖికంగా ఉపదేశించలేదు గాని, ఆత్మానుభవాన్ని భక్తులను పొందునట్లు చేసాడు. అట్లాగే హయగ్రీవుడు మొదలగు దేవతలను కొలవగా వారి అనుగ్రహాన్ని చూపించారు. పరమ శివునికే, నివృత్తి మార్గోపదేష్టగా పట్టం

కడతారు. దత్తాత్రేయుడు, సనకాదులూ నివృత్తి మార్గాన్ని ఉపదేశించారు. అయితే ఉపదేశమే వారి అవతార లక్ష్యమని ప్రకటించలేదు.

అయితే నివృత్తి మార్గం, సామాన్యులకు అందేది కాదు. అందువల్లనే ఎందరో మహాత్ములను పంపి తాను దిగివచ్చి ఉపదేశం చేసాడు.

గీతలో, భగవానుడే సూర్యునకు అనగా వివస్వంతునకు, కర్మఫలాలను ఆశించకుండా కర్మలను చేయాలని, అపుడది కర్మయోగమని పిలువ బడుతుందని చెప్పాడు. సూర్యుడు తన కొడుకైన వైవస్వత మనువుకు ఉపదేశించాడు. అతని పేరుతో నున్న వైవస్వత మన్వంతరంలో మనమున్నాం. అతడు తన కొడుకునకు - ఇట్లా పరంపరగా ఉపదేశం సాగింది. ఇట్లా గీతలో కర్మయోగ, జ్ఞానయోగాలు చెప్పబడ్డాయి. మరి భక్తి యోగం మాటేమిటి?

జ్ఞానయోగంలో కర్మానుష్ఠానం లేదు. ధ్యాన విచారణలే ఉంటాయి. భక్తిలో పూజలు మొదలైనవి ఉంటాయి. ఇవే కర్మలు లేని ధ్యానంలో ప్రవేశపెడతాయి. అనగా సవికల్ప సమాధి ఏర్పడుతుంది. అందే పరమేశ్వరునితో ఐక్యం.

సాధారణ ప్రజలు యోగ, వేదాంత, మీమాంసలపై దృష్టి పెట్టక కొద్దిపాటి భక్తితో ఉంటారు. ఏదో ఒక శక్తి మనలను నడిపిస్తోందని దానిని వేడితే ధనాదుల వంటివి లభిస్తాయనే నమ్ముతారు. భౌతిక ప్రయోజనాలకై ప్రయత్నం చేస్తూ, ఈశ్వరానుగ్రహం కోసం పరితపిస్తూ ఉంటారు. ఉన్నది ఒక్కడైనా పెక్కుమంది దేవతలు వివిధ ఫలాల నిస్తారని నమ్ముతారు.

ఇది భక్తి కాదు, ఇది వట్టి వ్యాపార ధోరణియని కొందరు గేలిచేసినా వీరు భక్తి కలిగియుంటారు. అయితే ఇందులోనూ కొందరు అక్రమ మార్గాలను త్రొక్కారు. కర్మయోగం, మీమాంసకుల చేతిలో పడి ఎట్లా రూపు మాసిందో, భక్తియోగం కూడా దిగువస్థాయికి చేరుకుంది. దీనిని గీతలో 'అనేకమైన కోర్కెలకై అనేక దేవతలను కొలుస్తున్నారని' జ్ఞాన విజ్ఞాన యోగంలో గీతాచార్యుడన్నాడు. సత్త్వగుణంతో ఉన్నవారు దేవతలను, రజోగుణంతో

ఉన్నవారు యక్ష రాక్షసులను, తమోగుణంతో ఉన్నవారు భూత ప్రేతాలను కొలుస్తారని శ్రద్ధాత్రయ విభాగయోగంలో సెలవిచ్చాడు. రాను రాను భక్తిమార్గంలో క్రూరకర్మలు, నరబలులూ కూడా ప్రవేశించాయి.

ప్రవృత్తి, నివృత్తి మార్గాలు పరస్పర విరుద్ధాలైనపుడు మూడవది ఎందుకుంటుందని అడగవచ్చు. భక్తి యుండడం సాధారణం కనుక కర్మ జ్ఞానాలనే పేర్కొన్నాడు. ఇదంతా మాయగా చూచే జ్ఞాని కూడా భక్తిలోనే మునిగి, మాయను గుప్పిట్లో ధరించిన భగవానుని ఈ లీలేమిటని ఆశ్చర్యపడతాడు. కొందరు భక్తులు జ్ఞానమార్గాన్ని, కర్మమార్గాన్ని విడిచి భగవానుని వాత్సల్యాది గుణాలను కీర్తిస్తూ ఉంటారు. కొందరు ప్రవృత్తిలోనే ఉండి మాకు జ్ఞానాన్ని, నివృత్తి మార్గాన్ని ఉపదేశించమని ప్రార్థిస్తూ ఉంటారు. కర్మయోగులు, జ్ఞాన యోగులగుటకు చిత్తశుద్ధితో పాటు ఏకాగ్రత కూడా కావాలి. ఈశ్వర స్మరణ వల్ల వారికి ఏకాగ్రత లభిస్తుంది. వీరూ భక్తి మార్గంలో ప్రవేశిస్తారు. అతడు ఫలదాతయని భక్తితో ఉంటారు. ఇక చాలామంది కర్మయోగులు కాకుండా పనులు చేస్తూ, కేవలం ఫలాలనే ఆశిస్తూ కొబ్బరికాయలను కొట్టడం, అంగ ప్రదక్షిణలు మొదలైనవి చేస్తూ ఉంటారు. నాకు ఫలానాది ప్రసాదించుమని అడగడమే భక్తియని భావిస్తారు. కొన్ని కూడని పనులను చేస్తున్నా తాము భక్తులమని అతడనుగ్రహిస్తాడని భ్రాంతి పడుతూ ఉంటారు. భక్తిని అభ్యసించుటకు వేదాలలోని ఉపాసనా కాండ కావాలంటారు కొందరు. గీతలో కర్మ, భక్తి, జ్ఞాన యోగాలు వరుసగా చెప్పబడ్డాయి.

గీతలో యోగాలు

ఇందు 18 అధ్యాయాల పేర్లలో యోగం అని యుంటుంది. మొదటి అధ్యాయమే అర్జున విషాదయోగం. దీనిని యోగం అనడం ఏమిటి?

అసలీ పేర్లు ఎవరు పెట్టారు? సమాధానం చెప్పలేం. భగవానుడు ఉపదేశించాడని నమ్మితే చాలు. వ్యాసుడే ఉంచాడన్నా తప్పులేదు. వ్యాసుడు కూడా అతని అంశావతారమేకదా!

విషాదం ఎట్లా యోగమౌతుంది? ఇందాత్మ గురించి అర్జునుడాలోచించడం లేదా? అది ఒక కారణం. అంతకు ముందు అన్నిటిని జయించి విజయుడయ్యాడు. యుద్ధ రంగంలో బంధువులను చూసి వీరిని చంపడమా? దీనికంటే ముష్టి ఎత్తుకోవడం మేలని భావించాడు. పరిపక్వమైన మనస్సులో పుట్టిన విరక్తి కాదిది. కాని అజ్ఞానం వల్ల పుట్టిన మమకారం వల్ల వీళ్ళు నావాళ్ళని భావిస్తున్నాడు. ధర్మయుద్ధం చేయవలసినవాడు ఇట్లా బెంబేలు పడడాన్ని కృష్ణుడు ఛీత్కరించాడు. ఈ విషాదాన్ని చూసే భగవానుడు, ఉపదేశం చేయవలసి వచ్చింది. ఎన్నిటిలోనో సాయం అందించిన కృష్ణుడు (సుభద్రా వివాహం మొదలైనవి) జ్ఞానోపదేశం చేయడానికి ఇంతవరకూ అవకాశం చిక్కలేదు. ఇతని తాత్కాలిక విషాదం, మంచితో సమాప్తమైంది కనుక ఇది విషాదయోగమైంది.

పరమాత్మతో ఏ రకమైన సన్నివేశమైనా అది యోగంగా మారుతుంది. లోకంలో ఫలానా వాడికి యోగం బాగుంది కాబట్టి అంత సంపాదించాడురా అంటాం. ఏమిటి దీని యర్థం? జాతకంలో గ్రహాల కలయికను బట్టే కదా! అన్ని యోగాలలో ఏది గొప్పది? పరమాత్మతో ఐక్యం కావడం గొప్ప యోగం.

అద్వైతంలో శాశ్వత యోగం

ఈ యోగం కూడా నిరంతరం పరమాత్మతో కూడి యుండాలి. అంటే అంతరం లేకుండా. మధ్య విరామం లేకుండా అని. రెండు వస్తువులు ఒకటైనంత వరకూ మధ్య ఎడం ఉంటుంది. ఆ ఎడం, దూరం అవుతుందనే భయం పట్టుకొంటుంది. అట్టి ఎడం లేకుండా నిరంతరమూ కలిసి యుండుట, అనగా జీవ బ్రహ్మ అభేద యోగం గురించి తైత్తిరీయ ఉపనిషత్తులోని

ఆనందవల్లి చెప్పింది. ఏమాత్రం ఎడం ఉన్నా ఐక్యానికి భంగం కల్గుతుందనే భయం పుడుతుందని దానిలోని ఒక మంత్రం వివరించింది. ముముక్షువు, బ్రహ్మములో ఉండగా అతనికి అభయ ప్రతిష్ఠ కల్గుతుందని చెప్పింది.

గీతలోనూ, ఈ జీవబ్రహ్మ అభేదం చెప్పబడింది. ఈ నివృత్తి మార్గోపదేశం, క్షత్రియుడై కార్యక్రమాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్న అర్జునునకు పట్టుబడడం వెంటనే సాధ్యం కాదని అతనికి ముందుగా కర్మయోగాన్ని, దాని గొప్పతనాన్ని వివరించాడు. చివరకు మోక్ష సన్న్యాస యోగాన్ని ఉపదేశించాడు. అన్ని పనుల ఫలాలను తనకు అర్పించాలని, తాను ఫలదాత అని, అపుడు సమస్త పాపాలనుండి విముక్తుణ్ణి చేస్తానని 'మా శుచః = దుఃఖ' పడవద్దని అన్నాడు.

తిరిగి పుంజుకునేటట్లు చేసిన కృష్ణుడు

కృష్ణుడు – అర్జునునితో – ఈ ఉపదేశాన్ని ముందుగా సూర్యునికిచ్చాను, కొన్ని తరాల వరకూ ఈ ఉపదేశం సాగింది. నీవు నా భక్తుడవు, స్నేహితుడవు కనుక నీకు ఉపదేశిస్తున్నాను అని అర్జునుని మిషగా పెట్టుకొని లోకానికి అంతటికీ అందించాడు. "కాలం గడచిన కొలదీ ఈ యోగం క్షీణదశను పొందింది, దానిని తిరిగి ఉద్ధరించి అందిస్తున్నాను" అని చెప్పాడు.

ఇక్కడ చెప్పిన యోగము, కర్మయోగమే. ఈ యోగాన్ని పూర్వరాజులు రక్షిస్తూ ఆచరిస్తూ ఉండేవారు. అది క్షీణించగా రాజవంశానికి చెందిన అర్జునునకుపదేశించాడు. జ్ఞానయోగాన్ని సన్న్యాసులకు, అనగా సాంఖ్యులకు నిష్కామ కర్మ యోగాన్ని ఏనాడో అందించానని అన్నాడు

'లోకేస్మిన్ ద్వివిధా నిష్ఠా పురాప్రోక్తా మయానఘ

జ్ఞాన యోగేన సాంఖ్యానాం, కర్మయోగేన యోగినాం'

అనగా ప్రవృత్తి మార్గంలోనున్న వారికి కర్మయోగాన్ని, నివృత్తి మార్గంలో ఉన్నవారికి జ్ఞాన యోగాన్ని తిరిగి అందించాడు. ఇది కూడా అవతార

ప్రయోజనమే. ఈ రెండు యోగాలలో అన్ని యోగాలూ కలుస్తాయి. అయినా ఉపదేశము సాంఖ్యయోగంతో ఆరంభపడి మోక్ష సన్యాస యోగంతో ముగుస్తుంది. కనుక ఉపదేశ లక్ష్యము, నివృత్తి మార్గమే. కొన్ని సందర్భాలలో కర్మయోగాన్ని ప్రశంసించడం వల్ల ఇతడు కర్మయోగాన్నే చెప్పాడని భ్రాంతి పడుతూ ఉంటారు. దీనికి కారణం, అర్జునుడు కర్మయోగానికే ప్రస్తుతం, అర్హుడు కనుక, కర్మయోగ ప్రస్తావన చేయవలసి వచ్చింది.

జ్ఞానం ద్వారా, అనగా నివృత్తి మార్గం ద్వారా మోక్షమని చెప్పడమే కృష్ణుని లక్ష్యమని శంకరులు, గీతాభాష్య ఉపోద్ఘాతంలో వివరించారు.

కృష్ణావతారం ముందు అన్ని యోగాలూ క్షీణదశకు చేరాయి. ఇంద్రియాలను అదుపులో పెట్టామని చెబుతూ ఇంద్రియ సుఖాలకై అఱ్ఱులు చాచేవారిని మిథ్యాచారులని గీతలో (3-6) అన్నాడు. కనుక ఆనాడూ నివృత్తి మార్గంలో ఉన్నవారూ సరిగా ప్రవర్తించలేదని అర్థం వస్తోంది. ఇక రెండవ అధ్యాయంలో వేదాల సారాంశాన్ని గ్రహించకుండా ప్రవర్తించే మీమాంసకులను (2-42; 43) **వేదవాదరతాః** = వేదాలను అనుసరిస్తున్నామని అనుకొనేవారిని గురించి చెప్పాడు. వీరు జ్ఞాన విచారం చేయడం లేదని, కేవలం కోరికలను కోరేవారని, కామాత్ములని, స్వర్గపరులని ఈసడించాడు. జనులను కర్మలలో ముంచి జనన మరణ ప్రవాహంలో కొట్టుకొనిపోయేటట్టు చేసి అందమైన మాటలను **పుష్పితం వాచం** - (Flowery Language) పలికేవారని, వీరూ 'అవిపశ్చితః' - సరియైన విద్వాంసులు కారని నిందించాడు కదా. అనగా కృష్ణుని కాలంలో కర్మయోగం దిగజారిపోయినట్లే.

భక్తి యోగం, వెఱ్ఱి తలలు వేసిందని, తమోగుణ భక్తివల్ల అనర్థమని అతడు చెప్పినట్లు లోగడ చెప్పాను. కనుక అన్ని మార్గాలనూ, ఉద్ధరించడమే కృష్ణుని అవతార ప్రయోజనం.

కనుక ప్రవృత్తి మార్గం, కర్మ యోగంగా మారితే, దానివల్ల చిత్తశుద్ధి ఏర్పడితే జ్ఞాన మార్గం వల్ల నివృత్తి మార్గంలో ప్రవేశించాలని సారాంశం.

మీమాంసకులు చెప్పిన కర్మ మార్గంలోనే మునిగితే ఇక నివృత్తి మార్గం ఎట్లా పట్టుబడుతుంది? అతని కాలంలో నివృత్తి మార్గం అడుగంటడం వల్ల మొత్తం ప్రవృత్తి నివృత్తి మార్గాలను పునరుద్ధరించడం కోసం అవతరించాడు.

శ్రీకృష్ణుడు - శంకరులు

కృష్ణావతారంలో పరిస్థితులెట్లా ఉన్నాయో అంతకన్నా ఎక్కువగా అవి శంకరుల కాలంలో ఉన్నాయి. ధర్మానికి హాని జరిగినపుడు తానవతరిస్తానని కృష్ణుడు మాట ఈయడం వల్ల శంకరులవతరించారు. కృష్ణుడు లేకపోతే శంకరుల అవతారమూ లేదు. శంకరులే భజగోవిందం అని నల్గడలా వ్యాపింపజేసారు. వారి కులదైవం కృష్ణుడే. శంకరులకంటె ముందుగా కృష్ణునకు జగద్గురువనే బిరుదుంది. జగద్గురువైనవాడు గీతోపదేశం చేయగా మన జగద్గురువులైన శంకరులు దానికి భాష్యం వ్రాసేరు. కనుక శంకరుల గురించి చెప్పేటపుడు ముందుగా కృష్ణుని స్మరించవలసి వచ్చింది. కృష్ణావతార పరిస్థితుల కంటె దిగజారిన పరిస్థితులలో శంకరులవతరించి వలసి వచ్చింది.

పూర్వావతారాలు

కృష్ణుని ముందు చాలా అవతారాలున్నాయి. వారెవ్వరూ ఉపదేశాలీయ లేదు. ఉపదేశం ఈయవలసిన పరిస్థితి, కృష్ణుని కాలంలోనే వచ్చింది. ఎందుకంటే కర్మయోగాన్ని తర తరాలనుండి అనుసరిస్తున్నారని కృష్ణుడు ముందన్నాడు కదా!

పూర్వావతరాలలో రాక్షసుల బాధ ఉండడం వల్ల వారిని సంహరించడం, ప్రజలు భయం లేకుండా తమ తమ ధర్మాలను అనుసరిస్తూ ఉండడం సాగిపోయేది. వారి వారి స్వభావాలనుగుణంగా కొందరు ప్రవృత్తిలో, కొందరు నివృత్తిలో మార్గంలోనూ నడుస్తూ ఉండేవారు.

మధ్య మధ్య జ్ఞానం యొక్క గొప్పదనాన్ని ప్రకటించడం కోసం దత్త, హంసావతారాలనెత్తవలసి వచ్చింది. తీవ్రమైన బాధ లేర్పడినప్పుడు తన శక్తినంతటినీ ప్రకటిస్తూ ప్రత్యేకావతారాల నెత్తవలసి వచ్చింది. అది దశావతార ప్రయోజనం.

నర, నారాయణ, కపిల, దత్త, వ్యాస మొదలైన అవతారాలను అంశావతారాలని అంటారు. 24 అవతారాలలో అంశావతరాలూ ఉన్నాయి. ఇందు జ్ఞానోపదేశం కోసం వచ్చినవి కొన్ని, దశావతారాలు, ధన్వంతరి, మోహిని మొదలగు అవతారాలు ఉన్నాయి.

ఇక రామకృష్ణావతారాలలో అసురులే మానవాకారాలు ధరించి కంస, జరాసంధ, కౌరవాదుల రూపంలో అనేక పాలకులుగా వచ్చారు. కొందరు దుష్టక్షత్రియ సంహారము, పరశు రాముడు చేయవలసి వచ్చింది. అసురుల తాకిడికి తట్టుకోలేక భూదేవి బ్రహ్మనడుగుట – దేవతలను వెంట బెట్టుకొని బ్రహ్మాది దేవతలు విష్ణువును సమీపించుట – అందువల్ల కృష్ణావతారం ఆవిర్భవించుట తెలిసిందే. మానవునిగా అతడవతరించి నవనీత చౌర్యం, రాసక్రీడ, గోవర్ధన గిరి నెత్తుట, విశ్వ రూప దర్శనం, పాండవులను రక్షించుట, కుచేలాదులను బ్రోచుట మొదలైనవి ఎన్నిటినో చేసాడు. అందులో ఉపదేశం చెయ్యడం ఒకటి. ఉపదేశం చెయ్యడం కోసమే అతడవతరించలేదు. అవతారం కాలం చాలాకాలం గడిచిన తరువాతనే ఉపదేశం ఇచ్చాడు. చివరగా భక్తుడైన ఉద్ధవునకుపదేశించాడు. అదే ఉద్ధవగీత.

కలియుగం

కృష్ణావతారం ముగుస్తుందనగా కలి ప్రవేశించాడు. అంశావతారమైన వ్యాసుడు ప్రజలకు ప్రవృత్తి నివృత్తి మార్గాలలో పెట్టుటకు ఆవిర్భవించాడు. వేద విభజన చేసాడు. ఉపనిషత్ సందేశాన్ని బ్రహ్మ సూత్రాల రూపంలో అందించాడు. 18 పురాణాలనూ అందించి భక్తి మార్గాన్ని ప్రతిష్ఠించాడు.

ఇట్లా చేయడం వల్ల కలి ప్రవేశించిన 2500 సంవత్సరాల వరకూ ప్రజలు ధర్మంగానే ప్రవర్తించారు. తరువాత కలి విజృంభించింది.

క్రీస్తు పూర్వం 3102లో కలియుగం ఆరంభమైంది. సంకల్పం చెప్పుకొనేటపుడు, ఏనాడు చేస్తున్నామో పరంపరగా వస్తోంది కదా!

కలి ప్రమాదం

పూర్వ యుగాలలో రాక్షసుల ఆకారాలు, చేష్టలు స్పష్టంగా కనబడడం వల్ల వారిని గుర్తించడం సులువైంది. రాను రాను దుష్ట పాలకులలో రాక్షసాంశలు ప్రవేశించడం వల్ల వారిని సంహరించడం జరిగింది. రాక్షసులు, దుష్ట పాలకులు సంహరింపబడిన తరువాత ప్రజలకు ప్రత్యేకంగా ఉపదేశించనవసరం లేకపోయింది. ప్రజలకు, తమ తమ విధులకెట్టి ఆటంకాలూ లేకుండా ఉండేవి.

ఇక కలిలో ప్రత్యేకంగా రాక్షసులెవ్వరూ లేరు. కాని వారు ప్రజల మనస్సులలో దూరారు. ఇదీ ఇక్కడి విశేషం.

క్రొత్త మత స్థాపకులు

ఇక కొందరు వేద మార్గాన్ని విడిచి సందు గొందులను చూపించారు. రాను రాను అజ్ఞానాంధకార గహనపతితులై పోయారు. క్రొత్త క్రొత్త సిద్ధాంతాలను కొందరు బుద్ధిమంతులు ప్రచారం చేసి వేదమార్గం నుండి దూరులగునట్లు చేసారు.

ఇందులో కొందరు వేదాన్ని పూర్తిగా తిరస్కరించకుండా ప్రచారం చేసినవారు. కొందరు పూర్తిగా తిరస్కరించినవారు. ఈ తిరస్కరించినవారే బౌద్ధులు, జైనులు, చార్వాకులు. చార్వాకాన్నే బార్హస్పత్యమంటారు. బృహస్పతి దీనిని స్థాపించాడు.

బౌద్ధమతం - జైన మతం - హిందూ మతం

అభ్యుదయ భావాలనందించాయని బౌద్ధ మతాన్ని, జైన మతాన్ని, నేటి గాంధీ సిద్ధాంతాన్ని ప్రశంసిస్తూ ఉంటారు. పై రెండు మతాల చరిత్రతోనే చరిత్ర పుస్తకాలు మొదలౌతాయి. హిందూమతంలోని యజ్ఞంలో హింస యుందని, వర్ణ విభజన యుంది కనుక పైవాటిని పొగుడుతూ ఉంటారు. వివిధ మనః ప్రవృత్తులు కలవారికి వివిధ ప్రవృత్తులని, సంఘం సక్రమంగా సాగాలంటే అందరూ అహింసను పాటించడం కుదరదని గుర్తించారని, నాల్గు ఆశ్రమాలను ఏర్పాటు చేసి మానవోన్నతికి దారి చూపించారు హిందువులని పొగడరు.

అందరికీ అహింసను చెప్పిన బౌద్ధమతం యొక్క నేటి పరిస్థితిని ఇతర దేశాలలో చూడండి. బౌద్ధ భిక్షువులే మాంసాహారులై యున్నారు కదా! ప్రభుత్వ పరంగా యుద్ధాలు వారు చేయవలసి వచ్చింది. ఒక్క అశోకుడు తప్ప ఏ బౌద్ధ, జైన రాజులూ యుద్ధాలు వద్దని బోధించలేదు. ఇవి తప్పని సరియని గుర్తించడం వల్లనే వారూ యుద్ధాలు చేయవలసి వచ్చింది. మన మతంలో కొందరికే యుద్ధ విద్య తప్ప మిగిలినవారికి లేదు. సన్యాసులకే అహింసానియమం తప్ప మిగిలిన వారికి లేదు. మాంసాహారం కూడా కొందరికే. ఇట్లా మన మతం అధికారి భేదాన్ని గుర్తించింది. ఒక కట్టుబాటు ఉండడం వల్లనే ఎందరో మహాత్ములీ మతంలో ప్రభవించారు. గొప్ప సంస్కృతి అనాదిగా పరిఢవిల్లింది. బాబిలోనియా, ఈజిప్టు, గ్రీకు నాగరికతలు కాలగర్భంలో కలిసిపోయినా హిందూజాతి, అవిచ్ఛిన్నంగా సాగిపోతూనే యుంది. కళలు విద్యలు, నాగరికత, సంస్కృతి ఎడదెగకుండా సాగుతూనే యున్నాయి. దీనికంతటికీ రాగద్వేషాలు లేకుండా ఆలోచిస్తే వర్ణాశ్రమ విభజనయే కారణమని అంగీకరించక తప్పదు. ఒక ప్రత్యేకమైన వర్ణానికి అనేక నియమ నిష్ఠలను చెప్పడం వల్ల వారిని ఆదర్శంగా మిగిలినవారు గ్రహించి జీవించేవారు.

మన మతాన్ని ఖండించేవారిని ఎదుర్కొనడమే లక్ష్యం

అన్ని మతాలలోనూ మహాత్ములున్నారు. అందరూ భూతదయాది గుణాలను ప్రశంసించినవారే. బౌద్ధ, జైన, సాంఖ్యాది మతాలలో ఎందరో విజ్ఞాన వంతులు ప్రభవించిన మాట వాస్తవం. నాకూ బౌద్ధ నాగార్జునుని రచనలంటే ఇష్టమే.

భౌతిక దశను దాటి అభౌతిక దశను అందరూ కీర్తించినవారే కాని మన మతం జీవ బ్రహ్మైక్య వాదాన్ని చెప్పింది. భిన్న మతాలకు ప్రత్యేక లక్షణాలుండి అవి మన సంప్రదాయాన్ని తెలిసికోకుండా ఖండిస్తూ ఉన్నా వాటిని సహిస్తూ ఉండడమా? మన సంప్రదాయాన్ని వివరించవద్దా? జీవ బ్రహ్మలకు భేదం లేదని ఒక మూల చెబుతూ వర్ణ విభజన అంటూ గోడలు కట్టారేమిటని ఇతరులు ప్రశ్నిస్తే ఎందుకిట్లా ఉందో వివరించవలసిన అవసరం లేదా?

అన్ని పద్ధతులలోనూ మంచి యుంటుందని, మనం వైదిక మతస్థులతో కలిసి మెలిసి యుందామని బౌద్ధ, జైనులు భావించలేదు సరికదా, ఖండించారు. అపుడు మనం సమాధానం చెప్పవద్దా? అనేక దేశాలలో అనాదిగా వస్తున్న బలమైన మతం లేకపోవడం వల్ల బౌద్ధం, క్రైస్తవం, మహమ్మదీయ మతం ఆయా ప్రజలకు సంతృప్తినిచ్చాయి. కానీయండి, మనలను విమర్శిస్తూ ఉన్నపుడు మానవులలో, అధికారి భేదాలుంటాయని వాటికి అనుగుణంగా ఆచార వ్యవహారాలుంటాయని, క్రమ క్రమంగా అందరూ ఉన్నతిని పొందే మార్గాలున్నాయని వివరించవద్దా?

సరియైన కారణాలను చెప్పి వారూ మనలను ఖండించవచ్చు. మనమూ వారిని ఖండించవచ్చు. విమర్శించడానికి అందరికీ హక్కు ఉంది. విమర్శ అనేది రెండు రకాలుగా తప్పు. సరియైన కారణాలు చూపించకుండా వితండవాదం చేయడం ఒకటి. ఇక రెండవది మనస్సులో శత్రుత్వం పెట్టుకొని వాదించడం. భిన్న అభిప్రాయాలున్నంత మాత్రంచే ద్వేషించనవసరం లేదు. ప్రేమతోనే విమర్శించవచ్చు. వ్యక్తుల నుద్దేశించి కాక అభిప్రాయ భేదాలపై దృష్టిని పెట్టి విశదీకరించవచ్చు.

బుద్ధిమంతులైన కొందరు, వేద ధర్మంలో కొంత గ్రహించి అదే పరమార్థమని కొన్నిటిని ఖండించడం మొదలు పెట్టారు. వేద విరుద్ధమైన వాటిని, వేద సమ్మతములని ప్రజలచే విశ్వసింపజేసి ప్రచారం చేసారు.

ఇంద్రియ నిగ్రహం కలిగి, సదాచారం, ప్రేమా హింసలను పూర్తిగా పాటించిన బుద్ధుడు, జినుడు వంటివారు, ఈ శరీరం పోయినా ఫరవాలేదు, ఉన్నతలక్ష్యం చేరుకోవడమే మా ప్రయత్నము అని చెప్పి వేదాలు, వేద మతానుష్ఠానం అవసరం లేదని చాటారు. అయితే మన ప్రమాణ గ్రంథాలలో ఏముంది? బృహదారణ్యకోపనిషత్తులో (4-3-22) జ్ఞానికి తండ్రి లేడు, తల్లి లేదు, ప్రపంచం లేదు, దేవతలు లేరు, వేదం లేదని చెప్పబడింది. ఆ స్థితి పట్టుబడాలంటే ఎట్లా ఉండాలో వివరించింది. 'తత్త్వమసి' మహావాక్యాన్ని అందించిన ఛాందోగ్యోపనిషత్తు కూడా ఇట్లా చెప్పింది.

వేదాధ్యయనం, శాస్త్ర ప్రకారం అనుష్ఠానం, ఇంద్రియ నిగ్రహం, వేదం విధించిన హింస తప్ప అన్నివిధాల అహింసాపాలనం, ఉన్నవానికే అట్టి ఉన్నత స్థితి కల్గుతుందని చెప్పింది. అందువల్ల జ్ఞానులు కాని వారు, వేద విధులను పాటించవలసిందే. అందరూ బుద్ధుడూ, జినుడు కాలేరు. క్రింద మెట్టునుండి పై మెట్టునకు అడుగు వేయాలని మన మతం అంటోంది. జ్ఞాని తన నడవడిక ద్వారా దిగువ స్థాయిలో నున్నవానికి చేయూత నందీయాలని చెప్పింది. ఈ విషయమై గీత "శ్రేష్ఠుడాచరించినదే ఇతరులూ ఆచరిస్తారని" నొక్కి చెప్పింది. కనుక మహోత్తమ జ్ఞానులకుండవలసిన ధర్మాలు సామాన్యునకుండవు. ఇట్టి సందర్భంలో ఇతరమత ఖండన తప్పదు. అంటే కేవలం ఖండించడం కాదు, మన మతాన్ని సరిగా అర్థం చేసుకొనేటట్లు మనం చేయాలి. ఒప్పించగలగాలి. అందుకే శంకరులవతరించారు.

ఒక ముళ్ళ చెట్టు పెరిగిందంటే దానికి తగిన విత్తనం, తగిన నేల ఉన్నపుడే వృద్ధి పొందుతుంది. మానవుల మనస్సులు, పైవారి సిద్ధాంతాలను బలపరచినపుడు మాత్రమే అవి వృద్ధి పొందుతాయి. వేద ధర్మంపట్ల

విముఖులైనపుడవి వృద్ధి పొందుతాయి. ఏ కర్మకాండల అవసరం లేకుండా నిర్వాణమో, లేక మోక్షమో వస్తుందంటే ప్రజలెగబడుతారు. కనుక కలిలో రాక్షసులుండరని, వారు మానవుల మనస్సులలో దూరి విజృంభిస్తారని లోగడ, అందుకే చెప్పాను. ఇతర మతాల వారు ధర్మం గురించే చెబుతున్నారని ప్రజలు భ్రాంతి పడతారు. ఇట్లా కలిపురుషుడు వీళ్ళచేత నాటకాలిస్తాడు.

కలియుగం ప్రారంభమై 2500 సంవత్సరాలు గడిచేవరకూ కృష్ణుడు, వ్యాసుడు మొదలైనవారు బోధించిన వైదిక ధర్మంవల్ల వైదిక మతం క్షీణ దశను చేరుకోలేదు. ప్రజలు నిర్లక్ష్యం చేయడం వల్ల సోడా కొట్టినపుడు ఒకమాటు బుస్సుమని గాలి తన్నుకు వచ్చినట్లు కలి విజృంభించాడు. దీనివల్ల సనాతన ధర్మాన్ని వ్యతిరేకించే 72 మతాలు అప్పుడు ప్రచారంలో ఉండేవని కొన్ని గ్రంథాలవల్ల తెలుస్తోంది.

అధర్మానికై కలి విధింపబడ్డాడా?

చతుర్యుగాలలో కలిలో ధర్మం క్షీణిస్తుందని అనడం భగవత్ సంకల్పం కదా! కనుక కలిని ద్వేషింపనేల? అధర్మం ఉంటుందని అంటే దానిని తగ్గించే బాధ్యత మనకు లేదా? దానిని ఎగసన త్రోద్దామా?

నాటకంలో వివిధ రసాలుంటాయి. క్రోధాన్ని, భయాన్ని, క్రౌర్యాన్ని చూపించవలసి వస్తుంది. అవి హద్దు మీరకుండా దయతో ప్రజలను భగవానుడు రక్షిస్తూ ఉంటాడు. పైవి ఎక్కువ స్థాయిలో ఉంటే అది రసస్థాయికి తీసుకొని రాలేదు. విరసమే మిగులుతోంది. ఒకమూల అధర్మం ప్రబలుతూ ఉన్నా ప్రవచనాలు భజనలు, కుంభాభిషేకాలు జరుగుతూ ఉంటాయి. కలికాలం అంతమయ్యే సమయంలో కూడా ఏ కొద్దిమందో ధార్మికులుంటారు. విత్తనాలు నశించవు, కల్కి ఎక్కడ పుడతాడో కూడా పురాణాలు వివరించాయి. తామ్రపర్ణి నదీ తీరంలో ఉన్న విష్ణుయశస్ అనే బ్రాహ్మణుడికి కుమారుడిగా అతడు జన్మిస్తాడని అన్నాయి.

పురాణాలలో కలి తీవ్రత, అతిశయోక్తులతో నిండి యుంటుంది. శంకరులవతరించడానికి ముందు వేదధర్మం అడుగంటిందని దేవతలు పరమేశ్వరునితో మొరపెట్టి నట్లుంది. శంకరులు కాలడిలో అవతరించినప్పుడు వేద ధర్మం పూర్తిగా అడుగంట లేదు.

యుగారంభంలో కలిలో ప్రవృత్తి మార్గానికి, నివృత్తి మార్గానికి అవకాశం ఉంటుందా అని ధర్మ శాస్త్రాలు చర్చించాయి. ఎంతవరకూ అగ్నిహోత్రం ఉంటుందో, వేదాధ్యాయనం ఉంటుందో, వర్ణ విభజన ఉంటుందో అంతవరకూ నివృత్తి (సన్యాసం) ఉంటుందని నిర్ణయించాయి. కొడిగట్టే దశలో ఒక మహానుభావుడు వచ్చి దీపాన్ని వెలుగునట్లు చేస్తాడు. శంకరుల కాలంలో సంప్రదాయ విద్య, అవిచ్ఛిన్నమైన గురు పరంపరతోనే సాగుతోంది. మిగతా యుగాలతో పోల్చినపుడు కొంత క్షీణ దశలో ఉండవచ్చు. లేకపోతే కర్మానుష్ఠానాలు చేసే సద్వంశంలో పుట్టడం గాని, గోవింద భగవత్పాదుల యొద్ద ఉపదేశం గాని శంకరులకు దక్కి యుండకపోవచ్చు. వీరికి ముందు కాశకృత్స్నుడు, ద్రవిడాచార్యుడు, బ్రహ్మానంది, భర్తృ ప్రపంచుడు, భర్తృహరి, బ్రహ్మదత్తుడు, సౌందర పాండ్యుడు మొదలైనవారు అద్వైతాన్ని గురించి చెప్పినవారే. పూజలూ, ఆలయాలూ ఉండేవి. తాంత్రిక పద్ధతులలో సాగేవాటికి వైదిక మార్గాన్ని బోధించి శంకరులు పునరుద్ధరించారని చదువుకున్నాం.

మరి ఎందుకు అంతా నాశనమైపోతోందని అన్నాయి? ప్రమాదపు హెచ్చరికలు చేసాయి? దొంగలుంటారు, జాగరూకత వహించండని రక్షక భటులు హెచ్చరించరా? అన్ని వస్తువులను బైట ఉంచి దొంగతనానికి ప్రేరేపిస్తామా? అట్లా కలి, ప్రవేశించిందని, ధర్మాన్ని రక్షించుకోండని హెచ్చరించడానికే పురాణాలట్లా చెప్పాయి.

ఇట్లా కలిలో తనను గురించి ఎవడు సమీపిస్తాడా, అని భగవంతుడెదురు చూస్తూ ఉంటాడు (అని మహాస్వామి వారు చమత్కరించారు.) అలా వచ్చిన వానిని అక్కున చేర్చుకుంటాడు.

మిగతా యుగాలలో ఎంతో ధ్యానము, యజ్ఞ యాగాది క్రతువులు, పూజలు చేస్తేనే గాని అనుగ్రహించని దేవుడు కలిలో నామస్మరణ చేస్తేనే అనుగ్రహిస్తాడని చెప్పబడింది. అందుకే వ్యాసుడు కలిః సాధుః, కలిః సాధుః అని రెండు సార్లన్నాడు.

శంకర విజయం

శంకరుల కాలంలో 72 మతాలున్నాయని, శంకర విజయం చెప్పిందని లోగడ అన్నాను. విజయం అంటే జయించుట. ఏమిటక్కడ విజయం? ఎవరిపై విజయం? ప్రజల మనస్సులపై విజయం. రాజులు చేసేది, దిగ్విజయం. మహాత్ములు ఆత్మజయాన్ని పొందారు కనుక, చెడ్డ భావాలు దరి చేరవు కనుక అందరి మనస్సులను జయించారు. శంకరులకు 'ద్విసప్తతి మతోచ్ఛేత్రేనమః' అని ఒక నామం. అనగా 72 మతాలను లేకుండా చేసారని అర్థం.

72 మతాలు

వీటి పేర్లు కూడా నేడు తెలియవు. 40 లేదా 45 మతాలను గుర్తించవచ్చు. అన్నిటికీ ఆధార గ్రంథాలు లభించవు. అందు మీమాంస, న్యాయ వైశేషిక మతాలు వేద ధర్మానికి కొంత బాసటగా ఉంటాయి. 72 మతాల పేర్లు చెప్పలేనంత మాత్రంచే ఏవో కాకమ్మ కథలు, శంకర విజయాలు చెప్పాయని భావించవద్దు.

ఆనాడు, శైవ వైష్ణవ మతాలతో బాటు బ్రహ్మను పూజించే హిరణ్య గర్భ మతమూ ఉంది. అట్లాగే ఇంద్ర, కుబేర, మన్మథ, యమ మతాలూ ఉండేవి. వారినే పరమదైవములుగా కొలిచేవారుండేవారు. అట్లాగే పితృభూత, బేతాళాదులను పూజించేవారు. 20 లేక 25 మతాలకు ఒక సిద్ధాంతమూ ఉండేది. ఇక సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక, మీమాంస, పాశుపత, కాలాముఖ, భాగవత, పాంచరాత్రాలు (శాంకర భాష్యంలో ఇవి రెండూ

కలపబడ్డాయి) వేదానుకూలం కాగా, వేద విరుద్ధమైన ఆచారాలతో ఉండే గాణపత్యం, కౌమారం, శైవం, వైష్ణవం, సౌర మతాలను శంకరుడు సంస్కరించి వైదిక మతాలుగా తీర్చి దిద్దారు. వేద విరుద్ధమైన జైన, బౌద్ధాలూ ఉన్నాయి. కేవల భౌతిక వాదంతో ఉండే చార్వాకమూ ఉండేది. ఇట్లా కొన్ని మతాలను గుర్తించవచ్చు గాని చాలా వాటి పేర్లు కూడా వినబడవు. గ్రంథాలు లేవు.

ఇక బుద్ధ మతం, ఇక్కడ పుట్టినా అంతరించి మిగతా దేశాలలో వ్యాపించింది. ఇక జైన మతానికి ప్రత్యేకత ఉన్నా హిందూ పూజా విధానాన్నే స్వీకరించింది. వీరికీ హిందువులకూ పరస్పర వివాహ సంబంధాలున్నాయి. శంకరుల భాష్యంలో దీనిని గురించి ఎక్కువగా ప్రస్తావింప బడలేదు. అంతేకాదు, బౌద్ధ మతాన్ని కూడా వీరు విస్తారంగా ఖండించలేదు. తరువాత దీనిపై చర్చిద్దాం.

ఈనాడు శైవం, వైష్ణవం ఉన్నా శంకరులు ఖండించిన శైవ వైష్ణవ సిద్ధాంతాలు వేరు, శంకరుల తరువాత వచ్చిన ఆచార్య పురుషులు శంకరుల కాలంలోని ఈ మతాలలో కొన్నిటిని గ్రహించి యుండవచ్చు. రామానుజుల వైష్ణవంలో పాంచరాత్ర సిద్ధాంతాలున్నాయి. అట్లాగే సిద్ధాంత శైవంలో శంకరులు ఖండించిన పాశుపత సిద్ధాంతాలున్నాయి. కనుక ఈనాడు ప్రచారంలో ఉన్న శైవ వైష్ణవాలకు క్రొత్త రూపును సంతరింప చేసారు పై ఆచార్య పురుషులు.

న్యాయ, మీమాంసలను నేడధ్యయనం చేస్తున్నా వీటి అనుయాయులు నేడు లేరు. అంటే న్యాయ మతాలవలంకులు, మీమాసంతావలంబకులు లేరన్నమాట. ఈనాడు యోగాన్ని అభ్యసిస్తున్నా యోగమతాన్ని అనుసరిస్తున్నామని ఎవ్వరూ అనరు. ఇట్లా అనేక మతాలు కనుమరుగైపోయాయి.

శంకరుల అద్భుత కృత్యం

చాలా మతాలు నేడంతరించాయని దీనికి కారణం ఒక సన్యాసి అంటే వారి ఆధ్యాత్మిక శక్తి, మేధా సంపదన వాదనా పటిమలను చూసి అట్టి

వారిని అవతారమని కీర్తించమా? వారు జీవించిన కాలం 32 సంవత్సరాలే కదా!

అయితే అందరూ శంకర సంప్రదాయాన్ని అనుసరిస్తున్నారా? లేరు. రామానుజ, మధ్వ, శ్రీ కృష్ణ చైతన్య, వల్లభాచార్య, శ్రీ కంఠాచార్య, మేయ కండర్ మొదలైనవారి సంప్రదాయ వాదులున్నారు. ఇవన్నీ శంకరుల తరువాత వచ్చిన సంప్రదాయాలే. ఒక్క అద్వైతం, అవిచ్ఛిన్నంగా వస్తోంది. శంకరులు తరువాత వచ్చిన వారు శంకర సంప్రదాయాన్ని నిర్మూలించలేకపోయారు. రామానుజులు వచ్చిన తరువాత, అద్వైతం కనుమరుగైపోయిందా? మధ్వాచార్యులు వచ్చిన తరువాత అద్వైతం, విశిష్టాద్వైతం లేకుండా పోయినాయనా? ఇతర సంప్రదాయాలను క్రొత్తగా వచ్చినవి నిర్మూలింపలేకపోయాయి. శంకరుల కాలంలోనే అందరూ అద్వైత సంప్రదాయానికి తల ఒగ్గారు. వారి తరువాత చాలాకాలం వరకూ అట్లాగే సాగింది. అందుకే వారు జగద్గురువులయ్యారు. ఈ బిరుదు కేవలం గౌరవంతో పెట్టింది కాదు.

జగత్ అనినపుడు మిగతా దేశమతాల ప్రస్తావన తీసుకొని రానవసరం లేదు. ఈ దేశం కర్మభూమి కనుక, ప్రపంచానికే గుండెకాయ వంటిది కనుక, దీని గురించి మాట్లాడదాం. భారతదేశం పూర్వకాలంలో భరత ఖండంగా ప్రసిద్ధి. ఇది ఎంతో విస్తరించిన ప్రాంతం, అంగ, వంగ, కళింగాది 56 దేశాలతో ఉండేది. ఆచార్యులు వాటన్నిటిలోనూ పర్యటించి మిగతా మతాల ఖండన చేసి అద్వైత స్థాపన చేసారు. కనుక వీరికి జగద్గురుత్వం వచ్చింది.

శంకర సంప్రదాయమే వైదికం, అన్నిటిని సమన్వయించేది

ఈనాడే సంప్రదాయమున్నా అన్నిటికీ వేదమే కదా ఆధారం. మిగిలిన వారు వేదాన్ని అంగీకరించినా లేకపోయినా మిగిలిన దేశాలలో

అనుసరించేవాటికి కూడా మూలాలు వేదంలో కన్పిస్తాయి. ఈనాటికీ సిద్ధాంతాలే కాదు, కర్మకాండ యొక్క ఛాయలూ మిగతా దేశాలలో కన్పిస్తాయి *(లోగడ ఉపన్యాసాలలో అనేక ఉదాహరణలను స్వామివారు పేర్కొన్నారు. చూ. అమృతవాణి-6).*

వేదాలలో శివవిష్ణు సంబంధమైన విషయాలుంటాయి. విశిష్టాద్వైత, ద్వైత సంప్రదాయాలలో శివుని విడిచి కేవలం విష్ణు సంబంధమైన వాటినే స్వీకరించారు. అట్లే శివాద్వైతంలో శైవ సిద్ధాంతాలలో విష్ణువును విస్మరించారు.

ఇక మీమాంసకులు వేదంలోని కర్మమార్గాన్నే గ్రహించి జ్ఞాన కాండను విస్మరించారు. వేదంలో జగత్తు, మిథ్య అనే మాటనే తీసుకొని దీనికొక రూపునిచ్చి బౌద్ధం వచ్చింది. ఇట్లా పదాలలో కొంత గ్రహించడం, కొంత మానివేయడం ఇతర సంప్రదాయాలలో కన్పిస్తాయి. శంకర మతం అంటూ ప్రత్యేకంగా ఏదీ లేదు. శంకర సంప్రదాయంలో ఉన్నది వైదిక మతమే. వీరు వేదంలోని కర్మ, భక్తి, జ్ఞాన యోగ, ధర్మ, శివ, విష్ణు సంబంధ విషయాలన్నిటినీ గ్రహించి సమన్వయించారు. అందరి దేవతలను పూజించారు.

ఇతర మతాల గురించి

శంకరులు అసంపూర్ణ మతాలు లేకుండా ఎట్లా చేసారో వివరిస్తాను.

కర్మకాండకు ప్రాధాన్యమిచ్చే మీమాసంకుల గురించి చెప్పాను. ఈశ్వరుడీ జగత్తును సృష్టించాడని వీరనరు. అతడు కర్మఫలదాత యని కూడా వీరనరు. వారికి సగుణ బ్రహ్మమూ లేదు, నిర్గుణ బ్రహ్మమూ లేదు. ధ్యానించరు. ఈశ్వరుణ్ణి పూజించరు. స్వర్గంగాని, లేదా దాని పైనున్న మోక్షంగాని కావాలన్నా కర్మానుష్ఠానం చేస్తే చాలని వారంటారు. తామే వేదాన్ని పూర్తిగా పాటిస్తున్నామని, జ్ఞానం పేరుతో కర్మను విడిచిన సన్న్యాసిని చూడడం కూడా పాపమని భావిస్తారు.

వేదాంతులతో బాటు వేదాన్ని పూర్తిగా నమ్మినవారు మీమాంసకులు. వీరు వేదంలో చెప్పబడిన కర్మలనే ఆచరిస్తారు. అవి న్యాయ, వైశేషిక, సాంఖ్య యోగాలు. వేదమంత్రాల ప్రామాణ్యాన్ని శంకించరు. అయితే తమ సిద్ధాంతాలకు వేదమే మూలమని గట్టిగా వాదించరు.

అయినా మీమాంస, అసంపూర్ణమైన మతమే. పాఠశాల చదువునుండి కళాశాలలోకి వెడతాం. ఆ పాఠశాల చదువే గొప్పదంటే ఎలా?

సాంఖ్యంలో 24 తత్త్వాలు, ప్రకృతినుండి పంచ భూతాలవరకూ లెక్కింపబడ్డాయి. ప్రపంచానికి ప్రకృతియే కారణమంటారు. మనస్సు, ఇంద్రియాలు ప్రకృతి నుండే వచ్చాయని అది సత్త్వ రజస్తమో గుణాలను కలుపుతుందని, చరాచర వస్తు ప్రపంచమూ దాని నుండే వచ్చిందని అంటారు. ఇక జీవంతో ఉన్నవాడు పురుషుడే. అతడు ప్రకృతితో సంబంధం లేకుండా ఉండగలడు. అతడు కార్యాలలో మునిగి తేలడు. కాని ఇతని సన్నిధానం వలన ప్రకృతి, అన్ని కార్యాలను నిర్వహిస్తుంది. జీవుడు ఈ 24 తత్త్వాలను (పంచతన్మాత్రలు, పంచభూతాలు, పంచ కర్మేంద్రియాలు, పంచజ్ఞానేంద్రియాలు మొదలైనవి) నిశితంగా గమనించి వాటిని తొలగించుకుని, పై మూడు గుణాలకు సమతౌల్యం తీసుకొని రాగలిగితే ప్రకృతి నుండి విడివడి కేవలం పురుషునిగా ఉండగలగడమే కైవల్యమని, లేదా మోక్షం అంటారు. ఇది వారి సిద్ధాంతము.

వీరి పురుషుడు వేదాంతులు చెప్పే నిర్గుణమైన ఆత్మతో; ప్రకృతి – మాయతో సమానము. కాని మన వేదాంతము, ఆత్మయే పరమాత్మయని లేదా బ్రహ్మమని, ప్రపంచము కనబడుతున్నట్లుగా ఉంటుంది, మాయవల్ల కల్పనగా ఉందని అంటుంది. ఇక మాయ లేదా ప్రకృతి అన్నిటికీ కారణమైనపుడు ఆత్మ, జ్ఞానంతో ఉన్న పురుషుడు, ఒక్కరు కాదా? పెక్కు ఆత్మలుంటాయా?

మీమాంసకులున్నట్లుగానే సాంఖ్యులు కూడా ఈశ్వరుని అంగీకరించరు. కాని వేదాంతులేమంటారంటే సగుణ బ్రహ్మయైన ఈశ్వరుడు తన ఆధీనంలో

మాయ నుంచుకొంటాడని, నిర్గుణ బ్రహ్మము మాయతో కలిసినపుడు ఈశ్వరుడై ప్రపంచ ప్రవర్తకుడౌతున్నాడని చెబుతుంది. పురుషుని కెట్టి సంబంధం లేదని, అతడుండడం వల్లనే ప్రకృతి, ఈ నాటకం ఆడుతోందని సాంఖ్యులు చెప్పే మాట సబబుగా లేదు.

నిష్కామ కర్మయోగం వల్ల చిత్తశుద్ధిని పొంది ఈశ్వరుణ్ణి భక్తితో భజించి ఏకాగ్రతతో జ్ఞానం విచారించి చేస్తే, ప్రకృతి బంధంనుండి విముక్తులు కావచ్చని వేదాంతులంటారు. కర్మకాండను ఈశ్వరుణ్ణి విడిచి కేవలం విడువదగిన 24 తత్త్వాలను విచారణ చేస్తేనే విముక్తి ఎట్లా సిద్ధిస్తుందని వేదాంతులంటారు.

అఖండ చైతన్యమైన బ్రహ్మమే ప్రపంచానికి కారణమని ఉపనిషత్తులంటాయి. కాని జడమైన ప్రకృతియే కారణమని సాంఖ్యం అంటుంది. ఈ ప్రధానమైన భేదాన్ని మనసులో పెట్టుకొని సాంఖ్యం, వైదిక సంప్రదాయానికి చెందినదని శంకరులన్నారు.

వేదాంతుల మాదిరిగానే, సాంఖ్య పురుషుడు (ఆత్మ) నిష్క్రియుడు. కాని ఇతని తృప్తికోసం ప్రకృతి సృష్టిస్తోందని సాంఖ్యమంటుంది. ఇది వేదాంతానికి, బుద్ధికి రుచించనిమాట. అనుభవించుట యనేది ఒక క్రియ కాదా? పురుషుడు నిష్క్రియుడైతే తనంతట తాను ప్రకృతి వ్యవహరించగలదా? సమాధి సుఖాన్ని పొందినవారు, పురుషుడైన ఆత్మ, పనికి కారకుడు కాదని, అతడనుభవించబడడని అంటారు. ఒకమూల పురుషుడు, కర్త కాదంటూ అనుభవించడం సబబుగా ఉందా?

చిత్తాన్ని అదుపులో ఉంచేది యోగపద్ధతి. సమాధి స్థితి, ఎట్లా పట్టుబడుతుందో చెబుతుంది. ఇది అష్టాంగాలలో ఉంటుంది. దీనిని అనుసరించేవారు నేటికీ ఉన్నారు. లాభాలను పొందుతున్నారు. దీనిలో ఈశ్వరుడున్నాడు. మిగిలినదంతా సాంఖ్యాన్ని అనుసరిస్తుంది. కనుక సాంఖ్యంలోని లోటుపాట్లు, ఇందులోనూ ఉంటాయి. చరాచర వస్తు ప్రపంచాన్ని నడిపేవాడీశ్వరుడనే మాటను, ఫలదాతయనే మాటనూ

పలుకకుండా అతడు శుద్ధుడని, దుఃఖాలంటనివాడని, అభ్యాసకునకు ఆదర్శప్రాయుడని, చిత్తైకాగ్రతకు దోహదం చేస్తాడని వీరు అంటారు.

న్యాయ, వైశేషిక మతాలు కేవలం బుద్ధి గమ్యాలు. తర్కంపై న్యాయం ఆధారపడింది. బ్రహ్మ సత్యమని, మాయ, జీవులనే తొడుగులు తొడిగిందని జ్ఞానం వల్ల ఆ ముసుగులును తొలగించాలని, బ్రహ్మముతో ఐక్యం కావాలని వేదాంతం చెప్పగా పై రెండు మతాలు జీవులు, ప్రపంచమూ సత్యమేయని, ముసుగులంటూ ఏమీ లేవని ఒక్క పరమాత్మ అనుటకు పెక్కు ఆత్మలని అంటాయి. వైశేషిక సిద్ధాంతము, న్యాయ మతాన్నే అనుసరిస్తుంది. చరాచర వస్తువులలోనున్న విశేషాన్ని గుర్తిస్తుంది. అనగా ప్రత్యేకతను. దీని మత ప్రకారం జగత్తు, జీవభావం జ్ఞానం వల్ల పోదని, చరాచర వస్తు ప్రపంచం అంతా అణువులతో నిర్మితమైందని, అవి విభజించడానికి వీలు లేవని, అణువుల కలయిక వస్తూత్పత్తి మొదలైన విషయాలనందిస్తుంది. శరీరము ప్రపంచమూ అంతా అణువులతో నిర్మింపబడిందే, ఆత్మయే చైతన్య స్వరూపమని తెలిసి, జీవన మరణ ప్రవాహం నుండి విముక్తులు కావాలని చెబుతుంది. సాంఖ్యంలో ఏ లోటుపాటులున్నాయో, ఈ వైశేషికంలోనూ అవే ఉన్నాయి. కర్మనాశన మెట్లా? వాదప్రతివాదాలతో సంబంధ విముక్తి ఎట్లా?

జడమైన ప్రకృతియే ప్రపంచానికి కారణమని సాంఖ్యులన్నట్లు, న్యాయ వైశేషికాలు ప్రపంచానికి అణువులే కారణమంటాయి. కనుక వైదిక మత విరుద్ధములన్నారు శంకరులు.

ఇక బౌద్ధులకు, జైనులకు వేదము లేదు, వేదాధ్యయనమూ లేదు. కర్మకాండలు లేవు, వర్ణాశ్రమాలసలే లేవు. ఈశ్వరునే వారు కాదన్నారు. మన ధర్మ శాస్త్రాలలో ఉన్న సామాన్య ధర్మాలను వారు స్వీకరించారు. సత్యం, అహింస, అస్తేయం (దొంగతనం లేకుండుట) బ్రహ్మచర్యం, అపరిగ్రహం (అవసరాన్ని మించి ప్రోగు చేయకుండా ఉండడం) మొదలైన వాటిని గ్రహించి ఇవి అందరికీ అని అన్నారు. మనుష్యులలో పరిపక్వతను గ్రహించకుండా

తీవ్రంగా అందరికీ ఈ ధర్మాలను విధించారు. జైన మతంలో భిక్షువులవలంబించే మహావ్రతము ఉంది. సామాన్యులకు తక్కువస్థాయి అను వ్రతం ఉంది. ఆ మతంలో వర్ణాశ్రమ ధర్మం లేకపోవడం వల్ల సామాన్య జనులు, ఈ అనువ్రతాలను అవలంబించలేకపోయారు. శరీరాన్ని బాధపెట్టడం వల్ల (శ్రమ) కర్మలను చేయమంటుంది. అందుకే వారిని శ్రమణులంటారు.

ఇది నిశ్చయమని మనమేమీ చెప్పనవసరం లేదని, ఎవరి అంతటవారే వివరించాలని కొద్దిగా తత్త్వాన్ని బుద్ధుడు అందించాడు. ఆ చెప్పినది, తరువాత వచ్చిన వారికి భిన్న భిన్నంగా తోచి వైభాషికమని, సౌత్రాంత్రికమని, యోగాచారమని, మాధ్యమికమని నాల్గు మార్గాలైంది. రెండు ప్రధాన భేదాలుగా మహాయాన హీనయానములున్నాయి. యోగాచారం, మాధ్యమికం, మహాయానం పరిధిలోనికి రాగా; సౌత్రాంత్రికము, వైభాషికము హీనయాన పరిధిలోనికి వస్తాయి. ఇదంతా వాద వివాదాలతో ఉంటుంది.

బుద్ధుడు వేదంలో కొంతయే చెప్పాడని అన్నాను. ఉపనిషత్తులనుండి మాయనే గ్రహించాడు. కాని ఆ మాయకు ఆధారమైన సత్యాన్ని గ్రహించలేదు. కనుక సచ్చిదానందుడైన పరబ్రహ్మము చేరుట లక్ష్యంగా బౌద్ధము చెప్పదు. ఈ మాయనుండి, మాటిమాటికీ మారే జగత్తునుండి విముక్తులై శూన్యస్థితిని అందుకోవడమే నిర్వాణమని, లేదా మోక్షమని అంటుంది. ఉన్నదానిని లేదంటూ ధ్యానం వల్ల ఎట్లా తెలిసికోగలం? బ్రహ్మానందముండగా అంతా శూన్యమవడం ఎట్లా? నిత్య వ్యవహారంలోనే బ్రహ్మానంద మనుభవించామని అంటాం కదా! ఇక సమాధిలో అనుభవించిన వారికి ఎట్లా లేదని చెప్పగలం?

ప్రపంచం లేదు, జీవం లేదు, ఈశ్వరుడు లేదు, ఆత్మ లేదు, పరబ్రహ్మము లేదు, కనబడేదంతా భ్రాంతియే. కనబడుట, కనబడకపోవుట నిరంతరంగా సాగుతూ ఉండడం వల్ల జీవం ఉన్నట్లు భ్రాంతి కల్గుతోంది. ఊదితే దీపం, ఆరిపోవునట్లు అన్నిటినీ ఊది వేయగా నిర్వాణం కల్గుతుందని బౌద్ధం అంటుంది. జీవుడు పరమాత్మలో ఐక్యమయినపుడు ఈ జగత్తు జీవించుట

అంతా అబద్ధమని వేదాంతము చెబుతుంది. జ్ఞానం రానంతవరకూ, అతనిలో ఐక్యం కానంతవరకూ మాయా శక్తితో కూడిన ఈశ్వరుడై బ్రహ్మము ఇదంతా ఆడిస్తున్నాడని, ఒక క్రమపద్ధతిలో ఈశ్వరుడు దీనిని నడుపుతున్నాడని, ప్రపంచము పారమార్థిక సత్యం కాపోయినా, వ్యావహారిక సత్యమని (కొంత కాలం ఉండిపోయేదని) జ్ఞానం పట్టుబడనంతవరకూ ధార్మికమైన నియమాలు అందరూ పాటించాలని అంటుంది వేదాంతం. బౌద్ధం, ఈశ్వరునీ నమ్మదు, వ్యావహారిక సత్యాన్నీ నమ్మదు. అన్నీ కనిపిస్తూ మరుగైపోతాయంటుంది. అయితే కర్మసిద్ధాంతాన్ని బౌద్ధులంగీకరిస్తారు. కారణ కార్యాలుండడం వల్ల పునర్జన్మనూ అంగీకరిస్తారు. ఇట్టి పద్ధతి అసంబద్ధంగా ఉంటుంది.

బ్రహ్మము గురించి జైన మతము చెప్పక పోయినా, అది ఉందని గాని, లేదని గాని కంఠోక్తిగా చెప్పదు. దీనిని స్యాత్‌వాదమంటారు. కొన్ని ఇట్లా ఉండవచ్చు అని అంటుందే కాని ఇది ఇట్లా ఉంటుందని గట్టిగా చెప్పదు. కావచ్చు, కాకపోవచ్చనే భేదం, ఇది ఏడు రకాలుగా ఉంటుంది. (సప్తభంగి). కాని ఒక చిక్కు సమస్యలా ఉంటుంది. స్యాత్ అస్తి = వస్తువక్కడ ఉండవచ్చు; స్యాత్ నాస్తి=అందుండకపోవచ్చు; స్యాత్ అస్తి నాస్తి = అది అక్కడ ఉండవచ్చు, లేకపోవచ్చు; స్యాత్ అవక్తవ్య= దానిని నిర్వచించకపోవచ్చు; స్యాత్ అస్తిచ అవక్తవ్య = అది అక్కడ ఉన్నా నిర్ధారణగా అది ఎట్లానో చెప్పలేకపోవచ్చు; స్యాత్ నాస్తిచ అవక్తవ్య = ఆ వస్తువు అక్కడ లేకపోయినా దాని స్వరూపాన్ని చెప్పలేకపోవచ్చు; స్యాత్ అస్తిచ, నాస్తిచ అవక్తవ్య= ఆ వస్తువు వుందని గాని లేదని గాని చెప్పుటకు వీలు పడకపోవచ్చు.

ఇట్లా సాగుతూ ఉంటే ఏ నిర్ణయానికి వచ్చినట్లు?

జ్ఞాన స్వరూపము, ఆత్మయని జైనమతం అంగీకరిస్తూ, శరీరమెంత ఉంటుందో ఆత్మ అంత ఉంటుందని ప్రత్యేకంగా చెప్పింది. చీమలో చీమంత ఆత్మ; ఏనుగులో ఏనుగంత ఆత్మయని; చీమ, ఏనుగుగా జన్మిస్తే ఏనుగంత ఆత్మ ఉంటుందని అంటుంది.

కర్మలు, అణు స్వరూపాలై, ఆత్మలో చొచ్చుకొని ఆత్మను బంధిస్తాయని; బంధాలను త్రెంపుకొంటే ఆత్మకు విముక్తియని, ఆకాశం చివర భాగంలో సంతోషంతో ఉంటుందని అంటారు. అణుస్వరూపాలుగా ఆత్మలో కర్మలు ప్రవేశించడాన్ని అడ్డుకోవాలని, అందుకై తీవ్రవ్రతాలను అనుసరించాలని అంటారు.

అహింసకు ఈ మతం అధిక ప్రాధాన్యం ఇస్తుంది. దాన ధర్మాలకూ అంతే. ప్రాపంచిక జీవితంపై తీవ్ర ద్వేషంతో ఉంటుంది. సిద్ధాంతాలు బాగుండవచ్చుగాని సామాన్యులకు అందుబాటులో ఉండవు. అందువల్ల దానిని అనుసరించువారే దానిపై తిరుగుబాటు చేస్తారు. మన మతంలో గృహస్థాశ్రమానికి, పురుషార్థాలకు తగిన స్థానం ఉంది, అందర్నీ ఉన్నత స్థితిని చేరుకోవడానికి రకరకాల మార్గాలను సూచించింది. పరిపక్వమైన మనస్సులు కానివారికి అట్టి బౌద్ధ జైనాలు సంతృప్తి నీయలేదు. అపరిపక్వమైన పండు చెట్టునుండి పడితే రుచికరంగా ఉంటుందా? సామాన్యులు ఆ సిద్ధాంతాలను ఆచరించడం సాధ్యం కాదు కనుక ఈ దేశం నుండి అవి పోవడమో, లేదా ఈ దేశపు ఆచారాలకై మరల వారు మ్రొగ్గు చూపడమో జరిగింది.

భగవత్ తత్త్వం

కర్మ సిద్ధాంతం గురించి కొంత మాట్లాడుకుందాం. చర్యకు ప్రతిచర్య ఉంటుంది. కారణానికి కార్యం ఉంటుంది. దీనినుండి ఎవ్వరూ తప్పించుకోలేరు. మంచి చెడు కర్మలకు తగిన ఫలముంటుంది. శరీరం పోయినా జీవుడు మరొక శరీరం దాల్చి గత జన్మలకు తగిన ఫలాన్ని పొందవలసిందే. ఈ చక్రం నుండి ఎవ్వరూ తప్పించుకోలేరు. మీమాంస, బౌద్ధ, జైనాలు, ఈ సిద్ధాంతాన్ని నమ్ముతూ ఈశ్వరుడు మాత్రం ఫలదాత కాదంటారు. ఇదీ చిత్రం.

కర్మ జడం కదా! తగిన ఫలాన్ని అది ఎట్లా ఈయగలదు? వేదాన్ని నమ్ముతూ కర్మ, తనంతట తానే ఫలాన్నిస్తుందని, ఈశ్వరుడవసరం లేదని ఒకవైపు మీమాంసకులనగా; వేదాలను కాదని కర్మ, ఎట్లా ఫలాన్నిస్తుందో బౌద్ధ జైనాలు వివరించలేదు. కర్మ ప్రకారం మరల పుట్టుక ఉందంటారు. కనుక వీరు పునాది లేని సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అంతా శూన్యమని అంటూనే, అంతా నిరంతరం మార్పు చెందుతోందని అంటూ ఫలానా కర్మలు, ఫలానా ఫలాన్ని ఇస్తాయని బౌద్ధులెట్లా నిర్ణయించగలరు? అంతా మాయయని కొట్టివేయకుండా దీనినంతటినీ నడిపే గొప్ప మనస్సు (మహత్తు) లేదా ఈశ్వరుడన్నాడని వేదాంతులంటారు.

వేదాంతులు బ్రహ్మమే సత్యమని చెబుతూ మాయా సిద్ధాంతాన్ని బౌద్ధుల నుండి తీసుకొన్నారని వేదాంతులను ఇతరులాక్షేపిస్తారు. వారొక భేదాన్ని తప్పక గుర్తించాలి. మాయవల్ల బ్రహ్మము ప్రపంచంగా కన్పిస్తోందని ఈశ్వరుడు తన ఆధీనంలో మాయ నుంచుకొని ఫలాలనందిస్తాడని వేదాంతులంటారు. మరొక విధంగా చెప్పాలంటే నిర్గుణ బ్రహ్మము, నిష్క్రియ బ్రహ్మము మాయాశక్తితో కలిసి ఈశ్వరుడగుచున్నాడని, సగుణ బ్రహ్మము (ఈశ్వరుడు) ప్రపంచ వ్యవహారాలను నడిపిస్తున్నాడని అద్వైతులంటారు. సగుణ బ్రహ్మము నుండి నిర్గుణ బ్రహ్మము వైపు పయనించడమే అద్వైత లక్ష్యం. అందువల్ల మాయతో కూడిన సగుణ బ్రహ్మము యొక్క అనుగ్రహం కావాలని, జ్ఞాన మార్గానికి వెళ్ళడానికి ముందు భక్తితో ఈశ్వరుని భజించాలని అద్వైతం అంటుంది. ఇట్లా బౌద్ధానికి ఇది భిన్నం.

మరొక భేదం ఉంది. మాయ అంటే కేవలం అబద్ధం కాదు. దానిని అత్యంత అసత్ అనలేదు. నిర్గుణ బ్రహ్మమే అసలైన సత్యం. దీని మధ్యలో ప్రాతిభాసిక సత్యం ఉంది. అనగా సత్యమని భ్రమింపచేసి అసత్యమని నిరూపించుట. ఇది ఎండలో ముత్యపు చిప్ప, వెండిగా కనబడే స్థితి. ఈ మాయాలోకాన్ని ప్రాతిభాసిక సత్యమన్నారు. ఇది జ్ఞానంలో కనుమరుగై

పోతుంది. కనుక ప్రాతిభాసిక సత్యం కేవలం అసత్ కాదు. అట్లాగే జగత్తు అసత్యం కాదు. ఇది మిథ్య. అనగా తాత్కాలికంగా సత్యంగా కనబడేది.

తాత్కాలిక సత్యం గురించి చెప్పేటపుడు మంచి చెడు కర్మలు, దానికి తగిన ఫలాన్ని ఈశ్వరుడిస్తాడనే మాట కుదురుతుంది. అందువల్ల సత్కర్మలు చేయండని, దానికి తగిన ఫలాన్ని ఈశ్వరుడిస్తాడని, చిత్త శుద్ధి కల్గుతుందని, తరువాత అతని అనుగ్రహం లభిస్తుందని, తద్వారా జ్ఞాన మార్గంలో ప్రవేశించి అతనిలో లీనం కావచ్చని చెబుతారు. ఈ మంచి కర్మలు, ధర్మశాస్త్రం విధించిన కర్మలు.

అంతా శూన్యమని దీనినందుకొనుటయే మోక్షమని చెప్పే బౌద్ధమతం, సత్యాహింసలను పాటించాలని అంటుంది. హింసను పాటిస్తే తప్పేమిటి? మంచి నడవడిక ఎందుకుండాలని ప్రశ్నించవచ్చు. అటువంటివారికి వారి దగ్గర సమాధానం దొరకదు. శంకర సిద్ధాంతంలో సమాధానం దొరుకుతుంది. మాయా జగత్తు మిథ్యయని చెప్పినపుడు ఇది పూర్తిగా సత్యము కాదు. అసత్యమూ కాదని చెప్పినపుడు ఈ మధ్యలో సత్కర్మలకు మంచి ఫలాన్ని ఇస్తాడని, మనిషికి చిత్తశుద్ధి ఏర్పడుతుందని, జ్ఞాన మార్గాన్ని అవలంబించుటకు అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడనే మాటకు ఆస్కారం ఉంటుంది. అందుకే మీమాంసకుల కర్మ మార్గాన్ని వీరు స్వీకరించారు. బౌద్ధుల మాయావాదాన్ని ఒక దశలో స్వీకరించారు. జైనుల అహింసామార్గాన్ని గ్రహించారు. ఆయా స్థానములలో అన్నిటినీ గ్రహించారు.

అన్నీ అబద్ధమని చెప్పిన బౌద్ధమతం గాని, ఏదీ స్పష్టంగా నిర్వచించని జైన మతంగాని కర్మ – దాని ఫలాలు నిర్వహించుటలో విఫలం పొందాయి. సాధారణంగా ఈశ్వర సంబంధం లేని మతానికి ప్రజలు మ్రొగ్గు చూపరు.

బౌద్ధ జైనాలు - ప్రజల మనః ప్రవృత్తి

సాధారణ ప్రజలు తత్త్వాన్ని గూర్చి ఆలోచించరు. ఏదో ఒక శక్తి, ఈ జగత్తు నంతటినీ నడుపుతోందని భావిస్తారు. ఏదో మహాత్ముణ్ణి ఆదర్శంగా

తీసుకొని అతడు చెప్పినది సత్యమని నమ్మి పాటిస్తూ ఉంటారు. అతడు చెప్పిన తత్త్వం ఒంటబట్టిందా లేదా అనే విచారణ లేకుండా అతణ్ణి పూజిస్తూ ఉంటారు. ఏ మతస్థులైనా కొంతైనా ఆచరిద్దామని భావిస్తారు.

జైన బౌద్ధాలందించిన సత్యాహింసలను అన్ని మతాలూ చెప్పాయి. మనుస్మృతిలో ఇవి లేవా? వీటిని చెప్పడానికి ప్రత్యేక శాస్త్రాలంటూ అక్కర్లేదు. అయితే ఆచరణలో పెట్టినపుడు కోరికలు బుస కొడతాయి. తత్త్వ విచారణ చేసేవారు వీటిని అదుపులో పెట్టగలరు. మిగిలినవారు చెడునుండి దూరంగా ఉండాలని కోరుతూ మంచిని ప్రసాదింపుమని ఈశ్వరుని వేడుకుంటారు.

బౌద్ధ జైనాలలో ఈశ్వరుడూ లేడు. వాటి తత్త్వాలు సామాన్యులకు బోధపడవు. వారు చెప్పిన నీతి సూత్రాలను పాటించడమూ కుదరదు. అందరికీ అన్ని నియమాలంటే కుదురుతుందా? సమానమైన హక్కులన్నారు. హిందూ మతంలో పక్షపాతంతో కూడిన వర్ణ విభజన ఉందని ప్రచారం చేసారు. అయితే జినుడు, బుద్ధుడు తమ నడవడికల ద్వారా ఆనాటి ప్రజలనాకట్టుకున్నారు.

అయితే జినుడు, బుద్ధుడు తనువులు చాలించిన తర్వాత, వట్టి నడవడిక ప్రజలను ఆకట్టుకొనలేకపోయింది. సిద్ధాంతాలు, ఎట్లాగూ పట్టుబడవు. ఆ తర్వాతి వారు ఈశ్వరుణ్ణి నమ్మకపోయినా జైన, బౌద్ధ, జ్ఞాన సిద్ధుల విగ్రహాలని మలిచి ప్రజలముందుంచారు. ఇట్లా మూర్తి పూజ నేర్పాటు చేసారు. చివరకు మిగిలిందేమిటి? బుద్ధుడు, బోధి సత్త్వ విగ్రహాలు, జైన తీర్థంకరుల విగ్రహాలూ వెలిసి వాటిని ఆసరాగా తీసుకొని నడవండని, ఆ మతనాయకుల అనుయాయులు ప్రచారం చేసారు. పెద్ద పెద్ద విహారాలు, పెద్ద పెద్ద విగ్రహాలూ వచ్చాయి. ఇంతవరకూ హిందూ దేవతలను మ్రొక్కనివారు వీటికీ మ్రొక్కడం మొదలు పెట్టారు. అవి ప్రసాదించు, ఇవి ప్రసాదించు అనే మాటలు కూడా మామూలే. జ్ఞాన వైరాగ్యాలను ప్రసాదింపుమని అడిగినా బాగుండేది. సామాన్యులకు అవి కావాలా? ఆ మూర్తులందించిన ఆదర్శాలపై దృష్టి

పెడతారా? పెట్టరు. చివరకు వారి మందిరాలలో వాటినీ పూజించడం మొదలు పెట్టారు. దేవుడు లేడు, దెయ్యమూ లేదనే మతాలు, వారి మత నాయకులనే దేవతలుగా భావించిన పరిస్థితి వచ్చింది. ఇదంతా 2500 సంవత్సరాల వెనుక.

పచ్చి భౌతికవాదం

ప్రాపంచిక జీవితం, బంధహేతువని ఇంతవరకూ చెప్పిన మతాలకు భిన్నంగా, ఇది బంధ హేతువు కాదని అన్నిటినీ అనుభవించడమే లక్ష్యంగా చెప్పింది చార్వాకమతం. చార్వాకమనగా మధురమైన మాట. తపశ్చర్యలు, వ్రతాలు, శరీరాన్ని శుష్కింప చేసుకోవడం వంటివి దండుగని, ఇష్టమైనది తినడం, త్రాగడం మంచిదని బోధించింది. వినడానికి బాగానే ఉంది కనుక ఇది చార్వాకం. ఈశ్వరుడు లేడు. ఉంటే కనబడుతున్నాడా? ఏది శరీరానికి, మనస్సునకు ఆనందాన్నిస్తుందో దానిని అనుభవించండని అన్నారు.

దానిని బృహస్పతియనే దేవ గురువు స్థాపించాడని, సన్మార్గంలో నడిచే అసురుల మనస్సులను విరవడం కోసం దీనిని స్థాపించాడని, ఇది బార్హ స్పత్యమని, లోకాయతమని ప్రసిద్ధిని పొందింది. అసుర ప్రవృత్తితో ఉన్న నేటి వారికి ఈ మాటలు రుచికరంగానే ఉంటాయి.

వేదాలను నమ్ముతూ వేదాంతాన్ని త్రోసివేసినవి

వేదంలో భాగమైన ఉపనిషత్తు చెప్పే జీవ బ్రహ్మల అభేదాన్ని అంగీకరించకుండా కేవలం కర్మకాండలకే పరిమితమైన మీమాంసక మతాన్ని కృష్ణుడే ఖండించాడు. అయినా కర్మానుష్ఠానికే బ్రాహ్మణులు మ్రొగ్గు చూపారు. వేదమంత్రాల అర్థ విచారణ, వీరిని ఆకట్టుకొంది. సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక సిద్ధాంతాలను చాలా తక్కువమంది విద్వాంసులు పాటిస్తూ ఉండేవారు. యోగసిద్ధాంతంలో ఈశ్వరుణ్ణి అంగీకరించినా ఇదీ పూర్తిగా సనాతన ధర్మాన్ని అనుసరించలేదు.

ఇక కొందరు బుద్ధిమంతులు బౌద్ధమతం కొమ్ముకాసేరు. వేదాంత సిద్ధాంతము క్షీణదశలో నుండగా కర్మలపట్ల విముఖత చూపించిన బ్రాహ్మణులు దీనికి ఆకర్షితులయ్యారు. అందు ధ్యానానికి అవకాశం మెండుగా ఉండడం వల్ల కావచ్చు. కనుక యాగమనే మాటను స్మరిస్తేనే ప్రజలు చెవులు మూసికొంటున్నారని దేవతలు, పరమేశ్వరునితో మొరపెట్టుకొన్నట్లుగా కొద్ది అతిశయోక్తితో శంకర విజయంలో చెప్పబడింది. ఇది ఆనాటి పరిస్థితి.

ఆనాటి పూజా పద్ధతులు

ఒక ప్రక్క కాపాలికం, కాలాముఖం, భైరవం లాంటి క్రూర పూజావిధానాలు విజృంభించాయి. శక్తి ఉపాసనలో వామాచారం మధువు, మత్స్యము, మాంసము, ముద్ర, మైథునాలతో సాగేవి. అసహ్యాకరమైన ఈ చర్యలకు కొత్త కొత్త అర్థాలను చూపించి సమర్థించినవారూ ఉండేవారు.

సాత్త్వికపూజలతో బాటు తామసిక పూజలూ చాలాకాలం నుండి వస్తున్నాయి. కల్లు, మాంస నైవేద్యం, భయంకర నృత్యాలు మొదలైనవి నేటికీ సాగుతున్నాయి. ఇప్పటికీ ఆదివాసులు ఇట్టి నైవేద్యాలను అర్పిస్తూ పండుగలు జరుపుకుంటూ ఉంటారు.

దేవతారాధన పేరుతో కొన్ని భయంకరాచారాలు తంత్రగ్రంథాలలో కన్పిస్తాయి. అందు సాధన, చేసినవారికి కొన్ని సిద్ధులూ సంప్రాప్తిస్తాయి. ఈ ఉగ్ర లేదా క్షుద్ర దేవతలను ఆరాధించే సమయంలో ఏమాత్రం పొరపాటు జరిగినా ఆ దేవతయే ఆ సాధకునికి హాని చేస్తుందని అంటారు. యోగాభ్యాసంలో కూడా సరిగా చేయకపోతే హాని కలగడం ఖాయం. మనసు కెట్టి వికారాలూ అంటకుండా, క్షోభ లేకుండా వీటిని ఆచరించడం, కత్తి అంచుమీద నడవడం వంటిది. బ్రహ్మవిద్య కూడా అట్టిదేయని ఉపనిషత్తులన్నాయి. రామకృష్ణ పరమహంస లక్ష్యాన్ని సాధించడానికి ఇవి కూడా మార్గాలే కాని ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రధాన ద్వారం గుండా కాక

దొడ్డిదారి ద్వారా ప్రవేశించడం లాంటిది" అని అన్నారు. కనుక దొడ్డిదారి బాగుందని అనేవారు భయంకర ఆచారాలను బాహాటంగా ఆచరించకుండా ఉంటే మంచిది. కానీ తామాచరించడమే కాకుండా ప్రచారం చేయడం చేసిన కాలమది.

చిత్రమేమిటంటే దేవుణ్ణి గురించి మాట్లాడని బుద్ధుణ్ణి దేవతగా చేసి పూజించడం మొదలు పెట్టారు. ఈ మూర్తులను చూస్తే శాంత భావం మనలో ఉదయిస్తుంది. పూజలతో వారు ఆగలేదు. తరువాత భిక్షు సంఘాలు వచ్చాయి. ఎంతమంది సన్న్యాసులుంటే అంత ఘనతగా భావించారు. అర్హత, పరిపక్వమైన మనస్సు లేనివారు సన్న్యాసం తీసుకొంటే రకరకాల వికారాలు పుట్టడం సహజం. (స్త్రీలకూ సన్న్యాస దీక్ష మొదలైంది కూడా) కోరికలను తీర్చుకోవడంకోసం తాంత్రిక పూజలను మొదలు పెట్టారు. పూజలేని మతంలో పూజలు ప్రారంభమయ్యాయి. వీరిని చూసి మన మతంలో మనవారూ ప్రవేశపెట్టారు.

పాశుపతమతం, వైదికమని, అవైదికమని చీలింది. వైదిక పాశుపతంలో అసభ్యకరమైన పూజలు లేవు. అట్లాగే వైష్ణవ, భాగవత, పాంచరాత్రంలోనూ అసభ్యం లేదు. ఇక కాశ్మీర శైవ సిద్ధాంతంలోనూ వామాచారం లేక పోయినా పూర్తిగా వైదిక మతం కాలేకపోయింది. భక్తి ద్వారా ఏకాగ్రతను సంపాదించి అద్వైత జ్ఞానాన్ని పొందవచ్చని చెప్పింది. ఇది అద్వైతానికి దగ్గరగా ఉంటుంది. పూర్తిగా అద్వైతంలో ఉండదు.

వైదికం అంటే పూర్తిగా వేదాలను నమ్మితేనే

వేదంలో కొంత భాగాన్ని నమ్మి, కొంత దానిని నమ్మని మతాన్ని పూర్తి వైదిక మతమని అనలేం. ఇందు శివసూక్తాలున్నాయని పాశుపత మతాన్ని వృద్ధి చేసామని; విష్ణు సూక్తాలను గ్రహించి భాగవత పాంచ రాత్రాన్ని వృద్ధి చేసామంటే అది సరియైన వాదం కాదు. వేదంలో శివ, విష్ణువులని అన్నా అవి పరబ్రహ్మ వాచకములే. శివుడే పరమ దైవమన్నా, విష్ణువే పరమ

దైవమన్నా ఇబ్బంది లేదు. కాని ఒకరికంటె మరొకరు తక్కువని నిందించుకోవడం వేద సమ్మతం కాదు. అందువల్ల ఆ మతాలు, అవైదికాలని పిలువ బడతాయి.

వేదాలలో యజ్ఞాలు, వాటిలో హవిస్సుల నర్పించుట; అవి వివిధ దేవతలకు చెందుట అనే ప్రక్రియ వైదికము. ఇందొక దేవతకే అర్పిస్తాను, ఇంకొక దేవతకు అర్పించననడం అవైదికం. ఒక దేవతను ఇష్టదైవంగా ఆరాధించడంలో తప్పులేదు. ఇక కర్మకాండ దగ్గరకు వచ్చేటపుడు శ్రుతి, స్మృతులలలో చెప్పబడినట్లే చేయాలి. ఒక దేవత పట్ల ప్రత్యేకాభిమానము, మరొక దేవత పట్ల దురభిమానాన్ని ప్రకటించడానికి వీలు లేదు.

40 సంస్కారాలే స్మృతులలో చెప్పబడ్డాయి. దానికి మించి అనుసరిస్తే అది అవైదికమే. శంఖం, చక్రం, త్రిశూలం, ఋషభం వంటి ముద్రలను శరీరంపై ముద్రాధారణం, వైదికం కాదు. అవైదికమే అనాలి. ముద్రాధారణ జరిగితేనే శైవునిగానో, వైష్ణవుని గానో పరిగణిస్తామని అనడం శాస్త్రసమ్మతం కాదు.

నాకు భక్తే ప్రధానం, వర్ణాశ్రమాలలో పని లేదన్నా ఆ పద్ధతి కూడా అవైదికమే.

కేవలం తత్త్వాన్నే గ్రహిస్తాం, మిగిలిన వాటిని పట్టించుకోం అని కొందరంటారు. కర్మకాండ, భక్తి, తత్త్వవిచారణ మొదలైన అంశాలన్నీ ఎవరికి ఏ దశలో, ఏ స్థితిలో చెప్పారో గ్రహించుకొని నిర్ణయానికి రావాలే గాని, తమ కిష్టం కాని దానిని విసర్జిస్తామని; మాకా వేదాంతమే ప్రధానమని, అందలి వర్ణాశ్రమాలు నేటి సమాజంలో పనికిరావని వాదించేవారిని వైదికులని ఎట్లా అనగలం? వేదం అందించిన మార్గాన్ని పట్టుకోలేకపోతే అదీ అనవసరం అనడం సబబు కాదు.

ఏది వైదికమో, ఏది అవైదికమో భారతమే నిర్ణయించింది. (వివరాలకై అమృతవాణి-1, పుట 55 చూడండి) అయినా సూక్ష్మంగా అందిస్తా.

"సాంఖ్యం యోగః పాంచరాత్రం వేదాః పాశుపతం తథా"

అనగా ఇందులో వేదం కంటె భిన్నంగా మతాలు పేర్కొనబడ్డాయి. ఐదు మతాలలో వేదం ఉంది. అంటే మిగిలినవి అవైదికములనే కదా అర్థం! ఇక శివ మహిమ్నస్తవంలో

"త్రయీ (వేదం) సాంఖ్యం యోగః పశుపతిమతం, వైష్ణవ మితి" అని ఉంది. త్రయి అంటే వేదమే. దానికి భిన్నంగా మిగతా మతాలు పేర్కొనబడ్డాయి. శివుణ్ణి కీర్తించే స్తోత్రమైనా శైవాన్ని వైదిక మతమని పుష్పదంతుడు అనలేదు.

కనుక వేద మార్గమే సత్యమైన మార్గమని మిగిలినవారు కొన్నిటిని గ్రహించి కొన్నిటిని విడిచి, కొన్నిటిని చేర్చి వైదికములనే భ్రాంతిని కల్గించారు. వీరు విద్వాంసులగుటచే బుద్ధిమంతుల్ని ఆకర్షించారు. సామాన్య జనులపై కూడా ప్రభావం చూపారు.

అట్లాగే కొన్ని తంత్రాలు వైదికములనే భ్రాంతిని కల్గించాయి. ఇక కొందరు వేదాలకంటె ఆగమాలకే పట్టం గట్టారు. అవి దేవాలయ అర్చనాదులను చెప్పేవి. వాటిని భగవంతుడే చెప్పాడని ప్రచారం చేసారు.

తాము అవైదికంగా ఉన్నా, వైదిక మతాన్ని వారెట్లా గుర్తించారో చూడండి. భగవంతుడే తంత్రాన్ని లేదా ఆగమాన్ని చెప్పాడని, పురాణాలలో ఇట్లా చెప్పబడిందని వాటిని ప్రమాణంగా చూపుతూ వైదిక కర్మలకు సామాన్యులను దూరంగా ఉంచారు.

విప్లవాత్మక మతాలు

పాతవాటిని నిర్మూలించాలని, క్రొత్తవాటిని ఏర్పాటు చేసుకుందాం అనడం చాలాకాలం నుండి నేటివరకూ ఉంది. పూర్వకాలంలో ఈ ధోరణి తక్కువగా ఉండేది. నేడిది అధికం. వేదం ఎందుకు? మా శాస్త్రాన్ని భగవానుడే అందించాడని కొందరు, వేదము లేదు, శాస్త్రమూ లేదు, మా శాస్త్రమే గొప్పదని కొత్త మతాలను స్థాపించారు.

ఇట్లా బౌద్ధ జైన మతాలు వచ్చాయని చెప్పాను. అయితే పచ్చి భౌతిక వాదాన్ని చెప్పే చార్వాకాన్ని చాలామంది స్వీకరించలేదు. బౌద్ధ జైనమతాలకు రాజాదరణ లభించింది. వారిద్దరు రాజ కుటుంబాలలో పుట్టడం, అన్నిటినీ త్యజించడం, వారి ప్రవర్తన, ప్రజలకు నచ్చింది ఇక రాజపోషణ కూడా ఉంది. ఆ పైన జనులు మాట్లాడుకొనే ప్రాకృత భాషలోనే బుద్ధుడు ప్రవచనాలను సాగించాడు. జినుడు, అందరికీ ఉపయోగపడే పాఠశాలలను స్థాపించి విద్యావ్యాప్తి చేసాడు. వారి వారి మాతృ భాషలలోనే పాఠాలుండేవి. ఆ మత సిద్ధాంతాలు సామాన్య జనులకు తెలియవు. జీవితంలో వాటిని ఆచరణలో పెట్టడం తెలియకపోయినా ఆ మతాలలో జనులు చేరారు. చివరగా ఆ మతాలవారు, విగ్రహారాధనను కూడా ప్రవేశపెట్టారని చెప్పాను. అందువల్ల చేరారు.

ఈ రెండు మతాలలో శంకరుల కాలంలో జైనం ఎక్కువగా వ్యాప్తి చెందకపోవడం వల్ల దానిని ఎక్కువగా శంకరులు ఖండించలేదు. బౌద్ధమతాన్ని అక్కడక్కడ ఖండించారు. ఇక మీమాంసకులనెక్కువగా ఖండించవలసి వచ్చింది. కారణం చెబుతాను.

అవతరించుటకు తగిన పరిస్థితులు

శంకరుల కాలంలో వైదిక మతం క్షీణించింది. వైదికం కాని మతాలు కొన్ని, తాంత్రిక మతాలు కొన్ని, భగవంతుడే తమ మతాలు చెప్పాడని కొన్ని, ఇట్లా 72 మతాలున్నాయి. అందువల్ల ఈశ్వరుడే అవతరించవలసి వచ్చింది. కృష్ణావతారానికి, శంకరావతారానికి సంబంధం ఉంది.

అసలవతార తత్త్వం

కృష్ణుడు తాను సూర్యునకు 'సనాతన ధర్మాన్ని' ఉపదేశించినట్లు అది చాలాకాలం సాగి క్రమక్రమంగా క్షీణించినట్లు దానిని మరల అర్జునునకు

ఉపదేశిస్తున్నట్లు చెప్పాడు. ఇదేమిటయ్యా! నీవు నాకు కన్పిస్తున్నావు, యుగాల వెనుక ఉపదేశమిచ్చా నంటావేమిటని అర్జునుడన్నాడు:

"అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః

కథ మే తద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవానితి"

దానికి సమాధానంగా "నీకూ నాకూ అనేక జన్మలు గడిచాయని, నేను వాటినన్నిటినీ ఎరుగుదనని, నీవెరుగవని" కృష్ణుడు అన్నాడు.

"బహూని మే వ్యతీతాని జన్మాని తవార్జున

తాన్యహం వేద సర్వాణి నత్వం వేత్థ పరంతప"

అర్జునుడు తిరిగి ప్రశ్నించాడా? నాకున్నట్లే ఇతనికీ బహు జన్మలున్నాయని ఊరుకున్నాడా? అతడు గుర్తు పెట్టుకున్నాడులే అని ఊరుకున్నాడా? ఎందుకు? ఎప్పుడు జన్మనెత్త వలసి వచ్చిందని అడిగాడా? గత జన్మల గురించి ఇప్పటికీ ఎట్లా గుర్తుందని అడిగాడా? ఇట్లా శంకించి భగవంతుణ్ణి ప్రశ్నిస్తాడా? మనకైతే సందేహం కల్గుతుంది. అర్జునుడు మానవుడు కనుక, గత జన్మ కర్మలు వెంటబడడం, జన్మలనెత్తడం ఉంటుంది కాని, భగవంతునకు కర్మలు - జన్మలూ ఉంటాయా? కర్మల వల్ల పుట్టుక ఉంటుందా? ఎందువల్ల భగవానుడు జన్మనెత్తవలసి వచ్చింది? ఇపుడు లీలగా జన్మనెత్తినట్లు అప్పుడూ లీలగా ధరించాడా? అనే ప్రశ్నలు మనవంటి వారికి వస్తాయి. అర్జునుడడగకపోయినా మనవంటివారికి అట్టి సందేహాలు కలిగాయని కృష్ణుడు ఇట్లా జవాబిచ్చాడు "నాకు జన్మ లేకపోయినా, అనంత శక్తులతో కూడిన స్వభావం కలవాడినై అన్ని ప్రాణులను నియమిస్తూ, స్వీయ ప్రకృతిని వశం చేసుకుని నా మాయవల్లనే అవతరిస్తున్నా"నని అన్నాడు

అజోఽపిసన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపిసన్

ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామి ఆత్మమాయయా

ఇక ఎందుకు జన్మనెత్తాడో సమాధానం చెబుతున్నాడు. ఎపుడు ధర్మానికి పతనం, అధర్మానికి అభివృద్ధి ఉంటుందో అపుడు నేను నా శరీరాన్ని సృష్టించుకుంటానని అన్నాడు.

ధర్మం పతనమైతే సత్పురుషులకు రక్షణ ఉండదు కనుక, వారిని రక్షించడం కోసం, దుష్టులను శిక్షించడం కోసం అవతరిస్తానని అన్నాడు:

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం

ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే

ఇట్లా ధర్మాన్ని స్థాపించినా మరల అసుర శక్తులు విజృంభిస్తూ ఉంటాయి కనుక స్థాపనంతో సరిపెట్టక సంస్థాపనమన్నాడు. అంటే బాగుగా స్థాపించుట. అది కొంతకాలం ఉంటుంది. మరల అసురల శక్తుల విజృంభణం. అందుకే యుగ యుగాలలోనూ ఉన్నాడు. అంటే ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క అవతారం కాదు. ఎన్ని యుగాలు రానీ, ఎన్ని సృష్టులు రానీ, విసుగు చెందకుండా మళ్ళీ మళ్ళీ అవతరిస్తానని అర్థం చేసుకోవాలి. శ్లోకం, యుగంతో ఆరంభం కాలేదు. ఎప్పుడు ధర్మానికి పతనం అధర్మానికి అభివృద్ధి ఉండవో అన్నవాడు, ఒక్క యుగంలోనే అంటాడా? ప్రకృతికి బద్ధులై మిగిలినవారు పుడతారు. తానేమో ప్రకృతిని వశం చేసుకొని పుడతానన్నాడు. అదీ తేడా.

అవతార రహస్యం - సూచన

'ప్రకృతిం స్వామధిష్ఠాయ' ప్రకృతిని వశం చేసుకొని అని ఎందుకన్నాడు? మరొక చోట గీతలో 'ప్రకృతిం స్వాం అవష్టభ్య' అని ఉంది. దాని అర్థమూ పై మాదిరిగానే. ఆ రెండింటికీ 'వశీకరించుకొని' అని శంకరులు వ్యాఖ్యానం చేసారు. ముందు తానట్లా జన్మ నెత్తినట్లు, రెండవచోట జన్మలను ప్రాణులకు ప్రసాదిస్తున్నానని అన్నాడు. ప్రకృతి యొక్క సాయంతో ప్రకృతి యొక్క స్వాధీనంలో ఉన్న ఈ సమస్త భూత సముదాయాన్ని మళ్ళీ మళ్ళీ పుట్టిస్తున్నాడు.

ఇక్కడ ధర్మం కోసం జన్మల నెత్తుతున్నానని చెప్పి ఊరుకోవచ్చు. లేదా ప్రలయంలో అన్నీ లీనమైన జీవులు, తమ తమ కర్మలననుభవించడానికి మరల పుట్టిస్తున్నానని చెప్పవచ్చు. రెంటిలోనూ ప్రకృతినే వశం చేసుకొని అని ఎందుకన్నట్లు?

ఇక్కడే అవతార రహస్యం వస్తుంది. అందువల్ల దానిని తెలియజేయడం కోసం, అట్లా అన్నాడు.

కేవలం సంకల్పం వల్ల సృష్టించవచ్చు కదా! అని మరొక ప్రశ్న. ధర్మం క్షీణించింది, ప్రజలు బాధ పడకూడదని ప్రజలు ధార్మికులుగా జీవించాలని అనుకోవచ్చు. సంకల్పం చేస్తే చాలు కదా! జన్మలేనివాడు జన్మనెత్తడమేమిటి? నామ రూపాలు లేనివాడు, నామరూపాలతో అవతరించడమేమిటి? అతడు సచ్చిదానందుడైనా మన మాదిరిగా కోపతాపాలు, శృంగారం, మొదలైనవి ఏమిటి? ఏ వైకుంఠంలోనో కూర్చొని సంకల్ప బలం ఉపయోగించవచ్చు కదా! ఇట్టి ప్రశ్నలు వస్తాయి.

అసలు సృష్టే లేకుండా సంకల్పం వల్ల చేయవచ్చు. ఆదిలో సచ్చిదానందుడై లేడా? అతడాత్మతృప్తితో ఉండకుండా లీలగా మాయ యొక్క సాయంతో ఈ ప్రపంచాన్ని సృష్టించాడు. ప్రలయంలో లీనమైన జీవులను మరల సృష్టించడం, వారు జనన మరణ ప్రవాహంలో ఇరుక్కోవడం ఏమిటి? అయినా అతని సంకల్పాన్ని, చేష్టను అర్థం చేసుకోలేం. ఏదో ఒక కారణం వల్ల సృష్టిస్తున్నాడు. ఏం జరిగింది? వేదాంతంలో, చివరి మాట ప్రకారం అసలు సృష్టే లేదు. అంతా కల్పనే. (దీనిని అజాత వాదం అంటారు) మాయా విలాసం ఎందుకుండాలి? వీటినన్నిటికీ లీలయని చెప్పగలం.

భగవానుని స్వభావం తెలియదు. శాంతంగా ఉండిపోవచ్చు. శాంతంతో ఉంటూనే ఆట ఆడిస్తున్నాడు. సృష్టికి అంతం అంటూ లేదు. దానిని ముగించడు. ప్రలయం వచ్చేవరకూ ఆట సాగుతూనే ఉంటుంది.

సంకల్పంతోనే ధర్మ సంస్థాపనం చేయవచ్చు. లేదా సృష్టికి చాపచుట్టవచ్చు.

అధర్మం ప్రబలి, ధర్మం నాశనమవుతూ ఉంటే ధర్మ సంస్థాపనం కొనసాగాలనుకున్నాడు. ఈ పని, శాశ్వతంగా ఉంటుందా? ఇట్లా జరిగితే ఈ నాటకం భిన్న భిన్న రసాలతో, సన్నివేశాలతో ఉండకుండా విసుగు కల్గిస్తూ ఉంటుంది. ఒక పెద్ద త్రాటిని అటూ ఇటూ కొంతసేపు లాగుతూ ఉంటారు. ఒక్కసారి ఒక పక్షమే లాగితే ఇంక వినోదమేమిటి? అటూ ఇటూ లాగుతూ ఉంటేనే ఆట. అందరూ ధర్మాన్ని ఆచరించి మోక్షం పొందితే ఇక సృష్టేమిటి? అసలు ప్రపంచం మిశ్రలోకం. అంటే ఇందులో మంచి, చెడు, రెండూ ఉంటాయి. అసుర లోకం అంతా కశ్మలంగా, దేవగంధర్వ లోకాలు సంతోషమయంగా; తపోలోక సత్యలోకాలు శాంతిమయంగా ఉంటాయి. దానికి భిన్నంగా ఈ మిశ్ర లోకాన్ని సృష్టించాడు. ఈ జీవులకు కొంత స్వేచ్ఛను ప్రసాదించాడు. ఆట సాగించాడు. ఈ మిశ్ర లోకం, అమిశ్రలోకమై ధర్మలోకమైనపుడు ఇక నాటకాన్ని శాశ్వతంగా మూయవేయవలసి వస్తుంది.

అందరూ మోక్షాన్ని పొందితే ఇక సృష్టి సాగడమేమిటి? నేను సృష్టించిన దానిని ప్రాణులే మూసేస్తారా అని అనుకోడా? నేనే ఆ పని ఎందుకు చేయకూడదని భావించడా?

ఇది లీలా సృష్టి కనుక శాశ్వతంగా ధర్మ సంస్థాపన చేయడు. అతడవతరించాలని అనుకోకపోయినా మన చేష్టలవల్ల అతడవతరించునట్లు చేస్తాం. అతడన్నిటినీ గమనిస్తాడు. అందువల్లనే సృష్టి, పోషణ, సంహారమూ కొనసాగుతూనే ఉంటుంది. ఇదంతా జీవుల కర్మలనుసరించే అతడవతరించడం ఎందుకని, అతణ్ణి బాధ పెట్టడమేమిటని మనం ఊరుకుంటామా? అతని సంకల్పానికి దూరంగా ఉండము. అట్టి సందర్భంలో కేవలం సంకల్పబలం వల్లనే సృష్టిని మూసివేయకుండా అవతరిస్తాడు. ధర్మ సంస్థాపన చేస్తాడు.

అంతా అతని సంకల్పము. అది మరొక దాని ద్వారా జరుగునట్లు చేస్తాడు. అధర్మం తల ఎత్తడమూ అతని సంకల్పమే. అసురుల వల్ల, క్రూరుల వల్ల

అధర్మం తల ఎత్తుతుంది. కలిలో మానవులు చెడిపోయారంటే అది వారి మనస్సుల వల్లనే. మనస్సులో చెడ్డ ఆలోచన వచ్చినపుడు ఇంద్రియాలూ పనిచేస్తాయి అనగా సాధనలు, ఉపకరణాలు. కాని సంకల్పం బైటకు కనపబడదు. సంకల్పాల వల్లనే చెడ్డ పనులు. సంకల్పం వల్లనే వాటి నిర్మూలనం జరుగుతుంది. మంచి వాటికి చెందిన సాధనాలూ కావాలి. అందువల్లనే మహాత్ములనే సాధనాలను మాటిమాటికీ పంపుతాడు. పుట్టునట్లు చేస్తాడు. వారివల్ల సాధ్యం కాకపోతే తానే అవతరిస్తాడు.

మానవ స్వభావం - అవతారంలో దివ్యత్వం

ధర్మాన్ని స్థాపన చేయడంలో ఎన్నో దృష్టిలో పెట్టుకుంటాడు. ధర్మోపదేశం చేయడమే కాదు, దానిని ఆచరించి చూపిస్తాడు. వట్టి ఉపదేశం, తలకెక్కుతుందా? తాము ధర్మాచరణ చేస్తూ సుఖంగా ఉన్నవానిని చూసి ఇతరులకు వారిని అనుసరించాలనే బుద్ధి పుడుతుంది. తన జీవితాన్ని దృష్టాంతంగా చూపించడం అందుకోసమే.

అవతార పురుషులకు మానవులలో ఉన్న లోపాలుండవా? అందరికీ అందుబాటులో ఉండకుండా ఏ కొండ శిఖరాన్నో అధిరోహించి యుంటాడా? కోరికలు, ఎట్టి భావ సంఘర్షణలూ లేకుండా మనకందుబాటులో లేకుండా ఉంటాడా? అట్లా ఉండకుండా ఉంటే అతడు మనకాదర్శప్రాయుడెట్లా అవుతాడు? ఒక వస్తాదు, తన వక్ష స్థలంపై ఏనుగు నెక్కించుకొని యుండగా దానిని చూసి ఆశ్చర్యపోతాం. అయితే ఆ పనిని మనం చేయడానికి సిద్ధపడతామా? అవతార పురుషుడు అట్టివాడు కాదు. మనలో ఒకనిగా ఒకడై ఉంటాడు. మానవ స్వభావంతో ఉండి ధార్మికంగా మసలుతాడు. ధార్మిక కార్యాలలో ఎక్కడ మనం తప్పటడుగులు వేస్తామో అట్టి చోట్ల విజయాన్ని పొందుతూ ఆదర్శంగా ఉంటాడు.

ఆయన సామాన్య మానవునిగా ఉంటే కూడా ఆయన పనులను మనం పట్టించుకోం. ఈనాటికీ ధార్మికులనేకులున్నారు. వారిని పట్టించుకుంటున్నామా? ఇతరులపై వారు ప్రభావాన్ని చూపలేరు. మొత్తం జాతికంతటికీ ఉపయోగించే పనులు చేసే గాంధీ వంటి వారక్కడక్కడ ఉంటారు. అందువల్ల అవతారమూర్తిలో కొన్ని మానవ లక్షణాలుంటాయి. దైవ లక్షణాలు, దైవీశక్తుల ప్రదర్శన కూడా ఉంటుంది. అందువల్లనే అవతారం చాలించినా అట్టివాని ప్రభావం తరతరాల వరకూ ఉంటుంది. అందుకే చిన్ననాటినే శ్రీరాముడు తాటకను వధించడం, సుబాహువును చంపడం, రాజ్యాన్ని త్యాగం చేయడం, అరణ్యాలకు వెళ్ళమంటే సంతోషంతో వెళ్ళడం జరిగింది. ఆయనో దేవుడు, మనకు చాలా దూరంగా ఉన్నాడని జనులు భావించకుండా సీతాపహరణంలో విలపించాడు. మీరు సీతను చూసారా అని చెట్టును, పుట్టనూ అడిగాడు. ఇట్లా ఒక్కొక్కప్పుడు మానవునిగా, మరొక సందర్భంలో దేవునిగా ప్రవర్తిస్తూ ఉంటాడు.

ఆయన దేవుడు కదా, గొప్ప పనులు చేసాడు. మనమేమి చేయగలం? అని నిరుత్సాహ పడనవసరం లేదు. ఇంద్రియాలను నియమించి పవిత్ర జీవనం గడిపే వారు కూడా కొన్ని అద్భుత కృత్యాలు చేయగలరు. వారు యోగేశ్వరులైతే దేవతల కంటె మిన్నగా పనులు చేస్తారు కూడా. అట్టివారెందరో ఉన్నారు. ఇట్లా ప్రోత్సాహమీయడానికే దేవుడవతరిస్తాడు.

ప్రజలతో కలిసి మెలిసి యుండాలని తపన

సంకల్పం వల్ల ధర్మ సంస్థాపనం కాదు. తాను సృష్టించిన ప్రాణులతో కలిసి మెలిసి యుండాలనే తపనతో ఉంటాడు. ఈ సృష్టి అంతా అతని సంతానమే. పిల్లలతో తల్లిదండ్రులుండడానికి ఇష్టపడరా? అట్లాగే పరమాత్మ కూడా. పిల్లలెట్లా ఉన్నా వారితో ఉండాలనే ప్రతి తల్లి, తండ్రి కోరుకుంటారు. అతనికట్టి కోరిక కలిగియుంటే అతడు నిర్గుణ బ్రహ్మమైతే ఎట్లా మనం

తెలిసికోగలం? మనకు తెలియని బ్రహ్మముతో మన కలయిక ఎట్లా? నాల్గు చేతులతో శంఖ చక్రాలతో కనిపిస్తే మనమాతనిని సమీపించగలమా? అట్టి మూర్తిని చూడగానే వరాలనడుగుతాం. లేదా వెంటనే మూర్ఛపోతాం. అందువల్ల మానవాకారాన్ని ధరించి వస్తాడు. అట్టి అవతారాన్ని ఒక బోయగాని, ఒక కోతిగాని, లేదా ఒక గొల్ల వనితగాని సమీపించగలరు. అతడు మానవుడని దగ్గరకు చేరుతారు. ఆ అవతారాలలో క్రోధం, దుఃఖం కూడా మానవుల మాదిరిగానే ప్రదర్శిస్తాడు, కనుక వీరు సమీపించగలరు. అంతకంటె అనంతమైన ప్రేమ, జ్ఞానం, సత్యం చూపుతూ ధర్మస్థాపన చేస్తాడు. ధర్మం క్షీణించినపుడవతరిస్తాడు.

మానవకారం చూసి మనకు సందేహాలు రాగా, మీ మాదిరిగా మాయలో పడనని, మాయనే తన ఆధీనంలో ఉంచుకొన్నానని చూపిస్తాడు. "ప్రకృతిం స్వామధిష్ఠాయ" అన్నాడు కదా! నేను పరబ్రహ్మనైతే మాయ, నా దగ్గర రాదు. అదైనా నా చెప్పు చేతలతో ఉంచుకుంటాను" అని అంటాడు. ప్రలయానంతరం, జీవులు పుట్టాలి. పుట్టించాలి కదా! సత్త్వ రజస్తమో గుణాలతో ఉన్న మాయను సాయంగా చేసుకొని అవతారంగా వస్తానంటాడు. మానవాకారంతో ఉన్నాడంటే, మాయతో ఉన్నాడని కాదు. దీనితో ఏదైనా చేస్తాడు. దీనిని పొమ్మని ఆత్మారాముడై యుండగలడు.

కోపం ప్రదర్శిస్తాడేమిటి? అవి వస్తే రానీ, పోతే పోనీ, ఉంటే ఉండనీ, అవి లోనున్న నిజరూపంపై ప్రభావాన్ని చూపించగలవా అనే ధోరణిలో ఉంటాడు.

ఆత్మజ్ఞాని, దేహం గురించి ఏమీ పట్టించుకోలేదని వింటాం. లోనున్న ఆత్మను శీతోష్ణాదులేమీ చేయలేవని శాంతంగా ఉంటాడు. అయితే ఆత్మకంటె, మనస్సు భిన్నంగా ఉంది. బాధపడనీ, కోపబడనీ అని మనస్సనుకోదు. భగవానుడు కూడా మాయకు లోబడి యున్నట్లుగా జీవునిగా నున్నాడు. అయినా మనస్సును నియమించి ప్రత్యేకంగా మాయతో నున్న జీవునిగా

ఉండకుండా, జ్ఞాని గానే ఉంటాడు. అటువంటప్పుడు మనస్సునెట్లా ఆహ్వానించి తన దగ్గరే ఉంచుకుంటాడు? కోపం, దుఃఖం మొదలగు లక్షణాలు కలిగిన మనస్సు నెట్లా తనంతట తాను ఇష్టం వచ్చినట్లుగా వెళ్లేదానినిగా చేస్తాడు? అతడు మాయకు అతీతుడు కనుకనే మాయకు లోబడకుండా తన అదుపులో ఉంచుకోగలడు. పరమాత్మ అనే స్థితినుండి ఎప్పుడూ దూరంగా ఉండడు. మహామాయ, జ్ఞానులను కూడా లోబరుచుకొంటుందని, దుర్గాసప్తశతిలో ఉంది. అట్టిది కూడా, అవతారం దగ్గర తలవంచవలసిందే. అందుకే మాయను (మనస్సును) రమ్మనగలడు, పొమ్మనగలడు కూడా.

మామూలు మానవుల మాదిరిగా కోపతాపాలను ప్రదర్శించగలడు. వేషం వేసినపుడు దానికి తగ్గట్టు చూపించాలి కదా! శరీరం ఫలానా రీతిలో ఉండాలని జ్ఞాని, దాని నెట్లు నియమించడో, అవతార పురుషుడు మనస్సు పట్ల కూడా అట్లా ప్రవర్తిస్తాడు. అతడు భావావేశానికి లోబడినట్లు కన్పిస్తాడు. ఇక మనం వాటికి లోబడతాం. కాని వాటికి అతడు లోబడడు, అదీ తేడా. తన పరమాత్మ స్థితిపై భావావేశాలు, ఆటంకాలు ఉండలేవు. అతడు మన మాదిరిగా క్రింద మీద పడుతున్నట్లు కనబడినా నిలద్రొక్కుకునే యుంటాడు.

అవతారం గురించి సందేహమేల?

అవతార పురుషుడు, దీనునిగా ఉన్నట్లు కన్పిస్తాడు. ఆ సందేహం రాకూడదని, మాయను అధీనంలో ఉంచుకొన్నానని గీతలో అన్నాడు. కాలడిలో నదీ గమనాన్ని మార్చినా, నర్మద వరదలను అడ్డుకున్నా, జ్ఞానం విషయంలో సర్వజ్ఞులైన శంకరులు మమూలు మనిషిలా ఎందుకు ప్రవర్తించారు? కాశీలో విశ్వనాథుడు, పంచముడిగా రాగా, అతడు స్వామియే యని శంకరులెందుకు గుర్తించలేకపోయారు? పొమ్మని ఎందుకన్నారు? తరువాత అతనికి నమస్కరించి ఉపదేశాన్ని ఎందుకు పొందారు? అట్టి సందర్భాలలో గీతా సూక్తులను గుర్తుంచుకోవాలి.

అవతార పురుషుని ఆధీనంలో మాయయున్నా, మాయ గుప్పిట్లో తానున్నట్లు కన్పిస్తాడు. అనుకుంటే వెంటనే దానిని తరమగలడు. సీతకోసం విలపించిన రాముడు, రావణుని సంహరించి నా ధర్మం నేను నిర్వర్తించాను. నీకూ నాకూ ఏ సంబంధం లేదని, ఇష్టం వచ్చిన చోటుకు పొమ్మని సీతతో అన్నాడు. అనగా ఒక తీవ్రదశనుండి మరొక తీవ్రదశకు చేరుకున్నట్లుగా కన్పిస్తాడు. ఇట్లా ఎందుకని మనం, అవతారాన్ని ప్రశ్నించకూడదు.

ధర్మక్షయం

కృష్ణుడెందుకు అవతరించాడో శంకరులూ అందుకే అవతరించారు. క్రీ.పూ. 2500 నాటి భారత స్థితి, అవతరించడానికి, అనువుగానే ఉంది. కృష్ణుని కాలంలో ప్రవృత్తి నివృత్తి ధర్మాలెట్లా క్షీణించాయో అట్టి పరిస్థితే, శంకరుల కాలంలోనూ ఉంది. కృష్ణుని కాలం కంటె, అవి ఎక్కువగా క్షీణించాయి.

కృష్ణుని కాలంలో స్వర్గం నిమిత్తమై కర్మానుష్ఠానం ఉండేది. కర్మల విషయంలో వేదాలలో చెప్పిన వాటికి తగిన గౌరవం ఉండేది. శంకరుల కాలంలో వేదాన్ని విడిచి పెట్టారు. ఇక నివృత్తి మార్గంలో శూన్య సిద్ధాంతము చోటు చేసుకుంది. అది ఒక త్రిశంకు స్థితి వంటిది. అట్టి శూన్యబోధ, కృష్ణుని కాలంలో లేదు. అందువల్ల శంకరులవతరించవలసి వచ్చింది.

గీత ఇచ్చిన అభయం - సమస్య - పరిష్కారం

గీతలో సాధువుల్ని రక్షించడం, దుష్టులను శిక్షించడం అవతార ప్రయోజనమని యుంది.

శంకరుల కాలంలో సత్పురుషులను రక్షించనవసరం లేకపోయింది. పూర్వకాలంలో సత్పురుషులెక్కువగా ఉండేవారు కనుక వారిని ఈశ్వరుడు రక్షించవలసి వచ్చింది. కాని కలిలో సత్పురుషులే తక్కువ. వీరిని రక్షించడం దేనికి. ఇక దుష్టులను సంహరించడమేమిటి? పూర్వావతారాల కాలంలో

అసుర రాక్షసులు, క్రూరమైన రాజులు, వారి సహచరులూ చాలామంది ఉండేవారు కనుక విడిగా గుర్తించి వారిని సంహరించడం జరిగింది.

మరి శంకరుల కాలంలో? ఆనాడు రాక్షసులులేరు. కంస, జరాసంధుల వంటివారు లేరు. అసుర లక్షణాలు కలిగిన దుర్యోధనుని వంటివారు కృష్ణుని కాలంలో కంటె శంకరుల కాలంలో ఎక్కువగా ఉన్నారు. మంచిగా కనబడుతూ అధర్మాన్ని పాటించేవారే ఎక్కువగా ఉండేవారన్నమాట. కొంతమందిని మినహాయిస్తే అధర్మమే ఎక్కువగా ప్రబలియుంది కనుక ఇట్టి వారిని విడదీసి సంహరించడం అంటూ కుదరదు. దుష్టులను సంహరించడం అనే మాటను పాటిస్తే అందర్నీ సంహరించవలసి వచ్చేది. అపుడు ధర్మ సంస్థాపనమెట్లా అవుతుంది? రాబోయే ప్రలయాన్ని ముందే ఆహ్వానించినట్లే కదా!

విశ్వామిత్రుడు యాగం చేసేటపుడు కొందరు రాక్షసులు రావడం, రాముడు సంహరించడం, యాగ సంరక్షణ జరిగింది. ఆ విశ్వామిత్రుడే కలియుగంలో పుడితే అతనికి యాగం చేయాలనే సంకల్పమే ఉండదు.

కనుక కలిలో దుర్మార్గులను చంపడం కాదు. దుర్మార్గ ప్రవృత్తిని సంహరించాలని పరమేశ్వరుడు భావించాడు. చెడ్డ వారనుటకు బదులు చెడ్డ పనులను అని సవరించాలి.

'దుష్కృతాం' బదులు 'దుష్కృత్యానాం' అనాలి.

అసంఖ్యాకమైన దుష్ట స్వభావాలుంటే వాటిని సంహరించవలసిన అవసరం లేదని అనిపించవచ్చు. ఇట్టి పర్యవసనాలకు దుష్ట భావాలనే విత్తనాలు మనసులో పుడుతున్నాయి. అవి కార్య రూపాన్ని ధరిస్తున్నాయి. వీటిని పెకలించగలగాలి. అపుడు ధర్మ మార్గం వైపు ప్రజలు నడుస్తారు. అపుడు ధర్మ సంస్థాపనం జరుగుతుంది.

మనస్సును సరిదిద్దడం ఎలా?. మంచి ఉపదేశాల వల్ల. వట్టి ఉపదేశం సరిపోతుందా? చెప్పే వాని ఆచరణ కూడా ఉండాలి. అందువల్ల పరమాత్మ, జ్ఞానిగా అవతరించాడు.

సన్న్యాసావతారం ఎందుకు?

సన్న్యాసులొక్కరే జ్ఞానులు కానవసరం లేదు. చండాలుడు, జ్ఞానియైతే అతడే గురువని శంకరులనలేదా? జ్ఞాని ఎక్కడోగాని ఉండడు. వారికి గురువుతో నిమిత్తం లేదు. ఇతరులకు ఒక పద్ధతి ప్రకారం ఉపదేశ గురువు బోధించి అర్హులుగా తీర్చిదిద్దాలి. అతడు ఉపనిషత్తులలోని మహావాక్యాలనందిస్తూ ఉండాలి. అన్నీ శాస్త్ర విరుద్ధంగా కన్పిస్తున్నప్పుడు శాస్త్రోపదేశం ద్వారా, క్రమశిక్షణాయుతులైన వారిని, శాస్త్రప్రకారం తీర్చిదిద్దాలి. శాస్త్రాలతో సంబంధమే లేకుండా ఎక్కడో ఒక జ్ఞాని యున్నా అట్టివానికి అవతారంతో సంబంధం లేకుండా ఉంటుంది. అట్టివారిని ఆదర్శంగా చూపితే అవతార ప్రయోజనం సిద్ధించదు. ఒక మూల వేదశాస్త్రాలపై దండెత్తేవారు కత్తులు నూరుతున్నారు. వారిని ఎదుర్కొనాలంటే వేదశాస్త్ర జ్ఞానం కలిగిన వారిని తీర్చి దిద్దవలసిందే. వేదశాస్త్ర పరిరక్షణ ముందుగా ప్రధానం. వేద తత్త్వమైన అద్వైతాన్ని అందించాలి. అందువల్ల అవతారమూర్తి సన్న్యాసం పుచ్చుకొన్న తరువాత జ్ఞానం సంపాదించినవాడుగా ఉండాలి.

జ్ఞానానికి అంకితమైనవారే భిక్షువులుగా ఉండాలని బౌద్ధ జైనాలలోనూ ఉంది.

కృష్ణుడు, సన్న్యాసి కాకపోయినా ఉపదేశం ఇచ్చాడు. కృష్ణుడు అనేక కార్యాలు చేసాడు. ఆయన ద్వారకకు రాజై ఏలాడు. పాండవులను అనేక పర్యాయాలు రక్షించాడు. అర్జునికి రథ సారథి అయ్యాడు. నరకునితో బాటు అనేక రాక్షసులను సంహరించాడు. ఇట్లా కృష్ణుడు చేసిన అసంఖ్యాకమైన పనులలో గీతోపదేశం ఒకటి. కలిలో ఇది సరిపోదని జీవితాంతము జ్ఞానానికే అంకితమైన సన్న్యాసి గురువే కావాలనుకున్నాడు.

అనేక కార్యాలలో మునిగే గృహస్థులవల్ల ఈ పని సాగదు. ఎట్టి బాదరబందీ లేని సన్న్యాసియే జ్ఞానియై జ్ఞానోపదేశం చేయగలడని భావించాడు.

భారతదేశంలో అలుముకున్న అవైదిక మతాలను ఎదుర్కొని నిజమైన వేదాంతాన్ని బోధించవలసిన అవసరం ఏర్పడింది. దేశాటన చేయాలి. వాదాల నెదుర్కొనాలి. ఇట్టిది గృహస్థు చేయగలడా? అతడు తిరిగే పరివ్రాజకుడు కాగలడా? బ్రహ్మచారి అంతే వాసిగా గురువు దగ్గరే ఉండాలి. ఇక వాన ప్రస్థుడు, అరణ్యంలోనే ఉండాలి. అందుకే సన్యాసి అవతారం.

కృష్ణుడు, దేశం అంతా తిరిగి ఉపదేశించలేదు. అర్జునునకు, ఉద్ధవునకు మాత్రమే ఉపదేశించాడు. అన్నిటికీ ప్రభువునని తన విశ్వ రూపాన్ని చూపించాడు. అతడు పరమ పదాన్ని పొందిన తరువాత భగవంతునిగా అందరూ గుర్తించారు. ఇది భారత, భాగవతాదుల ద్వారా వెల్లడైంది. కనుక ఆ అవతారాన్ని ఏ ఆశ్రమానికి చెందినవాడని ప్రశ్నించనవసరం లేదు, అవసరం లేకపోయింది కూడా. తాను అవతరించినపుడు తాను దేవుడనని అన్నివేళలా ప్రకటించలేదు. మామూలు మనిషిగానే చాలా సందర్భాలలో ప్రవర్తించాడు.

కలిలో జ్ఞానోపదేశం బాగా జరగాలి కనుక సన్యాసిగా అవతరించాలి. కలిలో గృహస్థుడుపదేశిస్తే జనాలు శంకిస్తూ ఉంటారు. ఆచరించకుండా ఏదో ఉపదేశిస్తున్నాడులే అనే చులకనభావం కల్గుతుంది. ఇంద్రియాలను జయించే గృహస్థులరుదు. ఇక కలిలో వానప్రస్థం నిషేధింపబడింది కూడా. కలిలో గృహస్థాశ్రమం నుండే సన్యాసం.

కనుక నివృత్తి మార్గంలో ఉన్నవారికే ఉపదేశానికి అర్హత. ప్రవృత్తి మార్గంలో కూరుకుపోయిన వారు, నివృత్తి మార్గాన్ని ఉపదేశించడమా?

రాత్రి కాలంలో చిన్న దీపం వెలిగిస్తే చాలనే కాలం, పూర్వం ఉండేది. కాని నేడు రాత్రి, పగలూ అనే తేడా లేకుండా దీపం నిరంతరం వెలుగుతూ ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది.

శంకరులు జీవించినది 32 సంవత్సరాలే. 8 సంవత్సరాల జీవిత కాలం 16 సంవత్సరాలయ్యాయి. తరువాత 16 సంవత్సరాలు వ్యాసుని చేత

పొడిగింపబడ్డాయి. 32 సంవత్సరాలు జ్ఞానోపదేశానికి సరిపోతుందని భగవత్ సంకల్పం. శంకరులు జీవితాంతం, ఉపదేశంతో గడిపారు.

బ్రహ్మచర్యంలోనూ

వీరి జీవితంలో కొద్దికాలం బ్రహ్మచర్యం, గురుకులంలో సంపూర్ణ విద్యాభ్యాసం తరువాత సన్న్యాసం, ఆపైన ఉపదేశం, ఇట్లా సాగింది.

పిల్లవాడు, పుట్టీ పుట్టగానే ఉపదేశం మొదలుపెడితే అదేదో అద్భుత కృత్యమని జనులాశ్చర్యపోతారు. అవతారంలో మానవాంశ కూడా కనబడాలి కదా! అట్టి అలౌకిక వ్యక్తిని ఆదర్శంగా తీసుకుంటారా? ఆశ్చర్య చకితులౌతారు గాని ఆదర్శంగా తీసుకోలేరు. అందువల్ల ఆదర్శ బ్రహ్మచారిగా కనబడ్డారు.

పుట్టినప్పటినుండీ సన్న్యాసి యైతే ఇక వేదకర్మలతో సంబంధం ఎట్లా వుంటుంది? ప్రజలకు వైదిక కర్మలపట్ల ఆసక్తిని కల్గించవద్దా? వర్ణ విభజన తప్పని వైదిక కర్మానుస్ఠానాలు అక్కరలేదనే కాలమది. పరిపక్వమైన మనస్సులు లేనివారికి ఒక్కమాటే జ్ఞానోపదేశం చేయడమా? ఒంటబదుతుందా? వేదశాస్త్ర ధర్మాలు ప్రజలందరికీ తెలియపర్చాలి. శాస్త్ర కర్మల పట్ల వారిలో అనురక్తిని కల్గించాలి. పుట్టుకతోనే సన్న్యాసి, ఆదర్శంగా ఉండలేదు కదా?

కనుక బ్రహ్మచర్యాశ్రమంలో ఉన్నారు. వేదాధ్యయనం, సమిధానం, భిక్షాచర్య, గురుసేవ, శాస్త్రాభ్యాసం మొదలైనవి చేసి సన్న్యాసం పుచ్చుకున్నారు. ఇట్లా బ్రహ్మచారి ఎట్లా ఉండాలో చూపించారు. ఇది లోకానికి ఆదర్శంగానే ఉంటుంది.

బ్రహ్మచర్య ఆదిగాగల నాలుగు ఆశ్రమాలు తప్పనిసరియని శాస్త్రాలనలేదు. బ్రహ్మచర్య దశలోనే నైష్ఠిక బ్రహ్మచారిగా ఉండి జీవితాంతం వేదాధ్యయనం చేస్తూ ఉండవచ్చు. లేదా తీవ్ర వైరాగ్యం ఉన్నవారికి సన్న్యాసం పుచ్చుకోవచ్చని జాబాలశ్రుతిలో ఉంది. కనుక బ్రహ్మచారిగా ఎనిమిది సంవత్సరాలుండి సన్న్యాసం గ్రహించారు.

బ్రాహ్మణ వంశంలో జన్మ

పూర్వావతారాలలో క్షేత్రధర్మం అవలంబించి శత్రు సంహారం చేయడానికి రామ, బలరామ, కృష్ణావతారాలలో క్షత్రియవంశంలో జన్మించి దుష్టులను సంహరించాడు.

కలిలో ఉపదేశం ప్రధానం కనుక, సాత్త్వికాచార్యునిగా ఉండాలి కనుక బ్రాహ్మణ వంశంలో జన్మించారు. పూర్వావతారాలలో క్షత్రియ ధర్మం, ఈ అవతారంలో బ్రాహ్మణ ధర్మం.

కృష్ణుడెన్నో చిలిపి పనులు చేసాడు. అట్టిది జ్ఞానావతారంలో కుదురు తుందా? ఏ అవతారమైనా ధర్మ సంస్థాపనమే లక్ష్యం.

శివ విష్ణు అవతారాలు - పోలికలు - తేడాలు

శివ విష్ణువులంటూ ప్రత్యేకంగా ఇద్దరు లేరు. ఉన్నది పరమాత్మయే. ప్రశ్నోత్తరమాలికలో శంకరులిట్లా ప్రశ్నించారు

కశ్చభగవాన్? = భగవానుడనగా ఎవరు?

మహేశః - శంకర నారాయణాత్మైకః

వేదాంతంలో ఈశ్వర - ఈశ ప్రస్తావన ఉంటుంది. అక్కడ శివుడని అర్థం కాదు. సగుణ బ్రహ్మయైన ఈశ్వరుడే. ఆ మహేశ్వరుడు శివుడా విష్ణువా అని అడిగితే శంకర - నారాయణ - ఆత్మా - ఏకః అని శంకరుల సమాధానం. అనగా శంకరునకు, నారాయణనకు ఉన్నది ఆత్మయనిగాని, లేదా ఉన్న ఆత్మయే శంకరనారాయణులని గాని అర్థం. ఉన్నది ఆత్మయే లేదా బ్రహ్మము. అదే శివుడు, విష్ణువని అర్థం.

ఇద్దర్నే ఎందుకు చెప్పినట్లు? మనమూ ఆత్మస్వరూపులం కదా! అయితే అట్లా భావించామా? పైవారిద్దరూ అట్లా కాదు. వారు ఆత్మయని వారికి తెలుసు. తాను విష్ణువని ఈశ్వరునకు; తానీశ్వరుడనని విష్ణువుకు తెలుసు.

పరమాత్మ అనేక రూపాలను ధరిస్తాడు. ప్రవృత్తి మార్గాన్ని నడిపేవాడు విష్ణువు కాగా, నివృత్తి మార్గాన్ని శంకరుడు నిర్వహిస్తాడు. శంకరుడు మోక్ష ప్రదాత. ఆయన రెండు రకాల మోక్షాన్నిస్తాడు సంసారం నుండి ప్రలయంలో విముక్తినిస్తాడు. అది శాశ్వతం కాదు. ప్రాణులు మరల జన్మించాలి. రెండవది శాశ్వత మోక్షం. జ్ఞానాన్నిచ్చి సంసార విముక్తులను చేస్తాడన్న మాట. ప్రలయ కాలంలో అతడు సంహారమూర్తి. అర్హులకు మోక్షాన్నిచ్చేటపుడు, దక్షిణామూర్తి.

సాధారణంగా మహావిష్ణువు మాయా జగత్తును రక్షిస్తే పరమశివుడు మోక్షాన్నిస్తాడు. అయితే ఒకరి పనులను మరొకరు బదిలీ చేసుకుంటూ ఉంటారు కూడా.

విష్ణువు దుష్టులను పరిమార్చేటపుడు తనలో కలుపుకొన్నపుడు రుద్రమూర్తి కాదా?

వేదంలోని శివవిష్ణుసూక్తాలు, ఇద్దరికీ భేదం లేదనే చెబుతాయి. అట్లాగే స్మృతులు కూడా. పురాణాలలో మాత్రం, శివ పురాణంలో శివుణ్ణి అధికంగా, విష్ణు పురాణాలు విష్ణువుని అధికంగా పొగుడుతాయి. ప్రమాణ గ్రంథాల వరుసలో ముందు వేదాలు, తరువాత స్మృతులు, ఆపైన పురాణాలని మరిచి పోవద్దు. ఇట్లా ఎక్కువ తక్కువల నెందుకు చూపించినట్లు? తమ ఇష్ట దైవాలపై భక్తులకు ఏకాగ్రత కల్గించడం కోసమే. కనుక విడివిడిగా మనం వారిని చూడకూడదు.

విష్ణువు, కృష్ణునిగా వచ్చినా సంహారమూ చేసాడు, జ్ఞానోపదేశమూ చేసాడు. మిగిలిన అవతారాలలో ప్రధానంగా సంహారమూర్తియైనా ఈ అవతారంలో జ్ఞానోపదేశం చేయడం ప్రత్యేకత.

అర్జునునకు విశ్వరూప సందర్శనంలో:

"దివ్యందదామి తేచక్షుః పశ్యమే యోగమైశ్వరం" (11.8)

అనగా నేను నీకు దివ్య దృష్టినిస్తున్నా. నా ఈశ్వరీయ సామర్థ్యాన్ని చూడుమని అన్నాడు. ఇక్కడ ఈశ్వరుడనేమాట వేదాంతంలో చెప్పే సగుణ బ్రహ్మమా? లేక పరమేశ్వరుని ఈశ్వరుడనడమా?

పరమేశ్వరుణ్ణి ఈశ్వరుడని అనడం చాలా కాలం నుండి యుంది. అమర కోశంలో "ఈశ్వరః శర్వ ఈశానః" అని యుండగా; కాళిదాసు, రఘువంశంలో

"హరిర్యథైకః పురుషోత్తమః స్మృతః

మహేశ్వరః త్ర్యంబక ఏవ నాపరః"

విష్ణువును పురుషోత్తముడని అన్నట్లు, ముక్కంటిని మహేశ్వరుడని అంటున్నారని వ్రాసేడు.

కాని పరమశివుణ్ణి పురుషోత్తముడని అనం. పురుషోత్తముడు విష్ణువు.

భగవానుడు విశ్వరూపాన్ని చూపించేటపుడు విష్ణువుగా, రక్షకునిగా, పోషకునిగా కనబడ్డాడా? లేదు. ప్రలయకాలంలోని రుద్రరూపంతోనే కనబడ్డాడు.

"కాలో౽స్మి క్షయకృత్ ప్రవృద్ధః" (11-32)

అనగా నేను కాలుణ్ణి, లోకాలను నాశనం చేయగలవాడని అన్నాడు.

ఇది అతిశయోక్తి. ప్రపంచాన్ని దగ్ధం చేశాడా? కృష్ణ అవతార సమాప్తికి ముందు కౌరవనాశం, తరువాత యాదవనాశం జరిగినా మిగిలియున్నాడు. ఎందుకిట్లా అన్నాడంటే యుద్ధం చేయనని భీష్మించుకొన్న అర్జునునకు ప్రోత్సాహం కల్గించడానికే. నీవు లేకపోయినా నేను ఈ పనిని చేయగలనని, నీకు కీర్తి రావడం కోసం నిన్నొక సాధనంగా వాడుకుంటున్నానని అన్నాడు. అందుకై అట్లా అతిశయోక్తితో చెప్పవలసి వచ్చింది. మనమేదైనా పుణ్యకార్యం తలబెట్టి, దానికి ఒక వెయ్యి రూపాయలను కావాలనుకుని చందాకై వెడితే, ఎవరైనా ఇవ్వనంటే నీవీయకపోతే వెయ్యికాదు, లక్ష రూపాయలను నేను ఇవ్వగలను అంటాము. ఇక్కడ కావలసింది వేయి కాని లక్ష కాదు. అట్లాగే కొంతమంది దుష్టులను సంహరించవలసి వచ్చినపుడు, మొత్తం నేనే సంహరిస్తానని అనడం అటువంటిది. సంహారకృత్యం, రుద్రునిదైనా ఇందులో భేదాన్ని సూచించాడు. 'యోగమైశ్వరం' అనినపుడు ఈశ్వరయోగాన్ని చూపిస్తానని సంహార కృత్యాన్ని చేస్తానని అన్నాడు.

ఎందుకిన్ని మూర్తులు ధరించాలంటే ప్రభుత్వ కార్యకలాపాలు కూడా పెక్కుమంది నిర్వహించాలి. దేవతలు - వారి కృత్యాల విభజన కూడా అట్లాగే ఉందని అనుకోవచ్చు.

ఇక విడుదల గురించి రెండు రకాలుగా ఉంటుందని చెప్పాను. ఒకటి సంసారం నుండి దయతో విముక్తి. అనగా ప్రలయకాలంలో విముక్తి. ఆ మాటకు కూడా సంహారమని కాదు. తనలో లీనం చేసుకొనుటయే. ఇక కేవలముక్తిలో తనలో శాశ్వతంగా లీనం చేసుకుంటాడు. మొదటి లయలో పుట్టుక, మరల సంహారమూ ఉంటాయి. కాని అందులో జీవులకు తాత్కాలిక విశ్రాంతి యుంటుంది. అదీ దయతోనే. కాని చిత్తశుద్ధి కలిగిన జీవులకు శాశ్వతముక్తిని దక్షిణామూర్తి రూపంలో ఇస్తాడు.

తాత్కాలిక ముక్తినిచ్చినపుడు శాంతంతో ఇస్తాడా? అట్లా ఇస్తే ప్రజలలో భయభక్తులు లేక ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తారు కనుక ప్రలయాన్ని సంహారమూర్తి రూపంలోనే చేస్తాడు.

దేవతలకు ప్రత్యేక విధులను పరమాత్మ చేసాడని చెప్పాను. అపుడు కూడా దేవతలందరూ ఒకటే అనే భావన కలిగియుండాలి. లేకపోతే నా దేవుడు గొప్ప అని కీచులాడుకుంటారు. కనుక ముఖ్య దేవతలైన శివ, విష్ణు శక్తులు జగన్నిర్వహణ చేస్తూ తమలో భేదం లేదని ప్రకటిస్తూ ఉంటారు. కాని క్షుద్రదేవతలట్టి స్థితిలో ఉండరు. ముఖ్య దేవతలు, ఒకరి విధులను మరొకరు కూడా నిర్వహించగలరు. శాశ్వతంగా మాత్రం మార్చుకోరు.

కృష్ణునికి ముందున్న అవతారాలు కొంత కాలమే యుండి దుష్టులను, పరిహరించి ధర్మస్థాపన చేసారు. మహావిష్ణువు క్షాత్రధర్మాన్ని అనుసరించి దుష్టులను సంహరించి ప్రజలను రక్షించాడు. వారితో యుద్ధం చేసినపుడు ఈశ్వర సంహార కృత్యాన్నే చేసాడు. కృష్ణావతారంలో ఆ పని చేస్తూ సంహారాన్ని చేస్తున్నానని ప్రకటించాడు. అదే సందర్భంలో జ్ఞానోపదేశం చేయవలసిన ఈశ్వర లక్షణాలతోనూ ఉన్నాడు. పూర్వావతారాలలో ఉపదేశం లేదు.

కాని కృష్ణావతారంలో అసుర లక్షణాలు రాజులలో ప్రవేశించడం వల్ల వారిని సంహరించుటకు అర్జునునకు జ్ఞానోపదేశం చేసి కర్తవ్యోన్ముఖుణ్ణి చేసాడు.

సంహారం చేసాడంటే బాగానే ఉంది కాని మహావిష్ణువునకు పరిపాలించడమే ప్రధాన కృత్యమైనపుడు ఉపదేశం చేయవచ్చా? ఆ బాధ్యత పరిపాలించే రాజుకు పూర్తిగా లేదని భావించకూడదు. రాజు పాలనతోబాటు ప్రజలలో వినయాన్ని నేర్పాలని కాళిదాసు, రఘువంశంలో రాజులను గురించి "వినయా ధానాత్" అని అన్నాడు. అంటే జ్ఞానోపదేశమూ అతనిలో భాగమే. అయితే అది అతని ప్రధాన కృత్యము కాదు. రాజు శాస్త్రాలను, శాస్త్రజ్ఞులను, జ్ఞానులను పోషించి నిర్వహింపచేస్తూ ఉంటాడు.

పురాణాలలో పెక్కుమందిరాజులు పెక్కు సందర్భాలలో ఉపదేశించినట్లున్న మాట వాస్తవమే. అయినా క్షత్రియుడు ధర్మాన్ని రక్షించాలే గాని ఉపదేశానికి అతడు పరిమితుడు కాకూడదు. అది బ్రాహ్మణ ధర్మము, యోగులు, జ్ఞానుల పని.

రాముడు క్షత్రియుడు, అయినా సాత్త్వికమైన లక్షణాలున్నవాడు. పరశు రాముడు బ్రాహ్మణుడైనా రాజసిక లక్షణాలున్నవాడు. ఇద్దరూ అధర్మాన్ని పోగొట్టారు. వామనుడు బ్రాహ్మణునిగా వచ్చి దానం పట్టాడు. అసురుని నెత్తిపై కాలు పెట్టాడు. అసుర రాజ్యానికి అతణ్ణి అధిపతిని చేసాడు. అయినా అక్కడ క్షత్రియ ధర్మాన్ని అనుసరించాడు. అది వేరే కథ.

మత్స్య, కూర్మ, వరాహ, నరసింహావతారాలకు వర్ణాలను అంట గట్టలేం. అయినా అవతారాలు క్షత్రియ ధర్మాన్నే అవలంబించారు. (కూర్మావతారం, దేవతలు అమృతం సంపాదించుకొని మృతులు అవకుండా ఉండడానికి తోడ్పడింది) బలరామావతారం, కృష్ణునితో సంబంధం కలిగి ఉంది. కృష్ణావతారానికి బలం చేకూరుస్తూ బలరాముడూ దుష్టులను సంహరించాడు.

కృష్ణుడు, సంహారంతో బాటు బ్రాహ్మణ ధర్మమైన ఉపదేశం చేసాడు. అదైనా అవతారం చివరి దశలోనే.

అసుర శక్తులు కలిలో చాలామందిలో ప్రవేశించడం వల్ల దుష్ట సంహారం చేయడానికి వీలు పడదు. అందువల్ల సాత్త్వికమార్గంలో ఉపదేశం చేయవలసి వచ్చింది. ఇది అవతారం ఉన్నంతవరకూ సాగవలసిందే. అందువల్ల జ్ఞానిగా బ్రాహ్మణ వంశంలో పుట్టవలసి వచ్చింది.

దీనిని విష్ణ్వతారమనాలా? జ్ఞానోపదేశానికి, జ్ఞానావతారం ఎత్తుతాడా? అతడట్టి అవతారం ఎత్తితే ఈశ్వరుడు, తన కృత్యంలో ఇతడు వేలు పెట్టాడేమిటని శంకించడు. భిక్షాటనమూర్తియై శంకరుడు ఋషిపత్నులను మోహింప చేస్తే మోహినీ అవతారంలో విష్ణువు ఋషులనే మోహపుచ్చాడు. శంకరుడపుడు ఋషులకు తత్త్వోపదేశం చేసాడు . కనుక ఇద్దరిలోనూ భేదం లేదు.

జ్ఞానోపదేశం ఈశ్వరుని కృత్యమైనా అవసరం వస్తే విష్ణువు దత్త, ఋషభ, నరనారాయణ, వ్యాస రూపాలలో ఉపదేశమిస్తూ ఉంటాడు. శివ కృత్యాన్ని తానూ నిర్వహిస్తున్నానని ప్రకటించడం కోసం. కాని అటువంటిది పూర్తిగా దశావతారాలలో చేయలేదు. హయగ్రీవుణ్ణి "జ్ఞానానందమయం దేవం" అని కీర్తిస్తాం. సాధకులకు ఉపయోగిస్తాడు. అతణ్ణి లక్ష్మీ హయగ్రీవునిగా కూడా అంటారని మరిచిపోకూడదు.

అవతారాలలో విష్ణువు మాయావిగా కన్పిస్తాడు. విష్ణు జ్ఞానమని, విష్ణు యోగమనే మాటలు లేవు. శివజ్ఞానము, శివయోగ పదాలు మాత్రమే ప్రసిద్ధి. కాని విష్ణుమాయ అంటాం.

కనుక కలిలో క్షాత్రధర్మంలో కాకుండా సాత్త్విక రూపంలో జ్ఞానోపదేశం చేయాలి. అది శివావతారంగా ఉండాలి.

పరమ శివునితో ఐక్యమయినట్లు, కానట్లుగా ఉంటాడు విష్ణువు. విశ్వరూప దర్శనంలో నా ఈశ్వర యోగాన్ని చూడుమని అన్నాడు. చివరి అధ్యాయంలో తనకంటె ఈశ్వరుడు భిన్నుడైనట్లు ప్రకటించాడు.

"ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశే௨ర్జున తిష్ఠతి

భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా"

"తమేవ శరణం గచ్ఛ"

అనగా అందరి హృదయాలలోనూ ఈశ్వరుడున్నాడు. మాయాశక్తి వల్ల జంత్రగాడు, యంత్రంలో ఉన్న బొమ్మల మాదిరిగా నున్న జీవులను త్రిప్పుచున్నాడు.

"అతనినే శరణు పొందు"

ఒకచోట నన్ను అని అంటాడు. మరొకచోట అతనిని అంటాడు. అయితే ఈ భేదాన్ని నిరంతరం పేర్కొంటాడా? లేదు. విభూతి యోగంలో అందరిలోనూ ఆత్మగా నున్నానని అంటాడు:

"అహ మాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః"

ఆశయమనగా హృదయం. ఈశ్వరుడు అందరి హృదయాలలో ఉన్నా విష్ణువు చేసే పనిని చేస్తున్నాడని ఈశ్వరః అనే శ్లోకంలో ఉంది. నన్నే శరణు పొందమని అనినపుడు విరుద్ధంగా కనబడడం లేదా? లేదు. 'మామేవం' అనగా ఒక్కడైన నేనే అని అర్థం. ఇక ఈశ్వరుడు తనకంటె భిన్నుడని అన్నాడా?

జ్ఞాన శివుడే జ్ఞానావతారం

ఆరోగ్యం కావాలంటే సూర్యుణ్ణి, జ్ఞానం కావాలంటే మహేశ్వరుణ్ణి వేడుకోవాలని ఒక ప్రసిద్ధ శ్లోకం ఉంది.

"ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్, జ్ఞానదాతా మహేశ్వరః"

జ్ఞానము మోక్షాన్నిస్తుంది. గీత యొక్క చివరలో నన్నే శరణు పొందమన్నాడు. అన్ని పాపాలనుండి పోగొడతానని అన్నాడు. ఈశ్వరునే శరణు పొందమన్నపుడు అతనివల్లనే శాంతి లభిస్తుందని అన్నాడు. అది జ్ఞానం వల్లనే.

"తత్ప్రసాదాత్ పరం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతం"

విశ్వరూప సందర్శనంలో రుద్రుడు చేసే సంహారము తానూ చేస్తున్నట్లు చెప్పాడు. గీత చివరలో మోక్షాన్ని గూర్చి ప్రస్తావించేటపుడు దక్షిణామూర్తి రూపంలో ఈశ్వరుడు మోక్షాన్ని ప్రసాదిస్తాడని, అది అతని కృత్యమని సూచించాడు. భేదం ఉన్నట్లుగా కన్పింపచేసాడు.

కలిలో 72 మతాలు విజృంభించగా జ్ఞానోపదేశం చేయాలి కనుక దీనిని ఈశ్వర కృత్యంగానే సంభావించాడు. 'సంభవామి యుగే యుగే' అన్నపుడు, ఇద్దరూ ఒక్కటే.

తానెన్నో అవతారాలెత్తాడు. మౌనంగానున్న దక్షిణామూర్తి సంచారం చేస్తే శిష్యగణంతో అతనికి సాయం చేస్తానని విష్ణువు సంకల్పించాడు. శంకరుల శిష్యులలో ఒకడైన పద్మపాదుడు, విష్ణ్వంశతోనే జన్మించినట్లు శంకర విజయంలో ఉంది.

పరమ శివునకు ఎన్నో పేర్లున్నాయి. వేదంలో సమస్త విద్యలకు అతడధిపతి యని, అతడే సమస్త ప్రాణులకు ప్రభువని చెప్పబడింది. "ఈశానః సర్వవిద్యానాం..." అనే మంత్రంలో. సదాశివుణ్ణి ఓంకారంగా చెప్పి అదే ఆత్మస్వరూపమని చెప్పి చివరగా అట్టి మంగలమూర్తియైన శివుడు మాకు అనుకూలుడగు గాక అని యుంది. ఆ పై మంత్రమే గీతలోనూ చెప్పబడింది. అట్టి విద్యాధినాథుడు, శంకరులై ఉపదేశ గురువు కావద్దా?

తంత్ర గ్రంథాలలో పరమేశ్వరుడే అమ్మవారికి ఉపదేశించినట్లు ఉంటుంది.

అద్వైత విద్య, అన్ని విద్యలకంటె అధికం. అది ఒక పుస్తకం కాదు, మంత్రం కాదు. అనుభవంతో కూడిన విద్య. అట్టి అద్వైతవిద్యయే శివుడు. 'అహం బ్రహ్మాస్మి' అన్నట్లుగా 'శివోహం' అని అంటారు. కేవలం ఈ మూడు అక్షరాలపై ధ్యానం చేయవచ్చు. మాండూక్యోపనిషత్తులో కూడా 'శివం అద్వైతం' అని యుంటుంది. కనుక అద్వైతాచార్య రూపంలోనే అవతరించడం సబబు. అమర కోశంలో పరమేశ్వరుణ్ణే సర్వజ్ఞుడని యుంది.

ఆపైన ప్రశ్నోత్తర మాలికలో ఎవరు జగద్గురువని ప్రశ్న. "కోహి జగద్గురు రుక్తః?" చటుక్కున మనం ఆదిశంకరులని అంటాం. అంతకు ముందే కృష్ణునకు జగద్గురు పదం ఉంది. కాని శంకరులు "శంభుః" అని సమాధానం చెప్పారు.

ఆ శంభువే శంకరుడు. జ్ఞానం ఎవని వల్ల వస్తుందని ప్రశ్న. "జ్ఞానం కుతః?" శివుని నుండే అని జవాబు. "శివాదేవ"

కనుక జ్ఞానావతారం, పరమశివుడే కావాలి. ఇంతకుముందు వచ్చినవి విష్ణ్వవతారాలు. కలిలో పరమేశ్వరుడవతరించాలి. వారే శంకరులు.

శక్తిని అంతర్గతం చేసుకొని దక్షిణామూర్తి

పరమేశ్వరుడనేక రూపాలలో ఉంటాడు. అవి కళ్యాణ సుందరమూర్తి, సోమస్కంద మూర్తి, నటరాజమూర్తి, భైరవమూర్తి మొదలైనవి. ఇందులో ఏది అవతారానికి కారణం? కలిలో సన్న్యాస గురువు అవతరించాలి కనుక శక్తితో కూడిన సోమస్కందాది మూర్తులు వీలుపడవు. ఎందుకంటే పక్కనే అమ్మవారుండాలి కదా! ఇక భైరవమూర్తి వచ్చాడంటే భయంకరంగా ఉంటాడు. అటువంటివాడు, శాంతమైన పలుకులతో ఉపదేశం ఎలా ఇస్తాడు?

కనుక దక్షిణామూర్తి, అవతార కారకుడు కావాలి. అతడు, అమ్మవారితో కలిసి యుండడు. అయితే బాలా త్రిపుర సుందరిగానో, కన్యాకుమారిగానో, దుర్గగానో అమ్మవారు వచ్చినా అయ్యవారు ప్రక్కన ఉన్నట్లు కనబడరు. శివశక్తులు విడదీయరానివి కనుక విడిగానున్నట్లు భావించకూడదు. నిర్గుణ సగుణ బ్రహ్మమే అసలైన శివశక్తి స్వరూపము. ప్రపంచంలో లీలార్థమై దంపతులుగా ఒకమారు, విడిగానున్నట్లు ఒక మారు కన్పిస్తారు.

పరమేశ్వరుడు దక్షిణామూర్తిగా వచ్చినా, నిష్క్రియుడైనా, క్రియా స్వరూపిణి యైన అమ్మవారు లోపలే ఉంటుంది. ఆమెను మనం చూడలేం. అట్టి శక్తి లేకపోతే శంకరులుగా అవతరించి దేశాన్ని ముమ్మారు పర్యటించి, అనేక గ్రంథాలు వ్రాసి, వాదాలలో పాల్గొని అందర్నీ అనుగ్రహించడం కుదురు తుందా?

శుభమును చేయువాడే శంకరుడు. కనుక నిష్క్రియుడెట్లా అవతరించాడు? అన్ని శక్తులకు పరాశక్తియే మూలం. అనగా క్రియాశక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞాన శక్తులకు మూలం. ఇట్టి పరాశక్తి, దక్షిణామూర్తిలో సూక్ష్మాకారంతో ఉంటుంది.

శంకరులు, శైవులూ, వైష్ణవులూ, శాక్తేయులు కూడా

శంకరుల గురించి "అంతః శాక్తో బహిః శైవః వ్యవహారే తువైష్ణవః" అంటారు. ఆయన లోపలేమో అంబిక. విభూతి, రుద్రాక్ష ధారణచే శివుడు. ప్రాపంచిక వ్యవహారాలో విష్ణువు. ఆయన నోటినుండి నారాయణ, నారాయణ అని వస్తుంది. వ్రాయవలసి వచ్చినప్పుడు "క్రియతే నారాయణ స్మృతిః" అనగా విష్ణు భావనతో శివావతారంగా చెలామణీ అయి చేసేదంతా నారాయణ కృత్యమే. ఇట్లా శివ- విష్ణు అద్వైతం కుదిరింది.

విష్ణువు చేస్తున్నాడంటే అమ్మవారు చేస్తున్నట్లే. అవతారం పురుషాకారంలో ఉంది. నారాయణుని పేరుతో పనులు. ఆ నారాయణుడూ అమ్మవారి పురుష రూపమే. లోపల అమ్మవారి రూపం. మరొకవిధంగా హృదయంలో అపారమైన దయ యుంటుంది. అందువల్ల "అంతశ్శాక్తః"

ఇక్కడ శక్తి అంటే దయయే. అది లేకపోతే శివం లేదు. శివుడు, తనలో నున్నది శక్తియని తెలియాలన్నా శక్తియుండవలసిందే. శివం దయను చూపిస్తే అది శక్తియే. ఆమె లేకపోతే ఆయన, రాణించడనే మాట ఉంది కదా.

అయితే ఈ అవతారం, సీతారాముల మాదిరిగా, రాధాకృష్ణుల మాదిరిగా ఉండదు. సన్న్యాసిగా అవతరించాడు కనుక, అమ్మవారు బైటకు కన్పడదు. తన భార్య కనబడేటట్లు విష్ణువు, ఆమెను ధరిస్తాడు. నరనారాయణునిగా కన్పడినపుడు విష్ణువుగా కన్పడకుండా అంశావతారంగానే కన్పిస్తాడు. కలిలో భగవత్ శక్తి అవతరించాలి. అయినా లక్ష్మి - విష్ణువనే జంటగా కాదు. సన్న్యాసి కదా! ఆపైన దక్షిణామూర్తి శుద్ధమైన, సంపూర్ణమైన పరమేశ్వరునిగా కన్పిస్తాడు. పార్వతీ పరమేశ్వర రూపంలో కాదు. అందువల్ల దక్షిణామూర్తి నుండే శంకరులవతరించాలి.

ఇక అవతారం, గురు రూపంలో ఉండాలి. అసలు, పరమాత్మయే గురువు. ఉపనిషత్తు, అతణ్ణి గురువని చెప్పింది. అతనికి నమస్కరించుట, శరణు జొచ్చుట చెప్పబడింది. బ్రహ్మయే వేదాలనిచ్చాడు. ఆ మంత్రాలతోనే సృష్టి కార్యక్రమం మొదలౌతుంది. బ్రహ్మ విద్య నందించువాడు కూడా అతడే. అతణ్ణి పరమాత్మ సృష్టించి అతనికి వేదాలనందించాడు. ముముక్షువైన నేను అతనికి శరణు జొచ్చుతున్నానని మంత్రం:

"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం
యోవై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై
తం (గ్ం) హ దేవం ఆత్మబుద్ధి ప్రకాశం
ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే"

-శ్వేతాశ్వతరం (6-18)

ఇందే మరొకచోట పరమ గురువు శివరూపంలో ఉన్నాడని ఉంది. మహర్షి రుద్రుడు. వేదాలను పఠించే బ్రహ్మజననం కోసం చూస్తున్నాడని (అనగా హిరణ్యగర్భుని కోసం) ఉంది. మరొక చోట అతడే బ్రహ్మను సృష్టించాడని చెప్పబడింది. మహర్షి అనడం వల్ల ఉపదేశించు ఆచార్యుడే. రెంటిలోనూ మాకు సద్బుద్ధిని ప్రసాదించుగాక అని ప్రార్థన. పరమ మంగళ కరమైనదే బ్రహ్మము. దానిని చింతించువానికి అది వరప్రదాయిని అని శ్లోకార్థము.

"అతి కల్యాణ రూపత్వాత్
నిత్య కల్యాణ సంశ్రయాత్
స్మర్తృణాం వరదత్వాచ్చ
బ్రహ్మ, తం మంగలం విదుః"

స్మరించేవారికి ఎట్టి వరమది? జ్ఞానమే వరఫలము. దీనినిచ్చునది శివమే. అతడిచ్చు జ్ఞానమూ శివమే. శంకరులే దాని స్వరూపము. ఆయనే శివం, కల్యాణం, శుభం. శివమే ఆచార్య శివమైంది.

ఈ అవతారానికి తల్లిదండ్రులెవరు? ఎక్కడ?

అవతారానికి ఉపక్రమం

పోలీసు స్టేషన్‌లో ఎవరైనా దొంగతనం జరిగిందని ఫిర్యాదు చేస్తే తగు చర్య తీసుకుంటారు. అట్లాగే అవతరించడానికి తగిన కారణం కోసం భగవానుడు ఎదురు చూస్తున్నాడు. ధర్మం క్షీణిస్తోందని దేవతలు, ఆర్తి పెడితే భగవానుడవతరిస్తాడు. అంతేకాదు అవతారానికి జన్మనిచ్చే దంపతులు తమకు మంచి సంతానం కావాలని అనాలి. ఏదీ లేకుండా అవతరిస్తాడా?

ఇట్లా రెండువైపులా ఆర్తి ఉంటుంది. ఇట్టిది రామకృష్ణావతారాలలో చూసాం. ముందు దేవతల ఫిర్యాదు. దశరథుడు పుత్రకామేష్టి చేయుట. తరువాత రామావతారం. సుతపస్ అనే ప్రజాపతి, అతని భార్య పృశ్ని చాలాకాలం పాటు తపస్సు చేసారని భగవానుడే మూడు జన్మలలో అవతరిస్తాడని ఉంది. అందు కృష్ణావతారం చివరది. దేవకీ వసుదేవుల బిడ్డడై జన్మించాడు. అంతకుముందు అదితి కశ్యపులకు వామనునిగా పుట్టాడు.

విష్ణువు విషయంలో అట్టి ఆర్తిలుంటే శివుని విషయంలో ఉండవద్దా? అతనికి లాంఛనాలతో పనిలేదు. అతనిలో ఉన్నది దయయే.

నిష్క్రియునకు దయయా?

దక్షిణామూర్తి, మౌనంగా మర్రిచెట్టు క్రింద ధ్యానంలో ఉంటాడు. ఆయన చూడడు, మాట్లాడడు కాని ఆయన మనస్సు దయతో పొంగుతోంది. అద్వైతంలో మనస్సే లేదు. మనస్సు పోతేనే ఆత్మ ప్రకాశిస్తుందని ఉంటుంది. అయితే దయతో, అయ్యో మానవులిట్లా అయిపోతున్నారేమిటని జాలిపడ్డాడు. (నవ్వుతూ అన్నారు స్వామి). అయితే అద్వైతమూర్తి ఎట్లా కాగలడతడు? మనపై దయ చూపించాడంటున్నాం. అయితే మనస్సుండాలి కదా!

ఘోషాస్త్రీ కనబడదు. వినబడదు కూడా. అయితే పిల్లవాడొక గోతిలో పడిపోతున్నపుడు బైటకు వచ్చి కేకలు వేస్తూ రక్షించదా? దక్షిణామూర్తికి అట్టి పరిస్థితి ఏర్పడింది. అతడు నిష్క్రియుడైనా దయతో వీక్షించాడు.

ప్రజలు బుద్ధితో వాదవివాదాలు చేసికొంటున్నారు. చేతులు కలబడడం వల్లనే కాదు, సంకల్పాల వల్లనూ సంఘర్షణలు వస్తాయి. ఇపుడు మనస్సును సక్రమ మార్గంలో పెట్టాలని చివరకు క్రియా రహిత స్థితిని పొందునట్లు చేయాలి.

మనస్సులోని ద్వైతాన్ని తొలగించడం అద్వైతం

సంకల్పాలను లేకుండా మనస్సును నిర్మూలించుటయే అద్వైతం. మనకంటె భిన్నమైనది ఒకటుందని మనస్సువల్లనే కల్గుతోంది. స్వప్నంలో మరొకటి కనబడదు. మనస్సు అణిగియుండడం వల్ల అట్లా జరిగింది. అందువల్ల ప్రశాంతంగా ఉంటున్నాం. మరొక వ్యక్తి కనబడితే శాంతికి భంగం. అతనికేదో ఉపకారం చేయాలని ఒక మాటు, మరొక సందర్భంలో ఒకర్ని చూస్తే ఈర్ష్యా ద్వేషాలు కల్గుతున్నాయి. ఒకనిమీద ప్రేమ చూపిస్తే మనసులో సంతోషం, ద్వేషం చూపిస్తే అవతల వ్యక్తికి కీడు కంటె మనకపకారం కల్గుతోంది.

మన కంటె మరొకడు లేనపుడు, మనకన్నా మరొకటి విడిగా లేనపుడు ప్రేమగానీ, ద్వేషం గాని కల్గుతోందా?

అంటే మిగిలినవారు లేకుండా నాశం చేయాలని కాదు. అట్లా ఎవ్వరూ చేయలేరు. అట్టి శక్తియున్న ప్రాణులను సంహరించవచ్చు గాని జడరూపాన్ని రూపుమాపగలమా? దానినీ నిర్మూలిస్తే మనం ఎక్కడ ఉంటాం?

విడిగా నున్న వ్యక్తుల వల్లనే కాదు, జడ ప్రకృతి వల్ల, శాంతికి భంగం కల్గుతోంది. మామిడిపండు కనబడితే తినాలనే ఉబలాటం ముళ్ళ చెట్టును చూస్తే ముళ్ళు గ్రుచ్చుకుంటాయేమోనని బాధ, ఇక ఉరుములు, మెరుపులు, భూకంపాల వల్ల భయం మొదలైనవి ఎన్నో కల్గుతున్నాయి. ఇవన్నీ లేకుండా ఉండాలంటే ఎలా?

అన్నిటినీ వదిలించుకున్నా ఆకలి దప్పులు మనల్ని బాధిస్తాయి. ఇక కోరిక, దుఃఖం సరేసరి. కోరికల పరంపరకు అంతులేదు. ఎవ్వరూ కనబడకపోయినా ఒంటరిగా ఉన్నా అట్టి భావాలు వెంట తరుముతూ ఉంటే శాంతి ఎక్కడ? ఏమిటి? మూర్ఖునిగా ఆలోచించానేమిటియని తనను తానే నిందించుకుంటాడు.

తనకంటె భిన్నమైనది లేదనే భావనను అద్వైతము అందిస్తున్నదంటే దానికి అర్థం తనకంటె భిన్నమైన వ్యక్తి ఉండకూడదని కాదు. అయితే ఉండకూడనిది ఏమిటిది? మనస్సే. ఇది ఎంతవరకూ మన దగ్గర ఉంటుందో అనేక దుఃఖ పరంపరలు సిద్ధం. మత్తుమందిచ్చి శస్త్ర చికిత్స చేసినపుడు బాధ పడుతున్నామా? రోజూ నిద్ర పోతున్నారు. అపుడు చరాచర వస్తు ప్రపంచం లేకుండా ఉందా? అయితే ఎప్పుడు బాధ కల్గుతోంది? మనస్సు పనిచేసినపుడే. మనస్సుంటేనే కదా సుఖ దుఃఖాలనుభవించేది?

కనుక రెండవ వ్యక్తి ఎవరు? నీ మనస్సే. నిద్ర పోతున్నపుడు గాని, మత్తు మందిచ్చినపుడు గాని నీ మనస్సు లేదు. కాని నీవు బ్రతికే యున్నావు. అట్టి ప్రాణశక్తియే ఆత్మ. అదే నీ నిజరూపము. మాయ, మనస్సును రెండవదానిగా తీసుకొని వచ్చింది. జ్ఞానం వల్ల దీనిని నిర్మూలించు, అపుడు నీకంటె మరొకటి కనబడదు. అపుడు అద్వైతం పట్టుబడుతుంది. నీకంటె మరొకటి లేదనినపుడు క్రియలేదు. మాట లేదు, దానికై వెంపర్లాడడం లేదు. నిన్ను అటూ ఇటూ లాగే ప్రపంచమూ నిన్నేమీ చేయలేదు. అపుడు నీ దృష్టిలో ప్రపంచము లేదు. నీవు ఒంటరిగా ఉన్నా కోపతాపాలు నీ దరిచేరవు. శాశ్వత కాంతితో ఉండిపోతావు. నిన్ను మంచి చెడులు రెండూ బాధించవు.

అది శూన్యము కాదు, సచ్చిదానందమే

ఏదీ లేనపుడు శూన్యమని, అన్నీ శూన్యంలో అంతమౌతాయని భావించకండి. అది శూన్యమైనా దాని కాధారము ఆత్మయే. నీవాత్మ

స్వరూపుడివి. శూన్యమెట్లా కుదురుతుంది? ఈ ఆత్మ అనే మాట పుస్తకాల వల్ల కొంతే తెలుస్తుంది. మనస్సు నిర్మూలింపబడిన స్థితి పట్టుబడడం కష్టం. అది అనుభవైకవేద్యం. పుస్తకాలేమంటాయి? నీకు మత్తు మందిచ్చినా, నిద్రపోతున్నా నీ సత్ స్వరూపం అవగతం కాదు. నీవు జ్ఞాన మార్గంలోకి వెళ్ళితే సమాధి స్థితిని చేరుకోగలిగితే నీవు సత్ అని తెలిసికోగలవు! అన్నీ అసత్యాలే. ఆత్మయే సత్యము. అది తాత్కాలిక సత్యానికి అనగా వ్యావహారిక సత్యానికి ఆధారం. నీవు సత్తే అని తెలిసికో. ఇట్లా అని చెప్పినపుడు చిత్ ప్రకాశిస్తూ ఉంటుంది. అనగా జ్ఞానంతో ఉంటావు. వట్టి జ్ఞానం వల్ల సత్‌ని తెలిసికొంటే అది తప్పే. అపుడు ద్వైత భావన కల్గుతుంది. అంటే సత్ వేరని, తెలిసికొనేవాడికి చిత్ వేరనే భావన వస్తుందన్నమాట. సమాధి స్థితిలో సత్ ఒకటి, దీనిని తెలిసికొనుట మరొకటి ఉంటుందా? రెండూ ఒక్కటే. అపుడు చిత్‌తో తెలిసికోవడం కాదు. నీవు చిత్‌వి. అంతేకాక నీవు, ఆనంద స్వరూపుడవనే స్థితికల్గుతుంది. అపుడు ప్రపంచ బాధలు లేవు. అపుడు శూన్యం కాదు. బ్రహ్మానందం. ఇది లోనుండి వచ్చింది. బయటినుండి వచ్చింది కాదు. బాహ్యమైన వాటివల్ల కలిగే ఆనందం, ఈ అఖండానంద సాగరంలో ఒక్క బిందువే. కనుక సత్ – చిత్ ఆనందం ఒక్కటే. ఈ స్థితిలో బైటనుండి ఆనందం వస్తే అపుడది ద్వైతమే. కాబట్టి ఏ స్థితిలో సత్–చిత్–ఆనందంలో ఉన్నదో ఆ స్థితి బంధాలనుంచి విముక్తి చేసేదే మోక్షస్థితి. కాని శూన్యం కాదు.

జీవాత్మ - పరమాత్మల భేదం లేదు

బంధాలనుండి జీవులను విముక్తులను చేసి ఈ ప్రపంచం కంటె పైనున్న వైకుంఠానికో లేదా కైలాసానికో పరమాత్మ తీసుకొని వెడతాడని, అక్కడే ఉంచుట మోక్షం అనే సిద్ధాంతాలవారంటారు. అంటే మోక్షంలో స్వామి యొకడు, ముక్తులు వేరనే భావన ఏర్పడుతుంది. మనకంటె భిన్నుడు స్వామియని

భావిస్తారు. అనగా జీవుడు వేరు, పరమాత్మ వేరని. అతడు చరాచర వస్తు ప్రపంచ కర్తయని భావిస్తారు.

కాని అద్వైతం ప్రకారం మాయవల్ల ఏర్పడిన మనస్సున్నంతవరకూ జీవుడు అనేక భావావేశాలకు లోనౌతాడని, జీవుడు, మాయను దాటగలిగితే శాశ్వత శాంతియని చెబుతుంది. సమస్త జగత్తు మాయవల్ల సంక్రమించింది. జీవునకు మనస్సెటువంటిదో బ్రహ్మమునకు మాయ అట్టిది. ఆత్మయొక్క నిజరూపం మనస్సు ఎట్లాకాదో, మాయ బ్రహ్మము యొక్క అసలు రూపం కాదు. బ్రహ్మము మాయతో కూడినపుడు ఈశ్వరుడు తన నిజరూపాన్ని చూపించడు. అట్లాగే మనస్సుతో కూడిన జీవుడు కూడా. మనస్సును దాటినపుడు, ఆత్మ తన సహజ రూపంలో ఉంటుంది. మాయను త్రోసి బ్రహ్మము తన నిజరూపంలో ఉంటుంది.

అట్లా అనినపుడు జీవాత్మ, పరమాత్మలు ఒకటీ కావా? బ్రహ్మము మాయను గ్రహించి జగత్తును, మనస్సుతో కూడిన జీవుణ్ణి సృష్టిస్తున్నాడంటే బ్రహ్మము జగత్తుగా జీవునిగా కనిపిస్తున్నాడనే కదా! జీవుని నుండి మనస్సును తీసివేస్తే అతడు బ్రహ్మమే అవుతున్నాడు. రెండు ఆత్మలంటూ లేవు. ఉన్నది ఒక్కటే. అదే బ్రహ్మము.

స్వామి, మనల్ని వైకుంఠానికి తీసుకొని పోతున్నాడంటే, అది ఎంత గొప్ప స్థితియైనా మన నిజరూపమే మనకు తెలియడం లేదు. అతడు తన నిజరూపంలోనూ లేకుండా ఉంటాడు. అక్కడ జీవులు భక్తిని చూపిస్తూ ఉంటారు. అతడనుగ్రహిస్తూ ఉంటాడని అంటారు. మనస్సు లేకుండా భక్తినెట్లా చూపించగలం? ఎప్పుడైతే మనస్సుందో ఆత్మకు దూరంగా ఉండి మనస్సుతోనే అక్కడ జీవులుంటారు కదా! వారికి నిజరూపం ఎట్లా అవగతమౌతుంది? అందువల్ల పరమాత్మ ఎట్టి దివ్యానుగ్రహం చూపించాలి? అక్కడ జీవుడు భక్తి చూపించనవసరం లేదని, భిన్నులనే భావన రానీయకూడదని వారిని తనకంటె భిన్నులుగా చూడవద్దని, భక్తుని మనస్సును పూర్తిగా పోగొట్టి తనలో భిన్న స్థితిని తీసుకొని రావడమే మోక్షమని అద్వైతం చెబుతుంది.

మోక్షమునసనుభవించుటయే గాని, మోక్షలోకం అంటూ ఏదీ లేదు. అక్కడ క్రియలేదు. పని ఉందంటే మనస్సున్నట్లే. మనస్సున్నంతవరకూ భేదభావం తప్పదు. కనుక దానినుండి విడుదల చేస్తాడు.

జీవులపై దయ చూపించి దక్షిణామూర్తి శంకరులుగా అవతరించాడంటే అతడూ మనస్సుతో ఈ పని చేసాడా? అయితే అతణ్ని ఆత్మయని, అఖండానందం అనుభవిస్తున్నాడని, ఎట్లా క్రియారహిత్వం ప్రాప్తించిందని శంక కల్గుతోంది.

ఈశ్వరుడు మాయతో ఉన్నా జ్ఞానియే

అతడు మాయతో ఉన్నా తానాత్మరూపుడనే ఎఱుక, ఎల్లవేళలా ఉంటుంది. మాయ అతని ఆధీనంలో ఉంటుంది. అదే మన ఆత్మను తెలిసి కోకుండా చేస్తుంది. అట్టి మాయ, ఈశ్వరుణ్ణి ఏమీ చేయలేదు. యోగి కొన్ని వస్తువులను సృష్టించినా, గారడీవాడు కొన్నింటిని చూపించినా వాటిని వారు నిజమని నమ్మరు. చూసినవారు నమ్ముతారు. అట్లాగే దక్షిణామూర్తి జగన్నాటకాన్ని ఆడుతున్నాడని శంకరులన్నారు.

"మాయావీవ విజృంభ యత్యపి మహాయోగీవ యఃస్వేచ్ఛయా

తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే"

అతడు మాయతో ఉన్న ఈశ్వరుడెట్లా జ్ఞాని అవుతాడని శంక. ఈశ్వరుడవడం వల్లనే అని సమాధానం. మనమట్టి స్థితిలో లేనంత మాత్రంచే అతడూ అట్లా ఉండలేడని భావించడం తప్పు. మన మాదిరిగానే ఈశ్వరుడుండాలా? అతడే కదా జ్ఞానులను, అజ్ఞానులను సృష్టించింది? రెండు రూపాలూ ఒకటై ఎందుకుండలేదు?

అతడు నిర్గుణుడైనా లోనున్నది సగుణ శక్తియే. అట్లా ఉండడం లేదా?

అవతార లక్ష్యం ఏమిటి? కర్మ భక్తులద్వారా జ్ఞానాన్ని పొందడమే అయితే

అందరూ క్రియారహిత స్థితిని పొందగలరా? ఏ పని లేకుండా కూర్చోగలమా? కనీసం నిద్రలో అట్టి స్థితిని పొందడం లేదా? ఏ పని, చేయకుండా మనస్సు ఊరుకోదు కదా!

"నహి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠతి అకర్మకృత్" (భవగవద్గీత 3.5)

అంతేకాదు, మనస్సులో ఆలోచననే రాకూడదంటోంది అద్వైతం. ఈ మాటను ఎవరు వింటారు?

విన్నా వినకపోయినా ఉపదేశించాలి. ఎవడో ఒకడైనా విని బాగుపడతాడు. ఒకనాటికైనా పరిపక్వస్థితి వస్తుందని ఆశ.

అందరూ కర్మ భక్తులను అనుసరించగలరు. భక్తిలో పండితే వైరాగ్యం వస్తుంది. అది పట్టుబడకపోయినా ఈశ్వరునిపట్ల అమిత ప్రేమను చూపించగలడు. కర్మకాండలు చేయలేకపోయినా పూజ, ఆలయదర్శనం, తీర్థయాత్రలైనా చాలు.

కనుక ప్రజలను దారి మళ్లించడం కోసం అవతరించాలి. వైదిక కర్మలను చేయుటకు ప్రోత్సహించాలి. తద్వారా చిత్తశుద్ధి కలుగుతుందని చెప్పాలి. ఆలయాలలో యంత్ర ప్రతిష్ఠలు చేయాలి. ప్రజలను భక్తిమార్గంలో పెట్టాలని అవతారం ఏర్పడింది.

అంతేకాదు, క్రియారహిత స్థితియే పరమ లక్ష్యమని ప్రజలకు బోధించాలి. అపుడు జ్ఞాన మార్గానికి మళ్ళుతారు. దీనిని చాలామంది అనుసరించలేక పోవచ్చు. పరిపక్వత లేకపోతే అట్టి మార్గంలో అడుగు పెట్టవద్దని ఈశ్వర సంకల్పం కాబోలు. అందుకే ప్రవృత్తి మార్గాన్ని ముందు బోధించి, అందు వారు నిలద్రొక్కుకున్నతరువాత నివృత్తి మార్గాన్ని బోధించాలని అవతార సంకల్పం.

అందుకే శంకరులు, ముందు కర్మలను అనుసరించండని మొదటగా ఉపదేశించారు. దానితో ఈశ్వరుని భజించండని అన్నారు:

"తేనేశస్య విధీయతాం అపచితిః"

అపుడు కర్మ, యోగమై కర్మ ఫలాల పట్ల కోరిక పోతుంది. ఫలాలనపేక్షించకుండా కర్మలను చేయాలన్నారు. "కామ్యే మతిః త్యజ్యతాం" అట్లా ఉంటే సత్సంగం చేయాలన్నారు – "సంగః సత్సు విధీయతాం". చివరకు మనస్సునకు పరిపక్వత వస్తుంది. నివృత్తి మార్గంలో అడుగు పెడతాడు. గురువును సమీపించి ప్రణవోపదేశాన్ని, మహావాక్యాలను వింటాడు. జీవబ్రహ్మైక్యం సిద్ధిస్తుందని మార్గాన్ని విశదీకరించారు శంకరులు. ఇదే మాట శ్లోకంలో

"సద్విద్వాన్ ఉపసర్ప్యతాం ప్రతిదినం తత్పాదుకా సేవ్యతాం

బ్రహ్మైకాక్షర మర్ధ్యతాం శ్రుతి శిరోవాక్య మాకర్ణ్య తాం"

బ్రహ్మాస్మీతి విభావ్యతాం=నేను బ్రహ్మానని భావించు. "పరబ్రహ్మాత్మనా స్థీయతాం" అపుడు బ్రహ్మయిపోతావు. "ఏకాంతే సుఖ మాస్యతాం... పూర్ణాత్మా సుసమీక్ష్యతాం" అపుడేకాంత స్థితి, క్రియారహిత స్థితి వస్తుంది.

చెడుతో కలవని మంచి ఉండదు

ఏ పనియైనా తనకోసం కాకుండా ఇతరుల మంచికై పూర్తిగా ఉంటుందా? ఉండదు. ఏ పని చేసినా కొంత చెడు ఉంటుంది. మంచిలో ఇతరులకూ కొంత హాని జరగడమూ ఉంటుంది.

మంచికై కర్మయోగాన్ని అవలంబించి యుద్ధం చేయమని కృష్ణుడనలేదా? అయితే యుద్ధం వల్ల అంతా మంచే జరిగిందా? ఎందరో వీరులు నేలకొరిగారు. వారిలో అభిమన్యుడూ ఉన్నాడు. దీనివల్ల లోక కల్యాణం జరిగిందా అని శంకిస్తాం. కర్ణుడు తనవాడే అని తెలిసికొన్న తరువాత ఇదంతా నావల్లనే జరిగిందని ధర్మరాజు వాపోయాడు. ద్రౌపది పిల్లలను అందరినీ పోగొట్టుకొనవలసి వచ్చింది.

సేవలో కూడా కొందరికి అపకారం

మంచి చేద్దామని అనుకున్నా అనుకోకుండా కొంత హాని జరుగుతూ ఉంటుంది.

మిల్లు బట్టలు విదేశాలనుండి వచ్చేవి. మిల్లు బట్టలను విడిచి ఖాదీని ప్రోత్సహించండని గాంధీగారన్నారు. దానితో విదేశీ వస్తు బహిష్కరణతో బాటు స్వదేశీ వస్తువుల ప్రోత్సాహము రెండూ సిద్ధించాయి.

1922లో రామేశ్వరానికి యాత్రకై వెళ్ళినపుడు మఠంలో ఉన్నవారందరూ ఖాదీని ప్రోత్సహించాలని అన్నాను. ఆనాడు విదేశీ వస్త్రాలను తగుల బెడుతూ ఉంటే బాధ కలిగి తగులబెట్టే బదులు వీటిని సముద్రంలో పడవెయ్యమని, ఖాదీని ధరించండని అన్నాను. ధనుష్కోటిలో వాటిని సముద్రంలో పడవేశారు. మదురై నుండి ఖాదీ బట్టలు వచ్చాయి. స్వదేశీ వస్త్రాలను ప్రోత్సహించడం వల్ల కుటీర పరిశ్రమలు వృద్ధి పొందాయి. దేశాభిమానం తొంగి చూసింది. బాగానే ఉంది.

లాంక్‌షైర్, మాంచెస్టర్‌లో నున్న మిల్లు యజమానులు గగ్గోలు పెట్టారు. వారి దేశంలో బొగ్గు, సున్నం తప్ప ఏమీ దొరకవు. అందువల్ల పరిశ్రమలు స్థాపించారు. విదేశాల నుండి ప్రత్తిని దిగుమతి చేసుకొని బట్టలను తయారు చేసి ఎగుమతి చేసుకొని బట్టలను తయారు చేసి ఎగుమతి చేస్తూ ఉండేవారు. కనుక వీరి నడవడికను తప్పు పట్టలేం. మిగిలిన దేశాలలోని చేనేత కార్మికులూ బ్రతకాలి కనుక కొన్ని రకాల బట్టలకే వారి వ్యాపారం పరిమితమైతే బాగుండుననిపించింది. అప్పుడు వారూ బ్రతుకుతారు కదా! ఇండియా, చైనా వంటి దేశాలు స్వదేశీ వస్తువులను ఉత్పత్తి చేసి తప్పనిసరి పరిస్థితులలో కొన్నిటినే విదేశాలనుండి దిగుమతి చేసుకుంటే బాగుండుననిపించింది. అయితే వ్యాపారమే వృత్తిగా గల ఇతర దేశాలవారు, మనం కేవలం స్వదేశీనే ప్రోత్సహిస్తే

బాధపడరా అనిపించింది. అందువల్ల నా అంతట నేను ఖాదీనే వాడుతూ ఇతరులకు ఖాదీనే వాడండని ఉపదేశం చేయలేదు.

కేవలం ఖాదీని వాడినా మన దేశంలోని మిల్లు యజమానులూ బాధపడతారు. చేతివృత్తులను ప్రోత్సహిస్తే మిల్లులు దెబ్బతింటాయి. ఇక మిల్లులను ప్రోత్సహిస్తే చేతివృత్తుల వారు బాధపడతారు.

మరొకటి. అనేకమైన చట్టాలను చేస్తున్నాం. దానివల్ల కొందరికి ఉపకారం, కొందరికి అపకారం జరుగుతూనే ఉంటుంది. లేకపోతే హర్తాళ్లు ఎందుకుంటాయి? ప్రతిపక్షం లేకుండా, ఆక్షేపణలు లేకుండా బిల్లులు తయారవుతున్నాయా?

రాజకీయాలలోనే కాదు, మత విషయాలలోనూ అంతే. ఒకే మార్గాన్ని రుద్దలేం. ఒక మార్గంతో పయనిస్తే మోక్షమనీ ఉండదు. అందువల్లనే అనేక మతాలు వచ్చాయి. ఏ పార్టీ ఉన్నా, ఏ మతమున్నా అభిప్రాయ భేదాలు తప్పవు.

సనాతన వాదికి మంచి జరిగితే సంస్కర్తలు గగ్గోలు పెడతారు. అట్లాగే సంఘసంస్కర్తలకనుకూలంగా ఉంటే సనాతన వాదులు అల్లరి చేస్తారు.

అట్లాగే భాషల విషయంలో కూలీలు – యజమానులు; అగ్రవర్ణాలు – బలహీన వర్గాలు; అనే వర్గాల విషయంలోనూ ఒక భాష అభివృద్ధి పొందితే ఒకటి క్షీణిస్తూ ఉంటుంది. కూలీలకు మంచి జరిగితే యజమానులకు ఇబ్బంది జరగొచ్చు. అగ్రవర్ణాలకు సుఖం. వెనుకబడ్డ వర్ణాలకు బాధ జరగొచ్చు. ఇట్లా అన్నిటిలోనూ మాకన్యాయం జరిగిందంటూ గోల పెడతారు.

ఇక పవిత్ర దేవాలయ నిర్మాణంలోనూ ఎందరో శ్రమకు లోనౌతారు. రథోత్సవంలో ఎక్కడో ఒకచోట ఒకడు దుర్మరణం పాలవుతాడు.

క్రొత్తగా ఆలయమెందుకు? పాఠశాలలు, వైద్యాలయాలు కట్టవచ్చు కదా అని ప్రశ్నిస్తారు. మానవ సేవ చేయడం మంచిదే. దానిని చేయండని శాస్త్రాలూ

చెబుతున్నాయి. రోగులకు మందీయడం మంచిదే. కాని ఒక దుర్మార్గుణ్ణి కాపాడితే వాడు సంఘానికి చేటు తీసుకు రావడం లేదా?

మంచిని నిరాకరిస్తున్నానని, చెడును ఎక్కువగా చూపిస్తున్నానని భావించకండి. ఏదో మంచి చేద్దాం, చివరికిట్లా చేటు వచ్చిందని అనడం వినడం లేదా?

గాంధీగారు, కొన్ని నెలల్లో చంపబడతారనగా దేశం విభజింపబడి లక్షలాది ప్రజలు నానా ఇబ్బందులూ పడుతూ ఉంటే ఇందుకా స్వరాజ్యం తెచ్చిందని బాధ పడలేదా?

ఒక సమస్యకు పరిష్కారాన్ని చూపిస్తాం. కాలం గడిచిన కొద్దీ క్రొత్త సమస్యలు పుట్టుకుని వస్తాయి. ఒక రోగాన్ని కుదర్చడం కోసం ఒక మందు వాడతాం. కుదిరినట్లుంటుంది. కొన్ని మందుల వల్ల అసలు రోగం కంటె క్రొత్త రోగాలు వస్తున్నాయి.

ఒక మాటు అన్నదానం ఏర్పాటు చేసాం. పెద్ద పెద్ద అన్నరాసులు ఖర్చయిపోయాయి. ప్రజలు తృప్తి పడ్డారు. మాకూ తృప్తి కలిగింది. తృప్తి పడ్డాం అంటే మేము చేసాం అనే అహంకారం, అందులో దాగి యుంది. అంతా ముగించిన వెనుక ఎండలో మాడి చాలాదూరం నుండి పది పదిహేనుమంది వచ్చారు. అన్నం లేదు. అన్నీ ఖాళీ పాత్రలు. ఆనాటి వారి నిరుత్సాహాన్ని చూస్తే బాధ కలిగింది. పై తృప్తి ఆవిరైపోయింది. వారికి ఏవో పళ్లు, డబ్బు ఇచ్చి పంపవలసి వచ్చింది.

వేయిమందికి అన్నదానం చేసామంటే ఇన్ని సంవత్సరాలూ వారు అన్నం తినకుండా ఉన్నారంటారా? ఆ రోజు కూడా వారెక్కడో తినేవారు. అంతమందిని పిలిచి పెట్టాం, 10,15 మందికి పెట్టలేకపోవడం జరిగింది. సేవ చేయడం మంచిదా? అందరికీ సేవ చేయలేకపోవడం మంచిదా? ఆలోచించండి. ఎందుకు చెప్పానంటే ఒకనికి సాయపడినా అనేక సమస్యలు, బాధలూ తప్పవని చెప్పడానికే. చేస్తామని చేయలేకపోయాం కదా!

ఒకడందరికీ సాయం చేయలేడు. కోటీశ్వరుడైనా దానాలిస్తూ పోతే చివరకు యాచకులను పొమ్మనే పరిస్థితి ఏనాటికైనా వస్తుంది. కొంత చెడు జరిగినా మంచి పనులు చేయవలసిందే కాదనను.

మరొక ఉదాహరణ. ఒక ప్రదేశంలో మకాం వున్నాం. ఆ ఇంటి వాసాలు పుచ్చిపోయి అందుండి పెద్ద పెద్ద పురుగులు రొద చేయడం మొదలు పెట్టాయి. అందొకటి క్రిందబడి వెల్లకితలా పడింది. లేవలేదు. అక్కడున్న చీమలు దానిచుట్టూ మూగి కుడుతున్నాయి. ఆ చిమ్మట పురుగును మామూలుగా చేస్తే ఎగిరిపోతుందని, అట్లా చేస్తే అది ఎగిరిపోలేదు సరికదా, ఈ చీమలన్నిటినీ తినడం మొదలెట్టింది.

ఒక జీవికి సాయం చేద్దామంటే అనేక జీవుల హింసకు కారణమయ్యాం. ఒక ప్రాణిని రక్షించామనే అహంకారానికి దెబ్బ తగిలింది. దుర్మార్గుడైన రావణుని సంహరిస్తే పతివ్రతయైన మండోదరి, విధవ కాలేదా? ఇట్లా మంచి, చెడు ఒక దాని వెంట మరొకటి అనుసరిస్తూనే ఉంటాయి.

అవతారం బోధించేది క్రియాశూన్యాన్నే

ఏ అవతారంలోనైనా ఎక్కువ మంచి జరిగినా కొంత చెడు జరగక తప్పదు. మంచిని చేయడమే, ధర్మాన్ని స్థాపించడమే అవతారం లక్ష్యం. ఎప్పుడైతే క్రియ యుందో కొందరికి ఉపకారం, కొందరికి అపకారం తప్పవు.

కాబట్టి పరమాత్మ సంకల్పించాడంటే ఎన్నో అవతారాలు మంచిని చేసాయి, ఇప్పుడు మంచి చేసినా చెడు చేసినా ప్రయోజనం లేదు గాబట్టి నిష్క్రియత్వాన్ని బోధించడమే మంచిదని సంకల్పించాడు. దానికై శంకరావతారం వచ్చింది.

అయితే, ఎన్నో వ్రతాలు, ఉపవాసాలు చేసి శంకరుల తల్లిదండ్రులు వీరిని కన్నారు. కాని విధవయైన తల్లిని వదిలి సన్న్యాసం పుచ్చుకొనవలసి వచ్చింది. తరువాత మండన మిశ్రులను ఓడించడం, శిష్యునిగా చేసుకుని సన్న్యాసిగా అతణ్ణి మార్చడం వల్ల అతని భార్యకు దుఃఖాన్ని కలిగించడం

జరిగింది. కనుక ఇందులోనూ మంచి చేయడం వల్ల కొందరికి కష్టాలెదురయ్యాయి. అందువల్ల నిష్క్రియాన్ని ఉపదేశ రూపంలో ఇచ్చారు.

మేము చెప్పేదే సత్యం, మంచి జరుగుతుందని అనేక మతాలను చాలామంది బోధించారు. అనేక సిద్ధాంతాల వల్ల ప్రజలలో సంశయాలేర్పడ్డాయి. దేనిననుసరించాలో తెలియని స్థితి. నిష్క్రియంగా ఉండడమే అన్నిటికంటే మేలని అదే మోక్షానికి దారి తీస్తుందని ఉపదేశించారు.

ఒకనికి మంచి చేద్దామనుకున్నాం. మనం అనుకున్నది చేయగలమా? ఫలదాతయైన ఈశ్వరుడున్నాడు. అతడు సంకల్పించకపోతే మనమా పనిని చేయగలమా? ఇతరుల కర్మ గురించి మనకు తెలియదు. పాప కృత్యాల వల్ల అతడట్లా బాధపడవలసి వచ్చిందేమో! కనుక ఎంత మంచి చేద్దామన్నా ఒకపుడు సాధ్యం కాదు.

నిత్య జీవితంలో సత్కర్మ ఫలాలు

మరొక విధంగా అనుకుందాం. అవతలివాని సమస్య మన సాయం వల్ల ఎందుకు పరిష్కారం కాకూడదు? నిత్య జీవితంలో పరస్పర సహకారం ఉండాలి కదా! కొన్ని సందర్భాలలో చేయవలసినది చేయకపోయినా చాలా వాటిల్లో కృతకృత్యులమౌతున్నాం. కనుక నిరాశానిస్పృహలతో ఉండేకంటె ప్రేమను, దయను చూపించవద్దా? బాధపడనీ నాకేమిటి సంబంధం అని ఊరుకుంటామా?

ఇదీ బాగానే ఉంది. చెడ్డ భావాలు, చెడ్డ పనులు చేయడం కంటె సత్కర్మలు చేయాలనుకోవడమూ మంచిదే. ఏదైనా మంచి వలన చెడు, ఎదురైనా పెద్దలనడిగి తెలిసికొని పరిష్కారం చేస్తాం. ఇట్లా సత్కర్మలు చేయాలనే సంకల్పం, చేయుట జరిగితే మన కర్మ భారం తగ్గుతుంది. ఏ మంచి చేయకుండా క్రియారహితులుగా ఉండడం మంచిదని ఇంతకుముందు చెప్పాను, అది విని మీలో, వేదరక్షణ, రోజూ పిడికెడు బియ్యం ఇతరులకై ఉంచడం, చెఱువులు

త్రవ్వడం వంటివి నేను చెప్పినవి చేయకుండా ఉందామంటే అది సబబు కాదు. అవే కాదు, ఇంకా మంచి పనులు చేయండంటాను.

నిష్క్రియత్వం గమ్యమని చెప్పిన శంకరులు, శాస్త్రప్రకారం నడవండి, ఇతరులకు సాయం చేయండి, పంచాయతన పూజ చేయండని చెప్పారు.

కర్మః వల్ల కర్మ రహిత స్థితి

వారనేక సత్కర్మలను చేయాలని ఎందుకన్నారంటే, కర్మ రహిత స్థితిని చేరుకోవడానికే. ఎంత మంచి పనియైనా అదే అంతిమ స్థితి కాదు. కర్మ, భక్తి యోగాలు, పూజ, ధ్యానాదుల అన్నింటి లక్ష్యమూ కర్మ రహిత స్థితియే.

ఏ పని చేయకుండా ఎవ్వరూ ఉండలేరు. కనుక నీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించవద్దని, కర్మానుష్ఠానం చేయాలని, చిత్తశుద్ధిని పొందాలని, ఋజుత్వాన్ని కలిగియుండండని అందరూ అన్నారు.

ఆత్మలో మనస్సు లీనం కావాలంటే ముందు చిత్తానికి శుద్ధి ఏర్పడాలి. సామాన్యులకు కర్మానుష్ఠానం తప్ప మరొక మార్గం లేదు. ఆత్మ సాక్షాత్కారానికి ముందు సత్కర్మానుష్ఠానం చేయవలసిందే. అందువల్లనే అన్ని గ్రంథాలూ కర్మయోగాన్ని ప్రశంసించాయి. తద్వారా కర్మ రహిత స్థితి.

కర్మలో మునుగుట లక్ష్యము కర్మరహిత స్థితి

చాలా పనులు చేయవలసి వస్తే వాటిని క్రమపద్ధతిలో చేస్తాం. ఉన్నది ఒక్కటే అయినపుడు క్రమ పద్ధతి యొక్క అవసరమే ఉండదు. ఆ ఒక్కటే ఉన్న స్థితిలో రెండవవాడు లేడు, సాధనం లేదు, క్రియ లేదు.

అయితే నిత్య వ్యవహారమంతా క్రియలతో కూడింది. క్రియ లేకుండా ఎట్లా ఉండగలమని ప్రశ్నించడం కాదు. ప్రాథమిక దశలో కర్మయోగం ఉండాలని గీతలో ఉంది కదా! ఉన్నతస్థితిలో ఏ పనీ లేదనీ ఉంది. "తస్య

కార్యం నవిద్య తే" అయితే చివరి మాటను మొదటినుండీ మరిచిపోకూడదని, క్రియారహిత స్థితిని గీతలో ముందే వివరింపకపోలేదు.

లోకంలో మనం మంచి పనులు చేస్తున్నాం, తగిన లాభాన్ని పొందుతున్నాం అంటారు. అది అహంకారాన్ని సూచించడం లేదా? ఆ అహంకారాన్ని అణచడం కోసం ఏ మంచి చేసినా కొంత చెడు జరుగుతూ ఉండడాన్ని పరాశక్తి, ఏర్పాటు చేసింది. లేకపోతే చేసేవాడి అహంకారాన్ని పట్టుకోలేం. మంచి చెడులు, సాపేక్షికం. ఓటములు తటస్థిస్తున్నాయి. సాయంలో కొందరికి అపకారాలూ అందుకే జరుగుతున్నాయి.

ఇట్టి మాటలు, నిరాశావాదాన్ని కల్గించడం కోసం కాదు. చేసే కర్మలవల్ల ఇట్టి లోపాలు రావడం వల్ల కర్మ రహిత స్థితి కొంతవరకూ ఏర్పడుతుంది. లేకపోతే ద్వంద్వ ప్రపంచంలో కూరుకొని పోతాం. అపజయాలు, ఎదురౌతున్నకొద్దీ ఈశ్వరుడే నడిపిస్తున్నాడని, మనచేత అతడు సాయం చేయిస్తాడనే భావన కల్గుతుంది. జ్ఞానికి, ఏ పని లేదని చెబుతూ జనకుడు మొదలైనవారు, వారే జ్ఞానులైనా లోక సంగ్రహం కోసం మంచి పనులు చేసారని గీతలో చెప్పాడు. కర్మ, మనచేత చేయిస్తే చేద్దాం. మనం చేస్తున్నామని కాక మన చేత చేయిస్తున్నాడనే భావనతోనే చేస్తూ ఉండాలి. ఏదో సేవ చేయడం, త్యాగం అని పైపైన కనబడినా ఏదో ఒకమూల అహంకారం పొడసూపుతూనే ఉంటుంది. అది పోనంతవరకూ మోక్షమనే మాట కల్ల.

మోక్షం కోసం దిగులు పడడం లేదు, అది వస్తే రానీ, సేవ చేయడం నా వంతని అనడం కూడా అహంకార సూచకమే.

సరే నీవు మంచి చేస్తున్నావు. ఈశ్వరుడు నీకొక మనస్సు నిచ్చి మాయతో బద్ధుణ్ణి చేసాడు. అంతటితో ఆగకుండా సాధన మార్గాన్నీ ఉపదేశించాడు. కర్మబంధాల నుండి విముక్తిని పొందే మార్గాన్నీ నీకుపదేశించాడు. అట్లా ఉన్నప్పుడు నేనీ కర్మలోనే ఉండి, అనగా ఈ కారాగారంలోనే ఉండి ఇందున్నవారికి సాయం చేస్తానని అనడం ఏమిటి? అతని ఆజ్ఞను

పాటించవద్దా? నీవు చేసే పని అంతా కర్మబద్ధులకే అని గుర్తుంచుకో. కారాగారంనుండి విడుదల చేయటం నీవల్ల కాదు. అది వాని చేతిలో ఉంది. ప్రతివాడూ ప్రయత్నిస్తే అతడు తాళాలు తెరుస్తాడు. నీవు చేసేదంతా సంసారంలో కొట్టుమిట్టాడుతున్నవారికే. అందులో ఉన్నవారికి సాయం చేసి తృప్తి పొందుతానంటే, జ్ఞాన మార్గాన్ని పట్టుకోనంటే, అఖండానందం అక్కర్లేదనుకుంటే అది ఎంత మూర్ఖత్వమో ఆలోచించు. తెలియకుండానే నీలో అహంకారం గూడు కట్టుకొని యుండి సుమా!

ఆపుడీశ్వరుడేం చేస్తాడు? ఇట్లా సేవ చేసినా చిత్తశుద్ధి ఏర్పడితే చాలని అనుకుంటాడు. చేసేది నిజమైన సాయం కాకపోయినా కర్మయోగమైనా చేస్తున్నాడని ఊరుకుంటాడు. నా సృష్టి గురించి నేను చూసుకుంటాను. నన్నొక సాధనంగా వాడుకొని నిన్ను బాగు చేయడానికి ఉపయోగిస్తా. ఇతరులకు సాయం, నీవల్లనే జరగదులే అని భావిస్తాడు.

ఈశ్వరునికి లేని బాధ నీకెందుకు? అతడు నీకిచ్చిన మనస్సును శుభ్ర పరచలేకపోతున్నావు. ఎవరికో సాయం చేద్దామని అనుకుంటున్నావు. చిత్తం అటూ ఇటూ తిరకుండా మంచి కర్మలను చేయవలసిందే. ఆత్మవిచారానికి అనువుగా నున్నపుడు కూడా నేను కర్మనే చేస్తాను, లోకాన్ని ఉద్ధరిస్తానని అనడం ఏమిటి? ఏదో జరిగిపోయిందని ఊహించుకుంటున్నావు.

స్వార్థంతో ఉండడం కాదు

నీవొక జీవుడవనుకొని, డబ్బు, అధికారం, మొదలైనవి సంపాదించడం స్వార్థ పరత్వం. వీటిని ఇతరులకు త్యాగం చేయవలసి వస్తుంది. ఇక కేవలం ఆత్మగా భావిస్తే, క్రియారహితుడవైతే స్వార్థమూ లేదు, ఇతరులకు సాయం చేయడం అంటూ ఉండదు. కేవలం నేను అనేది పోతే ఇక స్వార్థం ఎక్కడ? శాశ్వత సత్య స్థితిలో ఈ నేను పోయినపుడు ఇతరులకొరకై చేస్తున్నాననడం అసందర్భం.

అట్టి క్రియారహిత స్థితి చేరుకోనంత వరకూ కార్యక్రమాలు చేయవలసిందే. ఆ పై స్థితి, ఎందుకు పట్టుబడడం లేదు? ఎన్నో కర్మఫలాలు వెంటబడుతూ ఉండడంవల్ల దీనిని తెలిసికోలేకపోతున్నాం. దుష్టకర్మ ఫలాలనుండి తప్పించుకోవడం కోసం శాస్త్ర కర్మలు చేయాలి, ఇతరులకు సాయమూ చేయాలి. ఆ అడ్డు వచ్చే తెర, అట్లాగే ఉండుగాక, నేను చీకట్లో ఉంటానంటే అది తెలివైన పనికాదు. ఈశ్వరుని సంతోషపెట్టడమూ కాదు. **"ఉద్ధరేత్ ఆత్మనాత్మానం"** = నిన్ను నీవు ఉద్ధరించుకోవాలి, నిన్ను నీవు విడుదల చేసుకోవాలి. **"న ఆత్మానం అవసాదయేత్"** = నిన్ను నీవు తగ్గించుకోవద్దు. జ్ఞానమార్గంలో అడుగు బెట్టనని కర్మలోనే మునిగిపోతానని పట్టుబట్టకు. **"ఆత్మా ఏవహి ఆత్మని బంధుః"** = నిన్ను నేను విడిపించుకోగలిగితే ఆత్మయే నీ దగ్గర బంధువు **"ఆత్మా ఏవరిపు రాత్మనః"** = నేను ప్రయత్నం చేయనని బిగుసుకునిపోతే నీవే నీకు శత్రువౌతావు, అని భగవానుని మాటలు నా ఆత్మకు ఏదైనా కానీ, నేను ప్రపంచానికి మంచి చేస్తానని భీష్మించుకొంటున్నావు. ఆ మంచి ఫలాలు నీ చేతిలో లేవు, పైవాడి చేతిలో ఉన్నాయని మరిచిపోతున్నావు. నీవనుకున్నవి జరగకపోవచ్చు కూడా.

మోక్ష సుఖం కూడా అక్కర్లేదు, ప్రాణులకు సాయం చేస్తామనేవారి మాటలు, మనం ప్రాథమిక దశలో ఇతరులకు సాయం చేయాలని బోధించడానికే, కేవలం స్వార్థంతో ఉండకూడదని హెచ్చరించడానికే. పైవారు మోక్ష సుఖాన్ని కూడా త్యజిస్తున్నారంటే మనము కేవల స్వార్థపూరితమైన పనులను విడిచిపెట్టాలని బోధించడానికే.

ఈ పెద్దలు కూడా ఒక దశలో ఏమిటి ఇదంతా? ఈ మాయేమిటి? అన్నవారే. మనము కూడా స్వార్థ పూరితమైన కర్మలనే తెరను క్రమక్రమంగా తొలగించుకోవాలి. అంతేనే కాని నేనీ సేవ చేస్తున్నానని, చేస్తానని బిగుసుకొని పోయి యుండడం చీకట్లో తచ్చాడడమే.

తనకు జ్ఞానరేఖలు పొడసూపుతూ ఉంటే కోట్ల కొలది కర్మఫలాలు అనుభవించే ప్రాణులకు నేను చేసే సాయం ఏపాటిది? నా సాయం లేకపోతే ఇతరులుద్ధరింపబడేది ఎలా? అనే అహంకారం రానీయకూడదు. ఈశ్వరలీల కొనసాగుతూనే ఉంటుంది. నిమిత్తమాత్రుడవని భావించాలి. ఇట్టి భావాలనూ తొలగించి ధ్యానంలో ఉండి ఆత్మ విచారణ చేయాలి.

పని చేయకపోయినా ప్రపంచానికి మంచి చేసినట్లే

నిష్క్రియంగా ఉన్న జ్ఞానివల్ల, ఏ ఉపయోగం లేదని భావించకండి. అట్టి జ్ఞానుల సన్నిధిలో శాంతి మనకు లభిస్తుంది. శుకుడు, జడభరతుడు, సదాశివ బ్రహ్మేంద్రయోగి వంటి వారి మాటలను విన్నా శాంతి లభించడం లేదా?

అట్టివారిని సమీపిస్తే ప్రాపంచిక సమస్యలూ తీరుతాయి. ఆ సమస్యలను తీరుస్తున్నామని వారనుకోరు. ఇట్టి విషయాన్ని అవగతం చేయడానికే దక్షిణామూర్తి అవతరించాడు. ఇంతవరకూ ఇట్లా ఉన్నా ఇట్టి స్థితియొక్క గొప్పస్థితిని తెలియపర్చడంకోసం అవతరిస్తానని శంకరులుగా అవతరించాడు. నిష్క్రియంగా ఉండండని మనం నిరంతరం మాట్లాడుతున్నాం, ప్రచారం చేస్తున్నాం చూసారా (అని స్వామి నవ్వుకున్నారు)

శంభువే శంకరుడు

"అజ్ఞానాం తర్గహన పతితం ఆత్మవిద్యోపదేశైః
త్రాతుంలోకాన్ భవదావశిఖాతాప పాపచ్యమానాన్
ముక్త్వామౌనం వటవిటపినో మూలతో నిష్పతంతీ
శంభోర్మూర్తిశ్చరతి భువనే శంకరాచార్య రూపా"

- మాధవ శంకర విజయం (4-60)

శంభువు, ప్రపంచంలో సంచరిస్తున్నాడని వర్తమానం కాలంలో చెప్పబడింది. గమనించండి.

స్వామి శంభువు. అమ్మవారు శాంభవి. శాంభవీ దీక్ష అనే మాటను విన్నారు కదా. శం అనగా శాశ్వత సుఖం. రెండు రకాల శుభాలున్నాయి. ఒకటి శం. రెండవది 'మయస్'. రుద్రంలో "మయోభూః", "శంభు" అనే పదాలున్నాయి. ఒకటి మామూలు సుఖమని, రెండవది శాశ్వత సుఖమని వ్యాఖ్యానకర్తలు వ్రాసేరు.

శంభువనగా శాశ్వత సుఖం పుట్టినచోటు. అనగా మోక్ష సుఖం లభించేచోటు. అందువల్ల శంభువు.

దక్షిణామూర్తి మఱ్ఱి చెట్టు క్రింద ఆసీనుడై యుంటాడు. ఎందుకు? ఒకడు మాట్లాడుతూ ఉంటే వినేవాడుండాలి కదా! తనకంటె వేరొకడు లేదని అనినపుడు బ్రహ్మజ్ఞానిగా నున్నప్పుడు మాట్లాడడమేమిటి? అందువల్ల మౌనం. మాట్లాడాలంటే మనస్సుండాలి కదా. మాయవల్ల ఏర్పడిన మనస్సే అతనికి లేదు. అది లేనపుడు మాటేమిటి? అఖండ మౌనంలో ఉండిపోతాడు.

అన్ని నదులకూ ఒక మూలం ఉంటుంది. అది ఒక సన్నని త్రోవలా ఉంటుంది. అక్కడ నీరు నిలవగా ఉంటుంది. గంగోత్రికి ఉత్తరాన అట్లా ఉంటుంది. గంగ, ఆవు ముఖంలా ఉండే గోముఖి అనే రాతి తొర్రలో నుండి ప్రవహిస్తుంది. కావేరీ నది కూడా మూలమైన తలకావేరీలో సహ్యాద్రి కనుమలలోని కొడగులో అట్లాగే ఉంటుంది.

ఆ సన్నని త్రోవనుండి నీరు ప్రవహిస్తే ప్రజలకు లాభం లేదు. కానీ రొద చేసుకుంటూ పోతున్న నదీ ప్రవాహం ప్రజల అవసరాలు తీరుస్తుంది. దక్షిణామూర్తి కూడా శబ్దం చేయని సన్నని త్రోవలోని నీరులాగా ఉంటాడు. నదీ మూలాన్ని కొందరే గుర్తిస్తున్నట్లుగా సనకాదులే అతణ్ణి సమీపించగలరు. మామూలు జనులు సమీపించలేరు.

2500 సంవత్సరాల వెనుక ఉన్నవారు, అట్టివారి ఉపదేశాలు వినక, గురూపదేశాలు వింటున్న కాలమది. వారు అజ్ఞానమనే అరణ్యంలో చిక్కుకొన్నారని శ్లోకంలోని 'అజ్ఞానంతర్గహన పతితం' మాటకు తాత్పర్యం.

అంతేకాదు, ఆ అరణ్యంలో దావాగ్ని కూడా ఉంది. ఇక చెప్పేదేముంది? అజ్ఞానమనే అరణ్యంలో చిక్కుకున్నారు, సంసారమనే దావాగ్ని మధ్యలో ఉన్నారు. అందుకే 'భవదావశిఖాతాప పాపచ్యమానాన్' అక్కడ జ్ఞాన తీర్థంలో, దక్షిణామూర్తి సేద తీరుతున్నాడు. ఈ దావాగ్ని చల్లారాలంటే ఆ నీరు విడుదల కావాలి కదా!

భగీరథుడు, గంగను తీసుకొని వచ్చినట్లు ఆ గంగను ఎవరైనా తీసుకుని రాగలరా? ఇప్పుడు తనంతట తానే రావాలి. దయయే కారణం కావాలి. అందుకే లోకాలను విడిచాడు. 'ముక్త్వామౌనం'. ఆ చిన్ని గుంట నదిలా మారింది. అది జ్ఞాన గంగగా మారింది.

శంభువు శంకరుడయ్యాడు, శాశ్వత సుఖాన్నిచ్చేవాడయ్యాడు. కదలనివాడు, కదిలే శంకరుడయ్యాడు. దక్షిణామూర్తి, మూలవిరాట్టయితే శంకరులు, ఉత్సవమూర్తిగా అయ్యారన్నమాట. ఎప్పుడో కదిలాడని కాదు. కదులుతూ ఉన్నాడని 'చరతి' అని వాడబడింది. ఎప్పుడో శంకరులుగా అవతరించిన వారిప్పటికీ వర్తమాన కాలంలో కూడా చరిస్తున్నారని చెప్పబడింది,

దక్షిణామూర్తి అనుగ్రహంతో అట్టివారు చరిస్తూ ఉంటారు. రామకృష్ణ అవతారాలు గడిచినా భక్తులను నేటికీ వారు అనుగ్రహించడం లేదా? ఎట్లా? అనుగ్రహం అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉంటుంది. భక్తి పెంపొందినకొలదీ అనుగ్రహం, మానవ రూపాన్నెత్తుతుంది. కనుక శంకరులు అనుగ్రహ శక్తితో నేటికీ ఉన్నారు.

శంభువనగా, సుఖమీయన వలన కలుగునని అర్థం. సుఖ రూపియై యుండువాడు. ఆయన ఉత్పత్తి చేస్తాడు. పంపిణీదారుడు కాదు. దానికి తగ్గ ప్రతినిధులుంటారు. మిల్లుల్లో తయారైన వస్తువులు, వాటికి పంపిణీదారులు

వివిధ ప్రదేశాల్లో లేకపోతే తయారైన చోటే అవి నిలవ యుండిపోతాయి. కనుక శంభువు, శంకరుడు కావాలి. అనగా ఈ పదానికి సుఖమును చేస్తాడని. ఆయన నానా ప్రదేశాలు తిరగాలి. గంగ, గంగోత్రిలో పుట్టి నానా ప్రదేశాలు తిరిగి చివరకు ఇంట్లోని గొట్టాల ద్వారా మన దగ్గరకు వస్తోంది. అట్లా జ్ఞానాన్ని శంకరులందించారు. దక్షిణామూర్తిని సమీపించలేము, అతడే ప్రజల దగ్గరకు శంకరులుగా వచ్చాడు.

అవతార విషయమై ఆధారాలు

శంకర విజయంలో శంకరుడే, శంకరాచార్యులుగా అవతరించినట్లుంది. ఆ వ్రాసినవారు శంకర భక్తులై అట్లా వ్రాసియుండవచ్చు అని శంకిస్తారు. దానికంటే ఇతరమైన ఆధారాలను చూపిద్దాం.

వేదం కంటె మించిన ప్రమాణ గ్రంథం లేదు కదా! అయితే అక్కడ పరోక్షంగా ఆధారం చూపబడింది. ఇది యజుర్వేదంలోని నమక మంత్రాలలో ఉంది. అట్లే ఋగ్వేదంలోనూ ఆధారముంది. వాటికంటె ముందుగా, 18వ శతాబ్దంలో 95 సంవత్సరాలు జీవించిన భాస్కర రాయల మాటలను చెబుతాను. ఆయన పేరునకు తగ్గట్లు విద్వత్ సూర్యుడే. మంత్ర శాస్త్ర రహస్యాలను లోకానికి అందించినవాడు. దేవీ భక్తుడు. లలితా సహస్రనామంపై ఆయన వ్రాసిన వ్యాఖ్య ప్రసిద్ధమైనది. వారే శంకరులను నుతిస్తూ శ్లోకాలు వ్రాసేరు. ఋగ్వేదంలో పరోక్షంగా శంకరుల గురించి యుందని వ్రాసేరు:

"శ్రీరామం ప్రతి పుష్కరాభిధ మహాయక్షేన వేదత్రయీ
వ్యాకరణావసరే విశిష్య కథితం, శ్రీ విష్ణు ధర్మోత్తరే
ఏతాం ధేనుముపాహ్వయామి సుదుఘాం ఇత్యృఙ్ఞథం శంకరా
చార్యం శిష్య చతుష్టయేన సహితం వందే గురుణాం గురుం"

ఇందు గురువులకు గురువని యుంది. శ్లోకారంభంలో శ్రీరామం ఉంది. శంకరులకు రామునకు ఏమి సంబంధం?

రామాయణంతోనే రామచరిత్ర, పూర్తికాదు. అందు చెప్పనవి మిగిలిన గ్రంథాలలో ఉన్నాయి. అందులో ఒకటి యోగవాసిష్ఠం లేదా జ్ఞాన వాసిష్ఠం. రెండవది విష్ణుధర్మోత్తర పురాణం. వసిష్ఠుని నుండి అద్వైత జ్ఞానాన్ని రాముడు పొందాడు. అది విష్ణుపురాణానికి అనుబంధం. పుష్కరుడనే యక్షుడు రామునకట్టి ఉపదేశం ఇచ్చాడు. అందుకే శ్లోకంలో 'పుష్కరాభిధ మహాయక్షేన' అని ఉంది. రాముడే ఉపదేశం పొందాడంటే ఇచ్చిన వాడు పెద్దవాడై యుండాలి కదా. అందుకే మహాయక్షుడు వేదసారాన్ని అందించాడు. ఇక వేదమంత్రం గురించి:

"ఏతాం ధేనుం ఉపహ్వయామి సుదుఘాం" (ఋగ్వేదం ప్రథమ మండలం - 164 సూక్తం, 26వ మంత్రం) ఆవు తనే పాలనిచ్చి దూడను సాకుతున్నట్లు ఈశ్వరుడట్లా ప్రజలను పాలిస్తున్నాడని ఈ వేదమంత్రానికి అర్థం. విష్ణు ధర్మోత్తరంలో ఈ మంత్రానికి పరోక్షంగా అర్థం చెప్పబడినదని పుష్కరుడు రామునితో అన్నాడు. అద్వైతతత్త్వం మరిచిపోయిన కాలంలో ఆవు దూడకు పాలునిచ్చునట్లుగా పరమేశ్వరుడు శంకరాచార్య స్వామిగా వచ్చి జ్ఞానాన్ని అందిస్తాడని అంతేకాదు, నల్గురు శిష్యులతో అవతరిస్తాడని భాస్కరాచార్యుల వారు వ్రాసేరు.

ఇక యజుర్వేదంలో - వేదాలకు త్రయియని పేరు. ఋక్, యజుస్, సామములు. అందు మధ్య యజుర్వేదం. ఆలయం మధ్యలో గర్భగృహం ఉన్నట్లు కర్మకాండలకు అది ప్రాధాన్యం. *(బొమ్మ గీయడానికి గోడ ఆధారమైనట్లుగా కర్మకాండల కిది ఆధారమనే ప్రమాణం కూడా ఉంది-అనువక్త)*

యజుర్వేదం 7 కాండలతో ఉంటుంది. అందు మధ్యలో రుద్రమంత్రాలుంటాయి. ఆ రుద్రం మధ్యలో శివ పంచాక్షరి మంత్రం. ఆ మంత్రానికి ముందుగా శంభు, శంకర పదాలున్నాయి. పంచాక్షరిలో శివనామం. ఆ పై రెండు పదాలూ ఈ మంత్రాన్ని నడిపిస్తున్నాయి. ఆచార్యుని నుండి పంచాక్షరిని ఉపదేశం పొందాలి. ఆచార్యుడే మన శంకరులు. ముందు శంభువై, తరువాత

శంకరుడయ్యాడని చెప్పాను. రుద్రంలో శంభవే... శంకరాయ... పదాల తరువాత పంచాక్షరి ఉంది. శంభువు, శంకరులయ్యాడు.

రుద్రానికి, అభినవ శంకరులు వ్యాఖ్యానం వ్రాస్తూ మన శంకరుల ప్రస్తావన అందున్నట్లు వ్రాసేరు. చరాచర వస్తు ప్రపంచం అంతా శివమయమని రుద్రంలోని మంత్రాలుంటాయి. ఇందు మూడు వందల మంత్రాలుండడం వల్ల నామావళిగా, రుద్ర త్రిశతిగా రూపొందింది.

ఇందు రుద్రునకు అసాధారణ నామాలూ ఉన్నాయి. సాధారణ నామాలు బహువచనంలో వాడబడ్డాయి. అసాధారణ నామాలు, ఏకవచనంలో ఉన్నాయి. ఉదాహరణకు కూర్చున్నవారికి, నిలబడినవారికి నమస్కారాలంటూ అసాధారణ నామాలైన కపర్ది, వ్యుప్తకేశ పదాలు వాడబడ్డాయి. కపర్ది యనగా జడలు కలిగినవాడు. వ్యుప్తకేశుడనగా తలగొరుగుకొన్నవాడు, ముండి.

కపర్దమనగా జట. జటలున్న ప్రతివానినీ కపర్దియని అనం. పరమేశ్వరుని జటకే కపర్దమని అంటాం. మిగిలిన దేవతల నెత్తిపై కిరీటాలను ధరిస్తారు. కాని శివుడు యోగియై నెత్తిపై జటలతోనే ఉంటాడు.

దీని తరువాత వ్యుప్తకేశ పదముంది. ఈ పదం, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, జాలరి వంటి కులాల పదాల మధ్యలో రాదు. ఈ రెండు పదాలు విడిగా చెప్పబడ్డాయని, ఏక వచనాంతములని అన్నాను. వ్యుప్తకేశునిగా అనగా సన్యాసిగా ఉంటాడు. 24 శివమూర్తులలో తలగొరుగుకొన్న మూర్తి కనబడదు. అన్ని మూర్తులు జటాధారులై యుంటాయి. అతడే అవతారంలో అట్లా ఉన్నాడంటే కేవలం శంకరాచార్యులు అవతారంలోనే. అట్లా అభినవ శంకరులు వ్యాఖ్యానించారు.

ఆ ఆధారం ఒక్కటీ సరిపోతుందా? పురాణాల ఆధారాలను చూపిస్తాను. ఇతిహాస పురాణ జ్ఞానం లేకుండా వేద మంత్రాలు అర్థం కావు. అన్నిటినీ కలిపి చదివిన వానిని బహుశ్రుతుడని అంటారు. వీటిని జోడించం కూడా వేదానికి అర్థం చెబితే వేదం, భయపడుతుందనే శ్లోకం ఉంది.

"ఇతిహాసపురాణాభ్యాం వేదం సముప బృంహయేత్

బిభేతి అల్ప శ్రుతాత్ వేదో మా మయం ప్రతరిష్యతి"

ఏమిటా భయం? ఇష్టం వచ్చినట్లు మా మంత్రాలకు అర్థం చెబుతున్నాడని వేదం భయపడుతుందట. కనుక వ్యాఖ్యానకర్త వ్యుప్తకేశుడెవరని పురాణాలను శోధించాడు. తాను చెప్పే మాటలకు పురాణాధారం చూపించాలి కదా!

శివ రహస్యం అనే గ్రంథంలో వ్యుప్తకేశుడనగా శంకరులనే ఉంది. ఇక శ్రుతిలో ఉన్నదానిని విష్ణు ధర్మోత్తర పురాణం బలపరిచిందని తెలుస్తోంది.

శివుని ఇతిహాసం చెప్పేది శివరహస్యం. ఇది 50 వేల శ్లోకాలతో ఉంటుంది. దీనిని నిర్ణయ సింధువు వంటి ధర్మశాస్త్ర నిబంధన గ్రంథము ప్రామాణికమని పేర్కొంది. సుబ్రహ్మణ్యుడు, జైగీషవ్యునకుడనే ఋషికి ఉపదేశమిస్తే అతడు నైమిశారణ్యంలోని ఋషులకు అందించాడు. అట్లా లోకంలో ప్రచారమైంది. దీనిని జైగీషవ్యుడు సంకలనం చేసాడు. పరమేశ్వరుడు, అమ్మ వారికి చెప్పగా నేను నీకు చెబుతున్నానని సుబ్రహ్మణ్యుడే అన్నాడు.

ఇది 12 అధ్యాయాలతో ఉంటుంది. అంతా శివుని గురించే. తొమ్మిదవ భాగంలో శివభక్తులగురించి ఉంటుంది. 63 నాయనార్ల చరిత్ర ఉంటుంది. మారికూవరం దగ్గర కంజనూర్‌లో ఒక వైష్ణవుడుండేవాడు. అతడు శైవుడై అతిహరదత్త శివాచార్యుడయ్యాడు. అతని కథ కూడా అందే ఉంది. మన శంకరుల చరిత్ర కూడా ఉంది. రాబోయే కథలను జ్ఞాన దృష్టితో పరికించి చెప్పబడిన కథలవి.

అద్వైతియైన శంకరుల గురించే కాకుండా భక్తుడైన శంకరుల గురించే యుంటుంది. వారు శివుడు, విష్ణువు, అమ్మవారు, సుబ్రహ్మణ్యుడు మొదలైన దేవతలపై అనేక స్తోత్రాలు చేసారు. కనుక వారు జ్ఞానులు, భక్తులూ కూడా.

అమ్మవారి గురించి సౌందర్యలహరియే వ్రాసారు. శ్రీ యంత్రాన్ని అనేక ఆలయాలలో ప్రతిష్ఠించారు. విష్ణు సహస్రనామాలకు భాష్యం వ్రాసారు.

వారి మఠాలలో కొలిచేది, చంద్రమౌళీశ్వరుడినే. శివానందలహరిని శివునిపై వ్రాసేరు. అందువల్ల శివ భక్తునిగా శివరహస్యం పేర్కొంది.

కాలడిలో పుట్టుక దగ్గరనుండి కంచిలో ముక్తి పొందేవరకూ వీరి చరిత్ర అందులో ఉంది. పరమేశ్వరుడు పంచ స్ఫటిక లింగాలిచ్చినట్లు కూడా ఉంది. అద్వైత ప్రతిష్ఠాపనం గురించి ఇది స్పృశించదు.

శివసాయుజ్యం పొందిన వారి భక్తి గురించే యుంటుంది. భక్తిని, జ్ఞానానికి అంగంగా శంకరులు భావించారు. కేవలం భక్తికే పట్టం గట్టలేదు. అయినా నాయనార్ల సరసన వీరి చరిత్ర ఉండడం వల్ల దీని ప్రామాణ్యాన్ని పేర్కొంటున్నాం. ఆపైన వీరిని ఈశ్వరావతారంగా భావించింది.

తొమ్మిదవ భాగంలో పదునొకండవ అధ్యాయంలో ఒక ఉత్తమ బ్రాహ్మణుడు నా అంశతో చచలగ్రామంలో (కాలడిలో) పుట్టబోతున్నాడని శంకరుడు, అమ్మవారితో చెప్పినట్లుంది.

"కేరళే చలచల గ్రామే, విప్రపత్న్యాం మదంశజః

భవిష్యతి మహాదేవి శంకరాఖ్యో ద్విజోత్తమః"

ఇక కూర్మ పురాణంలో శంకరావతారం:

"కరిష్యత్యవతారం స్వం శంకరో నీలలోహితః

శ్రౌత స్మార్త ప్రతిష్ఠార్థం భూతానాం హితకామ్యయా"

అనగా లోకహితం కోసం నీలలోహితుడు (శివుడు) పుట్టబోతున్నాడని అర్థం. శివుణ్ణి ఎఱ్ఱవానిగా, తెల్లనివానిగా వర్ణనలున్నాయి. వేదాలలో రాగి, అరుణ, నీలలోహిత వర్ణాలతో నున్నట్లుంటుంది. ఎర్రని శివుడు, నీలమైన అమ్మవారిని ఎడమవైపు ధరించి యుంటాడు. హరి హరమూర్తిగా నున్నపుడు నీలలోహితుడు. కృష్ణ పింగలం అని కీర్తించినపుడు ఆయన ఎరుపు, విష్ణువు (కృష్ణ) నలుపు. పింగలుడనగా ఎర్రని శివుడు.

శ్రౌత స్మార్త కర్మల ప్రతిష్ఠాపనకై పుడతాడని అన్నాడు. ఇక లింగ పురాణంలో, కలిలో వేదవిద్యలడుగంటుతాయని, వాటిని నిందిస్తారని, రుద్రుడు శంకరులై పుట్టి కలి దోషాన్ని పోగొడతాడని యుంది:

"కలౌ రుద్రో మహాదేవః శంకరో నీలలోహితః"

ఇక భవిష్యోత్తర పురాణంలో కలి ప్రారంభమై రెండువేల సంవత్సరాలు గడిచిన తరువాత శంకరులు, శిష్యులతో అవతరిస్తారని చెప్పబడింది:

"కల్యాదౌ ద్వినహస్రాంతే లోకానుగ్రహకామ్యయా

చతుర్భిః శిష్యైస్తు శంకరోవతరిష్యతి"

ఈ రెండవ పంక్తి వాయు పురాణంలోనూ ఉంది. దీనిని వ్యాఖ్యాన కర్తయైన అభినవ శంకరుడు గ్రహించాడు.

ఇక బ్రహ్మాండ పురాణంలో మార్కండేయ సంహితలో 72వ కాండలోని 7,8 స్పందాలలో శంకరుల చరిత్ర చెప్పబడింది. దేవతలు మొరపెట్టగా చార్వాకాది మతాల నిర్మూలనకు ఈశ్వరుడు శివగురుని భార్యా గర్భంలో అవతరిస్తాడని చెప్పబడింది:

లోకానుగ్రహతత్పరః పరశివః సంప్రార్థితో బ్రహ్మణా

చార్వాకాది మత ప్రభేదనిపుణాం బుద్ధిం సదా ధారయన్

కాలట్యాఖ్య పురోత్తమే శివగురుర్ విద్యాధినాథశ్చయః

తత్పత్న్యాం శివావతారకాంశముదితః శ్రీ శంకరాఖ్యం వహన్"

సూర్యునకే సవితయని పేరు. సౌర పురాణం సూర్యుని గురించి చెబుతుంది. ఆ సవిత, శంకరునిగా అవతరిస్తాడని, వ్యాస సూత్రాలకు సరియైన అర్థం వివరిస్తాడని, వేదసత్యాన్ని తత్త్వ రూపంలో అందిస్తాడని చెప్పింది:

"వ్యాకుర్వన్ వ్యాస సూత్రార్థం శ్రుతేరర్థం యథోచివాన్

శ్రుతేర్న్యాయ్యస్స ఏవార్థః శంకరః సవితాననః"

సూర్యమూర్తే ఇందు శంకరులుగా అవతరించినట్లుంది. సూర్యుడు చీకటిని పోగొడతాడు. జ్ఞాన సూర్యులైన శంకరులు, అజ్ఞానమనే చీకటిని పోగొడుతున్నారు. విద్వాంసులకు జ్ఞాన భాస్కరులని అంటున్నాం. శంకరుని శిష్యులలో ఇద్దరు, శంకరులను సూర్యునిగానే నుతించారు.

తోటకుడనే శిష్యుడు వీరినుద్దేశించి అహిమాంశురివాత్ర విభాసి అన్నాడు. హిమాంశువనగా చంద్రుడు. అహిమాంశువనగా సూర్యుడు. అతడే మంచును కరుగునట్లు చేస్తున్నాడు.

వీరి శిష్యులలో సురేశ్వరాచార్యులు, తన బృహదారణ్యక వార్తికంలో వీరిని జ్ఞాన సూర్యునితో పోల్చారు. అజ్ఞానమనే చీకటిని పోగొడుతున్నారని కీర్తించాడు.

శంకర విజయంలోనే గాక ఋగ్వేదం, శివరహస్యం, మార్కండేయ సంహిత, విష్ణు ధర్మోత్తర, వాయు, కూర్మ, లింగ, భవిష్యోత్తర, సౌర పురాణాల్లో శంకరులు ఇట్లా అవతార మూర్తిగా ప్రశంసింపబడ్డారు.

ఎవరైనా స్తోత్రాలు వ్రాయవచ్చు, తత్వాన్ని ప్రతిపాదించవచ్చు. కాని ఆ వ్యక్తి యొక్క సంపూర్ణ వ్యక్తిత్వం, నడవడి దగ్గరనున్న శిష్యులకో, సేవకులకో బాగా తెలుస్తుంది. అందుకే ఆంగ్లంలో 'No man is hero to his Valet' అనే మాట పుట్టింది. అందుకే శిష్యుల మాటలను పేర్కొన్నాను.

హస్తామలకుడు, హస్తామలక స్తోత్రంలో ప్రాణులు లేరు, దేహాదులు లేవు, ఉన్నది ఒక్కటే, ఆత్మస్వరూపమని చాటాడు. కనుక ఆచార్య స్వరూపమని, అవతార స్వరూపమని విడిగా ఉంటాయా? ఇక మిగిలిన ముగ్గురు శిష్యులు వీరిని పరమేశ్వరునిగానే భావించారు. జ్ఞాన సూర్యుడని అన్నారు.

తోటకుడు, అష్టకం చివరలో "భవశంకర దేశికమే శరణం" అన్నాడు. శంకరులను, శంకరునిగా చూస్తున్నానని అన్నాడు. ఈశ్వర నామాలలో భవుడని ఒక నామం. 'భవ'ను క్రియగా భావిస్తే అగుగాక అని అర్థం.

'భవ ఏవ భవాన్' అన్నాడు. భవాన్ అనగా నీవు భవుడవే, నీవు శివుడవే, శివుడే భవుడని అర్థం.

"భవ ఏవ భవాన్ ఇతిమే నితరాం

సమజాయత చేతసి కౌతుకతా"

శంకరులనొక మానవ మాత్రునిగా, గురువుగా మాత్రమే భావించకుండా పరమేశ్వరుడే అని నోరారా కీర్తించాడు. పూర్తిగా సంతోషంతో ఉన్నట్లు 'నితరాం... కౌతుకతా' అన్నాడు. తరువాత 'గురుపుంగవ పుంగవకేతన' అని సంబోధించాడు.

పుంగవ కేతనుడు అనగా వృషభాన్ని జెండాగా ధరించినవాడు శంకరుడే కదా. ఇక్కడ అవతార ప్రస్తావన వస్తుంది.

ముందుగా పట్టిజడుడైన తోటకుడు, శంకరుల అనుగ్రహం వల్ల భావావేశంతో వ్రాసాడు. అట్టి భావావేశం, సురేశ్వరాచార్యునకుండదు. ఎందుకంటే ఆయన శంకరుల శిష్యుడవక ముందు కర్మమీమాంసకుడు, యాగాలు, యజ్ఞాలు చేసినవాడు. శంకరులతో ఆయనకు వాద ప్రతివాదాలు జరిగాయి.

ముందతడు శంకరుల దివ్య తేజస్సునకు ఆకర్షితుడు కాలేదు. అతడెప్పుడూ కర్మానుష్ఠానంలో ఉండేవాడు కనుక భావావేశానికి లోనయే పరిస్థితే లేదు. అట్టివారు తత్త్వాన్ని అంగీకరించిన తరువాత నమ్ముతారు. అందువల్లనే నిష్క్రియను బోధించే నైష్కర్మ్య సిద్ధి అనే గ్రంథాన్ని తరువాత వ్రాసేడు. తైత్తిరీయ ఉపనిషత్తుకు వార్తికం వ్రాసే సందర్భంలో పరమశివుని అవతారంగానే శంకరులను కీర్తించాడు.

"ముముక్షు సార్థవాహస్య, భవనామభృతో యతే" అన్నాడు.

ముముక్షువులలో ముఖ్యుడని, యతియని, భవుడని అన్నాడు. సార్థవాహుడు వర్తకులలో ముఖ్యుడు. ఆ వర్తకుల గుంపుకు దారి చూపిస్తాడు. అందువల్ల ముముక్షువులనే గుంపునకు దారి చూపించు సార్థవాహులు శంకరులు. సంసార సముద్రాన్ని దాటించువారు.

ఇక పద్మపాదుడు, వీరిని "భాష్యవిత్తకగురుః" అన్నాడు. వారు వ్రాసిన భాష్యాలే వారి విత్తమని అర్థం. శంకరుల బ్రహ్మ సూత్ర భాష్యంపై పంచపాదిక వ్రాస్తూ ఇట్లా అన్నాడు. అనగా జ్ఞానమే ద్రవ్యంగా కలవారని.

పద్మపాదుని వృత్తాంతాన్ని బట్టి అతనికి పాండిత్యమూ ఉంది. వీరిపట్ల అపారమైన భక్తి కూడా ఉంది. తోటకుడు, భక్తునిగానే కన్పిస్తాడు. హస్తామలకుడు, జ్ఞానంలో లీనమైనవాడే.

పద్మపాదుడు వీరిపై చమత్కారంగా ఒక శ్లోకం వ్రాసేడు. అసలు శివుడొక విధంగా శంకరులొక విధంగా ఉంటారని అన్నాడు. శంకరుల కాలంలో అసలు శివుణ్ణి, ఆదిశంకరుడని, వీరిని అవతార శంకరులని కీర్తించేవారు. శంకరాచార్య పరంపరలో శంకరులనే ఆది శంకరులని అంటున్నాం. ఇతడు వీరిని అపూర్వ శంకరుడని అన్నాడు. అనగా శంకరుని కంటె భిన్నులు, విశిష్టులనే అర్థంలో. శ్లేషతో కూడిన ఈ శ్లోకాన్ని చూడండి:

"నమామ్య భోగి పరివార సంపదం

నిరస్త భూతిం అనుమార్థ విగ్రహం

అనుగ్రహం ఉన్మదితకాల లాంఛనం

వినా వినాయకం అపూర్వ శంకరం"

ఇందిద్దరికీ భేదాలు చూపించబడ్డాయి. అవతార శంకరులు ఆరువేల మంది సన్యాస శిష్యులతో కూడి ఉండేవారట. "సర్వజ్ఞం బ్రహ్మసంస్థం మునిగణ సహితం" అని సురేశ్వరుడు వీరిని పేర్కొన్నాడు. శ్లోకంలో "భోగి పరివార సంపదం" అంటే భోగాలు లేని శిష్యులు కలవారని. ఇక కైలాస శంకరుడు, భోగి పరివార సంపద కలవాడు. ఎలాగంటే శంకరుని చుట్టూ పాములే. కంఠం చుట్టూ పూలదండలలాగా పాములుంటాయి. పడగ గలిగిన పామును భోగి అంటాం. అందు నవరత్నాలుంటాయి. ఆచార్యుడు శంకరుని నుతిస్తూ కన్నులే చెవులుగా గలిగిన పాములను ధరించినవాడని కీర్తించారు.

"రూక్షా సాక్షు శ్రుతి గణఫణా రత్నౌఘ భాభీక్ష్ణ శోభం

స్ఫటిక మతిశిలా మండలాభం"

అనగా పడగలు గల పాములే ఆభరణాలుగా కలవాడు. భోగమనగా పడగ. కనుక శంకరుడు 'భోగి పరివార సంపద కలవాడు. శంకరులు అభోగి పరివార సంపద కలవారు.'

'నిరస్తభూతి'యనగా, సంపదను త్రోసివేసిన వారు శంకరులు. కైలాస శంకరుడు, విభూతిని పులుముకొన్నవాడు. భూతి యనినా, విభూతియన్నా ఒక్కటే. ఆయన అష్ట సిద్ధులు కలవాడే. ఆయన విభూతిని పూసుకొన్నా అష్టసిద్ధులు కలవాడే. అనగా విభూతులు కలవాడే. శంకరులు నిరస్త విభూతుడు. ఇక్కడ భూతియనగా మామూలు సంపద.

శంకరుడు తన శరీరంలో అమ్మవారిని ధరించాడు. ఉమార్ధ విగ్రహుడు. సన్న్యాసులకు భార్య ఉండదు కనుక వీరు అనుమార్ధ విగ్రహులు.

శంకరులు, 'అనుగ్రం' – ఉగ్ర స్వభావం లేని వారు. అనగా సౌమ్యమూర్తి. దయామూర్తి. ఈ అనుగ్రమూర్తి, అనుగ్రహమూర్తి. ఇక కైలాస శంకరుడు. ఉగ్రమూర్తి. అతనికి ఉన్న నామాలలో 'ఉగ్ర' అనేది ఒకటి.

ఇక 'ఉన్మృదిత కాల లాంఛనం' ఏమిటి? కాలలాంఛనుడుగా, కంఠంలో మచ్చ కలవాడు శంకరుడు. శంకరులు, నీలకంఠులు కాదు కదా. అది లేనివారని ఉన్మృదిత కాల లాంఛనులని అర్థం.

ఆపైన నలుపు దోషాన్ని సూచిస్తుంది. అట్టిది లేనివారని కూడా అర్థం. అనగా మచ్చలేని జీవితం కలవారని అర్థం.

కాలలాంఛనాన్ని ఆంగ్లంలో చెబితే Black Mark అనాలి. (అట్టిది లేనివారని మహాస్వామివారు చమత్కరించారు).

కాలుణ్ణి తన్నడం వల్ల శంకరుడు కాలలాంఛనుడై అనగా ఆ మచ్చ కలవాడై యున్నాడు. కాలాన్ని జయించినవారు శంకరులు.

ఇక 'వినా వినాయకం' ఏమిటి? శక్తి పంచాక్షరి విధానంలో ఈశ్వరుణ్ణి, అంబికతోను, స్కందునితోనే గాక వినాయకునితోనూ కలిపి అర్చించాలి. శంకరులు, షణ్మతాలలో గాణపత్యాన్ని కూడా స్థాపించారు. ఎందుకిట్లా అన్నాడు? శంకరులు వినాయకుడు లేనివారంటే, బుద్ధుడు లేనివారని అర్థం. బుద్ధునకు, వినాయకుడని ఒక పేరు కూడా ఉంది.

వినాయకుడనగా ఒక గణానికి నాయకుడని అర్థం. ఇతని కంటె మరొక నాయకుడు లేనివాడని కూడా అర్థం. భూత గణాధిపతిగా గణపతిని కొలుస్తున్నట్లు బౌద్ధులు, బుద్ధుణ్ణి వినాయకుడని అంటారు. (బుద్ధుణ్ణే కాదు, బౌద్ధమత గురువులందర్నీ ఆ పదంతో పిలుస్తారని ఆప్టే నిఘంటువులో ఉంది)

అమరకోశంలో "షడభిజ్ఞో దశబలో౽ ద్వయవాదీ వినాయకః" అని ఉంది. కైలాస శంకరుడు, వినాయకునితో ఉంటాడు. మన కాలడి శంకరులు వినాయకునితో అనగా బుద్ధునితో ఉండరు.

కనుక శంకరులు, పరమశివులే. పరమ శివుడే, అపూర్వ శంకరునిగా మారారు.

శంకరులిచ్చిన సాక్ష్యం

ఇక వీరి మాటలలో తామీశ్వరావతారమని ఎక్కడైనా అన్నారా?

వీరు వినయ సంపన్నులు కదా. ఎన్ని గ్రంథాలు వ్రాసినా తమ గురించి ఒక్క ముక్క వ్రాసికోలేదు. ఆయన గురించిన విషయాలు మిగతావారు చెబితేనే తెలిసాయి. అందుకునే వీరి పుట్టిన కాలం గురించి, స్థాపించిన సంస్థలు గురించి, వ్రాసిన గ్రంథాల గురించి, దర్శించిన స్థలాల గురించి భిన్న అభిప్రాయాలు వచ్చాయి. కనుక ఈయన తను ఈశ్వర అవతారమని ప్రత్యక్షంగా చెప్పకపోయినా, పరోక్షంగా ఈ సంగతిని గుర్తించవచ్చు.

తాను మనిషినని రాముడన్నాడు. కృష్ణుడు కొన్ని సందర్భాలలో దేవుడని ప్రకటించుకొన్నా చాలా సందర్భాలలో పరోక్షంగా తన గొప్పదనాన్ని ప్రకటించాడు. ఇదంతా వారి లీల.

వ్యాసుడు, శంకరుల గురువైన గోవింద భగవత్పాదులతో, ఈశ్వరుడవతరించబోతున్నాడు, అతడు నీకు శిష్యుడు కాబోతున్నాడని, ఉపదేశమిమ్మని అన్నాడు. బాలశంకరుడు గోవింద భగవత్పాదుల దగ్గరకు వచ్చినప్పుడు గురువు నీవెవరని అడిగాడు. నీవు, నేనూ, అతడూ అంతా బ్రహ్మమే కాదా! ఇది తెలిసికొనిన నేను బ్రహ్మ స్వరూపాన్నే అని దశశ్లోకి రూపంలో సెలవిచ్చారు. ప్రతి శ్లోకం చివర శివోహం అని ఉంటుంది. వీటిలో కైలాస శంకర ప్రస్తావన తీసుకొని రాక ఉపనిషత్తులలో ప్రతిపాదింప బడిన శివం - శాంతం - అద్వైతం - అహం బ్రహ్మాస్మి - శివోహం, ప్రతిపాదింపబడ్డాయి. "తదేకో వశిష్టః శివః కేవలోఒహం" అని అన్నారు.

ఆచార్య పరంపర

మనం ప్రవర చెప్పుకునేటప్పుడు, అందలి ఋషులను చెబుతాం. అయితే సన్యాసులకు ప్రవర ఉంటుందా?

ఇక మరొక ప్రవర వివాహాలలో ఉంటుంది. వధూవరులను గురించి చెప్పేటప్పుడు మూడు తరాలవారిని పేర్కొంటాం. ముందు ఋషుల పేర్లు చెప్పి ఏ గోత్రంలో ఉన్నాడో చెప్పి వరుని యొక్క ముత్తాత, తాత, తండ్రులను గురించి చెబుతాం. అట్లాగే వధువు గురించి కూడా చెబుతాం. శ్రాద్ధాదులలో తండ్రి, తాత, ముత్తాత పేర్లను వరుసగా ఉచ్చరిస్తారు.

శంకరులు, బ్రహ్మచర్యాశ్రమంలో ఉండగా ఆత్రేయ గోత్రమని, తండ్రి శివ గురువని; తాత, విద్యాధిరాజని చెప్పి యుంటారు. ముత్తాత పేరు చెప్పబడిందో లేదో నాకు గుర్తులేదు.

అయితే సన్న్యాసి యైనపుడీ ప్రస్తావన ఉండదు. అయితే గురు పరంపర గురించి చెబుతారు గాని, వంశ పరంపర ఉండదు. ఇక్కడ ప్రవరయనగా గురు, పరమగురు, పరమేష్ఠి గురు, పరాపరగురువుల ప్రస్తావన ఉంటుంది. చివరకు ఆదిగురువు.

ఆదిగురువు, దక్షిణామూర్తి. ఆయన ఎవరికీ ఉపదేశమిచ్చినట్లు లేదు. గురు పరంపర, విష్ణువుతో ఆరంభమౌతుంది. మరొక శ్లోకంలో పరమ శివుడే దక్షిణామూర్తి కనుక విష్ణువును విడిచి యుంటుంది, ఆదిగురువు పరమశివుడు, మధ్య గురువులు, తరువాత శంకరులు, తరువాత మనకుపదేశమిచ్చిన ప్రత్యక్ష గురువు పేర్లను చెప్పి నమస్కరిస్తారు.

"సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం
అస్మదాచార్య పర్యంతం వందేగురు పరంపరామ్"

మొదటి శ్లోకం ప్రకారం విష్ణువు, బ్రహ్మ, ఇత్యాదిగా ఉంటుంది.

విష్ణువు, బ్రహ్మకు వేదాలనిచ్చాడు కనుక ముందు విష్ణువు, తరువాత బ్రహ్మ – వసిష్ఠుడు – శక్తి – పరాశరుడు – వ్యాసుడు తరువాత ఆయన కొడుకైన శుకుడు. అతడు వివాహమాడలేదు కనుక శిష్యుడైన గౌడపాదుడు గోవింద భగవత్పాదులు – చివరకు శంకరులకు వందనం సాగి, వీరి శిష్యులైన నల్గురు శిష్యులను పేర్కొంటూ మనకు ప్రత్యక్షంగా ఉపదేశమిచ్చిన గురువునకు వందనంతో ముగుస్తుంది.

మామూలుగా మనం చెప్పుకునే ప్రవరలో గోత్ర ఋషులను పేర్కొని తరువాత నున్న వారెవరో తెలియదు కనుక వారిని విడిచి కేవలం ముత్తాత, తాత, తండ్రులనే పేర్కొంటాం. కాని బ్రహ్మవిద్యా విషయంలో విష్ణువు నుండి ప్రత్యక్ష గురువు వరకూ పేర్కొంటాం. శంకరుల వరకు అవిచ్ఛిన్న పరంపర సాగింది. వరుసగా శంకరుల ముందు తొమ్మండుగురు పూర్వాచార్యులున్నారు.

అయితే ఏనాటి విష్ణువు? ఏనాటి శంకరులు? యుగయుగాలు గడిచి పోయాయి. తొమ్మండుగురునే చెబుతున్నారేమిటని శంక.

వసిష్ఠాదులు దీర్ఘకాల జీవులు. వసిష్ఠుడు, వేదంలో, రామాయణంలో పేర్కొనబడినవాడు. మన కాలమానంతో, మన ఆయుర్దాయంతో లెక్కపెట్టగూడదు. వ్యాసుడు చిరంజీవియే కదా. వారిని చారిత్రక వ్యక్తులని మిడిమిడి జ్ఞానంతో చూడకూడదు. ఇది వివరిస్తూ ఉంటే మధ్యలో ఆదిశేషువు, పతంజలి కథలు వస్తాయి.

వసిష్ఠుని నుండి వ్యాసుని వరకూ

బ్రహ్మ మానసపుత్రులలో వసిష్ఠుడొకడు. అతడు మంత్రద్రష్ట. సప్తర్షులలో ఒకడు. పరమ పతివ్రతయైన అరుంధతికి భర్త. నారాయణుడు, రామునిగా అవతారమెత్తగా అతనికి గురువైనాడు. అతడే రామునకు, జ్ఞానవాసిష్ఠాన్ని ఉపదేశించాడు. అందు బ్రహ్మయే సత్యమని, జగత్తు మిథ్యయని కొన్నివేల శ్లోకాలలో ప్రతిపాదింపబడింది. అందనేక కథలు. అతని తరువాత అతని తనయుడు శక్తి.

జీవన్ముక్తులైన సదాశివ బ్రహ్మేంద్రులు, గురురత్న మాలను వ్రాసేరు. అందు గురు పరంపర ఉంటుంది. దానిలో కంచిలోని 57వ పీఠాధిపతి వరకూ పేర్కొన్నారు. అందులో 87 శ్లోకాలుంటాయి. సుషమ అనే పేరుతో దానికి ఆత్మ బోధేంద్రస్వామి, ఒక వ్యాఖ్యానం వ్రాసేరు. అందు శక్తి గురించి వ్రాస్తూ, బహుమిత్రసహుడనే రాజునకు సంక్రమించిన పాపాన్ని కేవల తన దర్శనంవల్ల పోగొట్టాడని వ్రాయబడింది. అది అతని మహత్త్వము.

సూర్యవంశంలో బహుమిత్రసహుడు పుట్టాడు. వసిష్ఠుడతనికి కుల గురువు. ఒక రాక్షసుడు, తిన్నగా ఇతణ్ణి ఎదుర్కొనలేక వసిష్ఠ శాపానికి ఇతడు గురియగునట్లుగా చేసాడు. ఒక వంటలవానిగా ఇతని కొలువులో చేరాడు. మిత్రసహుడు, శ్రాద్ధం పెడుతూ వసిష్ఠుని భోక్తగా పిలిచాడు. ఆ వంటవాడు, మనుష్య మాంసాన్ని వండి దీనిని వసిష్ఠునకు వడ్డించండని అన్నాడు. దానిని చూడగానే వసిష్ఠునకు నరమాంసమని తెలిసింది. వెంటనే రాజును నీవు నరమాంస భక్షకునిగా మారి పొమ్మని శపించాడు.

రాజేమి చేస్తాడు? ఇతనికీ కోపం వచ్చింది. గురువని కూడా లెక్క చేయకుండా తిరిగి శాపం ఇద్దామని నీటిని గ్రహించి, వసిష్ఠుని మీద చల్లబోతూ ఉండగా మంత్రి వచ్చి, గురువును శపిస్తే వంశనాశమౌతుందని అన్నాడు.

అయితే చేతిలో నీటిని ఏం చేయాలి? ఎక్కడో చల్లాలి కదా? చల్లబడిన చోట, అది దగ్ధమై పోతుంది. తన పాదాలమీదే చల్లుకున్నాడు. కాలు నల్లబడి కాలిపోయింది. అందుకు కల్మషపాదుడయ్యాడు.

కాని వసిష్ఠుని మాట వ్యర్థం కాకూడదు. అందువల్ల రాక్షసుడయ్యాడు. ఇంతవరకూ పురాణాలలో ఉన్నదే. అక్కడనుండి వ్యాఖ్యానంలో ఉన్నది వివరిస్తా. ఆధారం లేకుండా వారు వ్రాయరు.

కల్మష పాదుడు రాక్షసుడై, వసిష్ఠ తనయులనే తినడం మొదలు పెట్టాడు. అపుడు వసిష్ఠ తనయుడు శక్తి వచ్చాడు. అతని దర్శనం వల్లనే ఇతనికి జ్ఞానోదయమయింది. రాజు పాపం పోయింది. ఉపదేశం ఇమ్మని ఇతణ్ణి అడిగాడు. బ్రహ్మ విద్యోపదేశం చేయగా అతడు ముక్తుడయ్యాడు. అందువల్ల గురుపరంపరలో శక్తికి స్థానముంది.

శక్తి కొడుకు, పరాశరుడు, గర్భస్థుడై యుండగానే వేదాధ్యయనం చేసినవాడు. అతడు వ్యాసుడనే పుత్రుణ్ణి, విష్ణుపురాణాన్ని లోకానికి అందించాడు. భాగవతానికి మూలం, విష్ణు పురాణం. దానినుండి సూక్తులను శంకరులు పేర్కొన్నారు. అది భక్తి గ్రంథంగా కనబడినా పాలలో పంచదార కలిపినట్లుగా అందు భక్తి, జ్ఞాన, అద్వైత వేదాంతాలుంటాయి. అతడొక 'స్మృతి'నందించాడు. అదే 'పరాశర స్మృతి'. కలిలో ప్రధాన 'స్మృతి'.

తరువాత వ్యాసుడు. శంకరుల రచనలలో ఏది ప్రధానమైనదంటే, సూత్ర భాష్యమంటారు. వ్యాసుడందించిన బ్రహ్మ సూత్రాలకే అది భాష్యం. బ్రహ్మ సూత్రాలు, ఉపనిషత్తుల సారం. వేద విభజన, 18 పురాణాల రచన మొదలైనవి ఎన్నో వ్యాసుడు చేసాడు. శంకరుల చరిత్రలు తెలియాలంటే ఎన్నో పూర్వగాథలు

తెలియాలి. ఆధ్యాత్మిక పరంపర తెలియాలి. లేకపోతే పెద్ద పర్వత పంక్తుల్ని చిన్న రంధ్రం నుండి చూసినట్లౌతుంది.

మహావిష్ణువు నుంచి శుకుని వరకు పురాణ పురుషులు. వీరి ప్రభావం, శంకరులపై ఎట్లా ఉందో తెలియాలి.

విష్ణువు నుండి శుకుని వరకూ అద్వైతులతో బాటు విశిష్టాద్వైతులు, మాధ్వులు కూడా ఆ వరుసను పాటించి నుతిస్తారు. మనకు, ముఖ్య గురువులలో విష్ణువొకడు. కాని పై సంప్రదాయాలకు, అతడే ప్రధాన గురువు.

గురుని ఆజ్ఞ ప్రకారం రామానుజులు, పరాశరునిపై భక్తిని చూపించి, వారి పేర్లు శాశ్వతంగా ఉండాలని, తన శిష్యుడైన కూరత్తాళ్వార్ యొక్క తనయునకు పరాశర భట్టర్ అను నామకరణం చేయించారు.

మూడు సంప్రదాయాలకు వ్యాసుడే మూల పురుషుడు. ముగ్గురు బ్రహ్మసూత్రాలపై భాష్యం వ్రాసేరు. మాధ్వులలో వ్యాసరాయర్ అనే వారున్నారు. వారికి వ్యాస రాయర్ మఠం కూడా ఉంది.

అట్లాగే శుకుడు కూడా ముగ్గురికీ గురువే. తరువాత గురుపరంపర, విడిపోయింది. మన అద్వైత సిద్ధాంతం గౌడ పాదునితో మొదలౌతుంది.

శుకబ్రహ్మము

శుకుడు అద్వైత జ్ఞానం మూర్తీభవించిన జీవన్ముక్తుడు. బ్రహ్మ సాక్షాత్కారం పొందిన మహాత్ముడు. చాలామంది జీవన్ముక్తులకు పూర్వ కర్మలు కొంతకాలం వెంట రావడం, వాటిని వీరు జ్ఞానంచే ఎదుర్కొనడం జరుగగా ఇతడు పుట్టుకతోనే జీవన్ముక్తుడయ్యాడు.

కర్మశేషం ఉండగా పుట్టలేదు. ఏ ప్రయత్నం లేకుండానే ఆత్మజ్ఞానం కలిగిన మహానుభావుడు.

పుట్టుక అంటే, పూర్వకర్మ ఉండాలి. శాస్త్రప్రకారం కర్మలు చేయడం, చిత్త శుద్ధిని పొందడం, ఆత్మ జ్ఞానం అవసరముండడం ఉంటుంది. అజ్ఞానం లవలేశం అంటకుండా పరమేశ్వరుడితణ్ణి అవతరింప చేసాడు. ఇది వాని లీల. ఇంతకంటె కారణం చెప్పలేను. ఈశ్వర సృష్టిలో ఇది యొక ప్రత్యేకత. ఇట్టివారు కూడా ఉంటారని లోకానికి వెల్లడి చేయడంకోసం పుట్టించాడేమో!

అట్టివాడు, వామదేవుడు కూడా. శుకుని కంటె ముందువాడు. "దేవతల జన్మలు నాకు తెలుసు. అనేక వేల జన్మలనెత్తాను. నేడు తెక్కలొచ్చాయి. అవి గరుత్మంతుని రెక్కల వంటివి, అందుకే బంధాలు వదుల్చుకుని ఎగిరిపోతున్నాను" అని ఐతరేయ ఉపనిషత్తులో ఇది ఉంది. పూర్వం అనేక జన్మలెత్తానని, ప్రస్తుతం గర్భవాసంలో ఉండగానే ఆత్మజ్ఞానం కల్గిందని ఆయన చెప్పగలిగాడు. అట్టి పూర్వ జన్మలులేనివాడు శుకుడు.

సదాశివ బ్రహ్మేంద్రులు కూడా జీవన్ముక్తులే. రెండు శతాబ్దాల వెనుక నున్నవారు. వారు తమ గురురత్న మాలికలో శుకుని గూర్చి ఇట్లా అన్నారు:

"జననీ జఠరాదివ చ్యవన్యో

జగతో నాద్రవత్ ఆత్మవిత్ విపధ్యః

అనహంత మహంత మాత్మవంతం

భగవంతం శుకమాశ్రయే ప్రశాంతం"

అనగా శ్లోకంలోని రెండవ భాగంలో అహంకారం లేని ఆత్మనెరిగిన శుకుణ్ణి, ప్రశాంతుని, భగవత్ స్వరూపాన్ని శరణు జొచ్చుతున్నానని అర్థం.

మొదటి భాగంలో తల్లి గర్భం నుండి రాగానే ఆత్మజ్ఞానం కలిగిందని, ప్రాపంచిక వాసనలు, అణుమాత్రం లేనివాడని పొగిడారు. 'జననీ జఠరాత్' అన్నారు. అదే మాట భజగోవింద స్తోత్రంలో : జననీ జఠరే శయనం" అని ఉంది.

శుకుని గొప్పదనం భాగవత శ్లోకం అందించింది:

యం ప్రవ్ర జంతం అనుపేతం అపేతకృత్యం

ద్వైపాయనో విరహకాతర ఆజుహావ

పుత్రేతి తన్మయతయా తరవో భినేదుః

తం సర్వభూత హృదయం మునిం ఆనతోఽస్మి

వానికి నమస్కారం అని ఉంది కాని వారి పేరు శ్లోకంలో లేదు. 'సర్వభూత హృదయం మునిం' = అందరి హృదయాలలోనూ ఉండే మునియని మాత్రమే ఉంది. అనగా పరబ్రహ్మ స్వరూపుడన్నమాట. శుకుడని పేరు చెబితే అతడొక జీవుడని భావిస్తారు కనుక అట్లా చెప్పలేదు. అనగా నామ రూపాలను దాటినవాడని తెలుస్తోంది.

ద్వైపాయనుడు అనగా రెండు ద్వీపాల మధ్య తిరుగువాడు, వ్యాసుడు కనుక 'పరివ్రజంతం' అని ఉంది. పుత్ర అనే సంబోధనతో ఉన్నాడు. అనగా వ్యాస పుత్రుడు. 'ద్వైపాయనం', అనే మాట శ్లోకంలో ఉంది. 'పుత్రేతి' అని వేరొకచోట ఉంది. సన్యాసులను పరివ్రాజకులని అంటారు. అనగా శుకుడు ఇంటినుండి వెళ్ళిపోతున్నాడు. దానికి ముందు రెండు విశేషణాలున్నాయి. అనుపేతం = ఉపనయనం కాకుండా; అపేతకృత్యం = అన్ని శాస్త్ర కర్మలను విడిచినవాడై. అనగా ఉపనయనానికి ముందే బ్రహ్మజ్ఞాని అయ్యాడు.

పుట్టుకతోనే జ్ఞానం. ప్రపంచ సుఖాలు, దుఃఖాలు అంటకుండానే జ్ఞానం సంపాదించడం. 'అనుపేతం' అనినపుడు ఉపనయన వయస్సు వచ్చినా ఉపనయనం కాలేదని అనాలి. ఒకడింకా ఉద్యోగ విరమణ చేయలేదంటే చాలాకాలం నుండి చేస్తున్నాడని, విరమణ కాలం సమీపించిందని అర్థం. క్రొత్తగా ఉద్యోగంలో చేరినవాడిని అట్లా అనం. కనుక ఉపనయనం కాలేదంటే ఉపనయనానికి తగిన వయస్సు వచ్చినా కాలేదని అర్థం. అసలు ఉపనయనం ఏడవ ఏట, బ్రహ్మ వర్చస్సును కావాలని కోరుకొనేవానికి ఐదవ యేటనే

చేయవచ్చనే శాస్త్రవాక్యం ఉంది. అనగా ఐదవ ఏడు సమీపించే లోపునే జ్ఞానిగా గుర్తింపబడ్డాడు. అట్లా అని చెప్పడం అతని గొప్పతనాన్ని తగ్గించినట్లు కాదు.

దానికి ముందు 'పరివ్రజంతం' అనగా తిరుగుతున్నవాడై. ఇట్లా వెళ్ళడానికి 4,5 సంవత్సరాలుండాలి. పుట్టీ పుట్టగానే పరుగెత్తడం కుదురదు కదా!

అసలు జ్ఞాని ఎక్కడికో వెళ్ళనవసరం లేదు. అయితే ఒకచోట ఉంటే అతడా ప్రదేశానికే పరిమితుడౌతాడని, అతడు వారికి చెందినవాడని వారతనికి చెందినవారనే బంధం ఏర్పడుతుంది. అందువల్ల జ్ఞాని, పరివ్రాజకుడై యుండాలి.

వ్యాసుడెంత గొప్పవాడైనా శుకుని వంటి బ్రహ్మజ్ఞాని కాలేకపోయాడు. ఇంకా అతనిలో పుత్రవ్యామోహం ఉండిపోయింది. ఇంట్లో ఉన్న కొద్దీ బ్రహ్మచర్య దీక్ష, భిక్షాచర్య మొదలైన వాటివల్ల ఇంకా అనుబంధం గట్టిదైపోతుంది. అందువల్ల శుకుడు ఇంటినుంచి తండ్రికి పుత్ర వ్యామోహం కల్గించకుండా వెళ్ళిపోయాడు. అతని దర్శనం వల్ల ఎందరో బాగుపడాలి. ఇది ఈశ్వర సంకల్పం. అంతేనే కాని తానితరులను దరిచేరుస్తానని శుకుడనుకోడు. ఏ సంకల్పం లేకుండా వెళ్ళిపోయాడు.

వ్యాసుడు తన కుమారుడు. పారిపోవడం చూసి పట్టుకుని వెనక్కి తీసుకు రావడానికి ప్రయత్నించాడు. కాని శుకుడు చిక్కలేదు. అపుడు వ్యాసుడు 'పుత్రా, పుత్రా' అని ఎలుగెత్తి ఆక్రోశించాడు.

తరువాత ఏం జరిగింది? 'తరవోభినేదుః', అంటే చెట్లు ప్రతిధ్వనించాయి. అభినేత్రుకు మరొక అర్థం ఉంది. క్రియ ద్వారా చూపువాడు. అనగా నటుడు. ఒకని వేషం వేసుకొని అతనిలా ఉండేవాడు. రాముడు గతించినా రామ వేషాలు వేస్తున్నారు. నాటకంలో దశరథుడు, రామ అంటే అసలు రాముడు పల్కాడా? అట్లాగే శుకుడు మాట్లాడలేదు. కాని అతని ప్రతినిధులైన చెట్లు ప్రతిధ్వనించాయి. ఎందుకు ఎందుకని ప్రశ్నించాయి?

చెట్లెందుకు సమాధానం చెప్పాలి? శుకుడు సర్వభూత హృదయుడు, బ్రహ్మజ్ఞాని కనుక అంతటా ఉన్నాడు. కనుక అన్నీ ఇతడై పోయాయి. ('తన్మయతయా') చెట్లేకాదు, పశువులు, పక్షులు, కొండలు, నదులూ కూడా చెట్లని చెప్పడం నిర్ధారణను సూచిస్తుంది.

శుకుడు సమాధానం చెప్పలేదు. అతడెంత జ్ఞానియైనా అతనిలో ప్రేమ ఉండదా? అందువల్ల చెట్లు సమాధానం చెప్పేటట్లు చేసాడు. అతనికి బదులవి సమాధానం చెబుతున్నాయని వ్యాసుడూ తృప్తి పడియుండవచ్చు. అతని ఆత్మ జ్ఞానమూ వికసించి యుండవచ్చు. ఒక కొడుకొక చోట ఉంటే అతణ్ణి విడిచి పెట్టి యుండలేడు. ఆ కొడుకే అన్ని భూతాలలో ఉండగా అతడెట్లా ఇతనికి దూరంగా ఉండగలడు? కనుక వ్యాసుడు విచారింపనవసరం లేదు. ఇది అనుభవం వల్ల పొందాడు. తన కొడుకు బ్రహ్మయని భావించాడు. అతడు తనతోనూ, అన్నిచోట్లా ఉన్నాడని భావించి యుంటాడు.

అట్టి శుకుని నుండి గౌడపాదుడుపదేశం పొందాడు. అతడు సన్యాస గురువు. ఇక గౌడపాదునకు విద్యా గురువు గురించి తెలుసుకుందాం. పతంజలి చరితం గురించి వివరిస్తా.

పతంజలి చరితం

17వ శతాబ్దం చివరలో తంజావూరు రాజైన షాహాజీ, తన రాజ్యం విద్వాంసులతో కళకళలాడుతూ ఉండాలని ఎందరినో విద్వాంసులను తిరువిసనల్లూర్‌కి తీసుకొని వచ్చాడు. ఒక గ్రామాన్ని 64 మంది విద్వాంసులకు అగ్రహారంగా ఇచ్చాడు. అందొకడు రామ భద్ర దీక్షితులు. ఇతనిలో వ్యాకరణం కవిత్వం రెండూ ఉన్నాయి. అతణ్ణి ఆనాడు పతంజలియని పిలిచేవారు.

ఇతడు పతంజలి చరితమే కాకుండా జానకీ పరిణయమనే నాటకాన్ని వ్రాసేడు. రామభక్తుడగుటచే రామస్తవకర్ణ రసాయనం, రామచరితస్తవం అనే గ్రంథాలను, రామాయణంలో లేని విశేషాలను వ్రాసేడు. దక్షిణ దేశపు పరువును నిలబెట్టాడు.

ప్రస్తుతం ఎనిమిది సర్గలున్న పతంజలి చరితాన్ని చూద్దాం

రాముడు గుర్తుకు వస్తే హనుమ గుర్తుకు వచ్చినట్లు నటరాజును ప్రస్తావిస్తే ఒక పాము, పెద్దపులి గుర్తుకు వస్తాయి. అవి అతని నృత్యాన్ని చూసి యుంటాయి. పెద్ద పులి పాదాలు కలిగినవాడిని వ్యాఘ్రపాదుడని అంటారు. పామును కాలుగా కలిగినవాడు పతంజలి.

ఇక వెంకట కృష్ణ దీక్షితులు వ్రాసిన నటేశ విజయంలోనూ పతంజలి ప్రస్తావన వస్తుంది. రెండు పుస్తకాలలోనూ పోలిక ఉంది.

వీటిల్లో పతంజలి, ఆదిశేషుని అవతారంగా చెప్పబడింది. ఆదిశేషునకు, విష్ణువునకూ సంబంధం ఉంది. విష్ణువు దగ్గరగా నున్నవాడు నటరాజు భక్తుడెట్లా అయ్యాడు? క్షీరాబ్ధినుండి చిదంబరానికి ఎందుకు వచ్చినట్లు? విష్ణువే పంపించినట్లుంది. అయితే విష్ణువునకు నటరాజునకు సంబంధం ఏమిటి?

విష్ణుని హృదయంలో శివనర్తనం

నటరాజ ఆలయంలో నటరాజ దర్శన మంటపం దగ్గరనే విష్ణు సన్నిధి యుంటుంది. ఆదిశేషునిపై పవ్వళిస్తున్నట్లు గోవింద రాజుగా కీర్తింపబడి యుంటాడు. అప్పయ్య దీక్షితులు, ఇద్దరూ ఒకచోట ఉండడం చూసి 'మారమణ, ఉమారమణ' అని ఇద్దర్నీ కీర్తించారు.

హృదయ పూర్వకంగా బంధుత్వం అంటాం. ఇక్కడ నటరాజు, మహావిష్ణువు హృదయంలో నర్తిస్తాడు.

పురాతన పరిశోధనలు చేసేవారు. తిరువారూర్‌లో నున్న త్యాగరాజా లయాన్ని చూసి విష్ణునకు రంగరాజు, వరద రాజు, గోవిందరాజు అని ఉంది కనుక, పై ఆలయం ముందు విష్ణువుదే అని తరువాత శివాలయంగా మార్చబడిందని అంటారు. అట్లాగే నాచ్చియార్ కోవెల ముందు శివాలయమని, తరువాత వైష్ణవాలయంగా మార్చబడిందని అంటారు. ఏమిటో ఈ పరిశోధన?

వారు స్థల పురాణాలను సరిగా అర్థం చేసుకున్నట్లు లేదు. ఎట్టి మార్పును చెప్పనవసరం లేదు. అవి ముందెట్లా ఉన్నాయో అట్లాగే ఉన్నాయి.

విష్ణ్వాలయంగానే తిరువారూర్‌లో నిర్మింప బడింది. విష్ణు హృదయంలో త్యాగరాజున్న మూర్తి అక్కడ ఉంది.

నటరాజు మాదిరిగా త్యాగరాజు కూడా నటనమూర్తియే. అయితే అతని ముఖమే చూడగలం. మిగతా మూర్తి అంతా వస్త్రంచే కప్పబడి యుంటుంది.

నటరాజు, త్యాగరాజుల నర్తనంలో తేడా ఉంది. నటరాజు నృత్యం చేస్తూ ఉంటే ఎడమకాలిని ఎత్తి నృత్యం చేస్తాడు. త్యాగరాజు తనంతట తాను చేయడు. అతడు విష్ణు హృదయంలో ఉన్నాడు. కాబట్టి విష్ణువు, శ్వాస పీలుస్తూ ఉంటే దానికి అనుగుణంగా త్యాగరాజు నృత్యం చేస్తాడు. ఆ కదలికయే నృత్యం.

విష్ణు హృదయంలో శివుడు నృత్యం చేస్తాడని నారాయణోపనిషత్తు చెబుతోంది. సహస్ర బాహువులు, సహస్రాక్షులు కలిగిన ఆ విరాట్ స్వరూపానికి హృదయం, పద్మకోశంలా అనగా తామర మొగ్గలా ఉంటుందట. దానిపై దహరాకాశం, అందు పరమాత్మ ప్రకాశిస్తాడని మంత్రం అంటోంది. బైట ఉన్నది, మహాకాశం, దానిలో నున్నది దహరాకాశం. చిదంబరంలో ఒకదానితో ఒకటి సంబంధం కలిగే యుంటుంది. జ్ఞానాకాశము, ఆకాశక్షేత్రము, చిత్సభ, తాండవమూర్తియైన నటరాజ శివుడు. అన్నిటికీ సంబంధం ఉంది.

అజప - హంసనటనం

శివతాండవాలు పెక్కువిధాలుగా ఉంటాయి. చిదంబరంలో ఆనంద తాండవం. తిరువలంగాడులో ఊర్ధ్వతాండవం. ఇక చోళ ప్రాంతంలో ఏడుగురు త్యాగరాజులు ఏడు రకాలైన తాండవాలు చేస్తారు. వీటిని సప్తవిడంగ క్షేత్రాలని అంటారు. అందు ముఖ్యమైనది తిరువారూర్. ఇందున్న త్యాగరాజు, అసలైన మూర్తి. ఇతని నృత్యాన్ని హంసనటన మంటారు. ఇదే అజపానటనం.

జపం కానిది అజపం. మంత్రంలోని అక్షరాలను పల్కుతాం. ఆ కంపనల వల్ల నాడులలో కదలిక ఏర్పడుతుంది. దీనివల్ల శక్తి, సిద్ధి, మనస్సునకు స్పష్టత, అనేక దృశ్యాలు కన్పిస్తాయి. ఇవి రావాలంటే ప్రాణాయామంతో కలిపి చేయాలి. దీని కంటె భిన్నమైన ప్రక్రియ యుంది. శ్వాసను గమనిస్తూ ఉంటే చిత్తానికి శాంతి ఏర్పడుతుంది. ప్రాణాయామంలో శ్రమ యుంటుంది. కాని ఈ ప్రక్రియ అప్రయత్నంగా సాగిపోతూ ఉండడాన్ని గమనిస్తాం. ఇది ఆత్మస్థానాన్ని చేరుస్తుంది. ఇందు మంత్ర జపం ఉండదు. అందువల్ల అజపం, వట్టి శ్వాస యొక్క గమనాన్ని వీక్షించడమే.

మామూలుగా దీనినీ జపం అంటాం. ఇదే హంస మంత్రజపం. పీల్చేటపుడు, విడిలేటప్పుడు ఇస్ హం, అనే నాదాలుంటాయి. అహంసః = నేను అతడే. నేను జీవాత్మ, అతడు పరమాత్మ. నేను, అతడు అని ఊరుకుంటే బ్రహ్మయే జీవుడనే, అర్థం వస్తుంది. అతడు, నేను అనినపుడు సః అహం. కలిపితే సోఽహం. సోహంను హంసతో కలిపితే హంసమంత్రం. ఇట్లా జీవుణ్ణి పరమాత్మతో కలిపినపుడు జపమాగిపోయి, అజపమౌతుంది. స, హ, అణగిపోయి ఓం, ఒక్కటే మిగులుతుంది. అది తురీయస్థితికి తీసుకొని వెడుతుంది.

విష్ణువు, కుండలినియైన పామును తల్పంగా చేసుకొని యోగనిద్రలో, పరమాత్మతో ఐక్యమై పరమేశ్వర రూపాన్ని పొందుతున్నాడు. మహావిష్ణువు యొక్క శ్వాసగతిననుసరించి పరమేశ్వరుని కదలిక యుండడం వల్ల దానిని త్యాగరాజు యొక్క అజపానటనమని, హంసనటనమని అంటారు.

దానిని విష్ణు హృదయంపై చేస్తున్నట్లు విగ్రహాన్ని మలిచారు. అందువల్ల మొత్తం విగ్రహం అంతా కప్పబడి త్యాగరాజు ముఖమే కనబడుతుంది. అంతేనే కాని, శివ విష్ణువులు శత్రువులు కారు. మాటిమాటికీ ఆలయాలు మారిపోయాయని భావించకూడదు.

ఆదిశేషుని అవతారం

విష్ణువు ధ్యానంలో ఉండి శివతాండవాన్ని తన హృదయంలో వీక్షిస్తూ ఆ ఆనందంలో ఆవేశానికి లోనయ్యాడు. ఆదిశేషుడు, ఆవేశపూరితుడైన విష్ణువు బరువును భరించలేకపోయాడు. ఈరోజు ఇంత బరువున్నారేమిటని విష్ణువు నడిగాడు. పరమేశ్వరుడు నా హృదయంలో నర్తనం చేస్తున్నాడు, అదే కారణమన్నాడు విష్ణువు.

సంతోషం వల్ల బరువు అనినపుడు అది అద్వైతం అవుతుంది. ఈశ్వరుడు నా హృదయంలో ఉన్నాడనినపుడు, అనగా ఇద్దరూ ఒకచోట కలిసినపుడు ద్వైతం. ఆ అద్వైతాన్ని చూపించకుండా ఉండడం, విగ్రహాన్ని కప్పుతారు. అందుచేత సాధారుణులకు ద్వైతమూర్తిగానే కన్పిస్తాడు. కాని అద్వైత దర్శనం ఇప్పించాలి. ఆదిశేషుడు ఏమి అడుగుతాడో తెలుసు. ఈ పని ఆదిశేషుని ద్వారా జరగాలని భగవత్ సంకల్పం.

ఈ ఈశ్వర నృత్యాన్ని తాను చూడాలని ఆదిశేషుడడగాలి. అపుడతనిని చిదంబరం పంపించి చూపించాలి. తద్వారా చిదంబర మహాత్మ్యం నల్గురికీ తెలుస్తుంది. ఇది భగవంతుని ఆలోచన.

తిరువారూర్‌లో జన్మిస్తే, మోక్షమని ఒకమాట. "జననాత్ కమలాలయే" అయితే పుట్టడం మన చేతిలో ఉందా? చిదంబరంలో దర్శనం వల్లనే ముక్తి. 'దర్శనాత్ అభ్రసదసి' ఎక్కడ పుట్టినా అక్కడకు వెళ్ళితే చాలు. మోక్షం వస్తుంది. మోక్షానికి దారి చూపిస్తుంది.

విష్ణువు, పతంజలిని చిదంబరానికి వెళ్ళమన్నాడు. దానివల్ల లోకానికి ఉపకారం జరిగింది. నటరాజు చేసిన డమరుక నాదాన్ని విని పాణినిమహర్షి వ్యాకరణ సూత్రాలు వ్రాసేడు. దానికి మహాభాష్యాన్ని వ్రాసి లోకానికి ఉపకరించవలసిందిగా ఆదిశేషుడిని విష్ణువు పంపించాడు.

విష్ణువు, పాముపై పవ్వళించినపుడు అతనికి తల్పంగా; అతడు కూర్చుంటే సింహాసనంగా, నడుస్తూ ఉంటే గొడుగుగా, పాము ఉపయోగపడుతుంది. అయితే విష్ణువు నృత్యం చేయడు. శివుడే చేస్తాడు. నృత్యం చేసేవానికి పామెట్లా ఉపకరిస్తుంది? అది ఒక ఆభరణంగా శివునికైనపుడే. అందుకే అతని కాలియందెగా అయ్యాడు. పతంజలి మహర్షిగా నటరాజును సమీపించాడు. అపుడు విష్ణువునకు తల్పంగా లేడని భావించవద్దు. ఒక అంశ అట్లా వెళ్ళింది.

పతంజలి, అత్రిమహర్షికి పుట్టాడు. కనుక అతడు, ఆత్రేయుడు. (ఆచార్యుల వారి గోత్రం కూడా ఇదే)

ఇతనికి గోణికా పుత్రుడని పేరు. పతంజలి చరిత్ర ననుసరించి, పురాణాల ప్రకారం గోణిక అనే తపస్విని కి పుట్టాడని, పతంజలిగా అవతరించాడని ఉంది.

గోణిక, పుత్రునికై, సూర్యునకు అర్ఘ్యం ఇస్తూఉండగా ఆమె అంజలిలో ఆదిశేషుడు పడి అతడు పతంజలి అయ్యాడని కథ. అంజలిలో పత్ = పడుటవల్ల పతంజలి.

ఇతనికే చరకుడని పేరు. నటరాజు తాండవాన్ని చూస్తూ ఉండేవాడు. అతడే మహాభాష్యం వ్రాసేడు.

త్రికరణాలకు శుద్ధి

మనస్సు, శరీరం, వాక్కు అనే మూడు కరణాలను శుద్ధి చేసికొనుటకు పతంజలి ఉపకరించాడని ఒక శ్లోకం:

"యోగేన చిత్తస్య పదేన వాచం
మలం శరీరస్య చవైద్యకేన
యోపాకరోత్ తం ప్రవరం మునీనాం
పతంజలిం ప్రాంజలిరానతోస్మి"

పై మూడింటికి మూడు గ్రంథాల నందించాడు. చిత్త దోషాన్ని పోగొట్టడం కోసం యోగ సూత్రాల నందించాడు. అదియే పాతంజలయోగ సూత్రం. అనేక యోగాలున్నా పతంజలి యోగాన్నే రాజయోగమంటారు. శ్లోకంలో "యోగేన చిత్తస్య" ఉంది. దీనివల్ల జీవాత్మ, పరమాత్మతో ఐక్యాన్ని పొందుతాడు. తరువాత వాగ్దోషం పోవడానికి, సుశబ్దాల నుచ్చరించడానికి వ్యాకరణ మహాభాష్యాన్ని అందించాడు. "పదేన వాచం".

పదమంటే వ్యాకరణం. "పదం వ్యాకరణం ప్రోక్తం" మహా విద్వాంసులను పదవాక్య ప్రమాణ పారావార పారీణులని యంటారు. పదమనగా వ్యాకరణం; వాక్యమనగా మీమాంస; ప్రమాణమనగా న్యాయశాస్త్రం. వాటిల్లో ఉత్తీర్ణులన్నమాట.

దేవతలు మాట్లాడే భాష, దేవభాష. వారీ ప్రపంచాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తూ ఉంటారు కనుక వారితో మాట్లాడాలంటే మనకా భాష రావాలి. అప్పుడు మంత్రాలు, శ్లోకాలు బాగా తెలిసి కర్మానుష్ఠానం బాగా జరుగుతుంది. అందువల్ల సంస్కృతాన్ని మనమందరమూ అభ్యసించాలి. వ్యాకరణ శుద్ధమైన భాషలో మాట్లాడడమే ఒక యోగం. నాడీశుద్ధి కల్గుతుంది. మానసిక పవిత్రత లభిస్తుంది. అందనేక ఆధ్యాత్మిక గ్రంథాలున్నాయి. మన సంస్కృతి తెలియాలంటే సంస్కృతం, తప్పనిసరిగా నేర్వాలి.

"మలం శరీరస్యవైద్యకేన" అని ఉంది. శారీరక రోగాలను పోగొట్టడానికి ఆయుర్వేదాన్ని అందించాడు. అదే చరక సంహిత అనే ప్రసిద్ధ గ్రంథం.

అందుకే అన్నిటి శుద్ధికోసం గ్రంథాల నందించాడు కనుక అతడు ముని ప్రవరుడయ్యాడు. మునులలో శ్రేష్ఠుడు.

ప్రామాణిక గ్రంథాలు మూడు రకాలుగా ఉంటాయి. అనగా సూత్రం, భాష్యం, వార్తిక రూపంలో ఉంటాయి. సూత్రం, సూక్ష్మంగా, సంక్షిప్తంగా అందిస్తుంది. దానిని భాష్యం విపులంగా వివరిస్తుంది. భాష్యంలోని క్లిష్టమైన

వాటిని వివరించేది వార్తికం. అనగా భాష్యంలో చెప్పనివాటినీ అందిస్తుంది. కొన్నింటిలో ఒక్కొక్కదానికి ప్రాధాన్యం ఉంటుంది.

పతంజలి యోగ శాస్త్రానికి సూత్రాలు, వ్యాకరణానికి భాష్యం. వైద్యానికి వార్తికం వ్రాసేదు. ఇట్లా ఒక్కొక్క శాస్త్రంలో ఇతదు వ్రాసినవన్నీ ప్రాధాన్యాన్ని పొందాయి.

యోగ శాస్త్రానికి కొందరు భాష్యాలు వ్రాసినా ఇతని సూత్రాలే ప్రఖ్యాతి. పాణిని సూత్రాలు సామాన్యులకు అర్థం కావు కనుక ఇతని భాష్యానికే ప్రసిద్ధి. ఎన్ని వైద్య గ్రంథాలున్నా ఇతని చరకానికే ప్రసిద్ధి.

నాట్యానికి భరతశాస్త్రం, రాజనీతికి చాణక్యుని అర్థశాస్త్రం, ఎట్లా ప్రాముఖ్యాన్ని పొందాయో ఇతని చరకం వైద్యానికట్లా ప్రసిద్ధి పొందింది.

యోగశాస్త్రాన్ని పూర్తిగా ఇతరులు ఏకీభవించకపోయినా దానిని ఒక ప్రధానాంగంగా అందరూ అంగీకరించారు. సిద్ధాంతం విషయమై, అద్వైతం కొంత విభేదాన్ని దీనితో కలిగి యుంది. కాని వ్యాకరణ మహాభాష్య విషయంలో ఎవ్వరికీ పేచీ లేదు.

యజ్ఞ నారాయణ దీక్షితుల సాహిత్య రత్నాకరంలో (11.124) పాణిని సూత్రానికి, పతంజలి భాష్యానికి నటరాజు యొక్క చేతులకు, కాళ్ళకు గల సంబంధం చెప్పే చమత్కార శ్లోకం ఉంది.

పాణియనగా చేయి. నటరాజు చేతిలోనున్న దమరుకం నుండి పాణిని సూత్రాలు వచ్చాయి. మరి కాలికి, భాష్యానికి సంబంధం ఏమిటి?

నిలబడిన నటరాజు నృత్యాన్ని చూడటానికి తృప్తి పడక పతంజలి పామై అతని పాదానికి ఆభరణమై యున్నాడు. ఆ అందె నోటినుండి మహాభాష్యం వచ్చింది. అందె చప్పుడు చేస్తుంది కదా!

సూత్రం చేతినుండి వస్తే, భాష్యంకాలి నుండి వచ్చిందని చమత్కారం.

వేయిమంది శిష్యులకు పాఠం

చిదంబరంలోని సహస్రస్తంభ మంటపంలో ఆదిశేషుడు పతంజలి అవతారమెత్తి వేయిమంది శిష్యులకు భాష్యం అందించదలచాడు.

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ చూపించాలి. పాఠాన్ని త్వరగా ముగించాలి. ఎవరడిగినా వారికి సమాధానం ఈయాలి. ఇట్లా చేయడానికి ఒక ముఖంతో ఒక నోటితో కుదరదు కనుక పతంజలి మహర్షి, ఆదిశేషుని అవతారమెత్తి వేయి పడగలతోనున్నాడు.

మానవులు ఎవరూ ఆదిశేషుణ్ణి చూడలేరు కనుక, అతని శ్వాసను కూడా భరించలేరు కనుక, ఒక తెరను కట్టి, ఒక్కొక్క ముఖము ముందు ఒక్కొక్క శిష్యుణ్ణి కూర్చోబెట్టి, పాఠం చెప్పడం మొదలు పెట్టాడు.

గురువు తెర వెనుక ఉన్నప్పుడు శిష్యులు తరగతి విడిచి ఆయన అనుమతి లేకుండా వెళ్ళినట్లయితే బ్రహ్మరాక్షసులవుతారని శాపం చెప్పాడు.

బ్రహ్మరాక్షసులు-రాక్షసజాతి

బ్రహ్మ రాక్షస్సనగా ఒక పిశాచం వంటిది. ప్రాణులలో అనేక భేదాలున్నట్లు అనేక పిశాచాలూ ఉంటాయి.

రాక్షసులలో భేదాలున్నా రాక్షస జాతి, దేవజాతిలోనిదే. రాక్షసులు వీరితో యుద్ధం చేసారంటే ప్రత్యేక జాతియని పొరపాటు బడతాం. వీరు దేవతలలో క్రూరులు. దేవతల నుండి భిన్నులు, అసురులు. అందుకే దేవాసుర యుద్ధమని ఉంది కాని దేవరాక్షస యుద్ధమని లేదు. దేవజాతిలో వీరూ ఒకరే యని అమరకోశం చెబుతోంది. అందరిని దేవయోనులంటారు. అసురజాతిని అసుర – దైత్య దైతేయ – దనుజులుగా పేర్కొంది.

రాక్షసులలోఒక ఉపశాఖ, బ్రహ్మ రక్షస్సులు. చిత్రమేమంటే ఈ పిశాచాలూ దేవజాతికి చెందినవే.

"పిశాచో గుహ్యకః సిద్ధో భూతోఽపీ దేవయోన యః

వేదాధ్యయనం చేసి తప్పుడు మార్గం త్రొక్కిన వాడు బ్రహ్మ రక్షస్సుగా పుడతాడు. వేదవేత్తలతో మృదువుగా మాట్లాడుతూ శాస్త్ర సంబంధమైన ప్రశ్నలు వేసి వారు సమాధానం చెప్పలేకపోతే వారిని తింటూ ఉంటాడు.

విపత్తుతో అంతం

పతంజలి తన అనుమతి లేకుండా వెళ్ళకూడదని తాను పాఠం చెబుతూ ఉండగా తెర ఎత్తిచూడకూడదనే నియమం పెట్టాడు. ఒక మనిషి వేయిమందికి వేయి ముఖాలతో పాఠాలు చెప్పడమా? అని ఒకనాడు ఒక విద్యార్థి తెర తొలగించి చూసాడు. అందరూ బూడిద పాలయ్యారు. "గురు వచనవ్యతి లంఘనం హ్యనర్థః" అని పతంజలి చరిత చెప్పింది. అయితే ఒక విద్యార్థి మందబుద్ధి అవడంవల్ల పాఠం అర్థంకాక ఎక్కడికో వెళ్ళి తిరిగి వచ్చాడు. అతడు దూరంగా నున్న గౌడ దేశం నుండి వచ్చాడు.

శిష్యునిపై అనుగ్రహం

శిష్యుడు గురువుల ఎదురనున్న బూడిద కుప్పల భయంకర దృశ్యాన్ని చూసాడు. చెప్పిన పాఠాలు వ్యర్థమయ్యాయని గురువు, బాధపడ్డాడు. గురు వాక్యాన్ని ఉల్లంఘించానని ప్రమాదం ముంచుకొస్తోందని శిష్యుడు భయపడ్డాడు. పోనీ ఒక్కడైనా మిగిలాడని గురువు సంతోషించి అతనిపై అనుగ్రహ శక్తిని ప్రసరించి వ్యాకరణ శాస్త్రాన్ని పూర్తిగా బోధించాడు.

అట్టి మహాత్ములు నేటికీ ఉంటారు. రామకృష్ణ పరమహంస, వివేకానందుని అనుగ్రహించలేదా? ఎప్పుడో గాని అట్టి శక్తిని చూపించరు. అయితే ఇంతకు ముందు పెట్టిన నియమం ప్రకారం, అతడు బ్రహ్మ రక్షస్సు కావలసిందే. ఇతడు విద్వాంసులను భక్షించడం ఖాయమే. ఎవరైనా సరియైన సమాధానం

ఇస్తే అపుడు వచ్చేవానికి మహాభాష్యాన్ని ఇతడు చెప్పాలనే నియమాన్ని పతంజలి ఏర్పాటు చేసాడు. అప్పుడితడికి శాపవిమోచనం కల్గుతుందని అన్నాడు.

సంస్కృతంలో ప్రత్యయాలు సాధారణంగా చివర వస్తూ ఉంటాయి. 'కృ' అనే ధాతువునకు 'క్త' అనే ప్రత్యయం చేరితే, కృతం అవుతుంది. 'భుజ్'కి చేరితే భుక్తం. వీటిని నిష్ఠాంతాలని అంటారు. 'పచ్' ధాతువునకు 'క్త' చేరిస్తే పక్వమౌతుందిగాని 'పక్తం' అనకూడదు. అట్లా సరిగా చెబితే అతనికి భాష్యాన్ని ఉపదేశించు, లేదా తినివేయవచ్చు అని పతంజలి అన్నాడు.

బ్రహ్మ రాక్షసుడు నర్మదా తీరంలోని రావిచెట్టు మీద కూర్చుని 'పచ' ధాతువునకు 'నిష్ఠ'తో రూపం ఏమి వస్తుందో చెప్పుమని వచ్చేపోయే విద్వాంసులనడిగేవాడు. చెప్పనివాళ్ళని ఆహారంగా భోజనం చేసేవాడు.

పంచగౌడ దేశీయులకు, పంచ ద్రావిడ దేశీయులకు మధ్యగా నర్మదా తీరం ఉంటుంది. ఇది ఒక కూడలి.

ఆంగ్లంలో But ని Cut ని ఒక విధంగా ఉచ్ఛరిస్తారు. అట్లాగే Put ని పుట్ అనాలి గాని బట్, కట్‌గా పట్ అనకూడదు. అట్లాగే సైది కూడా.

ఒకనాడు, ఒక కుర్రవాడు బ్రహ్మవర్చస్సుతో కనబడ్డాడు. అతడు పతంజలి భాష్యం నేర్వడానికి చిదంబరం బయలుదేరుతూ ఉన్నాడు. ఇతడు కాశ్మీరుకు చెందినవాడని కొందరు ఉజ్జయినికి చెందినవాడనీ అన్నారు. నీ పేరేమిటని బ్రహ్మరాక్షసుడు అనగా చంద్రశర్మయని సమాధానం చెప్పాడు.

బ్రహ్మరాక్షసుడు ఆ భాష్యం నా దగ్గర ఉందని, నేను చెబుతాను అని తనకు సరియైన సమాధానం చంద్రవర్మ ఇవ్వగానే సంతోషించి, మహాభాష్యం బోధించడానికి కఠినమైన నియమాలు పెట్టాడు. ఎందుకంటే బ్రహ్మరాక్షసుడుగా ఉన్నపుడు క్రూరమనస్తత్వం ఉంటుంది గదా.

నాతో కూర్చో, ఈ చెట్టు మీదనుండే పాఠం చెబుతా, కాని పాఠం అయేంతవరకూ రాత్రింపగళ్ళు ఎంత కాలమైనా సరే చెట్టు దిగడానికి వీలు లేదు అని రాక్షసుడు అన్నాడు. మరి పాఠం రాసుకోవడానికి పరికరాలు

ఎక్కడ దొరుకుతాయి? అందుకోసం చంద్రశర్మ తన తొడను చీల్చి రక్తంలో ఒక రావి కొమ్మను ముంచి రావి ఆకులపై భాష్యం వ్రాసేడు. ఇట్లా తొమ్మిదిరోజులు గడిచాయి. ఎంత కష్టపడి విద్యను నేర్చుకున్నాడో గమనించారా? బ్రహ్మ రాక్షసునకు శాపవిమోచన మైంది. అదృశ్యమయ్యాడు.

గురువుగారు చెప్పిన పని చేసి తన నిజస్వరూపం తెచ్చుకున్న గౌడునిలో ఆధ్యాత్మికత మొదలైంది. ఆత్మజ్ఞానానికై గురువును వెదకడం మొదలు పెట్టాడు. హిమాలయాలలో నున్న శుకుణ్ణి సమీపించి శరణు జొచ్చాడు. ఇట్లా బ్రహ్మ రాక్షసుడు, గౌడపాదుడయ్యాడు. అతడు వ్రాసిన మాండుక్యోపనిషత్ కారికలకు ప్రముఖ స్థానం ఉంది. అతడే కాలాంతరంలో చంద్రశర్మకు గురువయ్యాడు.

ఇది కేవలం, మాయ యొక్క ఊసెత్తని అద్వైత గ్రంథం. మొదటి భాగాన్ని ఆగమ ప్రకరణ మంటారు. మొత్తం గ్రంథాన్ని ఆగమశాస్త్రమంటారు. మామూలుగా ఆగమశాస్త్రం అంటే, దేవాలయ పూజాదులకు సంబంధించింది. కాని ఇది మాత్రం, అద్వైత వేదాంతానికి సంబంధించింది.

ఈ గ్రంథంలో మాయా ప్రస్తావన లేకపోయినా గౌడపాదుడు అమ్మవారి భక్తుడు కనుక ఆమెను బ్రహ్మ విద్యా స్వరూపిణిగా, మాయా స్వరూపిణిగా భావించాడు. సుభగోదయం అనే శ్రీవిద్యా తంత్రగ్రంథాన్ని రచించాడు.

జ్ఞానము - భక్తి

కర్మ భక్తి మార్గాలలో పరిపక్వత గడిస్తే ద్వైత ప్రపంచం మాయగా భావించి జ్ఞాన మార్గంలో అడుగిడినపుడు ఇక ఈశ్వరుని భజించడం ఉండదు. జగత్తును మాయగానే భావిస్తాడు. మరొక రీతిలో ఈశ్వరుని పట్ల భక్తిని చూపిస్తాడు. తాను నిర్గుణుడని తెలిసినపుడు సగుణంలో ఉన్న ఈశ్వర లీలలను చూసి వినోదిస్తాడు, ప్రార్థిస్తాడు. ఆ స్థితిలో ప్రాణుల పట్ల అనుకంపను చూపించి, భక్తునిగా ప్రవర్తిస్తూ ప్రజల బాగుకోసం స్తోత్రాలు వ్రాస్తాడు. పఠిస్తాడు.

శుకుడే భాగవతోపదేశం చేయలేదా? శంకరులట్టి దశలో స్తోత్రాలు వ్రాయలేదా?

గోవా దగ్గర శిరోదా అనే ప్రాంతంలో గౌడపాదాచార్య మఠం ఉంది. గౌడసారస్వత బ్రాహ్మణులు, ఈ మఠానుయాయులు. ఇట్లా ఈ నర్మదా ప్రాంతం, జాతీయ సమైక్యానికి తోడ్పడింది. గౌడుడు, బెంగాల్‌నకు చెందగా, శంకరులు ద్రవిడ దేశానికి చెందగా గోవింద భగవత్పాదులు కాశ్మీరునకు చెందిన సారస్వత బ్రాహ్మణుడు. ఇట్లా నర్మదా ప్రాంతం అందరికీ కూడలిగా మారింది.

శంకరుల స్తుతి

శంకరులు, గౌడపాదుని కారికలపై భాష్యం వ్రాసారు. ఆ గ్రంథం చివర సంసార సముద్రంలో చిక్కుకొన్న సామాన్యులకు, దేవతలకు కూడా దుర్లభమైన జ్ఞానా మృతాన్ని దయతో పంచి పెట్టారని నుతించారు. పరమ గురువులను పూజ్యులకు పూజ్యునిగా, మహాపూజ్యునిగా కీర్తించారు.

"పూజ్యాపి పూజ్యం పరమగు రు మముం పాదపాతైర్నతోఽస్మి" అని అన్నారు.

జ్ఞాన సముద్రాన్ని మథించి గౌడపాదులు అద్వైతామృతాన్ని అందించారని పేర్కొన్నారు.

గోవిందుని పేరు చివర, శంకరుల పేరు చివర భగవత్పాదులని ఉంటుంది. గౌడపాదులనేది వ్యవహారం. అది పూజ్యపాదకం. ఇక చంద్రశర్మ, శంకరుల గురువైన గోవింద భగవత్పాదులెట్లా అయ్యారు?

చంద్రశర్మ వృత్తాంతం

పూర్వ జన్మలో చంద్రశర్మ, పతంజలియే. గౌడుని బ్రహ్మరాక్షసునిగా పతంజలి శపించాడు. కాని తానందించిన భాష్యం లోకంలో ప్రచారం కావాలి.

అందువల్ల చంద్రశర్మగా అవతరించాడు. ఇప్పుడు శిష్యునికే (గౌడునకు) శిష్యుడయ్యాడన్నమాట. మానవునిగా అవతరించాడు కనుక ఒక గురువును సమీపించి రావి ఆకులపై మరల భాష్యాన్ని వ్రాయవలసి వచ్చింది.

వాటిని ఒక మూట కట్టి నిద్రిస్తూ ఉండగా కొంత భాగాన్ని ఒక మేక నమిలి వేసింది. అది తినిన భాగాన్ని 'అజభక్షిత భాష్యం' అంటారు.

మిగిలిన భాగాన్ని రక్షించి ప్రయాణం చేస్తూ ఉజ్జయిని వచ్చాడు. ఒక వర్తకుని ఇంటి అరుగు మీద కునుకు తీసాడు. అన్ని రోజుల అలసట వల్ల రక్తం పోవడం వల్లా రోజులకొద్దీ నిద్రలో మునిగిపోయాడు. ఆ వర్తకునికి ఒక కూతురుంది. ఇతడు నిద్ర నుండి లేపినా లేవడం లేదు. ఆకలితో మరణిస్తాడని పెరుగన్నం ఒంటినిండా పూసి రుద్దింది. ఆసారమైనా ఒంటబడుతుందని అట్లా చేసింది. కొంత కాలం గడవగా మెళకువ వచ్చి ఆ మూటను చంకన బెట్టుకుని ప్రయాణమయ్యాడు.

ఏమయ్యా! అట్లా వెళ్ళిపోవడం బాగుందా? నీ ప్రాణాన్ని నిలిపిన నా కూతురునిచ్చి నీకు వివాహం చేద్దామనుకుంటున్నానని వర్తకుడన్నాడు.

బ్రాహ్మణుడు వైశ్య కన్యను వివాహమాడడమేమిటి? అది ఈనాటి మాట కాదు. ఏనాటి కాలమో అది. శంకరుల కాలానికే ముందు జరిగిన కథ. వారెన్ని వేల సంవత్సరాల క్రితం ఉన్నారో మనకు తెలియదు కదా! పూర్వయుగాలలో అట్టి వివాహాలుండేవి.

మంట పెద్దదైతే నీటిని చల్లినా ఆరిపోదు. తక్కువ మంట మీద పోస్తే ఇట్టే ఆరిపోతుంది. అట్లాగే బ్రహ్మ తేజస్సంపన్నులైన వారు చేసిన పనులకు దోషం అంటదు కూడా. అట్టివారికి పిల్లలనీయడానికి మిగిలిన వర్ణాలవారూ ముందుకు వచ్చేవారు. ఇట్టివారు కలిలో లేరు కనుక బ్రాహ్మణుడు, బ్రాహ్మణ వర్ణాల స్త్రీని వివాహమాడాలని అన్నారు. కాని చంద్రశర్మ కాలంలో మిగిలిన వర్ణాల స్త్రీలను వివాహమాడడం ఉండేది.

ఇతని ధ్యాస, భాష్యాన్ని నల్గురికీ అందించాలనే తప్ప వివాహం చేసుకోవాలని లేదు. తప్పని సరి పరిస్థితులలోనే అట్టి వివాహాలుండడం వల్ల, ఇతని కట్టి కోరిక లేకపోవడం వల్ల వివాహమాడనని అన్నాడు.

నీ ప్రాణాన్ని నిలబెట్టింది మా అమ్మాయి. తిరస్కరించడం సబబు కాదు, మేము అడగడంలో తప్పు లేదు, రాజుగారి దగ్గరకు వెడదాం పద అని వర్తకుడన్నాడు.

రాజు, చంద్ర శర్మ రూపాన్ని చూసి అంత విజ్ఞానవంతుడికి తన కూతురు నిద్దామనుకున్నాడు. ధర్మశాస్త్రం అంగీకరిస్తుందో లేదో అని మంత్రికి కబురు పెట్టాడు.

బ్రహ్మతేజస్సు గల బ్రాహ్మణులు చతుర్వర్ణాల కన్యలను వివాహమాడవచ్చని శాస్త్ర సమ్మతమని, మంత్రి చెబుతూ తన కుమార్తెను కూడా చంద్రవర్మకు ఇవ్వాలనుకుంటున్నాడు. అందర్నీ వివాహమాడడం భగవత్ సంకల్పంగా భావించి రాజు సరే అన్నాడు. వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కన్యలు అప్పటికే ఉన్నారు. గనక చివరకు సేవ చేసే శూద్ర వనితను చంద్రశర్మ వివాహమాడ వలసి వచ్చింది.

అందరికీ సంతానం కలిగింది. వీరందరికీ భాష్యాన్ని అందించాడు చంద్రశర్మ.

అసలు మామూలుగా జరిగే వివాహాలలో మొదటి సంతానాన్ని ధర్మజుడని, మిగిలిన పిల్లలను కామజులని అంటారు. కనుక జ్యేష్ఠ కుమారునకే కర్మ చేసే అధికారం ప్రాప్తిస్తుంది. నంబూద్రీ బ్రాహ్మణులలో పెద్ద పిల్లవానికే ఆస్తి చెందడం ఉండేది. అట్లాగే రాజ్యాధికారం పెద్ద కుర్రవానికే ప్రాప్తించేది.

ఇక చంద్రశర్మ, జ్ఞానోపదేశం పొందడానికి మహాభాష్యం అందించిన గురువు కోసం వెదకడం మొదలు పెట్టాడు. తన విద్యా గురువయిన గౌడుడు శుకుడి దగ్గర సన్యాసం తీసుకొని హిమాలయాల్లో ఉన్నాడని తెలిసి సమీపించాడు. ఇపుడు విద్యాగురువే, సన్యాసి గురువైనాడు. దీక్షానంతరం,

చంద్రశర్మ గోవింద భగవత్పాదులయ్యాడు. జగద్గురువైన కృష్ణుని ఉన్న నామాల్లో గోవిందుడొకటి. ఆచార్యుల గురువు గోవింద భగవత్పాదుల పేరులో కూడా గోవింద నామం ఉంది. అందుచేత ఆచార్యులకు గోవిందనామం అంటే ప్రీతి. అందుకే భజగోవింద స్తోత్రంలో శంకరులు భజగోవిందం, భజగోవిందం, భజగోవిందం అని మూడుసార్లు అన్నారు.

గురు పరంపరంలో సన్న్యాసులు

నారాయణుని నుండి శుకుని వరకూ ఎవ్వరూ సన్న్యాసి గురువులు కారు. కాషాయం, ముండనాదులు లేవు. నారాయణుడు, బ్రహ్మ, దేవతలకు ఆశ్రమాలుండవు. ఇక వసిష్ఠుడు, శక్తి, పరాశరుడు, వ్యాసుడు ఋషులే. కాని వీరిని కేవలం మనుష్య జాతిగా పరిగణించం. వీరు మంత్రద్రష్టలు. కనుక మానవాతీతులు. దేవతలకూ, మనుష్యులకు వీరు మధ్యనుంటారు. కనుక వీరు సన్న్యాసులు కారు. ఆత్మసిద్ధిని పొందిన వారు. శుకుడు, శిరో ముండితుడని చెప్పబడలేదు. ఆయన అవధూత లేక దిగంబరుడు.

దిక్కులే అంబరంగా అనగా బట్టగా ఉన్నవాడు. కనుక దిగంబరుడు. వస్త్రాన్ని విడిచి పెడితే శరీరం చుట్టూ దిక్కులే యుంటాయి. అట్టివాడు శుకుడు.

నిర్వాణం

గాలిని ఊది దీపం ఆర్పడాన్ని నిర్వాణం అంటారు. అగ్నికి ఉన్న శక్తి నీటికీ, గాలికీ కూడా లేదు. ఒక నిప్పురవ్వ మొత్తం అంతా కాల్చగలదు. అట్టిదానిని కేవలం రూపు లేకుండా చేయవచ్చు.

శరీరాన్నే ఆత్మయని భావించడం జీవాత్మ భావం. ఇది అనేక వాసనలతో కూడి యుంటుంది. అట్టి దానిని మట్టుబెట్టడం మాటలు కాదు. అట్టి దానిని కూడా కేవలం దీపాన్ని ఊదినట్లు పోగొట్టడం నిర్వాణం. అట్టి భావం పొందాలంటే ఎంతో సాధన ఉండాలి. భగవదనుగ్రహమూ ఉండాలి.

బుద్ధుడే ఈ నిర్వాణాన్ని గురించి మొదట చెప్పాడనడం అసంగతం. అంతకుముందే ఈ ముక్త స్థితిని మన గ్రంథాలు నిర్వాణమని అన్నాయి. గీతలో స్థితప్రజ్ఞుని లక్షణాలను చెపుతూ 'బ్రహ్మ నిర్వాణ మృచ్ఛతి' అన్నాడు. సన్న్యాస యోగంలో తన యందే క్రీడించువాడు, సుఖించువాడు, లోచూపు కలవాడైన యోగి, బ్రహ్మ స్వరూపుడై, బ్రహ్మ నిర్వాణాన్ని (బ్రహ్మానందాన్ని) పొందుతున్నాడని చెప్పాడు. (గీత. 5-24)

"యోఽ ంతస్సుఖః అంతరారామః తథా అంతర్ జ్యోతి రేవయః

సయోగీ, బ్రహ్మనిర్వాణం, బ్రహ్మభూతోఽ ధి గచ్ఛతి

బుద్ధుడు, నిర్వాణాన్ని గూర్చి చెప్పాడు. అంతకుముందు భగవానుడు, బ్రహ్మ నిర్వాణాన్ని గురించి చెప్పాడు. బుద్ధుడు, జీవాత్మ భావం పోతుందని, అదే శూన్యస్థితియని చెప్పగా జీవాత్మ భావం పోవడమే కాదు, బ్రహ్మమే అవుతాడని భగవానుడన్నాడు.

శుకుడు, దిగంబరుడని చెబితే పవిత్ర స్థితిలో నున్నాడని, స్త్రీ పురుష భేదం లేకుండా ఉన్నాడని, భేద భావం కలిగినవారు కూడా ఇతని సన్నిధిలో అట్టి భావం కల్గియుంటారని అర్థం.

శుకుడు, ఇంటినుండి నగ్నంగా వెళ్ళిపోతూ ఉండగా నగ్నంగా స్నానం చేసే స్త్రీలు ఇతనిని చూసినపుడు సిగ్గు పడలేదు. తరువాత పుత్ర అని ఆక్రోశిస్తూ వ్యాసుడు వచ్చాడు. జింక చర్మాన్నో, చెట్ల బెరడునో కట్టుకొన్నా ఆయనను చూసి సిగ్గుపడి స్త్రీలు తమ శరీరాన్ని కప్పుకున్నారట.

నేను ముసలివాణ్ణి కదా! ఏమిటీ సిగ్గని వ్యాసుడు ప్రశ్నించాడు. వయస్సుకేమి? అతని పవిత్రత చూసి ఆశ్చర్య చకితులమయ్యాము, మాకూ అతనికీ భేదం కనబడలేదని సమాధానం ఇచ్చారట. అట్టి శుకుని వంటివారికి నియమాలుండవు.

నాల్గు ఆశ్రమాలలోను చివరిది సన్న్యాసము. దానికీ నియమ నిబంధనలుంటాయి. శుకుడు దానికి అతీతుడు. అట్టివారిని 'అత్యాశ్రమి' అంటారు. అంటే వర్ణాలు లేవు, ఆశ్రమాలు లేవన్నమాట.

గురు పరంపరలో దక్షిణామూర్తి తరువాత దత్తాత్రేయుడు. తరువాత విష్ణువు, బ్రహ్మలు. త్రిమూర్తులలో ఉన్న శివుణ్ణి పేర్కొనలేదు. అతడు దక్షిణామూర్తియే కదా! మధ్యమ మణిలా శంకరులు ఈ గురుపరంపరలో ప్రకాశిస్తున్నారు.

శుకుని మాదిరిగానే దత్తాత్రేయుడు కూడా అతివర్ణాశ్రమి. త్రిమూర్తులు కలిగిన రూపంతో ఉన్నా అవధూత సన్న్యాసిలా నిరంతరం తిరుగుతూ ఉంటాడు. సన్న్యాసి అంటే సన్న్యాసాశ్రమం స్వీకరించాడని భావించకండి. సన్న్యాసి మాదిరిగా అన్నిటినీ విడిచి పెట్టాడనే అర్థంలో వాడాను. అతనిదీ ముండిత శిరస్సు కాదు. కాషాయ వస్త్రాలు లేవు. జటలతో, దిగంబరంగా ఉంటాడు.

అతి వర్ణాశ్రమి, ఫలానా రూపంలో ఉండాలని లేదు. రాజులా ఉండవచ్చు. ఒకచోట ఏమీ చేయకుండా ఉండవచ్చు. కాని దత్తుడు, శుకుడు అట్టివారు కాక అన్నిటినీ విడిచిన సన్న్యాసులగా ఉంటారు.

సనక, సనందన, సనాతన, సనత్కుమారులని నల్గురు సోదరులు, జ్ఞానాచార్యులు. విష్ణువు యొక్క 24 అవతారాలలో వీరు కూడా ఉన్నారు. ఈ నలుగురు కలిసినది విష్ణువు కుమారావతారం. ఈ నలుగురులో సనత్కుమారుడున్నాడు కనుక అట్లా అన్నారు. బ్రహ్మకు, ముందు పుట్టిన మానస పుత్రులు వీరే. అందువల్ల వీరు బ్రహ్మకుమారులు. అంతేకాకుండా జీవితాంతమూ వీరు కుమారులుగానే ఉంటారు. దక్షిణామూర్తి, శుకుడు నిత్య యౌవనంలో ఉంటారు. పై సనకాదులకు యౌవనావస్థ లేదు. వారు నిత్య మునివృత్తి మార్గంలో ఉంటారు, జ్ఞానాన్ని పంచిపెట్టారు. మేము, మా మఠాలలో వ్యాసపూజ తరువాత వీరినీ కొలుస్తాం. సనత్సుజాతునితో కలిపి వీరైదుగురు.

గురు పరంపరంలో శుకుని వరకూ ఎవ్వరూ సన్న్యాసాశ్రమం తీసి కోలేదని అయినా బ్రహ్మ జ్ఞానులని, ఆచార్య పురుషులని చెప్పాను.

గృహస్థాశ్రమంలో ఉంటూ కలిలో జ్ఞానోపదేశం చేయడం సబబు కాదు. అట్లాగే అతి వర్ణాశ్రమంలో కూడా. ఈ యుగంలో కొందరు అతివర్ణాశ్రములమని, మాకే నియమాలూ పట్టవని, ఆ పేరుతో అనాచారాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ విషయాలు బాధ కలిగిస్తున్నాయి. అట్టి వారిని చూస్తే నిందింపవలసి వస్తుంది. కలిలో అతి వర్ణాశ్రములు, గురుపరంపరలో కనబడరు. గౌడపాదులవారినుండి సన్న్యాసం నియమాల ప్రకారము తీసుకోవడం మొదలయింది.

అట్లా అని గౌడపాదుల ముందు సన్న్యాసాశ్రమం లేదనుకొనండి. వేదంలో వీటి ప్రస్తావన లేదా? వేదంలో సంహిత, బ్రాహ్మణం, ఆరణ్యకం, ఉపనిషత్తులనే విభాగాలే నాల్గు ఆశ్రమాలను సూచిస్తున్నాయని శంకర సిద్ధాంతాన్ని సరిగా అర్థం చేసుకున్న జర్మన్ విద్వాంసుడైన పాల్ డ్యూయసన్ అన్నాడు. బృహదారణ్యకంలో భార్యను విడిచి యాజ్ఞవల్క్యుడు సన్న్యాసం పుచ్చుకోలేదా? 108 ఉపనిషత్తులలో 10 లేక 15 ఉపనిషత్తులు సన్న్యాసం గురించే ఉంటాయి. అవధూతోపనిషత్తు, సన్న్యాసోపనిషత్తు అని కూడా ఉన్నాయి. మనుస్మృతిలో తురీయాశ్రమం గురించి యుంది. ఈ ఆశ్రమం నుండే 'తురీయ' స్థితిని చేరుకోగలడని స్మృతులన్నాయి. విశ్వేశ్వర స్మృతిలో సన్న్యాసి ధర్మాలు ఉగ్గడింపబడ్డాయి. దీనిని విశ్వేశ్వర సంహిత అని కూడా అంటారు.

శంకరుల పరంపరలో గౌడపాదులు, గోవిందులు, నియమాల ప్రకారం సన్న్యాసం పుచ్చుకున్నవారే.

సన్న్యాసులలో కుటీచక, బహూదక, హంస, పరమహంసలని నాల్గు రకాలవారున్నారు. చివరి తరగతికి చెందినవారు, అద్వైత సంప్రదాయానికి చెందినవారు. వారు తిరుగుతూ ఉంటారు కనుక పరివ్రాజకులు.

శంకరులు స్థాపించిన మఠాలలోని ఆచార్యులు మత కార్యక్రమాలను నిర్వహించాలి కనుక, పరమహంస పరివ్రాజకుల విషయంలో కొంత సడలించారు. ఇది కేవల ధర్మ సంస్థాపన కోసమే.

శాస్త్రాలలో అత్యాశ్రమి, సన్న్యాసస్థితి కంటె అతీతుడైనవాడైన పరమహంసగానే పరిగణింపబడ్డారు.అందు పరమహంస సన్న్యాసులే బట్టలను, దండాన్ని, కమండలువులను విడిచి పెట్టినట్లు ఉంది. శుక, దత్తులట్టివారు. శంకరులు ఛాందోగ్యోపనిషత్తు భాష్యంలో అత్యాశ్రమియనగా పరమహంస పరివ్రాజకులనే వ్రాసేరు. ఇద్దర్నీ కలిపి వాడడం చాలాకాలం సాగింది.

శాస్త్రాలు రెండు రకాలైన సన్న్యాసాన్ని పేర్కొన్నాయి. వివిదిషా సన్న్యాసమని, విద్వత్ సన్న్యాసమని. తురీయాశ్రమాన్ని యతి ధర్మ నియమాలను పాటిస్తూ ఉన్నవాడు అన్నిటినీ విడిచి అత్యాశ్రమి అవుతాడు. వివిదిషయనగా తెలిసికొనుట. సమాధి, ఆత్మ సాక్షాత్కారం, బ్రహ్మానందం ఏమిటో తెలుసుకొనేవాడు. అతడు గృహస్థ జీవితాన్ని గడుపుతూ వాటిని తెలుసుకోవడం కుదరదు. కనుక శాస్త్ర నియామలను పాటిస్తూ దండ, కమండులువులను ధరించి సన్న్యాసం పుచ్చుకొన్నవాడు వివిదిషా సన్న్యాసి.

ఆశ్రమం పుచ్చుకొని, ఆత్మశాస్త్రాన్ని అభ్యసిస్తూ అప్పుడప్పుడు ఆత్మానుభూతి కల్గుతుంది. తరువాత విద్వత్ స్థితి వస్తుంది. తరువాత దండాదులను విడిచి పెడతాడు. అపుడు విద్వత్ సన్న్యాసి.

సన్న్యాసం నుండి సన్న్యాసం పుచ్చుకోవడమంటే విరక్తి పుట్టకుండా సన్న్యాసం ఎందుకులే అనే ఇంటికి తిరిగి రావడం.

అత్యాశ్రమి ఇట్లా తిరిగి రాడు. యతి ధర్మాలనే విడిచిపెడతాడు. సన్న్యాసాన్ని దాటి యుంటాడు. నిరంతరం సమాధి స్థితియే అతని లక్ష్యం.

అంటే అందరూ అట్లా కావాలని లేదు. జనకుడు గృహస్థాశ్రమంలో ఉండే జీవన్ముక్తుడు కాలేదా? బ్రహ్మచర్యా శ్రమంలోనే ఉండి సమర్థ రామదాసు జీవన్ముక్తుడు కాలేదా? ఇక సన్న్యాసంలోనే ఉండి అట్టి స్థితిని పొందిన వారున్నారు.

సాక్షాత్కారం పొందిన తరువాత సన్న్యాసాశ్రమ నియమాలను పాటించినా అతనికేమీ చిత్తక్షోభ ఉండదు. వీరెట్లా ఉండాలో అంతా ఈశ్వర సంకల్పాన్ని బట్టి యుంటుంది. నియామతీతులుగా కొందర్ని తీర్చిదిద్దుతాడు.

గౌడపాదులనుండి, అద్వైత సంప్రదాయంలో నియమాలతో కూడిన ఆశ్రమమే ఉంది. కనుక శంకరులు, సన్న్యాసి నుండే దీక్షను స్వీకరించారు గాని, అత్యాశ్రమి నుండి కాదని సారాంశం.

పైవారిద్దరూ ఒక్కటే అని ఏ సందర్భంలో శంకరులన్నారు? ఛాందోగ్యవనిషత్తులో ఇంద్రుణ్ణి ప్రజాపతి పరీక్ష చేసి ఆత్మ తత్త్వాన్ని అందించాడు. అన్ని కోరికలనూ విడిచి ఆత్మజ్ఞానానికే అంకితమైనవారు, అత్యాశ్రములని వారే పరమహంస పరివ్రాజకులని అన్నారు. ఇట్టివారే ఉపదేశించుటకు అర్హులని అన్నారు.

శంకరుల కాలంలో అట్టి ఉపదేశం ఇచ్చే వారున్నారు. ధర్మం పూర్తిగా కనుమరుగు కాలేదు. బౌద్ధులకు భిన్నంగా సంప్రదాయానికి బద్ధులై ఆత్మవిచారణ చేసేవారుండేవారు.

అందు అత్యాశ్రములు, తురీయాశ్రములూ ఉండేవారు. శంకరులు తురీయాశ్రమం గురువు ద్వారా తీసుకోవాలనుకున్నప్పుడు అత్యాశ్రమి దగ్గరకు వెళ్ళకుండా శాస్త్ర నియమాలను పాటిస్తూ ఆత్మజ్ఞానులైన వారినే గురువులుగా ఎన్నుకొన్నారని సారాంశం. ఉపనయనానికి ముందే అత్యాశ్రమి యైన శుకుని వంటివారి నుండి కాకుండా తురీయాశ్రమంలో ఉంటూ శాస్త్ర నియమాలు పాటిస్తున్న గోవింద భగవత్పాదుల దగ్గరకు వెళ్ళారు. గౌడపాదులకు ప్రత్యేకంగా సన్న్యాసనామం లేదు. గోవిందపాదులకుంది.

సన్న్యాసి నామము - శంకర నామం గొప్పదనం

సన్న్యాసం పుచ్చుకుంటే అసలు పేరు పోయి, మరొక నామం వస్తుంది. ఆది గురువు నుండి శుకుని వరకూ పేర్లల్లో మార్పు లేదు. గౌడపాదులకి ఏ

నామమిచ్చారో తెలియదు. గౌడ దేశం నుండి చదువుకై రావడం, తరువాత పూజ్యవాచక మైన 'పాద' పదంతో ఉండడం కన్పిస్తుంది.

గోవిందునకు పూర్వనామం చంద్రశర్మ. సన్యాసినామం, గోవింద.

శంకరుల అసలు పేరే శంకరుడు. అదే ఆశ్రమం పుచ్చుకున్న తర్వాత కూడా ఉంది. వీరు కైలాస శంకరుల అవతారమని నిశ్చయించి గురువు ఆ పదాన్ని మార్పు చేయకుండా ఉంచాడు. శంకర అనే పదం, నామ కరణం చేసినపుడు తిథి, వార, నక్షత్రాదుల కనుగుణంగా పెట్టారు. ఈ ఆచార్య సంప్రదాయంలో వీరు స్థాపించిన మఠాలలో శంకరాచార్య పదమే ఈనాటికీ వినిపిస్తుంది. అట్టిది మిగతా సంప్రదాయాలలో లేదు. రామానుజ పీఠంలో ఉన్న పీఠాధిపతిని రామానుజులని అనరు.

ఇట్లా ఎందుకు విధించినట్లు? మాకొక సన్యాసి నామం ఉంది. దానికి శంకరాచార్య అనే పదాన్ని ఎందుకు జోడించినట్లు? వారికీ తరువాత వచ్చినవారికీ భేదం లేదని చెప్పడానికా? బాగా లేదు. వారెక్కడ? మేమెక్కడ? హస్తిమశకాంతరం ఉంది.

వారి పేరులోనే శక్తి యిమిడి ఉంది. 59వ పీఠాధిపతియైన బోధేంద్రస్వామి, నామ మాహాత్మ్యాన్ని ఉగ్గడించలేదా? శివ విష్ణు నామాలలో పరమాత్మ ప్రకాశిస్తున్నాడని చెప్పారు.

"అపర్యాప్తం రూపం జగదవన ఏతత్పునరితి
ప్రభుర్భాగర్తి శ్రీహరి గిరిశ నామాత్మక తయా"

కనుక శంకర నామంలోనే శంకరుల శక్తి ఇమిడి యుంది. శరీరం లేకపోవచ్చు. జయ జయ శంకర, హర హర శంకర అంటే చాలు. ఇట్టి తన పేరే ఇతరులకు స్ఫూర్తిని, రక్షణను కల్గిస్తుందని తరువాత వారీ పేరుతోనే ఉండవచ్చని భావించారేమో! అర్హత, లేకపోయినా ఆ పదం అర్హతను సంపాదించి పెడుతుందని సమాధానం చెప్పుకున్నాను. అనుయాయులచే ధర్మ ప్రబోధం చేయించాలని వారి సంకల్పం.

వారి నామాన్ని ధరిస్తే వారి శక్తిని ధరించగలమా? వారి నామమే అట్టి శక్తినిస్తుందని సమాధానం. నీరసంగా ఉన్నవాడు, బలమైన మందును తీసుకొంటే నీరసాన్ని పోగొట్టడానికే అని సమాధానం.

రామానుజులతో పోలిక

శంకరులకు, రామానుజులకు కొన్ని పోలికలున్నాయి. అద్వైతానికి పూర్తిగా విరుద్ధం ద్వైతం. విశిష్టాద్వైతం అట్టిది కాదు. అయితే విధి విధానాలు భిన్నం. మధ్వ సంప్రదాయంలో బ్రహ్మచర్యాశ్రమం నుండే సన్న్యాస స్వీకారం. శిఖాయజ్ఞోపవీతాలుండవు. రామానుజ సంప్రదాయంలోని సన్న్యాసులకు ఇవి యుంటాయి. గృహస్థాశ్రమం నుండి సన్న్యాసం తీసుకుంటారు. మన సంప్రదాయంలో ఏకదండి సన్న్యాసులుంటే వారు త్రిదండి సన్న్యాసులు.

శంకరులు, మధ్వాచార్యులు మఠాలను స్థాపించారు. రామానుజులు స్థాపించలేదు. వీరిలో 72 సింహాసనాధిపతులున్నారు. అందులో సన్న్యాసి మఠం అనే వ్యవస్థ ఉండదు. వైష్ణవ సంప్రదాయం, గృహస్థ పరంపర వల్ల వృద్ధి పొందింది.

శంకర సంప్రదాయంలోని సన్న్యాసులు 'దశనామి' అనే వర్గం లోనివారు ఈ వర్గంలోనిదే, మధ్వాచార్యులు గ్రహించిన తీర్థ సంప్రదాయం. వారి సన్న్యాస నామం ఆనందతీర్థ. కృష్ణ చైతన్యులు ఈశ్వరపురి అనేవారినుంచి దీక్ష స్వీకరించారు. భారతి, పురి అనేవి కూడా దశనామి వర్గంలోనివే. రామకృష్ణ పరమహంసగారు, 'పురి' సన్న్యాసి నుండి ఆశ్రమాన్ని స్వీకరించారు. వారే తోతాపురి.

ఈ దశనామి సంప్రదాయంలో రామానుజులు లేరు. 'యాదవ ప్రకాశ' అనే అద్వైతి దగ్గరకు దీక్షకోసం వెళ్ళినట్లు ఆయనకు గురువు మాటలు నచ్చలేదని అంటారు. ఆశ్రమ స్వీకారానికి ముందట్లా వెళ్ళారట. (అయితే అద్వైత గ్రంథాలలో అట్టి వ్యక్తి ఉన్నట్లు లేదు.)

శంకరులు వర్ణాశ్రమ ధర్మాన్ని ప్రచారం చేయగా రామానుజులు కొంత సడలించారు. అయితే వారి భాష్యాన్ని చూస్తే దీనిని గట్టిగా సమర్థించినట్లుంది. సడలించినట్లున్న కథలు ప్రచారంలో ఉన్నాయి. మధ్వాచార్యులూ వర్ణాశ్రమ ధర్మాన్ని సమర్థించారు.

శంకరులకు విరుద్ధంగా కొన్నిటిని రామానుజులెందుకు ఏర్పాటు చేసారు? ఏదైనా క్రొత్త పార్టీ పెట్టినపుడు సిద్ధాంతాలలో భేదాలుండవా? జెండాలు మారవా? ప్రత్యేకత తప్పక ఉంటుంది. అట్లాగే మధ్వాచార్యుల వారు కూడా.

ఇక పోలికలేమిటి? రామానుజుల పూర్వాశ్రమ నామం లక్ష్మణులు. అంటే రాముని సోదరుడు. అందుచేత రామానుజుడన్నా లక్ష్మణుడన్నా ఒక్కటే. శంకరులు, ఆశ్రమ స్వీకారం చేసిన తరువాత పేరెట్లా మార్పు చెందలేదో, రామానుజుల పేరూ అట్లాగే ఉంది.

లక్ష్మణుడు, ఆదిశేషుడు. రామానుజులను ఆదిశేషుని అవతారంగానే భావిస్తారు.

శంకరులను శివావతారం అంటున్నాం. వైష్ణవులు వారి ఆచార్యులను విష్ణ్వతారమని అనరు. మాధ్వులు, మధ్వాచార్యులను వాయుదేవుడి అవతారం అంటారు.

మరికొన్ని పోలికలున్నాయి. గోవింద భగవత్పాదులు పతంజలి అవతారం. ఆ పతంజలి ఆదిశేషుని అవతారమే. వైష్ణవులు రామానుజులను ఆదిశేషావతారంగా భావిస్తారు. ఇంకో చిత్రమేమంటే శంకర జయంతి, రామానుజ జయంతి ఒకే రోజునే సాధారణంగా వస్తాయి. మనం తిథిని పాటిస్తాం. వారు నక్షత్రాన్ని పాటిస్తారు. అవి సాధారణంగా కలుస్తాయి.

మధ్వాచార్యుల పూర్వాశ్రమ నామం వాసుదేవులు. తరువాత వారు ఆనంద తీర్థులయ్యారు. వీరినే పూర్ణ ప్రజ్ఞులని అంటారు. వాసుదేవ పదానికి వారి సన్న్యాసి నామానికి పోలిక లేదు. కృష్ణ చైతన్యుని పూర్వనామం గౌరాంగుడు.

కృష్ణుడు నలుపు. గౌరాంగుడంటే తెల్లనివాడు. కనుక రెంటికీ పోలిక లేదు. శంకరులకే రెండు ఆశ్రమాలలోని నామాలూ ఒకటయ్యాయి.

గోవిందుల గొప్పదనం

గోవిందులు ఏమి వ్రాసారో తెలియదు. యోగతారావళి, అద్వైతానుభూతి వ్రాసేరని అంటారు. శంకరులే వ్రాసేరనీ ఉంది. శంకరులు వ్రాసేరన్నా గురువులనుండి స్ఫూర్తిని పొందినట్లు భావించవచ్చు. యోగతారావళిలో అష్టాంగ యోగాన్ని అనుసరిస్తే సమాధి స్థితిని పొందవచ్చని అద్వైతానుభూతి కల్గుతుందని చెప్పబడింది. పతంజలి, యోగ సూత్రాలు వ్రాసేడని తెలుసు కదా! ఆ పతంజలియే గోవిందులని చదివాం. అద్వైతాను భూతిలో క్రియతో కూడిన యోగం కాక, కేవలానుభూతి గురించే యుంటుంది.

గౌడపాదులనుండి మహాభాష్యాన్ని నేర్చుకున్నట్లు విన్నాం. అయితే ఇతడేమీ వ్యాకరణ గ్రంథం వ్రాయలేదు. శాస్త్ర ప్రచారం చేసాడు. ఎందరినో శిష్యులను తయారు చేసాడు.

సంగీత శాస్త్రజ్ఞులలో కొందరికి ప్రత్యేక శాస్త్రజ్ఞానం అంటూ లేకపోయినా, సంగీత పరిశోధకుల కంటె ఎందరినో శిష్యులను తీర్చి దిద్దినవారున్నారని విన్నాం. అంటే బుద్ధి కంటె అనుభవానికీ ప్రాధాన్యం. ఇతరులను తీర్చిదిద్దడం మాటలా?

బుద్ధిమంతులు కావచ్చు, కాని అందరూ అధ్యాపకులు కాలేరు. అట్టి ఆచార్యత్వం గోవిందులలో ఉంది.

అయితే మామూలు శిష్యునిగా తీర్చిదిద్దినట్లు శంకరులను తీర్చి దిద్దాలా? పరమేశ్వరుడు శంకరులుగా అవతరించినపుడు శిష్య గురు సంప్రదాయాన్ని తెలియపరచాలని గురువుల గొప్పదనం, శిష్యులను తీర్చిదిద్దే పద్ధతి లోకంలో తెలియజెప్పాలని శిష్యుడిగా చేరారు.

శంకరులు చాలా వినయంతో గురుస్తోత్రం చేసారు. గుర్వష్టకం వ్రాసేరు. వివేక చూడామణి గ్రంథంలో తన గురువునిట్లా నుతించారు:

"సర్వ వేదాంత సిద్ధాంత గోచరం తమ్ అగోచరం

గోవిందం పరమానందం సద్గురుం ప్రణతోస్మ్యహం"

(సద్గురుం బదులు మద్గురుం అనే పాఠం కూడా ఉంది.)

వారు పరమానంద స్వరూపులని, వారిని సమీపించడం కష్టమైనా దయతో శిష్యులనుగ్రహిస్తారని అన్నారు. ఎట్లా? వేదాంత సిద్ధాంతాన్ని, సాధన మార్గాలను చెప్పి వాటిద్వారా తన దగ్గరకు చేరునట్లు చేస్తారని చెప్పబడింది. అందుకనే ఈ శ్లోకం, సర్వ సిద్ధాంత గోచరం అని మొదలు.

ఈ శ్లోకాన్ని బట్టి ఇది ఒక మానవ మాత్రుని కాదని పరమాత్మనే సంబోధించినట్లు లేదూ?

అట్టి భావన ఉంటే మానవ గురువు యొక్క అవసరమే ఉండదు. శాస్త్రాల ప్రకారం పరమాత్మయే గురు రూపంలో వస్తాడని ఉంది. అయితే మనకొక సందేహం కల్గుతుంది. ఈయనకు పరమాత్మానుభవం ఉందా? అట్టి అనుభూతి కలిగినవాడే వీరు పేర్కొన్న గురువు వంటివారు కావాలి.

బదరికాశ్రమంలో గోవిందులకు వ్యాస దర్శనమైంది. ఒక అవతార పురుషునకు నీవు గురువు కావాలని వ్యాసుడు వీరితో అన్నాడు. ఈశ్వరుని మాట వ్యాసుని ద్వారా వెలువడింది.

సంప్రదాయం ప్రకారం ఒక గురువు, ఒక శిష్యుడు ఉండాలి కనుక అవతార పురుషునికి కూడా ఒక గురువుండాలి. "నీవు కొంత దూరం అతణ్ణి వెదకడానికి వెళ్ళు, అతడు సద్గురువును వెదుకుతూ వస్తాడు. భారతదేశం మధ్యలో నర్మదాతీరం ఉంది. అక్కడ ఇద్దరి సమాగమమని" వ్యాసుని తీర్పు. అపుడు వ్యాసుడే కాదు, శుకుడు, గౌడపాదులు, గోవిందులు అందరూ కలిసే యున్నారు. అది ఒక రకమైన Round Table Conference.

పతంజలి చరితంలో ఆదిశేషుని నుండి మొదలై గౌడపాద, గోవిందుల కథ వరకూ ఉంటుంది. శంకరుల కథ సూక్ష్మంగా చెప్పబడింది. ఎనిమిదవ సర్గలో, రామభద్ర దీక్షితులు, పూర్వాచార్యుల గురించి విపులంగా వ్రాసేరు. ఇక అనేక శంకర విజయాలలో శంకరుల చరిత్ర విపులంగా ఉంది. కనుక సంక్షేపించాడు. వీరి పుస్తకంలో మొసలి శంకరుల కాలును పట్టుకోవడంతో మొదలౌతుంది. కంచిలో శంకరులు చివరి కాలంలో ఉన్నట్లు వ్రాసేడు

"గోవింద దేశికం ఉపాస్య చిరాయ భక్త్యా
తస్మిన్ స్థితే నిజమహిమ్ని విదేహ ముక్త్యా
అద్వైత భాష్యం ఉపకల్ప్య దిశో విజిత్య
కాంచీపురే స్థితిం అవాప స శంకరార్యః

ఈ శ్లోకంలో శంకరులు గురువుకై వెదకడం, ఉపదేశాన్ని పొందడం, కాశీకి వెళ్ళడం, భాష్య రచన, దేశం నలుమూలలా తిరగడం చివరకు కంచిలో ఉన్నట్లు సూక్ష్మంగా చెప్పబడింది.

నర్మదా తీరంలో గురువుదగ్గర శంకరులు చాలాకాలం ఉండలేదు. గోవిందులు తాము వచ్చిన పనియై పోయిందని విదేహ ముక్తి పొందారు. తరువాత శంకరులు గురువయ్యారు. మరొక కథ కూడా ఉంది. జగదాచార్యులుగా దిగ్విజయం చేసారని, కైలాసానికి వెళ్ళారని, పరమ శివుని నుండి పంచలింగాలను పొందారని, గోవిందులను దర్శించుకొని దక్షిణామూర్తి అష్టకం వ్రాసేరని ఉంది. పతంజలి చరితం ప్రకారం గోవిందులు ముక్తిని పొందిన తరువాతే శంకరులు ఆచార్యత్వాన్ని వహించినట్లుంది. భాష్యాలను వ్రాసి కంచిలో ఉన్నట్లుంది.

గురురత్నమాలలోని గోవింద స్తుతిలో ఒకపుడు హరితల్పమైనవాడు, భూభారం వహించినవాడు లక్ష్మణునిగా, బలరామునిగా పతంజలిగా అవతరించిన వాడు చంద్రశర్మయై గోవిందముని యైన వానికి జయమగు గాక అనే స్తుతిలో పూర్వాపరాలన్నీ తడుమబడ్డాయి.

"హరితల్ప హరాంఘ్రి నూపురక్ష్మాధర
సౌమిత్రి, బల, అత్రిపుత్ర లక్ష్మా..."

ఆచార్య పరంపర యొక్క విశిష్టత

శంకరుల గురించి తెలుసుకోవాలంటే వారి పూర్వాచార్యులను గురించి తెలుసుకోవాలని ఇదంతా చెప్పాను.

ఒక ఆచార్యుని తరువాత మరొక ఆచార్యుడు అంది పుచ్చుకుంటాడు. ఆత్మజ్యోతి నిరంతరము వెలుగుతూ ఉండవలసిందే. జ్ఞానమనే విద్యుత్తు నిరంతరం ఉంటేనే ఆచార్య పరంపర కొనసాగితేనే ప్రపంచము వెలుగులో ఉన్నట్లుంటుంది. ఒక విద్యుత్ పరికరాన్ని 'ఛార్జి' చేసారని అంటాం. ఆఫీసరు ఒకడు బదిలీ అయి అతని బాధ్యతలను మరొకనికి అప్పజెప్పినపుడు ఛార్జ్ ఇచ్చారని అంటారు. జ్ఞానమనే విద్యుత్‌తో గురువు, శిష్యుణ్ణి ఛార్జి చేస్తాడు. పీఠాన్ని ప్రతివ్యక్తీ అధిరోహించడానికి వీలు లేదు. తగిన అర్హతలుండాలి. గురు పరంపర నిరంతరమూ సాగుతూ ఉండాలి.

ప్రార్థన - వరము

దక్షిణామూర్తి మఱ్ఱిచెట్టు క్రింద నుండగా కర్మానుష్ఠానం క్షీణించిందని, దేవతలు మొరపెట్టారు. నారదుడు, ముందుగా బ్రహ్మను సమీపించాడని తరువాత కైలాసానికి దేవతలతో కలిసి వెళ్ళాడని ఒక శంకర విజయంలో ఉంది. అదే ఆనంద గిరీయం.

శ్రుత్యాచారం (వేదాచారం) పోయి మిథ్యాచారం ప్రబలిందని అన్నాడు:

"శ్రుత్యాచారం పరిత్యజ్య మిథ్యాచారం సమాశ్రితః"

ఒక మూల బౌద్ధులు వేదాలను, కర్మానుష్ఠానాన్ని వర్ణాశ్రమ విభజనను ఖండిస్తున్నారని, యజ్ఞభూమిలో యోగులంటే చెవులు మూసుకుంటున్నారని,

మరొక మూల వైదిక పద్ధతులను విసర్జించి శైవ వైష్ణవులు, లింగ ముద్ర చక్ర ముద్రలు వేయించుకుంటున్నారని, ఇక కాపాలికులు తలలు కోసుకుంటున్నారని నీవవతరించి వేద మార్గాన్ని స్థాపించ వలసిందిగా వారు వేడుకున్నారు.

'ధర్మ స్థాపయతుశ్రౌతం, జగత్ యేన సుఖం వ్రజేత్'

అని ప్రార్థించినట్లు మాధవ శంకర విజయంలో ఉంది. (ఇది విద్యారణ్యులు వ్రాసినది కాదని చారిత్రకులంటారు). అవతరిస్తానని ఆయన మాట ఇచ్చాడు.

బ్రహ్మమొక్కటే అనే దానిని మరిచారని, జీవులు, బ్రహ్మము కంటె భిన్నులనే అజ్ఞానంలో ఉన్నారని, మాయ వల్ల ద్వైత జ్ఞానంలో ఉన్నారని, ఒకయతీంద్రునిగా అవతరిస్తానని పరమేశ్వరుడన్నాడని ఉంది. నేను నల్గురు శిష్యులతో మహావిష్ణువు యొక్క నాల్గు చేతులు మాదిరిగా అవతరిస్తానని అన్నాడు. దుష్టాచారాలను పోగొట్టడానికి, ధర్మస్థాపన చేయడం కోసం సూత్ర భాష్యాన్ని వ్రాసి వేదాంత తాత్పర్యం, అద్వైతమేయని ప్రతిపాదిస్తానని అజ్ఞానమనే చీకటిని పారద్రోలుతానని అన్నట్లుంది.

"దుష్టాచార వినాశాయ, ధర్మ సంస్థాపనాయచ
భాష్యం కుర్వన్ బ్రహ్మసూత్ర తాత్పర్యార్థ వినిర్ణయం
మోహన ప్రకృతి ద్వైతధ్వాంతం అధ్యాత్మ భానుభిః
చతుర్భిః సహితం శిష్యైః చతుర్భిః హరివత్ భుజైః
యతీంద్ర శంకరో నామ్నా భవిష్యతి మహీతలే"

యమ, యతి పదాలకు ధాతువొక్కటే. అణచుటయనే అర్థం. యముడు జీవులను శిక్షిస్తాడు. యతి, ఇంద్రియాలను, మనస్సును అణచేస్తాడు. యముని కర్మ, క్రూరంగా కన్పిస్తుంది. జ్ఞానంతో యతి అణుస్తాడు. కనుక యతి కూడా యముడే. దీనికి 'సం' అనే ఉపసర్గ చేర్చబడి సంయమి అయింది. అందుకే సన్న్యాసులను సంయములని అంటారు.

దేవతల అవతారం

ఈ అవతరించుటలో దేవతలకూ తగు ప్రాధాన్యం ఉంది.

త్రిపురాసుర సంహారంలో దేవతలందరూ శంకరునకు సాయం చేస్తామని వివిధాయుధాలతో వచ్చారు. అన్నిటినీ ఇతడుపయోగించుకున్నాడా? ఒక నవ్వు నవ్వాడు. అదే అగ్నియై త్రిపురాసురులను భస్మీపటలం చేసింది.

అట్టి లీలలను ప్రదర్శించిన భగవానుడు మరొక లీలను ప్రదర్శించపబోతున్నాడు. ఒక శంకర విజయంలో దేవతలకూ తగిన పాత్ర ఇచ్చినట్లుంది.

రామాది అవతారాలలో దేవతలు తమ వంతు పాత్రను పోషించారు. శంకరుడు ఈ అవతారంలో నలుగురు శిష్యులు కావాలనుకున్నాడు. అందుచేత పద్మపాదుడు, విష్ణ్వంశతో, హస్తామలకుడు వాయ్వంశతో; తోటకుడు అగ్న్యంశతో, సురేశ్వరుడు బ్రహ్మాంశతో అవతరించారు.

బ్రహ్మతో సరస్వతి కూడా వచ్చింది. ఈ అవతారంలో ఆమె పేరు సరసవాణి.

ఇంద్రుడు, సుధన్వుడనే రాజయ్యాడు. సుధన్వుడు కుమారిలునితో, సరసవాణి, సురేశ్వరునితో సంబంధం కల్గియుంది. వీరిని గురించి కూడా చెప్పుకోవాలి.

బౌద్ధమత ఖండనలో మీ మాంసకుల సాహాయ్యం

సురేశ్వరులకు, తోటి శిష్యులకు తేడా ఉంది. మిగిలిన ముగ్గురు బ్రహ్మచర్యం నుండే సన్యాసం స్వీకరించారు. ఇతడు శంకరుల కంటె వయస్సులో పెద్దవాడు. ఇతడు గృహస్థుడుగా ఉన్నప్పుడు మీమాంసకుడు. అద్వైత ఖండన చేసేవాడు. శంకరుని వాదనా పటిమచే అద్వైతాన్ని స్వీకరించి సన్యాసి అయినాడు. గృహస్థుగా నున్నప్పుడు అతని పేరు మండన మిశ్రుడు. బ్రహ్మయొక్క అంశతో జన్మించినవాడు.

యజ్ఞం, కర్మానుష్ఠానానికి చెందింది. యజ్ఞంలో నాల్గురకాలైన ఋత్విక్కులుంటారు. యజ్ఞాన్ని పర్యవేక్షించే వానిని బ్రహ్మ అని అంటారు. మీమాంసకుడైన ఇతడు, బ్రహ్మాంశతో పుట్టడం బాగానే ఉంది.

మరొక మీమాంసకుడు, సుబ్రహ్మణ్య స్వామి యొక్క అవతారం కుమారస్వామి అంశతో పుట్టాడు కనుక కుమారిలభట్టుగా వచ్చాడు. అతని సిద్ధాంతానికి భాట్ట మతమనే పేరు. యజ్ఞంలో అగ్నికి ప్రథమస్థానం. అగ్నియే సుబ్రహ్మణ్యుడు. అందుకే కర్మ మీమాంసకు అనుకూలంగా ఉంది. ముందితడు అద్వైత వేదాంతాన్ని ఎదుర్కొన్నవాడే. చివరకు శంకరుల జ్ఞాన మార్గాన్ని అంగీకరించాడు. అయితే శంకరుల శిష్యుడు కాలేదు. వారి కథ తరువాత చెబుతా.

శంకరులు జ్ఞాన మార్గాన్ని వీరు కర్మ మార్గాన్ని ఎన్నుకొనడమేమిటి? పరస్పరం వాగ్వాదాలేమిటి? వారు దేవతలైనపుడు దేవుడైన శంకరులకు తోడ్పడవద్దా అని శంకిస్తాం.

ఎదుర్కొనుట సత్యమే. అప్పుడే సాయం చేసారంటున్నా. ఇతర శిష్యులకంటె ఇట్టివారి వల్లనే మహోపకారం జరిగింది. చిత్రంగా ఉంది కదూ!

పైవారిద్దరూ బౌద్ధమతాన్ని ఖండించడంలో చాలా తోడ్పడ్డారు. మీమాంస అనే ఆయుధంతో ఎదుర్కొనడం వల్ల శంకరుల పని చాలా సులువైంది.

బౌద్ధమెట్లా భిన్నం?

బౌద్ధం, వైదిక పద్ధతిని ద్వేషించినా వీరి సిద్ధాంతాన్ని కొంతవరకూ అద్వైతం స్వీకరించింది. బౌద్ధులు, మాయను అంగీకరిస్తారు. మనస్సును పూర్తిగా మట్టు పెట్టడాన్ని నిర్వాణాన్ని పొందడాన్నే లక్ష్యంగా పెట్టుకుంటారు. మనస్సు నశించినా బ్రహ్మము ప్రకాశిస్తుందనే మాటను పేర్కొనకుండా శూన్యమనే అంటారు. అక్కడే వారికీ మనకూ తేడా. ఇంకా కొన్ని భేదాలున్నా జ్ఞాన సిద్ధాంతంలో వేదాంతానికి పూర్తిగా భిన్నం మాత్రం కాదు.

వారు భగవానుని అంగీకరించరు మనం భక్తిని స్వీకరిస్తాము కనుక మన ధర్మానికి అది విరుద్ధం. ఇక కర్మల విషయంలో వారు పూర్తిగా యజ్ఞాలను, మిగిలిన వాటిని వ్యతిరేకిస్తారు కనుక మనకూ వారికీ పడదు. చాలా వాటిల్లో వైదిక ధర్మం కంటె భిన్నం.

భగవంతుడున్నాడనుట

అందరూ భక్తికి మ్రొగ్గు చూపుతారు. ప్రతిదీ కారణకార్యాలతో ముడిపడి యుంటుంది కనుక దీనికంతటికీ ఒక కారణమైన ఈశ్వరుడున్నాడని చాలామంది నమ్ముతారు. అట్టిది లేదంటే విని ఆశ్చర్య పడతారు. లేదనే వారి తర్కం, ప్రజలను ఆకర్షించలేదు. వారు ప్రజలను ఆకర్షించినా భగవద్భక్తిని ప్రజలనుండి దూరం చేయలేకపోయారు. అందువల్ల ప్రజల మనస్తత్వానికి అనుగుణంగా ఏదో ఒక రూపంలో బౌద్ధులు పెట్టవలసి వచ్చింది. దేవుడు లేడనేవానికే వారు విగ్రహాలు పెట్టి పూజించారని లోగడ వివరించాను. ఇట్టి స్థితిలో శంకరులకు, వారితో పెద్దగా చర్చించవలసిన అవసరం లేకపోయింది. భక్తి తత్వాన్ని వైదిక మార్గంలో ఉన్నదాన్నే ఇంకా బలపరచడం కోసం, అనేక స్తోత్రాలను శంకరులు వ్రాసేరు. యంత్ర ప్రతిష్ఠాపనలు చేసారు. ప్రజలతో కాపాలికాచారాలను, వామ మార్గాలను ఖండించి వైదిక పద్ధతికి దోహదం చేసారు. బుద్ధి బలంతో భక్తిని పాదుకొల్పలేం. హృదయ బలంతోనే వ్యాప్తి చేయగలమని శంకరుల భావించారు.

భగవానుడు ఈ సమస్త ప్రపంచానికీ ఉపాదాన కారణంగా, నిమిత్త కారణంగా ఉన్నాడని శంకరులు ప్రతిపాదించారు. అంటే ఏమిటి? ఒక వస్తువును తయారు చేయాలంటే ఒక ముడిపదార్థం లేదా మూల పదార్థం ఉండాలి. ఒక నగను తయారు చేస్తే దానికి బంగారమో, వెండియో ఉండాలి. ఇంటికి ఇటుకలు కావాలి. నగకు బంగారం, ఉపాదాన కారణం.

నగ కంసాలియుంటేనే తయారవుతుంది. కనుక ఇతడు నిమిత్త కారణమౌతాడు.

అద్వైతం ప్రకారం ఉపాదానమూ, నిమిత్తమూ ఈశ్వరుడే. కనబడే జగత్తు, మిథ్యయని, ఉన్నట్లు కన్పిస్తోందని ఇది శాశ్వతం కాదని, శాశ్వతమైనట్లుగా ఉందని అనినప్పటికీ నిత్య వ్యవహారం సాగిపోతుంది. ఇట్లా తాత్కాలికంగా సత్యమనిపించే దానిని వ్యవహార సత్యమన్నారు. దీనికి మూల వస్తువూ ఉండాలి. తయారు చేసేవాడూ ఉండాలి. ఈ రెండూ ఒకటంటుంది అద్వైతం. అతడొక మూల వస్తువుతో చేసాడంటున్నాం. అది ఎక్కడినుండి వచ్చింది? అతనికంటె మరొకటి లేదు కదా! అతని నుండే వచ్చిందని, అతడే వివిధ వస్తువులుగా కన్పడేటట్లు చేసేవాడని, ఉపాదన నిమిత్తాలతడే అంటుంది. కలలో అనేకమైన వాటిని చూస్తున్నాం. ఇవి ఎక్కడినుంచి వచ్చాయి? మన మనస్సు నుండే ఈ స్వప్న ప్రపంచం రాలేదా?

కొన్ని మతాలుభగవానుడు లేడనగా కొందరు భగవానుడు నిమిత్త కారణమని, అణువులచే నిర్మించాడని, అనగా అద్వైతం రెండూ ఆయనే అంటుంది.

జగత్తునకు, ఈశ్వరుడు కర్త కాదని సాంఖ్యులంటారు. ఈశ్వరుడు జ్ఞాన స్వరూపుడని అంటారు. అట్టి జ్ఞానం నుండి ఈ భౌతిక జగత్తు రాదంటారు. శంకరులేమన్నారు? భౌతిక జగత్తు చైతన్యం నుండి రాదని, భౌతిక జగత్తు శాశ్వత సత్యం కాదని, మాయవల్ల కన్పిస్తున్నట్లుందని ఇది మాయయేయని, మన కల్పనల వల్ల ఉన్నట్లుందని అంటారు. ఆ కల్పన, మన బుద్ధి నుండి వచ్చింది. ఈశ్వరునిలోని కల్పన కూడా అంతే! అతని బుద్ధినుండే అతని చైతన్యం నుండే వచ్చిందనడంలో వైరుధ్యం ఏముంది? కనుక ఈ కల్పనా ప్రపంచానికి ఈశ్వరుణ్ణి కర్తయని అంటున్నాం. పదార్థం కూడా శక్తియేయని నేటి సైన్సు అంటోంది కదా!

కలలో కొన్నిటిని చూస్తున్నాం. చూస్తున్నంతసేపూ అవి ఉన్నాయి .మెలకువ వస్తే లేవు. కలలో అవి ఎట్లా తాత్కాలికంగా ఉన్నాయో జగత్తు కూడా కొంతకాలముంటుంది. నిత్య సత్యం కాదని అంటారు. ఈ కల్పనా ప్రపంచానికి ఈశ్వరుడే కర్త అవుతున్నాడు.

మనం కర్త అనే పదాన్ని వాడగా క్రైస్తవులు కర్తర్ అంటారు.

అది మాయయైనా కల్పనయైనా, ఈ కల్పించే వాడొకడుండాలి. కనుక కర్త, ఈశ్వరుడని, శంకరులు సాంఖ్య సిద్ధాంతాన్ని ఖండించారు.

ఫలదాత ఈశ్వరుడని, జడమైన కర్మ, ఫలాన్నియ్యదని, సమష్టి బుద్ధితో నున్న ఈశ్వరుడే ఎవరెవరికి ఏయే కర్మలకు తగిన ఫలాన్ని నిర్దేశించగలడని నిర్ధారించి మీమాంసకుల మతాన్ని ఖండించారు.

ఇట్లా భగవంతుడున్నాడని, ప్రజలలో భక్తిని పాదుకొలిపి, వైదిక కర్మలను ప్రోత్సహించి, క్రూరాచారాలను ఖండించి వైదిక మతాన్ని దృఢతరం చేసారు.

ఆనాడు తాంత్రికాచారాలుండేవి. 64 తంత్రాలు ఉండేవని, 'చతుష్షష్ట్యా తంత్రైః' అని సౌందర్య లహరిలో (31 శ్లో) అన్నారు. ఒక్కొక్క తంత్రానికి ఒక్కొక్క దేవత. దీనిని ఆగమమని అంటారు కూడా. వైదిక ధర్మానికి దూరంగా ఉంటే వీటిని నమ్మనవసరం లేదని శంకరులన్నారు. వేద సమ్మతాలనే స్వీకరించండన్నారు. ఇందు కౌల మార్గమని, మిశ్రమార్గమని, సమయ మార్గమని ఉన్నాయి. ఇందు కౌలం స్వతంత్రమైనది. మిశ్రమార్గంలో అక్కడక్కడా వైదికాచారాలుంటాయి. సమయ మార్గం మాత్రం వైదిక పద్ధతిలో ఉంటుంది. దీనిని శంకరులు సమర్థించారు.

శంకరుల తరువాత ఉదయనాచార్యులు వచ్చి, భగవంతుడున్నాడని బౌద్ధులను గట్టిగా ఎదుర్కొన్నారు. వారి న్యాయ కుసుమాంజలి ప్రసిద్ధం. శంకరుల పనిని పూర్తిగా నెరవేర్చినవారు వీరే.

శంకరుల వర్గీకరణం

కర్మానుష్ఠానాన్ని స్థాపించడంలో కుమారిలునిది ప్రధాన పాత్ర. బౌద్ధాన్ని వారీ విషయంలో ఎదుర్కొన్నారు. శంకరుల దృష్టిలో కర్మ, ప్రాథమిక మైనది. ఇది చిత్త శుద్ధికి తోడ్పడేది. తరువాత జ్ఞాన విచారం చేయాలని దానివల్లనే మోక్షమని ప్రతిపాదించారు. ఇదిప్రాథమికం కాదని, జీవితాంతం కర్మానుష్ఠానమని కుమారిలుని సిద్ధాంతం. జ్ఞాన విచారణ అక్కర్లేదని దీనివల్లనే మోక్షమని గట్టిగా నమ్మారు. కనుక బౌద్ధుల నెదుర్కొనడంలో, కర్మానుష్ఠానం విషయంలో శంకరుల పాత్ర కంటె వీరి పాత్ర ఎక్కువ. జైమిని సూత్రాలకు శబరస్వామి భాష్యం వ్రాయగా దానికి వీరు వ్రాసిన వార్తికంలో అనేక ఉపపత్తులను చూపించి బౌద్ధులను ఢీకొన్నారు.

దేవుడు లేడనే విషయంలో బౌద్ధులతో ఢీకొని తీవ్రంగా వాదించినవాడు, ఉదయనుడు. కర్మలు అక్కర్లేదనే విషయాన్ని ఖండించినవాడు కుమారిలుడు. ఇక శంకరులు చేసిందేమిటి?

శంకరుడు, శంకరులుగా అవతరించడానికి ముందే శంకర తనయుడైన కుమారస్వామి, కుమారిలునిగా అవతరించాడు.

మరొక చిత్రం పై వారిద్దరూ శంకరుల పనిని తేలిక చేసారు. ఉదయనునికి ముందున్న న్యాయ సిద్ధాంతాన్ని శంకరులు ఖండించారు. పెక్కు ఆత్మలని న్యాయం అంటుంది. ఉన్నది ఒక్కటే ఆత్మయని అద్వైతం అంటుంది. కనుక దీనినీ ఖండించవలసి వచ్చింది. దీనిని పెద్దగా ఖండించకపోయినా కుమారిలుని మతాన్ని గట్టిగా ఖండించారు. తరువాత సాంఖ్యులను. వారు చెప్పిన పురుష – ప్రకృతి సిద్ధాంతం, మన బ్రహ్మ – మాయ వంటిదిగా కనబడినా వేదాంతానికి భిన్నంగా కనబడడం వల్ల ఖండించారు. అయితే ఇందున్న తత్త్వ విభజనను స్వీకరించారు. అయితే వేదాంతానికి ఎట్లా భిన్నమో చెప్పవలసి వచ్చింది. ఆపైన సాంఖ్యం కేవలం బుద్ధితో సంబంధించినది.

బౌద్ధికం, సామాన్యులలో వ్యాప్తి పొందలేదు. ఇక కర్మానుష్ఠానం నిత్య జీవితంలో ఉంటుంది కనుక ఎంతవరకూ దీనిని గ్రహించాలనే విషయంలో మీమాంసకులతో పేచీ పడి ఇదే పరమార్థం కాదని ఖండించవలసి వచ్చింది. ఒక దశలో దీని ఊసు, ఎత్తకూడదని ఆత్మానుభూతియే పరమ గమ్యమని చెప్పవలసి వచ్చింది. శ్రౌతస్మార్త కర్మల అవసరం ఉన్నా అదే పరమార్థం కాదని చెప్పవలసి వచ్చింది.

ఒక గాయం తగిలింది, దానికి కట్టు కట్టాం.గాయం మానింది. మానినా ఇంకా కట్టు కట్టుకొని యుండండని అనడం సబబుగా ఉందా? అట్లాగే జ్ఞానావస్థలో కర్మకాండలలో మునగవద్దని శంకరులన్నారు.

ఇక మండన మిశ్రులు మీమాంసపై గ్రంథం వ్రాసారో లేదో! మీమాంసానుక్రమణిక గ్రంథం వ్రాసినవారు, వీరు కాదని వేరని అంటున్నారు. వారు సన్న్యాసం పుచ్చుకొన్న తరువాత వ్రాసిన గ్రంథాలు లభ్యమౌతున్నాయి.

కర్మవాదుల అవతార కారణం

ముందు వీరెందులకు అవతరించనట్లని సందేహం. బ్రహ్మ – కుమార స్వాములు సురేశ్వరులుగా, కుమారిలభట్టుగా అవతరించారు. పరమేశ్వరునితో దేవతలు కర్మానుష్ఠానం లోపించిందని అన్నారని విన్నాం. మనమిచ్చే ఆహుతులే దేవతలకాహారం. జ్ఞాన మార్గంలో ఉన్నవాడెట్లాగూ కర్మ చేయడు. కనుక దేవతలు జ్ఞానులంటే ఇష్టపడరు. కర్మిష్ఠులనే కోరుతారు.

కర్మ పూర్తిగా పోయినపుడు తానవతరించి ఏం ప్రయోజనమని, ముందు కొంతకాలం యజ్ఞాలు మొదలైన కర్మకాండ సాగనీ అని శంకరుడు భావించి యుంటాడు.

బౌద్ధులు, జ్ఞానం గురించి మాట్లాడుతున్నారు. మనం ఇప్పుడు వెడితే ఏది వైదిక జ్ఞానమో, ఏది కాదో అనే సందేహం ప్రజలలో కలుగుతుందని ముందుగా వారిని పంపించారు.

ఇంద్ర సరస్వతుల అవతారాలు

ప్రభుత్వ సాహాయ్యం లేకుండా శంకరుల కృషి

కొన్ని పుస్తకాలలో ఇంద్రుడు, సుధన్వుడనే రాజుగా వచ్చి కుమారిలభట్టునకు సాయం చేసినట్లుంది. ఇంద్రుడట్లా రావడం, దేవతలకూ ఉపయోగకరమే.

ప్రభుత్వం అండగా ఉంటే కుమారిల భట్టు జయించాడని భావించినా శంకరులు మాత్రం ఎట్టి సాయం లేకుండానే తమ బుద్ధి బలంతో ప్రతిపక్షులనెదుర్కొనారు. బౌద్ధమతం, జైనమతం, రాజుల ప్రోద్బలంతో వృద్ధి పొందాయి. అప్పర్, జ్ఞాన సంబంధర్, పల్లవ, పాండ్యరాజులును మరల వైదిక మార్గంవైపు మళ్లించారు. రాజెప్పుడైతే మారాడో ప్రజలూ వైదిక మతం వైపు మళ్ళారు. అటువంటిది శంకరుల జీవితంలో కనబడదు. వారి కాలంలో పెద్ద పెద్ద రాజులూ లేరని, చక్రవర్తి లేకపోవడం వల్ల వర్ణాశ్రమ ధర్మం క్షీణించిందని వారి 'సూత్రభాష్యం' వల్ల అవగతమౌతుంది.

రాజుల ప్రోద్బలంతో కుమారిలుడు, మండన మిశ్రుడు బౌద్ధమతాన్ని ఖండించడంతో బాటు అద్వైతాన్ని, ఎదుర్కొనగా శంకరులు వీరిని ఎదుర్కొని ఖండించారు. కుమారిలునితో వివాదానికి అవకాశం ఏర్పడలేదు. కాని వారి శిష్యుడైన మండన మిశ్రునితో 21 రోజులు వాదించి ఓడించారు. మండనుడు గృహస్థు కనుక, సరస్వతి, ఇతని భార్య సరసవాణిగా వచ్చింది.

మరొక కారణం ఉంది. శంకరుల సర్వజ్ఞత్వాన్ని పరీక్షించాలంటే సాక్షాత్తూ సరస్వతియే దిగి రావాలి. అందుకే ఆమె అట్లా అవతరించింది.

దేవతలు మొరపెట్టడం, శివగురు, ఆర్యాంబల మొరలాలించి శంకరుడే శంకరులుగా అవతరించాడు. ఇది ఎట్లా, ఎప్పుడో చూద్దాం.

కేరళ చరిత్ర

కేరం అంటే కొబ్బరి చెట్టు. అవి ఎక్కువగా నున్న దేశం కేరళ దేశం. ఒక మూల పర్వతాలు, మరొక మూల సముద్రం మధ్యనున్న దేశమది.

పరశురాముడు, దుష్ట క్షత్రియులపై 21 సార్లు దండెత్తాడని తెలుసు. ఇతనికి విరక్తి కలిగింది. ఈ రాజ్యాన్ని నేనేం చేసుకోను? నేను చేసిన కర్మలకు ప్రాయశ్చిత్తం చేసుకొని తపస్సు చేసుకొంటానని భూమినంతటినీ కశ్యప మహర్షికి ధారాదత్తం చేసాడు. మనం మనువు యొక్క సంతానం. మనువు యొక్క తండ్రి వివస్వంతుడు. వివస్వంతుని తండ్రి కశ్యపుడు. ఇతడే మనుష్యజాతికి మూల పురుషుడు. అతడు ప్రజాపతి కనుక, దేవాదులకూ తండ్రియే. ఎందరో ప్రజాపతులున్నా మనుష్య జాతి వృద్ధికి ఇతడు కారణం కనుక ఇతణ్ణి కశ్యప ప్రజాపతియని గౌరవంతో పిలుస్తాం.

ఇంటిని దానం చేసి మరల ఇంటిలో ఉండటం కుదురుతుందా? అందుచేత పరశురాముడు ఈ భూమిలో ఉండకుండా క్రొత్త ప్రదేశాన్ని ఎన్నుకొని తపస్సు చేద్దాం అనుకున్నాడు. అందుకే దానమిచ్చిన భూమిలో ఉండకూడదనే పరశురాముని భావనను కశ్యపుడు గమనించి జ్ఞాన దృష్టితో దానమిచ్చిన భూమి బయట తపో భూమిని చూడమని చెప్పాడు.

పరశురాముడు పశ్చిమ కనుమలకు వచ్చి కొండ శిఖరం ఎక్కాడు. ఆనాడు సముద్రం కొండకు సమీపించి యుండేది. అంటే కొండ కివతల మలయాళదేశం లేదు. కేవలం సముద్రమే ఉండేది. దానమిచ్చిన ప్రాంతంలో నేను ఉండకూడదు కనుక ఈ కొండ దగ్గర నువ్వు తొలగి నాకు కొంత చోటు నిప్పించుమని పరశురాముడు సముద్రుణ్ణి అడిగాడు.

రామునకు సముద్రుడు సాయం చేసినట్లే ఇతనికీ చేసాడు. నీ చేతిలో పరశువు ఉంది కదా, దానిని విసిరివేయగా అది ఎక్కడ పడుతుందో అంతమేర, నేను వెనుక తగ్గుతానని సముద్రుడన్నాడు. అట్లా ఏర్పడినదే మలయాళ దేశం. ఇక్కడ చాలా మంది పరశురాముని పేరుతో ఉంటారు.

ముందుగా అనేక ప్రాంతాలనుంచి మత్స్యకారులు వచ్చారు. దీనిని వైదిక భూమిగా చేద్దామని వైదిక అనుష్ఠానం బాగా తెలిసిన బ్రాహ్మణులను రప్పించాలనుకున్నాడు.

కేరళలో తమిళం

చోళ రాజ్యం నుండి వచ్చినవారిని చోళియర్లని అంటారు. వీరు ద్రవిడ ప్రాంతం నుండి వచ్చారు. ఆర్య ద్రావిడ భేదాలు కల్పితమని చాలాసార్లు చెప్పాను. వారు వేరు వీరు వేరనే భావనను పెకలించండి. ద్రవిడ దేశం నుండి ఉత్తర దేశానికి వెళ్ళినవారిని ద్రావిడ్ అనేవారు. అట్లాగే ఉత్తర దేశం నుండి వచ్చినవారూ ఇక్కడున్నారు. వారిని 'వాదమర్' అంటారు. (ఎవ్వరూ కైబర్ పాస్ నుండి వచ్చినవారు కాదు)

చోళియర్లు కేరళ ప్రాంత వాతావరణం పరిస్థితులకు తట్టుకోలేకపోయారు. నిరంతరం వర్షంతో చిత్తడితో ఉన్న నేల వారికి నచ్చలేదు. పరశు రామునికి తెలియకుండా రహస్యంగా తిరిగి వెళ్ళిపోదామనుకున్నారు. వీరి భావనను ఆయన గమనించి వీరి ఆచారాలలో కొన్ని మార్పులను చేసాడు. మార్పులను చేసినా వారు వెళ్ళిపోతే అక్కడ ఉండలేక తిరిగి వస్తారని ఊహించాడు. వారికి నెత్తిపై ఊర్ధ్వశిఖ ఉంటుంది. మనమాదిరిగా వెనుక నుండదు. ఇప్పటికీ నంబూద్రీ బ్రాహ్మణులీ ఆచారాన్ని పాటిస్తున్నారు. చాలామంది చోళ దేశం తిరిగి వెళ్ళిపోయారు. అందులో ఇట్లా ఊర్ధ్వశిఖ గలవారు తమిళనాడులో ఇప్పటికీ ఉన్నారు.

చాలామంది చోళియర్లు వెళ్ళిపోవడం గమనించి కన్నడ, ఆంధ్రప్రాంతాల నుండి బ్రాహ్మణులను రప్పించాడు. ముందు వీరికి ఉన్న 108 ఆచారాలలో అనేక మార్పులు చేసి వీరిని స్వస్థలాలకు వెళ్ళకుండా చేసాడు.

ఇట్లా ఉండిపోయిన వారిని నంబూద్రీ బ్రాహ్మణులని అంటారు. ఇదంతా కేరళోత్పత్తియనే గ్రంథాన్ని చూసి చెబుతున్నా.

వీరిలో చోళ దేశం నుండి వచ్చినవారెందరో ఉన్నారు. తెలుగులో ఇల్లును, కన్నడంలో మనా అంటారు. తమిళంలోనూ ఇల్లం, మనై మాటలు యున్నాయి. అందుకే నంబూద్రీలు మేము ఫలానా ఇల్లం లేదా ఫలానా మనాకు చెందిన వాళ్ళం అంటారు. ఆచార్యులు 'కయిపల్లిమనా'కు చెందినవారు.

వీరు ఆదివాసి జనులతో కలిసి యుండడం సగం తమిళం, సగం సంస్కృతం, దేశీయ పదాలతో మలయాళ భాష ఉంటుంది.

వేయి లేక 1500 సంవత్సరాలనుండి ఈ భాష ప్రచారంలో ఉంది. ఒక రాష్ట్రంలో వ్యవసాయం, వర్తకం, రకరకాల వృత్తులుండాలి. తమిళులలో బ్రాహ్మణేతరులు ప్రవేశించడం వల్ల వర్తక వాణిజ్యాలు వృద్ధి పొందాయి. తమిళ దేశపు చేరరాజుల ప్రభావం ఉండడం వల్లనే ఇక్కడ వైదిక సంస్కృతి వ్యాపించింది.

సుఖ జీవులైన తమిళ బ్రాహ్మణులు కొంతమంది తమ రాష్ట్రానికి వెళ్ళినా కన్నడ, తెలుగు బ్రాహ్మణులిక్కడ ఉండి పోయారు. పరశురాముడనేక క్షేత్రాలనేర్పాటు చేసాడు. తమిళ బ్రాహ్మణులు కేరళ రాష్ట్ర సరిహద్దులలో అనగా పాల్‌కాడ్, తిరువనంతపురంలలో స్థిరపడ్డారు.

అశోకుని శాసనాలలో కేరళ ప్రస్తావింపబడిందని చరిత్రకారులంటారు.

తిరుమురైని కీర్తించిన చేరమాన్ పెరుమాళ్ నాయనార్ ప్రబంధాన్ని కీర్తించిన కులశేఖర పెరుమాళ్ రాజులు కేరళలో ఎందరో ఉండేవారు.

శంకరులు ప్రభవించి ధర్మోద్ధరణను చేసినా రాను రాను క్షీణించిన కాలమూ ఉంది. పరశురాముడు, కొన్ని ఆచారాలను ప్రవేశపెట్టాడని చెప్పాను. బ్రాహ్మణులలో పెద్దవాడు, బ్రాహ్మణ స్త్రీని, మిగిలిన సంతానం ఇతర వర్ణ స్త్రీలను వివాహ మాడుట అందులో నొకటి.

పర్వత ప్రాంతానికి అవతలవైపు ఉండడం వల్ల, ఆనాడు రాకపోకలు తక్కువగా ఉండడం వల్ల, ఇది ఒక ప్రత్యేక సంస్కృతితో చాలాకాలముంది. అయితే అదీ, మొత్తం భారతీయ సంస్కృతికి భిన్నం కాదు. ఒక నదిలో

అనేక స్నానఘట్టాలున్నట్లుగానే భిన్న భిన్న సంప్రదాయాలుండడం సహజం. మిగిలిన ప్రాంతాలలో సనాతన పద్ధతులు క్షీణించినా ఇక్కడ మాత్రం రక్షింపబడింది. అందువల్ల శంకరులిక్కడ అవతరించారు.

దీనికి భిన్నంగా కొన్ని మార్పులు కాలక్రమేణా చోటు చేసుకున్నాయి. ఇది సముద్ర ప్రాంతంలో ఉండడం వల్ల పాశ్చాత్య దేశాలనుండి ఇతర మతాలవారిక్కడ ప్రవేశించారు. వర్తక కేంద్రం కావడం వల్ల మిగిలిన మతస్థుల ప్రవేశానికి తావేర్పడింది. ఇట్లా యూదులు, క్రైస్తవులు, మహమ్మదీయులూ ఇందు ప్రవేశించి తరువాత మతవ్యాప్తిని చేసారు.

ఇట్లా ఇతర మతాలవారు వచ్చినా ఇక్కడి హిందువులు శంకర సంప్రదాయాన్నే పాటిస్తూ వస్తున్నారు. పద్మనాభస్వామి, గురువయ్యూర్ వంటి వైష్ణవ క్షేత్రాలలో అర్చకులు వైష్ణవులు కారు. శంకర సంప్రదాయానికి చెందినవారనే మాటను గుర్తించండి.

ఒకమూల సనాతన సంప్రదాయమున్నా రాజకీయంగా కమ్యూనిష్టుల ప్రభావమూ ఇక్కడ ఉంది.

కంచి మఠం - కుంభకోణం

ఒక ప్రాంతంవారు మరొక ప్రాంతం వెళ్ళినా పూర్వ ప్రాంతంపై మక్కువతో ఉండడం, వారి ఊళ్ళ పేర్లను క్రొత్తవాటికి చేర్చడం సహజం. ఆంగ్లేయులు, అమెరికాకు వెళ్ళినా ఆంగ్ల ప్రాంతపు నామానికి కొత్తగా 'న్యూ' చేర్చడం జరిగింది. అమెరికాలో కొంత ప్రాంతాన్ని న్యూ ఇంగ్లాండ్ అంటారు. యార్క్ జెర్సీ వంటివి న్యూయార్క్ న్యూజెర్సీగా అమెరికాలో మారాయి. అట్లాగే ఆస్ట్రేలియాకు వెళ్ళిన ఆంగ్లేయులు వారి వేల్స్‌ని న్యూ సౌత్ వేల్స్‌గా మార్చారు.

అట్లాగే తమిళ దేశం నుండి వచ్చినవారి నల్ల కణ్ణనూర్, మలయాళంలో కన్ననోర్‌గా; పటూర్, పట పురుగా మారింది. శంకరుల జన్మస్థలం, శివపురం, త్రిచూర్‌గా ఎట్లా మారిందో తరువాత వివరిస్తాను.

కాంచీపురంలోని మా మఠం, 18వ శతాబ్దంలో కుంభకోణానికి మారింది. ఆర్కాట్ నవాబ్, ఈస్ట్ ఇండియా కంపెనీ, ఫ్రెంచివారు, హైదరాలీ యుద్ధాలతో కాంచీపురం అల్లకల్లోలంగా ఉండేది. 62వ పీఠాధిపతి అయిన చంద్రశేఖర సరస్వతీ స్వామివారు మఠాన్ని అక్కడికు మార్చారు.

రామేశ్వరం తీర్థయాత్రకు వెడుతూ ఉడయార్ పాలయంలో స్థిరపడ్డారు. అక్కడి జమీందారులు స్వామిని అక్కడే ఉండిపొమ్మని అన్నారు. అది సురక్షిత ప్రాంతం. కంచి కామాక్షి మఠం, మా మఠం యొక్క ఆధీనంలో ఉండేది. అందున్న స్వర్ణ కామాక్షి విగ్రహాన్ని రక్షించడం కోసం అక్కడే ఉండిపోవలసి వచ్చింది.

అంతేకాదు, చిదంబరంలోని నటరాజ విగ్రహం, కంచిలోని వరద రాజస్వామి యొక్క ఉత్సవమూర్తి; శ్రీరంగంలోని రంగరాజ ఉత్సవమూర్తిని తరలించవలసి వచ్చిన కాలమది. పరిపాలించేవారు రాజులైనా, విదేశీయుల భయం వల్ల ఇట్లా జరిగింది. భగవంతుడు తన శక్తి కోల్పోవడం వల్లకాదు. ప్రజలు మతంమీద నిరాదరణ, అనాసక్తే ఈ పరిస్థితులకు దారితీసింది. మన నిర్లక్ష్యమే కారణమని మనకొక గుణపాఠం భగవానుడు నేర్పాడని అనిపిస్తుంది.

స్వర్ణ కామాక్షికే కాదు, నటరాజు, త్యాగరాజు, రంగరాజు, వరద రాజులకు కూడా ఆ ఉడయార్ పాలెం నిలయమైంది. అక్కడి రాజులు భక్తి ప్రపత్తులతో వాటిని రక్షించారు.

శాంతి నెలకొల్పబడిన తరువాత మరల మూర్తులు, స్వస్థలాలకు వెళ్ళాయి. కాని కామాక్షి విగ్రహం, తంజావూర్‌లో స్థిరంగా ఉండిపోయింది. కారణం తర్వాత చెబుతాను.

ఉడయార్ పాళెంలో, శివ, విష్ణు ఆలయాలున్నాయి. ఈనాటికీ శివాలయంలో సభాపతి మంటపం, త్యాగరాజు మంటపమని, కామాక్షి మంటపమని ఉన్నాయి. విష్ణ్వాలయంలో రంగరాజు, వరద రాజుమూర్తులుండేవి.

ఆ సమయంలో తంజావూర్‌ని ప్రతాప సింహుడు పరిపాలిస్తూ ఉండేవాడు. మన స్వాముల వారిని మఠాన్ని అక్కడే ఉండేటట్లుగా ప్రార్థించాడు. మన స్వామి స్వర్ణ కామాక్షిని కూడా తీసుకొని వెళ్ళారు.

తంజావూర్‌లో ఉండడం కంటె కావేరీ తీరంలోని కుంభకోణంలో మఠం వీలుగా ఉంటుందనే అభిప్రాయాన్ని స్వామివారు వెల్లడించగా రాజు అంగీకరించాడు. మంత్రియైన దబీర్ పంత్‌తో ఏర్పాట్లు చేయవలసిందిగా రాజన్నాడు. అట్లా కంచి మఠానికి కుంభకోణం ప్రధాన కేంద్రమైంది. ప్రజలకు, రాజునకు తృప్తి కలిగించడం కోసం తంజావూర్‌లోనే స్వర్ణ కామాక్షి విగ్రహం ఉంటుందని స్వామివారన్నారు. రాజు, అమ్మవారికి గుడి కట్టించాడు. శ్యామశాస్త్రి వ్రాసిన తెలుగు పాటలలో ఆమెను బంగారు కామాక్షి అని అన్నారు. దానితోఆమె బంగారు కామాక్షిగా ప్రసిద్ధిని పొందింది.

కుంభకోణాన్ని ఎందుకెన్నుకున్నారని సందేహించాను. తంజావూర్ దగ్గరే కావేరి, 'పంచనదం'గా నాల్గు శాఖలతో ప్రవహిస్తోంది. అక్కడే తిరువైయార్ ఉంది. భూలోక కైలాసంగా ఆ క్షేత్రం ప్రసిద్ధిని పొందింది. కావేరీ తులాస్నానానికి ప్రసిద్ధమైన మాయావరం క్షేత్రం కూడా ఉంది. అయితే కుంభకోణానికి శంకరుల అవతారానికి సంబంధం ఉంది.

నంబూద్రీలు త్రిసూర్‌ని శివపురం అంటారు. మలయాళంలో శివపేరూర్. గౌరవవాచకమైన శ్రీనిఅనగా తిరు చేరిస్తే తిరు శివపేరూర్ అవుతుంది. అది కాలక్రమంలో తిరుచూర్ అయింది.

తమిళనాడులో కూడా శివపురం ఉంది. అప్పర్, జ్ఞాన సంబంధర్ అనే శివ భక్తులు అక్కడున్న దేవతామూర్తులను కీర్తించారు. అది కుంభకోణానికి మూడు మైళ్ల దూరంలో ఉంటుంది.

ఒక మహాక్షేత్రం ఉందంటే దాని ప్రభావం ఐదు క్రోసుల వరకూ ఉంటుంది. క్రోశమనగా $2^1/_2$ మైళ్ళు. అనగా పది, పన్నెండు మైళ్లవరకూ ఉంటుంది. దానిని పంచ క్రోశమంటారు. ఈ శివపురం ప్రాంతలోనే సమీపంగా

కుంభకోణం ఉంది. ఇక్కడ శివపురం ఉన్నట్లే మలయాళ దేశంలో కాలడిలో శివపురం ఉంది (త్రిచూర్). తమిళ ప్రాంతంనుండి అక్కడికి వెళ్ళినవారు వారి ఊళ్ళపేర్లను పెట్టుకుని సంతోషిస్తారని చెప్పాను కదా. అట్లాగే తమిళంలోని శివపురం వారు కేరళ వెళ్ళి శివపురం అని పెట్టగా అది త్రిచూర్ అయింది.

ఈ త్రిచూర్‌లోనే శంకరుల తల్లిదండ్రులు స్వామిని సేవించుట, ఈశ్వరానుగ్రహం వల్ల జన్మనిచ్చుట జరిగింది.

మరొక సంబంధం ఉంది. శంకరుల తండ్రి పేరు శివ గురువు. శంకరులు శంకరావతారం గనుక తండ్రిపేరు శివగురువనడం బాగానే ఉంది. తండ్రి గురువే, ఉపదేశమిచ్చువాడూ గురువే. ఇట్లా సరిపోయింది. తల్లి, ఆర్యాంబ.

శివ గురువని సాధారణంగా పేరు పెట్టుకోరు. కాని తమిళనాడులో, కుంభకోణం దగ్గర, శివపురంలో ఇట్లా పేర్లు పెట్టుకునేవారున్నారు.

తమిళనాడులోని శివపురంలో స్వామిపేరు, శివగురునాథ స్వామి. స్వామిమలైలో కుమారస్వామియే తండ్రికి ఉపదేశమిచ్చాడు. కనుక కొడుకే శివగురువయ్యాడు. కాని కేరళలో శివగురువు, శంకరావతారానికి తండ్రి అయ్యాడు.

కుంభకోణం దగ్గరగా నున్న శివపురంలోని బ్రాహ్మణులు, త్రిచూర్ వచ్చి యుంటారు. శంకరుల తాతగారైన విద్యాధి రాజు, తమిళనాడులోని శివ పురస్వామియైన గురుపదాన్ని తన కొడుకునకు పెట్టి యుంటాడు. ఇట్లా తమిళ సంబంధం కుదురుతుంది.

సృష్టికి కారణమైన అమృత కుంభం ఉన్నచోటు కనుకనే అది కుంభకోణమైంది. అట్టి క్షేత్రం నుండి శంకరుల పూర్వులు, కేరళకు వచ్చి యుంటారు.

అందువల్ల కంచినుండి మా మఠం, రెండవ పట్టణానికి మారవలసి వచ్చినప్పుడు కుంభకోణానికి ఆ బహుమతి లభించింది అని నాకు తోచింది. కుంభకోణానికున్న ఖ్యాతి ఒక కారణమై ఉంటుందనిపిస్తుంది. రాముడు సూర్య వంశానికి చెందినట్లు ఆచార్యులవారి పూర్వీకులు కుంభకోణానికి చెందినవారు.

కంచిలో శంకరులు, సిద్ధిని పొందగా కుంభకోణం వారికి ఒకవిధంగా కారణమైనట్లు ఊహిస్తున్నా.

తల్లియైన ఆర్యాంబ విశేషం చూద్దాం. శబరిమలై స్వామిని, శాస్తయని అంటారు. అతడే ఆర్యన్. తమిళనాడులో ఈ స్వామిని అయ్యనార్ అంటారు. ఈ అయ్యప్ప ద్రావిడ దేవతయనడం తెలివి తక్కువ.

అమ్మవారికి ఆర్య అని పేరు ఉంది. త్రిపుర సుందరియే ఆర్య. కామాక్షి, మహాత్రిపుర సుందరి కదా. ఆమెయే లలిత.

దుర్వాసుడు, ఆర్యాద్విశతిని రచించాడు. ఈ దేవతా పూజా కల్పాన్ని అందించాడు. మూక పంచశతిలో మొదటి వంద శ్లోకాలనూ ఆర్యాశతకమంటారు. కనుక కంచి అమ్మవారి పేరును, శంకరుల తల్లికి పెట్టగా ఆ పేరునకు, కంచికి సంబంధం ఉంది.

అవతార ప్రదేశం - విశిష్టత

వైదిక మతానుష్ఠానం ఉన్న కేరళ ప్రాంతం అనుకూలమైనదే. శాస్త్రంలేదు, వేదం లేదని మనం అనుకొంటూ ఉంటే ఈనాటికీ వాటిని రక్షిస్తున్నవారు నంబూద్రీ బ్రాహ్మణులే. సకాలంలో ఉపనయనం, గురుకులానికి పంపడం, బ్రహ్మచర్య దీక్షలు, దండధారణ, కృష్ణాజినం - అంతా నేటికీ ఉంది. ఈనాటికీ ఆంగ్ల విద్య నేర్చుకున్నా కొంతకాలం వేదాభ్యాసం చేస్తూ ఉంటారు. అది ఆ భూమి విశిష్టత. అందుకే వారక్కడ అవతరించారు.

పుణ్య దంపతులు

త్రిచూర్‌కి 30 మైళ్ళ దూరంలో కాలడి గ్రామం ఉంది. ప్రక్కనే పూర్ణానది ప్రవహిస్తోంది. శివగురువు తండ్రిపేరు విద్యాధిరాజు. పేరు సార్థకం.

అక్కడ గృహస్థులు సంపన్నులు. ఒక పెద్ద తోటలోనే వారి నివాసం. అది అనేక ఫలవృక్షాలతో ఉంటుంది. అందన్ని పంటలనూ పండిస్తారు.

తిండికి లోటుండదు. శివ గురువు తల్లి 'కైపల్లి'కి చెందగా; ఆర్యాంబ మేళపూర్‌నకు చెందింది.

త్రిచూర్ ప్రశస్తి

త్రిచూర్ ఆలయానికి వెళ్ళి నియమ నిష్ఠతో స్వామిని అర్చించారు. ఆ క్షేత్రాన్ని వృషాచల మంటారు. అందలి నంది ఎత్తుగా ఉంటుంది. ఒక మూల గుండ్రంగా ఎత్తైన పర్వతం. ఆలయంలో టేకు చెట్లుండడం వల్ల టేక్కంగాడని అంటారు.

స్వామి పేరు వడక్కునాథుడు. స్వామి సన్నిధిని శ్రీ కోవిల్ అంటారు. ఆలయం గుండ్రంగా ఉంటుంది. ఆలయంలోనే శంకర నారాయణ, రామాలయాలున్నాయి. విష్ణ్వాలయాలు శివాలయంలో ఉండడం కేరళలో ప్రత్యేకత. ఇక్కడ నృత్య నాటకాలకు ప్రత్యేక మంటపాలున్నాయి. వాటిని కూతంబళం అంటారు.

త్రిచూర్‌లో ఏనుగుల ఉత్సవం (త్రిచూర్ పేరం) పేర్కొనదగింది. అలంకరించిన ఏనుగులు బారులు తీరి యుంటాయి. అయితే వీటిపై వృషాచల మూర్తిని ఊరేగించరు. చుట్టు ప్రక్కలనున్న అమ్మవారి ఉత్సవమూర్తులను వీటిపై ఉంచి తీసుకొని వస్తారు. ఇక్కడ స్వామిని దర్శించుకొని ఉత్సవ ప్రాంతానికి చేరుకుంటాయి. శివరాత్రి ఉత్సవం బాగా ఘనంగా జరుగుతుంది. అయినా స్వామి ఉత్సవమూర్తిగా ఊరేగడు.

ఇందలి పూజారులు తమకు విధింపబడిన కాలంలో పూర్తిగా బ్రహ్మచర్య దీక్షతో ఉంటారు. అది ముగిసిన తరువాత మరొకరికి ఆలయాన్ని అప్పజెప్పి బైటకు వస్తారు. అట్లా చాలా పవిత్రంగా ఉంటుంది.

ఇక్కడి లింగాన్ని ఆవునేతితో అభిషేకిస్తారు. లింగంపై వేల సంవత్సరాల నెయ్యి పేరుకుని పోయి ఉంటుంది. వేసవిలో కూడా దీపాలను వెలిగించినా

ఆ నేయి కరగదు. మంచుతో కైలాసనాథుడుండగా, ఇక్కడ నేతితో మంచు ఆకారంలో కప్పబడి యుంటాడు.

కేరళ, ఆయుర్వేదానికి ప్రసిద్ధి. నేయి ఎంత ప్రాతదైతే దీని గుణం అంత ఎక్కువగా ఉంటుందని, వైద్యులు దానిని తీసుకొని వెదుతూ ఉంటారు.

మండలం (40) రోజులు దీక్షతో ఈ పుణ్యదంపతులు సంతానానికై స్వామి సన్నిధిలోనే ఉన్నారు.

వర ప్రదానం

స్వామి ప్రత్యక్షమయ్యాడు. దీర్ఘాయుర్దాయం కలిగిన వందమంది మూర్ఖులు కావాలా? అల్పాయుష్కుడూ, సర్వజ్ఞుడూ అయిన ఒక్క పుత్రుడు కావాలా అని అడిగాడు.

శివగురువు భార్య నడుగుతానన్నాడు తనకూ అట్టి కల వచ్చిందని ఆర్యాంబ చెప్పింది. స్వామిని మీ ఇష్టం వచ్చినట్లు చేయమన్నారు. నేనే అవతరిస్తాను. అయితే ఎనిమిది సంవత్సరాలే ఈ భూమిపై ఉంటా అన్నారు స్వామి. ఆమె గర్భంలో ఒక దివ్య తేజస్సు అవతరించింది.

జయంతి గొప్పదనం

నందన నామ సంవత్సరంలో వైశాఖ మాసంలో శుద్ధ పంచమినాడు, అభిజిల్లగ్నంలో (మధ్యాహ్నం) ఐదు గ్రహాలు ఉచ్ఛస్థితిలో, ఉండి ఆర్ద్రా నక్షత్రం ఉండగా శంకరులవతరించారు. కొందరు అవతరించినది పునర్వసువని అంటారు. ఆ పంచమినాడొకపుడు ఆరుద్ర వస్తుంది. ఒక్కొక్కప్పుడు పునర్వసూ ఉంటుంది.

మనకెన్నో పవిత్ర దివసాలున్నాయి. అన్నిటికంటె శంకర జయంతినే బాగా ఎందుకు జరుపుకోవాలి?

శంకరులు పుట్టిన తరువాతనే ఆ పవిత్ర దివసాల ప్రాముఖ్యాన్ని గుర్తించాం. ఎందుకంటారా? వేద, శాస్త్ర, పురాణ, శాస్త్రాల పునరుద్ధరణ ఇప్పటినుండే జరిగింది కనుక.

బౌద్ధం, జైనం, మీమాంసమతం విజృంభించి యుంటే శివరాత్రి వంటివాటిని ఎవరు జరుపుకుంటారు? శంకర జయంతి వల్లనే ఆ పండుగలను, జయంతులను జరుపుకుంటున్నాం. జయ జయ శంకర అంటూ జరపండి.

ఘనంగా జరపండి

శంకర జయంతి లేకపోతే రామనవమి, కృష్ణాష్టమి ఉండేవా!

మన శ్రేయస్సుకై జరపండి. కృతజ్ఞత మనకుండాలి. ఏదో మొక్కుబడిగా కాదు. దీని విశిష్టతను గుర్తించి జరపండి.

వైష్ణవాలయాలలో ఆళ్వార్లు, రామానుజులు, వేదాంత దేశికుల మూర్తులుంటాయి. అట్లాగే శివాలయాలలో నాయనార్ల విగ్రహాలుంటాయి. వారి జయంతులను వారు ఘనంగా జరుపుకుంటూ ఉంటారు. శంకరులు శైవులూ కాదు, వైష్ణవులూ కాదు. స్మార్త సంప్రదాయానికి చెందినవారు, అన్ని సంప్రదాయాలను గౌరవిస్తారు కనుక వీరికి ప్రత్యేకంగా విగ్రహం అంటూ ఉండదు. వీరు యంత్ర ప్రతిష్ఠాపన చేసిన ఆలయాలలో అక్కడక్కడ వీరి విగ్రహముంటుంది.

కంచితో ప్రత్యేక సంబంధం

కంచి ప్రాంతంలో ఆచార్యుల విగ్రహాలు చాలాచోట్ల ఉన్నాయి. కామాక్షి ఆలయంలో వీరి మూర్తి ఉంది. అట్లాగే ఏకామ్రనాథుడు, వైకుంఠ పెరుమాళ్, వరదరాజు ఆలయాలలో వీరి మూర్తి ఉంది. ముఖ్యంగా తాయారు సన్నిధికి వెళ్ళే మార్గంలో వ్యాసునితో కూడిన శంకర విగ్రహం, అక్కడ వ్యాసుడు, అద్వైతమే సత్యమని వేలెత్తి చూపిస్తున్నట్లున్న విగ్రహం, ఒక స్తంభంపై మలచబడింది.

కామాక్షి అమ్మవారు ఉగ్రమూర్తిగా ఉండగా శంకరులు ఆమెను సౌమ్యమూర్తిగా తీర్చిదిద్దారు కనుక, అమ్మవారితో శంకరులకు ప్రత్యేక సంబంధం ఏర్పడింది. దీనికి అనుగుణంగా తపః కామాక్షి విగ్రహాలు ఏ విధమైన భంగిమలలో ఉంటాయో అదేవిధమైన ముద్రలు భంగిమలతో ఆచార్యులవారి విగ్రహాలు కొన్ని గుళ్ళల్లో చూపబడినాయి.

శంకరులు శిష్యచతుష్టయంతో ఉన్నట్లు ప్రసిద్ధియైనా కంచిలో ఆచార్యులవారి నివాసాన్ని తెలిపే పుస్తకాలు, ఆర్గురు శిష్యుల గురించి చెబుతాయి. ఆచార్యులవారి ఆదేశంతో షణ్మతములను స్థాపించిన ఆర్గురు శిష్యులు, తమ తుది సంవత్సరములలో ఆచార్యులవారు కాంచీపురంలో విడిది చేసి ఉండగా వచ్చి వారికి నివేదించారని ఆ పుస్తకాలు చెబుతాయి. దీనికి తగినట్లుగా కామాక్షీ దేవాలయంలోని ఆదిశంకర మూర్తి పీఠంపై నల్గురు శిష్యులకు బదులుగా ఆరుగురు శిష్యులను చూడవచ్చు. కంచి మఠం పూజాగృహంలో కూడా రెండు ప్రక్కలా ముగ్గురేసి శిష్యులున్న ఆచార్యుల వారి మూర్తి ఉన్నది.

కంచి చుట్టుపక్కల చెన్నైవరకు అక్కడక్కడ వీరి మూర్తులున్నాయి. అంత్య సమయంలో వీరు కంచిలో ఉండడం వల్ల అట్లా మూర్తి ప్రతిష్ఠాపన జరిగియుండవచ్చు.

వారు స్థాపించిన మఠమే వారి భౌతికరూపం. రామానుజులు మఠాలను స్థాపించలేదు. అట్లాగే ఏ వైష్ణవ ఆచార్యుడూ స్థాపించలేదు. కాని వారి మూర్తులు విష్ణ్వాలయాలలో ఉంటాయి. కాబట్టి మఠాలలో శంకర జయంతి ఘనంగా జరుపుకోవాలి.

కామాక్షి ఆలయంలో శంకర జయంతి

కామాక్షి ఆలయానికి, మఠానికి శంకరుల జీవితానికి దగ్గర సంబంధం ఉండడం వల్ల ఆలయంలో వీరి మూర్తి గంభీరంగా ఉంటుంది. వీరికి ఇక్కడ మూలవిగ్రహము, ఉత్సవమూర్తులతో కూడిన ప్రత్యేక సన్నిధియుంది.

జయంతిని గర్భోత్సవంగా జన్మోత్సవంగా జరుపుతారు. జయంతి ముందు పదిరోజులు నుండి గర్భోత్సవం ఉంటుంది. జయంతితో ముగుస్తుంది. గర్భంలో ప్రాణి నవమాసాలూ ఉంటాడు. ఇక జయంతి నుండి పదిరోజుల వరకూ జరుపబడేది జన్మోత్సవం. పుణ్యాహవాచనంతో ముగుస్తుంది. గర్భోత్సవం, కృష్ణపక్షంలో ఆరంభింపబడి వైశాఖ శుద్ధ పంచమితో ముగుస్తుంది.

కామాక్షి ఆలయంలో జన్మోత్సవమే ఉంటుంది. పూర్ణిమతో అంతం. దీనిని దేవాలయమే నిర్వహిస్తుంది. ఇతరుల విరాళాలతో కాదు.

ఈ ఉత్సవంలో శంకరుల ఉత్సవమూర్తిని ఊరేగిస్తూ గాయత్రీ మండపం దగ్గరకు తీసుకొని వచ్చి ప్రతిరోజూ సౌందర్య లహరిలోని పది శ్లోకాలను పఠిస్తారు. చివరి రోజున ఒక ప్రత్యేకత యుంది. ఇక్కడ శుక్రవారమంటపం ఉంది. మామూలు ఉత్సవాలలో అమ్మవారిని ఈ మంటపం పై అధివసింపచేస్తారు. శంకర జయంతి ఉత్సవాలలో చివరి రోజున అమ్మవారు శంకరుల ఉత్సవమూర్తులను రెండింటినీ ఇక్కడ కూర్చుండబెట్టి చివరి పది శ్లోకాలను చదువుతారు. అమ్మవారి ప్రసాదం, వస్త్రం, శంకరులకు నివేదిస్తారు. ఇట్లా అన్నిచోట్ల జరగాలని నా ఆకాంక్ష.

మనస్సునర్పించుట - మౌన ధ్యానం

శంకర జయంతికి డబ్బు ఖర్చు పెట్టుట కంటె వారికి శరణాగతి పొందుటయే సరియైన పూజ. మనస్సు సమర్పించుటయే ముఖ్యం.

భగవంతుని పూజించుట కంటె శంకరులను స్మరిస్తేనే శాంతి కలుగుతుంది. మన కర్మానుసారంగా శిక్షించే వాడు శంకరుడు. కాని శంకరులు మనకు మంచిని చేస్తారు.

ఎట్లా వారిపై మనస్సును నిలపాలి? 'హరహర శంకర, జయ జయ శంకర' అంటే చాలు. హర హర నామమే అన్నిటినీ హరిస్తుందని జ్ఞాన సంబంధులనలేదా? శంకరులు దిగ్విజయం చేసారు కనుక జయ జయ శంకరను కలుపుదాం.

అనవసరమైన వివాదాలతో కాలం గడుపుతారేమిటి? శంభుని తలుచుకొని పరమానందం పొందండని వీరనలేదా?

"వృథాకంఠక్షోభం వహసి తరసా తర్కవచసా
పదాంభోజం శంభోర్భజ పరమసౌఖ్యం వ్రజ సుధీః"

నామకరణం

శిశువు పుట్టీ పుట్టగానే చేసే సంస్కారం పేరు జాతకర్మ. తరువాత 11వ రోజున నామకరణం జరుపుతారు.

వీరికి శంకరులని నామకరణం చేసారు. శంకరుని అనుగ్రహం వల్ల పుట్టాడు గనుక బాగానే ఉంది. శంకరునకు అనేక నామాలున్నాయి. దీనినే ఎందుకు పెట్టినట్లు? శంభువు, నిష్క్రియుడు. శంకరులనగా లోకానికి మంచి చేసేవారని చెప్పాను. కనుక ఇది సార్థకం.

ఏ కారణం లేకుండా దీనినుంచలేదు. పుట్టిన నెల, పక్షం, తిథికి అనుగుణంగా ఈ పేరుంది. ఇదీ విశేషం.

కటపయాది సంఖ్య

గణితానికి సంబధించిన కొన్ని సంకేతాలు తెలిస్తే ఏ సంవత్సరంలో పుట్టారో ఇట్టే మనకవగతమౌతుంది.

అంకెలను, అక్షర సంకేతాలతో చెప్పేవారు '**కాదినవ - టాదినవ - పాది పంచ - యాద్యష్టౌ**' అని ఇట్లా గుర్తులున్నాయి. అంటే క మొదలు ఝ వరకూ తొమ్మిది అక్షరాలు, వరుసగా ఒకటినుండి తొమ్మిది వరకూ ఉండే అంకెలను గుర్తు చేస్తాయి. అట్లాగే ట మొదలు ధ వరకు ఉండే అక్షరాలు ఒకటినుండి తొమ్మిది వరకూ ఉండే అంకెలను గుర్తు చేస్తాయి. ప నుండి మ వరకూ ఉండే అక్షరాలు ఒకటి మొదలు ఐదు వరకూ ఉండే అంకెలను సూచిస్తాయి. య నుండి హ వరకు ఉండే అక్షరాలు ఒకటి మొదలు ఎనిమిది వరకూ ఉండే అంకెలను సూచిస్తాయి. అచ్చులు ఒక్కటే ఉంటే సున్నాలను సూచిస్తాయి. ఈ అంకెల్ని కుడినుండి ఎడమకు లెక్కించాలి. అనగా ఎడమవైపున ఉండేది ఒకట్ల స్థానమౌతుంది.

ఉదాహరణకు 'జయ'ను చూదండి:

'జ' అనగా 8; 'య' అనగా 1, జయ=81. దానిని పై సూత్రం వల్ల త్రిప్పితే 18 అయింది.

గీతలో ధ్యానానికి చైలాజినకుశోత్తరం అని యుంది. చైలం=బట్ట, అజినం=చర్మం, కుశ=దర్భలు. ధ్యానానికి ముందు నేలపై బట్టను వేసి దాని పై చర్మం ఉంచి దానిపై దర్భలని చెప్పకూడదు. దానిని తలక్రిందులుగా చేయాలి. ముందు దర్భ, దానిపై చర్మం, దానిపై బట్టయని అర్థం చేసుకున్నట్లే పైన కూడా.

కటపయాదితో సిద్ధిని పొందిన సంవత్సరం

పుణ్యశ్లోక మంజరి అనే గ్రంథంలో 55వ పీఠాధిపతివరకు ఉన్న వారి పేర్లు, స్థలము, ఎక్కడ సిద్ధి పొందినవి మొదలైన వివరాలున్నాయి. తరువాత వచ్చినవారు అనుబంధాన్ని చేర్చారు. ఇట్లా 60వ పీఠాధిపతి వరకూ ఉన్నాయి. శ్లోకంలో 'శర చర' అని ఉంది.

ఫలే స్వస్మిన్ స్వాయుషి శరచరాబ్దేఖ సకలేః

విలీయే రక్తాక్షిన్ యతివృష సిద్ధై కాదశిపరే

ముందుగా వీరెప్పుడు సిద్ధిని పొందారో వివరిస్తారు. శరచరాబ్దంలో అనగా రక్తాక్షి సంవత్సరం, వైశాఖ మాసంలో శుక్లపక్ష ఏకాదశినాడు సిద్ధిని పొందారు. 'శ' వర్ణం ఐదును సూచిస్తే 'ర' రెండును చెబుతుంది. 'కాదినవ' అనే సూత్రం ప్రకారం 'చ' ఆరును చెప్పగా 'ర' రెండును చెబుతుంది. దీనిని తల్లక్రిందులు చేస్తే 2625 అయింది. అనగా కలియుగం ఆరంభమైన వెనుక 2625 సంవత్సరంలో సిద్ధిని పొందారు. అంటే కలిలో క్రీ.పూ. 477. వారు 32 సంవత్సరాలు బ్రతికారు. దానికి 32ను కలిపితే క్రీ.పూ. 509 అయింది. అది నందననామ సంవత్సరం.

వారి అవతార దివసాన్ని చూసి పేరు పెట్టారని గమనించండి. వైశాఖ శుద్ధ పంచమినాడు ఐదవ తిథి, ఒకటవ పక్షం, రెండవ మాసం. శ అంటే

5. క అంటే ఒకటి. ర అంటే 2. దీనిని తిరుగవేయండి. రెండవ మాసం, మొదటి పక్షం, ఐదవ తిథి కావడంచే శంకర అనే పేరు వస్తుంది.

భగవంతుడనే కాకుండా పుట్టిన మాసం, తిథి, పక్షాన్ని బట్టి శంకర పదం ఉంచారు.

ఆంగ్లంలోనూ ఈ పద్ధతియుంది. దీనిని వీరు Chronogram అంటారు. రోమన్ అంకె I ఒకటవుతుంది. V=5; X=10 అవుతాయి.

శంకరులు ఎంత కాలం బ్రతికారన్నది కూడా ఈ శ్లోకం వల్ల తెలుస్తుంది. ఫలే స్వస్మిన్ స్వాయుషి అని ఉంది. ఫ అనగా 2; ల అనగా 3. ఫల అనగా 23. త్రిప్పితే 32 సంవత్సరాలు. ఇప్పటికి 2500 సంవత్సరాల పూర్వం వారున్నారని తేలింది.

వసంత ఋతువు - వైశాఖ మాసం

మాసానికి, మల్లెకు, శారదకు, శంకరులకు గల సంబంధాన్ని చెబుతా. వైశాఖ మాసంలో పుట్టారు. విశాఖ యనగా కొమ్మలు లేనిది. లతకు కొమ్మలుండవు. దీనిని మాధవ మాసం అంటారు. చైత్రాన్ని మధువని అంటారు. మాధవి యనగా మల్లె. దీనికి కొమ్మలుండవు కనుక రెండు మాసాల పేర్లు దీనికి చెందినది. వసంతం నుండి వాసంతి వచ్చింది. మల్లెకు వాసంతి యని కూడా పేరు.

మల్లెపువ్వులున్న ఋతువులో, మాసంలో వీరి అవతారం కనుక శుద్ధ సత్వాన్ని, చల్లదనాన్ని సూచిస్తుంది. ఈ మల్లెకు వీరి మాటలకూ ఉన్న సంబంధాన్ని చెబుతా. మఠంలో శ్రీముఖం ఇచ్చేటపుడు శంకరుల వాక్కును ఇట్లా పోలుస్తారు:

అతలిత సుధా రస మాధుర్య కమలా సనకామినీ

ధమ్మిల్ల సంపుల్ల మల్లికా మాలికా నిష్యంద మకరంద

ఘురీ సౌవస్తిక వాఙ్మగుంభ విజృంభణానంత తుందిలిత మనీషీ మండలానాం

అనగా సరస్వతీ దేవి, పద్మంపై అధివసించి యుండి కొప్పులో మల్లెపూవులను తురుముకొంది. శంకరులు అమృత రసంతో కూడిన వాక్కులనందిస్తూ ఉంటే విద్వాంసులు సంతోషిస్తున్నారు. ఆ మల్లె పూవులనుండి వచ్చు మకరందం కూడా వీరి వాక్కులతో సాటిరాదని అర్థం.

శంకరులు, సరస్వతితో వాదించి ఓడించి వారి సర్వజ్ఞత్వాన్ని చాటారు. సరస్వతిని శృంగేరిలో శారదాపీఠంలో ప్రతిష్ఠించారు. సన్న్యాసులు పది నామాలతో వ్యవహరింపబడుతూ ఉంటారు. దానిలో భారతి నామం, శృంగేరీ సన్న్యాసులకుండగా, కంచిలో సరస్వతి పేరుంటుంది. సరస్వతి సన్న్యాసులలో రెండు సంప్రదాయాలున్నాయి. ఆనంద సరస్వతి, ఇంద్ర సరస్వతియని. కంచిలో ఇంద్ర సరస్వతులుంటారు. శృంగేరీ పీఠాన్ని శారదా పీఠమంటారు. కంచి మఠాన్ని శారదా మఠమంటారు. సరస్వతి, మల్లెలా స్వచ్ఛమైనది. అందలి మకరందం కంటె శంకరుల వాక్కులో మాధుర్యం ఉంటుంది. కనుక వీరు వైశాఖ మాసంలో పుట్టడమూ సబబే.

శ్రీశైలం - అర్జున క్షేత్రం

పరమేశ్వరునకు, మల్లెకూ సంబంధం ఉంది. మల్లె మాదిరిగా ఇతడు తెలుపు ఈయనకు మల్లికార్జునుడనే పేరు ఉంది. ఇక శంకరులకు శ్రీశైలంతో సంబంధం ఉంది. వీరి శివానంద లహరిలో 50,51 శ్లోకాలలో వీరు వ్రాసిన యోగతారావళిలోనూ శ్రీశైల మల్లికార్జున ప్రస్తావన వస్తుంది. ఉంది. లతలు పెనవేసుకొని యుండగా, నా చెవులలో పక్షులు గూళ్ళు కట్టుకొని యుండగా కదలని, మెదలని స్థితిలో శ్రీశైల గుహలలో ఎప్పుడుంటానో కదా అని అన్నారు.

మల్లె తీగ, మద్ది చెట్టును చుట్టుకొని యుండడం వల్ల మల్లికార్జునమైంది. అంబిక తీగయై, స్థాణువైన శివుడ్ని చుట్టుకొని యుంటుంది. ఆమె మనలో

జ్ఞానశక్తియే. అది ఆత్మతత్త్వమైన శివుణ్ణి, చుట్టి యుండాలి. మద్ది తెలుపు, శివుడూ తెలుపే.

అర్జున వృక్షం శివం కాగా, అమ్మవారు మల్లెతీగ. మరొకవిధంగా చెప్పవచ్చు. మల్లెతీగలో నున్న పువ్వు, శివుడు కాగా, మకరందం ఆస్వాదించే తుమ్మెదయే అమ్మవారు. శ్రీశైలంలో అమ్మవారు భ్రమరాంబిక. శివానందలహరిలో ఆచార్యులు:

సంధ్యారంభవిజృంభితం శ్రుతి శిరః స్థానాంతరాధిష్ఠితం
సప్రేమ భ్రమరాభిరామ మసకృత్ సద్వాసనా శోభితం
భోగీంద్రా భరణం సమస్త సుమనః పూజ్యం గుణావిష్కృతం
సేవే శ్రీ గిరిమల్లి కార్జున మహాలింగం శివాఽఽలింగితం

ఈ శ్లోకానికి రెండర్థాలున్నాయి. ఒకటి మల్లెకు, రెండవది శివునకు చెందినదిగా ఉంటుంది.

సంధ్యాకాలంలో మద్దిచెట్టు పుష్పాలతో వినిపిస్తుంది. శివుడపుడు నాట్యం చేస్తాడు. ఆ పూలు, ఆ చెట్టును అలంకరించడమే కాకుండా శ్రుతి శిరస్సులను (ఉపనిషత్తులు) అలంకరిస్తాయి. అనగా తలపైన, చెవులలోను అలంకరింపబడతాయి. శివుడు శ్రుతి శిరస్సులతో ఉంటాడు. ఆ చెట్టు తుమ్మెదలతో ఉండగా శివుడు భ్రమరాంబికతో ఉంటాడు. చెట్టు మంచి వాసనతో ఉండగా శివుడు మంచి వాసన (భావన)తో ఉంటాడు. దాని పూలు మహాభోగులకు అలంకారంగా ఉండగా శివుడు భోగీంద్రుడై వాసుకి ఆభరణంగా కల్గియుంటాడు. వీటి పూలు అన్ని పూలకంటే పూజ్యములు కాగా శివుడు మంచివారిచే, దేవతలచే పూజింప బడేవాడై యుంటాడు. ఇది సుగంధ గుణాన్ని బట్టి కనుగొనబడితే శివుడు మంచి గుణాలను బట్టి వ్యక్తమౌతూ ఉంటాడు. గుణానికి దారమని, గుణమని అర్థం. పువ్వులను దారాలతో గ్రుచ్చుతాం. అతడుత్తమ గుణాలతో ఉంటాడనీ అర్థం. మద్దిచెట్టును

మల్లెతీగ చుట్టుకొని యుండగా, శివుడు, అమ్మవారిచే ఆలింగనం చేసికొనబడియుంటాడు.

వసంతంలో మల్లెలు, మామిడి పండ్లు వస్తాయి. శంకరులు మల్లెలా, జ్ఞాన రసంతో కూడిన మామిడి పండులా ఉంటారు. అదే అద్వైత రసం.

శంకరుల కాలం

వీరు సిద్ధి పొందిన సంవత్సరానికి చెందిన శ్లోకాన్ని లోగడ పేర్కొన్నాను. ఆ పుస్తకంలోని ప్రాచీన శంకర విజయ శ్లోకంలో అవతార సంవత్సరం చెప్పబడింది. అందు, అసల సేవధి భానసేత్రే అని ఉంది. అనగా 3-9-5-2=3952. కటపయాది సూత్రంచే త్రిప్పితే 2593. కలిశకం క్రీస్తుపూర్వం 3102లో ఆరంభం. అందు 2593 తీసివేయగా క్రీ.పూ. 509 అయింది.

అయితే దీనికి విరుద్ధంగా పాశ్చాత్య పరిశోధకులు క్రీ.శ. 788-820 అన్నారు. అంటే నేను చెప్పినదానికి దీనికీ 1300 సంవత్సరాలు తేడా ఉంది.

వీరెట్లా నిర్ణయించారంటే మరొక శ్లోకాన్ని ప్రమాణంగా స్వీకరించారు. ఈ శ్లోకంలో:

నిధి నాగేభ వహ్ని అబ్దే అని ఉంది. నిధి=9; నాగ-8; ఇభ=8; వహ్ని-3; అనగా 9883. త్రిప్పితే 3889. కలి 3102 ఆరంభం కదా. అందు 3889 తీసివేస్తే క్రీస్తు తరువాత 787-788.

కారణాలిట్లా చెప్పారు. శంకరుల రచనలలో ఇతర సిద్ధాంత ప్రవర్తకులను తడమడం ఉంది. క్రీ.పూ. 560 నుండి 480 వరకూ బుద్ధుడు కాలమని అన్నారు. అటువంటప్పుడు శంకరుల కాలమూ అదే అవుతోంది కదా. బౌద్ధ మతాన్ని చాలామంది రాజులు పోషించినట్లుంది. అటువంటప్పుడు శంకరుల కాలంలో బౌద్ధం క్షీణించిందనే మాట ఎట్లా కుదురుతుంది? కనుక గౌతముని కాలంలో శంకరులున్నారనుట అసంగతమని చారిత్రక వేత్తలంటారు.

జ్ఞానశక్తియే. అది ఆత్మతత్త్వమైన శివుణ్ణి, చుట్టి యుండాలి. మద్ది తెలుపు, శివుడూ తెలుపే.

అర్జున వృక్షం శివం కాగా, అమ్మవారు మల్లెతీగ. మరొకవిధంగా చెప్పవచ్చు. మల్లెతీగలో నున్న పువ్వు, శివుడు కాగా, మకరందం ఆస్వాదించే తుమ్మెదయే అమ్మవారు. శ్రీశైలంలో అమ్మవారు భ్రమరాంబిక. శివానందలహరిలో ఆచార్యులు:

సంధ్యారంభవిజృంభితం శ్రుతి శిరః స్థానాంతరాధిష్ఠితం
సప్రేమ భ్రమరాభిరామ మసకృత్ సద్వాసనా శోభితం
భోగీంంద్రా భరణం సమస్త సుమనః పూజ్యం గుణావిష్కృతం
సేవే శ్రీ గిరిమల్లి కార్జున మహాలింగం శివాఽఽలింగితం

ఈ శ్లోకానికి రెండర్థాలున్నాయి. ఒకటి మల్లెకు, రెండవది శివునకు చెందినదిగా ఉంటుంది.

సంధ్యాకాలంలో మద్దిచెట్టు పుష్పాలతో వినిపిస్తుంది. శివుడపుడు నాట్యం చేస్తాడు. ఆ పూలు, అ చెట్టును అలంకరించడమే కాకుండా శ్రుతి శిరస్సులను (ఉపనిషత్తులు) అలంకరిస్తాయి. అనగా తలపైన, చెవులలోను అలంకరింపబడతాయి. శివుడు శ్రుతి శిరస్సులతో ఉంటాడు. ఆ చెట్టు తుమ్మెదలతో ఉండగా శివుడు భ్రమరాంబికతో ఉంటాడు. చెట్టు మంచి వాసనతో ఉండగా శివుడు మంచి వాసన (భావన)తో ఉంటాడు. దాని పూలు మహాభోగులకు అలంకారంగా ఉండగా శివుడు భోగీంద్రుడై వాసుకి ఆభరణంగా కల్గియుంటాడు. వీటి పూలు అన్ని పూలకంటే పూజ్యములు కాగా శివుడు మంచివారిచే, దేవతలచే పూజింప బడేవాడై యుంటాడు. ఇది సుగంధ గుణాన్ని బట్టి కనుగొనబడితే శివుడు మంచి గుణాలను బట్టి వ్యక్తమౌతూ ఉంటాడు. గుణానికి దారమని, గుణమని అర్థం. పువ్వులను దారాలతో గ్రుచ్చుతాం. అతడుత్తమ గుణాలతో ఉంటాడనీ అర్థం. మద్దిచెట్టును

దాని తరువాతే కాళిదాసు కాలమని; క్రీ.పూ. 600 కాని 500 కాని శంకరుల కాలం కాదని చారిత్రకులంటారు.

శంకరుల భాష్యంలో బౌద్ధమత సిద్ధాంతాలు

వైభాషికమని, సౌంతాంత్రికమని, యోగాచారమని, విజ్ఞాన వాదమని ప్రధాన బౌద్ధ సిద్ధాంతాలు. వైభాషికాన్ని, దిజ్నాగుడు, యోగాచార, విజ్ఞాన వాదాలను నాల్గవ శతాబ్దికి చెందిన అసంగుడు, వసుబంధుడు లేవదీసారు. మాధ్యమిక లేదా శూన్య వాదాలను బలపరచినవాడు నాగార్జునుడు. ఇతడు క్రీ.శ. 2వ శతాబ్దానికి చెందినవాడు. 2,4,6 శతాబ్దాలకు చెందిన బౌద్ధ సిద్ధాంతాలను శంకరులు ఖండించగా వీరు క్రీస్తు పూర్వం ఎట్లా ఉంటారని చారిత్రకులు ప్రశ్నిస్తున్నారు.

కనిష్కుని కాలంలో బౌద్ధం హీన యానమని, మహాయానమని రెండుగా చీలిందని అందు మహాయానాన్ని గురించి శంకరుల శిష్యుడు, పద్మపాదుడు తన పంచపాదికలో పేర్కొన్నాడని కనిష్కుడు క్రీ.శ. చెందినవాడు కావడం వల్ల కనుక శంకరులెట్లా క్రీస్తు పూర్వానికి చెందినవారౌతారని ప్రశ్నిస్తున్నారు.

శంకరుల స్తోత్రాలలో కాలనిర్ణయం

శంకరులు, సౌందర్య లహరిలో, అమ్మా! నీవు దయతో ద్రవిడ శిశువునకు పాలనీయడంచే అతడు మహాకవి అయ్యాడని ఉంది. అతడే జ్ఞాన సంబంధుడు. అతడు క్రీ.శ. 7వ శతాబ్దానికి చెందినవాడు. అప్పర్, మహేంద్రవర్మ అనే పల్లవరాజును జైన మతం నుండి వైదిక మతానికి మార్చినవాడు, జ్ఞానసంబంధుడు. మారవర్మన్ అరికేసరి అనే పాండ్యరాజును జైనాన్నుండి మార్చినవాడు. ఈ రాజు ఏడవ శతాబ్దంలో పాలించాడు కనుక సంబంధుడు ఏడవ శతాబ్దంలో ఉన్నాడు. అతణ్ణి శంకరులు పేర్కొన్నారు కనుక తరువాతి వారే అవుతారు. అప్పర్, జ్ఞాన సంబంధులు, సమకాలికులు.

మహేంద్రవర్మ తరువాత నరసింహ వర్మ వచ్చాడు. బ్రాహ్మణుడైన పరంజోతి అనే సైన్యాధిపతి, శివ భక్తుడై చిరుతొండ నాయనార్‌గా ప్రసిద్ధి పొందాడు. ఇతడే వాతాపిపై ఏడవ శతాబ్దంలో దండెత్తి చాళుక్య రాజును ఓడించాడు.

ఇతని ప్రస్తావన శంకరుల శివభుజంగ స్తోత్రంలో ఉంది. అందు భార్యకు, తనయునకు, తండ్రికి ద్రోహం చేసిన వారి మాదిరిగా నేను చేయలేదు. అట్టి ద్రోహం చేసినవారిని రక్షించావని శివుణ్ణి నిందాస్తుతిని చేసారు.

చిరు తొండనంబి కథ ప్రసిద్ధమైనది. బ్రతికియున్న కొడుకును చంపి ఆ మాంసాన్ని వండి వడ్డించిన కథ అందరికీ తెలిసిందే. అనగా సుతాద్రోహి అయ్యాడు. ఈశ్వరుడు, శివభక్తునిగా వచ్చి 'ఇయర్ పగైనాయనార్' అనే భక్తుడి భార్యనే అడిగాడు. అట్టివాడు కాంతాద్రోహి.

ఇక చండికేశ్వరుడు పితృద్రోహి. అతడు కుండల కొద్దీ పాలను శివలింగంపై అభిషేకిస్తూ ఉండేవాడు. తండ్రి వచ్చి ఆ పాల చెంబును కాలితో తన్నాడు. వెంటనే చండి కేశ్వరుడు తండ్రి కాళ్లను నరికి వేసాడు. ఇక నుండి నేను నీకు తండ్రినని శంకరుడన్నాడు. అంతకుపూర్వం అతని పేరు విచార శర్మ, తరువాత చండికేశ్వరుడయ్యాడు. శివుని పంచమూర్తులలో అనగా శివుడు, అమ్మవారు, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, చండీశ్వరులలో ఒకటి అయ్యాడు. ఇది ఏనాటి కథయో?

పైవారిలో చిరుతొండ నాయనార్ చారిత్రక వ్యక్తి. ఏడవ శతాబ్దానికి చెందినవాడు. ఇతణ్ణి శంకరులు ప్రశంసించారు కనుక ఇతని తరువాతనే శంకరులుండాలని చారిత్రకులు వాదన.

చారిత్రకులెత్తి చూపినవి:

సూత్రభాష్యంలో శంకరులు, సత్‌నకు అసత్‌నకు సంబంధం ఉండదని చెబుతూ పూర్ణవర్మ పట్టాభిషేకానికి ముందు గొడ్రాలి కొడుకు రాజుగా

నున్నాడనుట అసంగతమనే అభిప్రాయంలో వాడారు. ఈ పూర్ణ వర్మ ఎవరు? ఇద్దరా పేర్లతో నున్నారు. జావా ద్వీపంలో నాల్గవ శతాబ్దానికి చెందిన పూర్ణవర్మ ఒకడు. శంకరులు పేర్కొన్న రాజు మగధను పాలించిన పూర్ణవర్మ అయి యుంటాడని అన్నారు. హ్యూయాన్ త్సాంగ్ అనే యాత్రికుడు ఏడవ శతాబ్దంలో మనదేశం వచ్చి మగధను పూర్ణవర్మ పరిపాలిస్తున్నాడని వ్రాసేడు.

బౌద్ధ మతానికి విరోధియైన శశాంకుడు గయలోని బోధి వృక్షాన్ని నరికాడని, పూర్ణవర్మ దానిని మరల ప్రతిష్ఠించాడని కథ. ఇతణ్ణి శంకరులు పేర్కొన్నారు కనుక ఏడవ శతాబ్దం తరువాత శంకరుల కాలమని చరిత్రకారుల వాదన.

అయితే చాలా కాలం వెనుకనే బౌద్ధం, హైందవ మతం మిగతా దేశాలలో వ్యాపించాయి. కాంబోడియా (కాంభోజ)లో ఒక శాసనంలో ఇంద్రవర్మ ప్రస్తావన ఉంది. అతని గురువు శివసోముడు. అతడు భగవత్ శంకరులనుండి శాస్త్రాలను నేర్చుకున్నట్లుంది. "యేనాధీతాని శాస్త్రాణి శంకరాహ్వాయతః" వారు శంకరులే అని చారిత్రకులున్నారు. ఇంద్రవర్మ కాలం తొమ్మిదివ శతాబ్దానికి చెందింది. అతని గురువు 30 లేక 40 సంవత్సరాల పెద్దవాడై యుంటాడు. కనుక శంకరుల సమకాలికుడే కనుక శంకరులు 788-820కి చెందినవారని తీర్పునిచ్చారు.

పాశ్చాత్య చరిత్రకారుల లక్ష్యం మనను కించపరచడమే

పాశ్చాత్య చరిత్రకారులు మన కాలగణనను చెత్తబుట్టలో వేస్తారు. మన సంకల్పంలో, ఏ కల్పంలో, ఏమన్వంతరంలో, ఏ యుగంలో, ఏ సంవత్సరంలో, ఏ రోజులో ఆ వేళ ఉన్నామో చెప్పుకుంటాం.

అనాది నుండి ఈ సంస్కృతి సాగుతోంది. పాశ్చాత్యులు రెండువేల సంవత్సరాల నుండి కన్ను తెరిచారు. ఇదంతా క్రీస్తు తరువాతనే. వారి భౌతిక విజ్ఞాన శాస్త్ర ప్రగతిని కాదనం, కించపరచడం లేదు. అయితే తమకంటె

పూర్వమే గొప్ప నాగరికతలున్నాయని వారంగీకరించకపోవడం వల్ల చరిత్రలోని లెక్కలు తారుమారయ్యాయి. ఇంకా మనం వర్ణ భేదాలతో కొట్టుకుంటున్నామని, అనాగరికులమని వారిలో ఒక దృఢ భావన ఏర్పడి వీరికి చరిత్ర పాఠాలు చెప్పాలనుకున్నారు. భారతీయ పూర్వపుటౌన్నత్యాన్ని జీర్ణించుకోలేక పోయారు. కాలాన్ని ఎంత తక్కువగా కుదించి చూపితే అదే మేలని భావించారు. మన శాస్త్రాలు, వేదాలు, కళలు, విద్యలను గుర్తించలేదు. మన విద్యల పట్ల ఏవగింపు కలిగేటట్లుగా పథకాలు పన్నారు. ఆర్యద్రావిడ భేదాలను కల్పించారు.

ఎట్లా మనలో ఏవగింపు కల్గించాలి? వర్ణాశ్రమాలను, వేదాన్ని కాదనిన బుద్ధుణ్ణి కీర్తించి భారతీయ చరిత్ర అంతా ఇతనితోనే ఆరంభమైనదని చిత్రీకరించారు. రాముడు, కృష్ణుడు మొదలైనవారు ఏవో కథలలో నాయకులని, చారిత్రక వ్యక్తులు కారని నమ్మబలికారు. ఇక అద్వైతం కూడా, బౌద్ధం నుండే వచ్చిందన్నీ, శయనిస్తున్నట్లున్న విష్ణు విగ్రహం కూడా బుద్ధుని మహా నిర్వాణంలో ఉన్న శిల్పం మాదిరిగానే ఉంటుందని ప్రచారం చేసారు.

వేదాలు, మహా అయితే బుద్ధునికి ముందు ఏ ఐదు వందల వత్సరాలనుండో వచ్చాయని, దానికంటె ముందు హరప్పా నాగరికత యుండేదని, అది ద్రావిడ నాగరికతయై యుంటుందని, హరప్పాలోని వారిని తరిమివేసి ద్రావిడ సంస్కృతినుండి నేర్చుకుని వైదిక నాగరికత వచ్చిందని వ్రాసేరు.

మన పురాణాలలో ఇచ్చిన రాజులు, వారి కాలం పుక్కిటి పురాణం క్రింద జమకట్టారు. ఇట్టి భావాలనే చరిత్ర పుస్తకాలలో వ్రాసి వ్యాప్తి చేసారు. చిన్నప్పటినుండీ ఈ నాగరికత పై చిన్నచూపు చూడడం మొదలు పెట్టారు.

పురాణాలలో రాజులు, వారి కాలాలు స్పష్టంగా ఉన్నాయి. ఈనాటి ముద్రణ సౌకర్యం ఆనాడు లేదు కనుక వ్రాతలలో కొన్ని పొరపాట్లు దొర్లి యుండవచ్చు. తులనాత్మక పరిశీలన చేసి అన్ని పాఠాలను పరిశీలించి ఒక నిర్ధారణకు రావచ్చు. సత్యాన్ని మనకు మనమే నిర్ధారణ చేసుకోగలం.

మన చరిత్రనుండే నిర్ధారణ

పురాణాలలో రాజవంశాలు పేర్కొనబడ్డాయి. ఇవి కాక కల్హణుడనే కాశ్మీర పండితుడు వేయి సంవత్సరాల వెనుక రాజ తరంగిణిని వ్రాసేడు. అందనేక రాజుల కథలున్నాయి. పురాణాల విషయాలు, ఇందు చెప్పినవి చూస్తే చాలా పోలికలున్నాయి.

అట్లాగే నేపాల్ వంశ చరిత్ర ఉంది. ఇందు భారత కాలంనుండి వచ్చిన రాజవంశాలున్నాయి. పండిత భగవాన్ లాల్ ఇంద్రాజీ, ఒక బౌద్ధ భిక్షువునుండి ఈ గ్రంథాన్ని సంపాదించి ప్రచురించాడు. దీనికీ పురాణాల వివరాలకూ సంబంధం కన్పిస్తోంది.

లంకలో మహావంశం అనే గ్రంథం ఉంది. 1500 సంవత్సరాల వెనుక నాటిదని ఆ దేశంలో బౌద్ధమత చరిత్రను చెబుతోంది. ఇట్లా అన్ని గ్రంథాలను పరిశీలిస్తే, ఎన్నో చారిత్రక విషయాలు తెలుస్తాయి. ప్రతి దానినీ కాకమ్మ కథగా కొట్టిపారవేయవలసిన అవసరం లేదు.

చరిత్రకారులు, ఎక్కడ తప్పటడగుగు వేసారో చూడండి.

అలెగ్జాండర్ సైన్యాధిపతి, సెల్యూకస్, అతని తరువాత గ్రీసు దేశపు రాజయ్యాడు. అతడు మన మగధరాజు చేతిలో ఓడిపోయాడు. సంధి చేసుకున్నాడు. సెల్యూకస్, మొగస్థనీస్ అనే రాయబారిని పాటలీ పుత్రానికి పంపాడు. ఈ రాయబారి తాను భారతదేశంలో చూసిన విషయాలను వ్రాసేడు.

ఇతడు సాండ్రకేటస్ పాటలీపుత్రాన్ని పరిపాలిస్తున్నట్లు వ్రాసేడు. అతడే మౌర్య చంద్రగుప్తుడని చరిత్రకారులు నిర్ధారణకు వచ్చారు.

కేవలం చంద్ర గుప్తుడని పేర్కొన్నాడే కాని, చంద్రగుప్తమౌర్యుడని పేర్కొనలేదు. ముందు నంద సామ్రాజ్యం ఉందనీ చెప్పలేదు. బిందుసారుడు, ఇతని కొడుకనీ చెప్పలేదు.

కనుక ఇతడు గుప్త సామ్రాజ్యపతియైన చంద్రగుప్తుడని ఎందుకు చెప్పకూడదు? గుప్త సామ్రాజ్యంలో ఇద్దరు చంద్రగుప్తులున్నారు. అందొకడు కాకూడదా? గుప్తులు పాటలీ పుత్రాన్ని పాలించారు కదా!

మన పురాణాలను, రాజ తరంగిణిని, నేపాలు రాజుల కథలను పరిశీలిస్తే అతడు మౌర్య చంద్ర గుప్తుడు కాదని తెలుస్తుంది. మనవాళ్ళ లెక్కల ప్రకారం క్రీ.పూ. 1500లో మౌర్య చంద్రగుప్తుడున్నాడు. ఇట్లా చరిత్ర 1200 సంవత్సరాలు వెనుకకు వెడుతుంది. అట్లాగే శంకరుల కాలమూ 1300 సంవత్సరాలు వెనుకకు వెడుతుంది.

విష్ణు పురాణంలో పరీక్షిత్తు పాలించిన వెనుక మహాపద్మనందుడు పాలించినట్లుంది. తరువాత చంద్ర గుప్త మౌర్యుడు వస్తాడు. నందరాజ్యం క్రీ.పూ. 1600 సంవత్సరంలో.

కాని చంద్రగుప్త మౌర్యుడు, క్రీ.పూ. 400 అని చరిత్రకారులు నిర్ధారణకు వచ్చారు. రెండవ చంద్రగుప్తుడు క్రీ.త. 5వ శతాబ్దమని అన్నారు. దానితో తేడా వచ్చింది.

వారితో వివాదపడనవసరం లేదు. లోతుగా పరిశోధన జరగాలంటున్నా పురాణాలను, మిగిలిన చారిత్రక గ్రంథాలను విజయవాడకు చెందిన శ్రీ కోట వెంకటాచలంగారు పరిశీలించి మెగస్థనీస్ వచ్చింది గుప్తరాజుల కాలంలోనే అని, మౌర్య చంద్రగుప్తుని కాలంలో కాదని నిర్ధారించారు. *(వివరాలకు వారి కలిశక విజ్ఞానం చూడండి)* వారు తరువాత అద్వైత సన్యాసి అయ్యారు. అట్లాగే కె.జి. నటేశ అయ్యర్ కూడా వేంకటాచలంగారి మార్గంలోనే పరిశోధించారు. వాటిని చూడండి.

మొదటి చంద్రగుప్తుడు కొడుకైన సముద్ర గుప్తుని కాలంలో ఆ రాయబారి వచ్చాడు. అతడు పేర్కొన్నది సాంద్రకోటస్. సముద్ర గుప్తుని మొదటి అక్షరం 'స' సరిపోతోంది కదా. సముద్ర శబ్దం జనుల నోళ్ళల్లో బడి సంద్రం కాగా దానిని విని సంద్రకోటస్ గా పేర్కొన్నాడని ఎందుకూహించకూడదు?

ఇట్లా వేయి సంవత్సరాలు వెనుకకు వెళ్ళితే శంకరులు క్రీ.శ. 8వ శతాబ్దానికి చెందిన బుద్ధుని కాలం, ఇంకా వేయి సంవత్సరాలు వెనుకకు వెళ్ళగా, అపుడు బౌద్ధ మత ప్రభావాన్ని శంకరులు ఎదుర్కొనడం కుదురుతుంది. అపుడు బుద్ధునికి శంకరులు సమకాలికులు కారు కదా!

పురాణాల ప్రకారం క్రీ.పూ. 1500 సంవత్సరంలో మౌర్య సామ్రాజ్యం స్థాపింపబడింది. దీనికి ముందు బింబిసారుడు, తరువాత అతని కొడుకు అజాత శత్రువు, అతని తరువాత ముగ్గురు రాజులు పాలించారు. తరువాత మహా పద్మనందుడు వచ్చాడు. తరువాత మౌర్యచంద్ర గుప్తుని రాక. చంద్రగుప్త మౌర్యునికి మూడు వందల సంవత్సరాల ముందు బింబిసారుడున్నట్లు పురాణాలంటున్నాయి. అనగా క్రీ.పూ. 1800 నుండి 1700 వరకూ బుద్ధుడున్నాడు. కనుక శంకరుల అవతారం క్రీ.పూ. 509 సరిపోతుంది.

ఇక కాళిదాసు కాలం గురించి వ్రాస్తూ కొన్ని వందల పుస్తకాలను చూసి, విద్యా వాచస్పతియైన కొల్హాపూర్‌నకు చెందిన అప్పాశాస్త్రిగారు కాళిదాసు కాలం క్రీ.పూ. 6వ శతాబ్దానికి చెందినదని, ఆ శతాబ్దం మధ్యలో కుమారిల భట్టు కాలమని, ఆ శతాబ్ది చివరలో శంకరుల కాలమని నిర్ధారించారు. జైన గ్రంథాలను కూడా వారు పరిశీలించారు.

అయితే క్రీ.శ. 2,6 శతాబ్దాలలో పుట్టిన బౌద్ధుల వాదులను శంకరులెట్లా ఖండించారని అడగవచ్చు. వారి పేర్లను పేర్కొనలేదు. బౌద్ధంలో చాలాకాలం నుండి వస్తున్న సిద్ధాంతాలనే ఖండించారని గుర్తించండి.

శంకరులు తన పూర్వమున్న అద్వైతాన్నే తిరిగి ప్రతిష్ఠించారు కాని లేని దానిని క్రొత్తగా కనుగొన్నట్లు వ్రాయలేదు.

అసలు గౌతమ బుద్ధుణ్ణే 24వ బుద్ధుడని బౌద్ధ గ్రంథాలంటున్నాయి. కనుక ఇతని ముందు 23 బుద్ధులున్నట్లే కదా. అందుకనే రామాయణంలో బౌద్ధాన్ని ఖండించినా అది కేవలం గౌతమ బుద్ధుని సిద్ధాంతం కాదని అంతకుముందున్న దానినే అని భావించవచ్చు. జాబాలి యొక్క అవైదిక

సిద్ధాంతాన్ని అట్లా ఖండించాడు. ఇట్టివారిని ప్రోత్సహించకూడదని వీరిని దొంగలను శిక్షించినరీతిలో శిక్షించాలని అన్నాడు. గౌతమ బుద్ధుడు చెప్పిన సదాచారం ధ్యానం, ఇంద్రియ నిగ్రహం వంటి సిద్ధాంతం చార్వాకం కాదు. ఇది పచ్చి భౌతిక వాదం. కాబట్టి దీనిని ఖండించాడు.

జైనులు కూడా జైన మత వ్యాప్తి చేసిన వర్ధమాన మహావీరుణ్ణి 24వ తీర్థంకరునిగా పేర్కొన్నారు. మా మాతం, అనాదియని వారూ అంటారు. జైన మత స్థాపకుడు క్రీ.పూ. 9వ శతాబ్దానికి చెందినవాడని అన్నారు.

ఇక బ్రహ్మ సూత్రాలలో బౌద్ధం ఖండింపబడింది. కనుక, గీత బ్రహ్మ సూత్రాలూ బుద్ధుని తరువాత వచ్చాయనడం సబబు కాదు. ఎందరో బుద్ధులున్నారని బౌద్ధులే అన్నారు. వారి సిద్ధాంతాన్ని ఖండించాడు వ్యాసుడు. వ్యాసుడు గాని, కృష్ణుడు గాని, గౌతమ బుద్ధుని తరువాత వచ్చారనడం సబబు కాదు.

ఇక క్రీస్తు శకారంభంలో కనిష్కుడున్నాడని అతని కాలంలో హీనయానం, మహాయానంగా బౌద్ధం చీలిందని అందువల్ల దాని తరువాత శంకరుల జన్మమని అనడం కుదరదు. అంతకుముందు నుండే ఈ సిద్ధాంతాలున్నాయని చెప్పాను.

ఇక ఏడవ శతాబ్దానికి చెందిన జ్ఞాన సంబంధుణ్ణి ద్రవిడ శిశువని శంకరులు, సౌందర్య లహరిలో పేర్కొన్నారని అనడం సబబు కాదు. సౌందర్య లహరీ వ్యాఖ్యానాలలో ఆ ద్రవిడ శిశువు, శంకరులే అని వ్రాసేరు. శంకరులే పాలను అమ్మవారికి నివేదించారని అన్నారు.

ఏడవ శతాబ్దానికి చెందిన సిరు తొండ నాయనార్‌ని సుతాద్రోహిగా వీరి స్తోత్రాలలో పేర్కొన్నారని అంటారు. కొన్ని స్తోత్రాలు వీరి పేరున ఉన్నా, అన్నీ వీరు వ్రాయలేదు. సౌందర్యలహరి, శివానందలహరి, భజగోవిందం, సుబ్రహ్మణ్య భుజంగ స్తోత్రం, కనక ధారాస్తవం వంటి వాటినే వీరు వ్రాశారు. ఎందుకన్నీ వ్రాయలేదో చెబుతాను చూడండి. దేవీ అపరాధ స్తోత్రంలో పెద్ద

కొడుకు పుట్టవచ్చుగాని, చెడ్డ తల్లి పుట్టరమ్మా "కుపుత్రో జాయేత, కుమాతా నభవతి" అని వ్రాసి 85 సంవత్సరాలున్న నేను, ఎక్కడ శరణు జొచ్చుతానమ్మా అని వ్రాసినట్లుంది. 32 సంవత్సరాలు బ్రతికిన శంకరులిట్లా వ్రాస్తారా? శంకర మఠాలలో చాలామంది శంకరాచార్యులున్నారు. అందొకరు వ్రాసి యుంటారు.

ఇక శివభుజంగ స్తోత్రంలో సుతాద్రోహి అనే మాట వస్తుంది. అది కూడా వేరే శంకర నామ ధేయులు వ్రాసియుంటారు.

ఇక పూర్ణ వర్మ గురించి దానిని బట్టి కాలాన్ని చెప్పలేం. మనం ఏ వెంకయ్యో, పుల్లయ్యో అన్నట్లు; ఆంగ్లేయులు టామ్, డిక్, హ్యారీ అన్నట్లు ఏదో రాజునకు ఏదో పేరుంచాలి కనుక అట్లా పేరు వ్రాసేరని ఊహించవచ్చు. భాష్యాలలోనే యజ్ఞదత్త, దేవదత్త అనే పేర్లువస్తాయి. అట్లా వారున్నారని కాదు. ఏదో ఒక వ్యక్తి ఉన్నాడని చెప్పడం కోసం అట్లా సంస్కృత సాహిత్యంలో పేర్లుంటాయి. అట్లాగే పూర్ణ వర్మ అని యంటారు. సత్‌ని పూర్ణంగా, అసత్‌ని శూన్యంగా చెప్పడం కోసం గొడ్రాలు కొడుకని చెప్పి యుంటారు.

మగధరాజు పూర్ణవర్మ మరల బోధివృక్షాన్ని నాటాడని పేర్కొన్నాను కదా! అనగా ఫాహియాన్ పేర్కొన్నవాడు బౌద్ధుడు. అట్టి బౌద్ధ దృష్టాంతాన్ని శంకరులు చెప్పాలా? చెప్పి యుంటారా? ఆ చిన్న రాజును గురించి ప్రస్తావిస్తారా? శూన్యవాదిని పూర్ణవర్మ చేయడమా? (అని నవ్వుతూ అన్నారు)

అభినవ శంకరులు

కాంబోడియా శాసనంలో భగవత్ శంకర అని యుంది కనుక వారు ఆదిశంకరులే కావాలి. శాసన కాలం క్రీ.శ. 8వ శతాబ్దమని తెలుస్తోంది. దీనికేమి సమాధానం చెబుతారని ప్రశ్నిస్తున్నారు.

శంకరుల తరువాత అనేకులు పీఠాలను అధిరోహించారు. మహమ్మదీయులను దండయాత్రల నుండి హిందూ మతాన్ని రక్షించిన

విద్యారణ్య స్వామి అట్టివారే. ద్వైత సిద్ధాంతం నుండి, వీరశైవం నుండి వచ్చే దాడుల నెదుర్కున్నారు. వారు విజయనగర సామ్రాజ్య కారకులు.

అట్లాగే అభినవ శంకరులు కూడా. కంచి మఠంలో వీరు 38వ పీఠాధిపతి. వీరి జీవితం గురించి శంకరేంద్ర విలాసం, సద్గురు సంతాన పరిమళం గ్రంథాలలో చూడవచ్చు. శంకరుల తరువాత 1300 సంవత్సరాలకు వచ్చి శంకరులు చేసిన అవైదిక మత నిర్మూలనం వీరూ చేసారు. సర్వజ్ఞ పీఠాన్ని అధిరోహించారు. వీరితర దేశాలకు వెళ్ళినట్లు కూడా ఉంది. చీనా, తుర్కిస్థాన్, బాహ్లీక (ఆఫ్ఘనిస్తాన్‌లో ఒక భాగం) రాజ్యాలకు వెళ్ళినట్లు, గుణరత్నమాల అనే గ్రంథం చెబుతోంది. ఆ దేశాలవారు, వీరిని తమ గురువులుగా కీర్తించారని ఉంది.

"చీన - తురుష్క - బాహ్లీకాద్యైః స్వరూపాచార్య తయాస్తుతం (శ్లో. 66)

శంకరులతో సమానమైన వారిని ఆదిశంకరులుగా భావించి లోగడ పేర్కొన్న 'నిధి నాగ'శ్లోకాన్ని ఆది శంకరులకు ఆపాదించారు. ఈ శ్లోకంలో పేర్కొనబడిన శంకరులు, అభినవ శంకరులే. చాలామంది ఎనిమిదవ శతాబ్దానికి చెందినవారు, ఆది శంకరులని భ్రాంతి పడడానికి కారణమైంది.

ఆది శంకరులు పుట్టినది, వైశాఖ మాసం, శుక్ల పక్షంలో. ఆది శంకరులు నందన నామ వత్సరంలో పంచమినాడు పుట్టగా వీరు విభవనామ సంవత్సర దశమినాడు పుట్టినట్లుంది. మరి ఇద్దరూ వేర్వేరు వ్యక్తులే కదా!

ఇట్లా వీరిద్దరూ ఒక్కరేయని భ్రాంతి పడ్డారు. కాంబోడియా శాసనంలో ఇంద్రవర్మ యొక్క గురువైన శివసోముని యొక్క గురువు శంకరులని యుండగా, శంకర విజయాలలో శంకరుల శిష్యుడు శివసోముడని ఎక్కడా లేదు. అయినా భ్రాంతి పడి వీరిని వారుగా భావించి యుంటారు.

కొంతమంది క్రీ.పూ. 44-12 అని అన్నారు. టి.ఎస్ నారాయణ శాస్త్రిగారు జైనుల లెక్కలను బట్టి వారి యుధిష్ఠిర శకకాలాన్ని బట్టి అట్లా అన్నారు.

ద్వారకా మఠంలో నున్న గురుపరంపరలో క్రీ.పూ. 509 కాలానికి వారి లెక్కలు ఇంచుమించు సరిపోతున్నాయి. కంచి, ద్వారక, పూరి మఠాల లెక్కలు క్రీ.పూ. 500 సంవత్సరాల దరిదాపులో ఉన్నాయి.

థియోసఫిస్టు అనే పత్రికలో పాశ్చాత్యులచే కూడా పొగడబడిన శ్రీ సుబ్రహ్మణ్య అయ్యర్ ద్వారకా మఠపు లెక్కల ప్రకారం శంకరులు క్రీ.పూ. 600–500 కాలానికి చెందిన వారని అన్నారు.

ఇంద్రాంశతో సుధన్వుడనే రాజు పుట్టాడని చెప్పాను. శంకరులతో అతడు మాట్లాడినట్లు తమ దగ్గర తామ్ర శాసనముందని ద్వారకా మఠం వారన్నారు. అది ప్రకటింపబడింది కూడా.

బద్రీనాథ్‌లో జ్యోతిర్మఠం వారు మఠానుశాసనం (1946) ప్రకటించారు. వీరు శంకరుల కాలం క్రీ.పూ. 509 అనే నిర్ణయించారు.

ఇట్లా అనేక మఠాలు, ఏకాభిప్రాయంతో ఉండగా ఇదంతా తప్పనడం నేటి చారిత్రకుల మాటలకే పట్టం గట్టడం, దీనినే ప్రచారం చేయడం బాగుందా?

నేపాల్ రాజవంశావళిలో శంకరులు, నేపాల్ వెళ్ళినట్లు వృషదేవవర్మ అపుడు పాలిస్తున్నట్లు కలి ప్రారంభించిన 2600 సంవత్సరాలకు అతడున్నట్లుంది. అనగా క్రీ.పూ. 5వ శతాబ్దమే కదా!

జైనుల గ్రంథాలలో శంకరులను ఖండించినా, వీరిని శివునిగా పేర్కొన్నారు. ఇది శివావతారాన్ని తెలుపుతోంది. ఇక శంకరులు సిద్ధి పొందిన సంవత్సరం కూడా ఉంది. "ఋషిః బాణాః తథా భూమి మర్త్యాక్షౌ" అని. ఋషి–7, బాణం–5, భూమి–1; మర్త్యాక్షం–2. అనగా 7512. త్రిప్పితే 2157. వారి జైన యుధిష్ఠిరశకంతో పోలిస్తే, కలిలో 2625; అనగా క్రీ.పూ. 477లో శంకరులు సిద్ధిని పొందారు. తామ్రాక్ష సంవత్సరంలో సిద్ధియని యుంది. అనగా రక్తాక్షి సంవత్సరమే.

హాలుడు - పూర్ణవర్మ

గురురత్నమాలలో హాలునిచే పోషింపబడిన కుమారిలుడు, కాశిని విడిచి పెట్టాడని యుంది. శాతవాహన చక్రవర్తియైన హాలుడు క్రీ.శ. 1వ శతాబ్ది యని చారిత్రకులు నిర్ణయం. కాని కె.జి నటేశ అయ్యర్ 'జిజ్ఞాస' అనే పత్రికలో కలియుగం ప్రారంభమైన తరువాత 74వ రాజు హాలుడని నిర్ణయించారు. పురాణాల లెక్కల ప్రకారం ఇది శంకరుల కాలమౌతోంది. కలి తరువాత 2600 సంవత్సరాలు.

ఆపైన వాయుపురాణంలో "తతః సంవత్సరం పూర్ణో హాలో రాజా భవిష్యతి" అనగా పూర్ణుడనే పిలువబడే హాలుడు రాజుకాబోతున్నాడని అర్థం.

శంకరులు, సూత్ర భాష్యంలో పూర్ణవర్మ ప్రస్తావన తీసుకొని వచ్చారు కదా! యజ్ఞదత్త, దేవదత్త వంటి పేరే అదియని లోగడ చెప్పాను. తరువాత పరిశోధనల వల్ల పూర్ణవర్మయే హాలుడని తెలియవచ్చింది. పురాణాల లెక్కల ప్రకారం అతని కాలం క్రీ.పూ. 500. మనమూ అట్లాగే అంటున్నాం.

అసాధారణ బాలుడు

పుట్టుకనుండి తన అసాధారణత్వాన్ని చూపించారు శంకరులు. మూడవ యేట లోపుగా ప్రాంతీయ భాషలో, ఐదవ యేడు పూర్తి అయ్యేటప్పటికి సంస్కృతంలో ప్రావీణ్యం చూపించారు. వారి ప్రాంతీయ భాష తమిళం అయి యుంటుంది. మూడవ యేటనే జ్ఞాన సంబంధులు తేవారాన్ని కీర్తించారు.

ఇవన్నీ కాకమ్మ కథలని అనుకుంటాం. కాని ఈనాటికీ అట్టి బాలమేధావుల గురించి పత్రికలలో చదువుతున్నాం. గత జన్మ సంస్కారాలు, ఒక్కమాటుగా, పొటమరించాయని చెప్పడం కంటె సమాధానం ఏం చెప్పగలం? గత జన్మల గురించి బౌద్ధ జైనులూ నమ్ముతారు. అయితే శంకరుల గురించి, సంబంధుల గురించి గత జన్మలున్నాయని చెప్పకూడదు. వారు అవతార మూర్తులే.

చిన్ననాటనే ఉపనయనం

ఐదవ యేటనే ఉపనయనం జరిగింది. జ్ఞాన సంబంధులు మూడవ యేటనే తేవారాన్ని కీర్తించారని, తీర్థ యాత్రలు ముగించుకొన్న తరువాత వారికి ఉపనయనం జరిగిందని పెరియ పురాణంలో ఉంది. పుట్టిన తరువాత ఏడవ యేటనే ఉపనయనం జరగాలి. బ్రహ్మ వర్చస్సును కోరుకొనేవారికి ఐదవ యేట చేయవచ్చని శాస్త్రాలన్నాయి.

నిత్య కర్మల వల్ల ఆత్మశక్తి వృద్ధి పొందుతుంది. సత్యం పలకడం వల్ల లాభం కనిపిస్తోందా? అసత్యం పలకడం వల్ల లాభాలు కన్పిస్తున్నాయి. అయితే సత్యాన్నే ఎందుకు పలకాలన్నారు? పాపభూయిష్ఠుడవుతున్నావు కనుక కూడదన్నారు. అట్లాగే నిత్య కర్మల విషయంలోనూ. నిత్య కర్మల వల్ల (సంధ్యావందనం మొదలైనవి) ఆత్మశుద్ధి ఏర్పడుతుంది. దాని ఫలాన్ని చూడలేం. ప్రత్యక్షఫలం అంటూ కనబడదు. ఒక కోరికతో చేసేవాటిని కామ్య కర్మలని అంటారు. దశరథుడు, పుత్రుని కోసం పుత్రకామేష్టి చేసాడు. వాటిని విధిగా చేయాలని లేదు. నిత్య కర్మల వల్ల ఫలం ప్రత్యక్షంగా కనబడక పోయినా, చేయకపోతే పాపమన్నారు.

ఉపనయనం సకాలంలో చేయలేకపోతే 16 సంవత్సరాల వరకూ చేయవచ్చని అన్నారు. బ్రాహ్మణులకు, క్షత్రియులకు 11 నుండి 22 వరకు; వైశ్యులకు 12 నుండి 24 వరకు ఉపనయనం చెయ్యవచ్చని ఉంది. అంతకంటె మించకూడదు. ఈనాడు దీనిని గుర్తించక పోవడం దురదృష్టకరం.

కామం, మనస్సులో చొరబడని కాలంలోనే రోజూ వేయిసార్లు గాయత్రిని చేస్తే చిత్తశుద్ధి ఏర్పడి, తద్వారా లోక కల్యాణము జరుగుతుంది. అట్టిది సకాలంలో చేయకపోతే తండ్రికి పాపం చుట్టుకోదా? 8 నుండి 16 వరకూ ఉన్నదానిని గౌణకాలం అంటారు. 7వ ఏట చేయడం ముఖ్య కాలం అంటారు. గౌణకాలం కూడా దాటితే వ్రాత్యుడని అన్నారు. అనగా జాతినుండి వెలివేయదగినవాడని ఘాటుగా చెప్పారు.

ఉద్యోగానికి వయః పరిమితి దాటకూడదంటే దొంగ సర్టిఫికెట్లు పుట్టించైనా తొందర పడుతున్నాం కదా! అట్లా ఉంటే నిత్య కర్మల విషయంలో జాగరూకత ఉండవద్దా?

అందువల్ల పూర్వులు కామ్యోపనయనాన్ని ఐదవ యేటనే చేయవచ్చుని అన్నారు. "బ్రహ్మవర్చస్య కామః పంచమే" అని స్మృతి వాక్యం. మామూలు కోరికలతో చేసే కామ్య కర్మ కాదది. బ్రహ్మ వర్చస్సును కోరి చేసేది.

అట్టివాడు, అధర్మకృత్యాలు చేయడానికే ముందుకు రాడు. గాయత్రి, అట్టివాని బుద్ధిని బాగా పదును పెడుతుంది.

శంకరుల వంటి వారికి దివ్య శక్తులున్నా చీటికీ, మాటికీ చూపించరు. అవసరం వచ్చినపుడు చూపిస్తారు. మామూలు వ్యక్తుల లాగానే కన్పిస్తారు. కేవలం దివ్యశక్తి ప్రదర్శనమైతే వారెట్లా సంఘంలో కలిసి మెలిసి యుండగలరు? అనగా కొంత దూరంగా ఉంటూ దగ్గరగా ఉంటారన్నమాట.

ప్రపంచంలో పరిస్థితులు క్షీణిస్తున్నప్పుడు శంకర, జ్ఞాన సంబంధులు వాటిని వీలైనంత వేగంతో సరిజేద్దామనుకున్నారు. శంకరులు తమ 32 ఏళ్ళ జీవిత కాలంలోనే యావద్దేశంలో పునర్జీవనం తీసుకొని వస్తే జ్ఞాన సంబంధులు బ్రతికిన 16 సంవత్సరాలలోనే తమిళ దేశంలో అలౌకిక కృత్యాలు చేసారు. ఇది బాల్యంనుంచి వారికి ఉన్న మేధస్సు, విషయ జ్ఞానం వల్ల జరిగింది.

ఇట్లా ఉపనయనం, గురుకుల వాసం జరిగి ఎనిమిదవయేటనే సమస్త శాస్త్రాలను శంకరులు కరతలామలకం చేసుకున్నారు. ఇదంతా లోక మర్యాద కోసం వారు తలుచుకుంటే ఇంకా ముందే చదువు ముగింపగలరు.

అట్టి అలౌకిక వ్యక్తియే రాజచూడామణి దీక్షితుడు. ఇతడు అప్పయ్య దీక్షితుల బావమఱది. ఉపనయనానికి ముందే అన్నీ వీరికి వశమయ్యాయట. కమలినీ కలహంసం అనే వీరు వ్రాసిన నాటకంలో బ్రహ్మగారి భార్యయైన గాయత్రి, నన్ను సమీపించకముందే, అతని మరొక భార్యయైన సరస్వతి, నా దగ్గరకు వచ్చిందని స్పష్టంగా వ్రాసుకొన్నాడు.

కనీస కాలంలో ఉపనయనం మీ బిడ్డలకు చేయలేకపోతే శంకరుల చరిత్ర చదివి ఏం లాభం?

శంకరులు అనేక శాస్త్రాలను చదివినట్లు వీరి చరిత్రలో ఉంది. "ఆన్వీక్ష క్ష్యైక్షి" శ్లోకంలో పరిపాలనకు సంబంధించిన 'అన్వీక్షకి' శాస్త్రం చూడడంతోనే వశమైందని, సాంఖ్య శాస్త్రాన్ని మీమాంసను అవలోకనం చేసారని; "పీతం పాతం జలాంభః" అనగా పతంజలి యోగశాస్త్రాన్ని త్రాగారని; ఆంజనేయుడు సముద్రాన్ని దాటినట్లు కుమారిలుని శాస్త్రాన్ని అనగా మీమాంసను దాటారని వ్రాయబడింది:

ఆన్వీక్షిక్ష్యైక్షి, తంత్రే పరిచిలి రతులా కాపిలే కాపిలేయే

పీతం పాతం జలాంభః పరమపి విదితం భాట్ట ఘట్టార్థ తత్త్వం

యత్ తైః సౌఖ్యం సదస్యాంతర్భవత్ అమలాద్వైత విద్యా సుఖేఽస్మిన్

వీరి గ్రంథాలను, అందు పేర్కొన్న పంక్తులను పరిశీలించగా ఈ శ్లోకం అతిశయోక్తి అనిపించదు.

ప్రపంచంలో ఏ మతంవారైనా తత్త్వం తెలిసికోవడం కోసం గ్రంథాలను నేటికీ పరిశీలిస్తూ ఉంటారు. వారు సర్వజ్ఞులు కనుకనే, మిగతా శాస్త్రాలను ఖండించి అద్వైతాన్ని స్థాపించగలిగారు. ఇదంతా "అమల అద్వైత సుఖం" కోసమే. అనగా మచ్చలేని కోరికలేని దానికోసమే. ఈశ్వరుడూ, నేనూ ఒకటని అనినపుడు మనస్సెక్కడుంది? చివరి పంక్తిలో అన్ని సిద్ధాంతాల వల్ల పొందదగిన సుఖం అంతా అద్వైతంలోనే ఉందని ఉంది.

ఈ శ్లోకాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలి?

గీతలో ఒక క్లిష్టమైన శ్లోకం ఉంది. దీనినర్థం చేసుకోవడం కష్టం. కృష్ణుడు, అర్జునునకు జ్ఞానయోగాన్ని చెబుతూ నశించనది ఆత్మయే యని దానితో సంబంధం దృఢ సంకల్పంతో పెట్టుకోవాలని, లేకపోతే మీమాంసకులు చెప్పిన కర్మకాండలలో మునిగిపోతావని అపుడు మనస్సు నిశ్చలంగా ఉండదని

అన్నాడు. ఇక్కడ వేదాంతం నుండి కర్మకాండ వేరు చేయబడింది. వేదం కర్మకాండలను చెబుతూ వాటివల్ల సత్త్వ, రజస్తమో గుణాలతో ఉంటావని, కాని త్రిగుణాతీతమైన ఆత్మను పట్టుకోవాలని అంటూ ఈ దిగువ శ్లోకాన్ని చెప్పింది:

"యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే

తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః" (II-46)

అనగా అంతటా నీటి వెల్లువయున్నా, నుయ్యి, చెఱువు వంటి జలాశయాల వల్ల ఏ ప్రయోజనమో సిద్ధిస్తుందో అనగా స్నానపానాదులు సిద్ధిస్తున్నాయో అట్లాగే బ్రాహ్మణునకు సర్వవేదాల ప్రయోజనమూ అంతే.

అయితే ఈ శ్లోకం అర్థం కావడం లేదు. చిన్న నీటి యూటవల్ల ఏ ప్రయోజనమో పెద్ద చెఱువు వల్ల అంతే ప్రయోజనం అనేది అర్థమౌతోంది. కాని జ్ఞానం కలిగిన బ్రాహ్మణునకు అన్ని వేదాలూ అంతే అనినపుడు అర్థం కావటం లేదు. శంకర విజయంలోని ఒక శ్లోకాన్ని చూసినపుడు అర్థమైంది.

శంకరులు అన్ని శాస్త్రాలూ చదివి ఏ సుఖం పొందారో అదంతా అద్వైత జ్ఞానంలోనే ఇమిడి యుందని దీనివల్ల అనంత సుఖం వస్తోందని:

"కూపే యో౽ర్థః సతీర్థే సుపయసి విదధే హంత నాంతర్ భవే త్ కిం?" అని ప్రశ్నార్థకంగా చెప్పారు. నూతి నీటివల్ల పొందే ప్రయోజనం, నదిలోని నీటివల్ల పొందడం లేదా అని ప్రశ్నించారు.

ఎన్ని శాస్త్రాలు చదివినా అద్వైత జ్ఞానం వల్ల పొందినంత సుఖాన్ని వాటివల్ల పొందలేకపోయారు. నది నీటివల్ల పొందే ఆనందంతో పోలిస్తే నూతినీరు, అంత సుఖాన్ని ఇయ్యడం లేదని వారి భావన.

నూతినీటిని అప్పుడప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలి. అట్లా నది నీటిని చేయనవసరం లేదు. రెంటిలోనూ నీరు ఉండవచ్చు.

కర్మకాండల వల్ల పొందే సుఖం కొద్దిగా ఉంటుందని, జ్ఞాన కాండం వల్ల సుఖం నది నీరు వంటిదని అర్థం. జ్ఞాన కాండ వల్ల ఎక్కువ సుఖాన్ని

పొందవచ్చు. దీని తాత్పర్యం ఏమిటంటే అద్వైతం, అఖండ నది వంటిదని, అన్ని శాస్త్రాలు నుయ్యి, చెఱువు వంటివని, ఈ నీటివల్ల ఏ సుఖము పొందుతున్నావో అన్ని సుఖాలు అద్వైతమనే నదిలో మునిగినపుడు కలుగుతాయని అర్థం. ఈ శంకర విజయ శ్లోకం, పై గీతాశ్లోకాన్ని దృష్టిలో పెట్టుకొని వ్రాసినట్లుంది.

(గంగా తీరంలో ఉండేవారు నూతిని ఉపేక్షించినట్లు జ్ఞానం లభిస్తూ ఉంటే కర్మకాండల నాశిస్తాడా? అని కొందరన్నారు. అనాయాసంగా నదిలో నీరు లభిస్తూ ఉండగా నూతి గురించి విచారించనట్లు జ్ఞానం కలిగినవారికి ఈ కర్మ కాండల వల్ల ప్రయోజనం లేదని కొందరన్నారు. నుయ్యి, స్నాన పానాదులకు ఎంత ఉపయోగిస్తుందో పెద్ద చెఱువు కూడా అంతే ఉపయోగిస్తుందని అట్లాగే వేదాల వల్ల ఏ ప్రయోజనం ఉందో అంత ఉపయోగం జ్ఞానులకు జ్ఞానం వల్ల కల్గుతోందని కొందరన్నారు.

బావుల వల్ల స్నానపానాది ప్రయోజనం ఎంత మాత్రం కలుగుతుందో నదులవల్ల కలుగు అనంత ప్రయోజనాలలో అంతర్ధానం చెందినట్లుగా కర్మానుష్ఠానం వల్ల వచ్చే ఫలం, జ్ఞానికి కలిగే మోక్షరూప ఫలంతో అంతర్భావం చెందుతుందని పూర్వ వ్యాఖ్యాతలన్నారు-అనువక్త)

కనకధారాస్తవం

ఒక ద్వాదశినాడు 'భవతి భిక్షాందేహి' అని ఒక ఇంటి ముంగిట శంకరులు నిలబడ్డారు. ఆ ఇంటి యజమాని దరిద్రుడని తెలిసి వారిని అనుగ్రహించడానికి భిక్షనడిగి అనుగ్రహ భిక్ష పెట్టారన్నమాట.

శంకరులు వెళ్ళినపుడు ఇంటి యజమాని లేడు. కాని గృహిణి యుంది. బ్రహ్మచారికి ఈయడానికి తనదగ్గర ఏమీలేదు. కాని బ్రహ్మ వర్చస్సుతో వెలుగొందేవానికి ఎంతో కొంత ఇస్తే పుణ్యం దక్కుతుందని భావించింది. ఇంటిని గాలించింది. ఒక ఎండిపోయిన ఉసిరికాయ కనబడింది. ద్వాదశినాడు, ఉసరిక తినాలి కనుక ఆ యజమాని దాచి యుంటాడు.

దానినే భిక్షా పాత్రలో వేసింది. వెంటనే శంకరులు కనకధారాస్తవం చేసారు. భాగ్యంతో వారిని అనుగ్రహించుమమ్మా అని అమ్మవారిని ప్రార్థించారు. ఇదే వారి మొదటి స్తోత్రం. అపుడు అశరీరవాణి 'ఇది వీరి పూర్వ జన్మ పాపఫలం' అని చెప్పింది.

అమ్మా! వీరెన్ని దుష్కర్మలు చేసినా వీరిపట్ల దయ చూపించుమమ్మా అని ఎట్లా ప్రార్థించారో చూడండి.

నీ దృష్టియనే మేఘం, దయావాయువుచే ప్రేరేపించబడినదై ఎంతోకాలంగా ఉన్న దుష్కర్మలనే తాపాన్ని తొలగించి, దరిద్ర శిశువువనే చాతక పక్షిపై ధనమనే వర్షాన్ని కురిపింపుమమ్మా అన్నారు.

(కేరళలో వైశాఖమాసంలో కూడా నైఋతి పవనాలు వీచి చల్లని మేఘాలను సృష్టిస్తాయి)

'దద్యాద్దయాను పవనో ద్రవిణాం బుధారాం
అస్మిన్న కించన విహంగశిశౌ విషణ్ణే
దుష్కర్మ ఘర్మమపనీయ చిరాయ దూరం
నారాయణ ప్రణయినీ నయనాం బువహః'

కర్మ బాగా పేరుకొని పోయినపుడు, అమ్మవారి కటాక్షం మరొకవైపున ఉంటుంది. అయితే ఏమిటి? వర్షించే మేఘం, ఏ అండమాన్ అంత దూరంగా ఉండవచ్చు. కాని ఋతువులలో వీచే గాలులు వాటిని ఇక్కడకు తీసుకొని రావాలి కదా! అమ్మవారి దయ, అట్టి అనుకూల పవనమన్నమాట. ఆ గాలి, కటాక్షమనే వర్షాన్ని, వీరు చెడ్డకర్మలు చేసినా కురిపించుగాక. దయాపాత్రుని కానివానిపై కూడా దయ, అనుగ్రహాన్ని చూపించవచ్చు. ఆపైన గాలి, మేఘం, ప్రాణుల అర్హతలను పరికిస్తాయా?

'ద్రవిణ' అనే మాటకు సంపదయనే కాదు, బంగారమనీ అర్థం ఉంది. ఈ ద్రవిణధారయే కనకధారయై స్తోత్రానికి ఆ పేరే ఉంది.

తనకోసమా దబ్బు? పాపం, ఈ చాతక శిశువుపై దయ చూపింపుమని. కనుక ఇది అలసి సొలసి యుంది.

కవిత్వంలో చకోరమని, చాతకమనే పక్షులున్నాయి. ఇవి నేడు కనబడవు. చకోర పక్షి, వెన్నెలనే ఆహారంగా గ్రహిస్తుందట.

సౌందర్యలహరిలో (63 శ్లోకం) అమ్మవారి మందహాసం నుండి వెన్నెల కిరణాలు వస్తున్నాయని; చకోర పక్షులు త్రాగగా అవి వెళ్లి తీపిగా ఉండడం వల్ల నాల్క మొద్దు పడిందని అందువల్ల పుల్లని వస్తువుల కోసం చూడగా చంద్రుని నుండి వచ్చే వెన్నెలయనే అమృతాన్ని అన్నపుగంజియనే భ్రాంతితో ప్రతిరాత్రి తాగుతున్నాయని చమత్కరించారు. అయితే చాతక పక్షికి కంఠంలో చిల్లుంటుంది. ఇది ముక్కుతో తినదు. తింటే ఆ చిల్లునుండి బైటకి వచ్చేస్తుంది. ఆహారం తన ముక్కుతో కంఠ రంధ్రంలోకి ప్రవేశపెట్టలేదు. ఆ రంధ్రంలో పడే వర్షపు చినుకులు ఆ పక్షికి ఆహారం. వర్షం లేకపోతే ఆకలితో ఉంటుంది.

నోటితో తినడం అంటే కర్మానుభవాన్ని సూచిస్తుంది. కర్మ అనుకూలంగా లేనపుడు డబ్బు ఎట్లా వస్తుంది? కనుక అమ్మవారు కర్మయనే చిట్టావర్జాలను చూడకుండా చాతకపక్షి నోటిలో వాన చినుకు పడేటట్లుగా కనకవర్షాన్ని కురిపించమంటున్నాడు. చిన్న చాతక పక్షి, ఆకలికి తట్టుకోలేదు. అట్లా వీరిని పోల్చారు. ఆవిడ అమ్మవారు, ఇది విహంగ శిశువు సరిపోయింది.

చాతక పక్షి ఆహారం కోసమే బాధపడుతుంది. కాని ఈ దంపతులనే పక్షులకు ఇల్లు, డబ్బు, వస్త్రాలు, మొదలైనవి అన్నీ కావాలి. కనుక వీరి గత జన్మ పాపాలను పోగొట్టి వీరిని కటాక్షింపుమమ్మా అని అడిగారు.

డబ్బునే ఎందుకడిగారు? భజగోవింద స్తోత్రంలో అర్థమనర్థం అన్నారు. అయితే ఈ డబ్బును పరిమితంగా తెలివిగా వాడి, సత్కర్మలకుపయోగిస్తే ఇదీ ఆధ్యాత్మిక ప్రగతికి తోడ్పడుతుంది. అన్ని స్తోత్రాలను ఈ లక్ష్యాన్నే దృష్టిలో పెట్టుకొని వ్రాసేరు. అన్నపూర్ణేశ్వరిస్తోత్రంలో భిక్షాం దేహి అంటూ చివరగా జ్ఞాన వైరాగ్య సిద్ధ్యర్థం అన్నారు. భక్తుల దారిద్ర్యాన్ని ప్రస్తావిస్తూ అట్టి దారిద్ర్యంతో బాటు కర్మనుండి విముక్తి చేయమని ప్రార్థించారు.

కనక ధారాస్తవం ఒక పాఠంలో 18 శ్లోకాలున్నాయి. కొన్నింటిలో 20-21 శ్లోకాలున్నాయి. ఈ శ్లోకంలోనే డబ్బును గురించి అడిగినట్లుంది. తరువాతి శ్లోకంలోనూ "ఇష్టాం పుష్టిం కృషీష్ఠ మమ" అని డబ్బును గురించి అడిగారు. మిగతా స్తోత్రం అంతా అయ్యవారిని, అమ్మవారిని అనుగ్రహం చూపించవలసిందిగా ఉంది. ఆయన నల్లని మేఘం ఐతే అతని వక్షఃస్థలంపై మెరుపుతీగలా ఉండే పరాశక్తిని స్తోత్రం చేసినట్లే ఉండి డబ్బు గురించి అడిగినట్లుంటుంది. తానెందుకు ఈ స్తోత్రం చేయవలసి వచ్చిందో కేవలం సూచనగా ఉంటుంది.

పై శ్లోకంలో కర్మను భక్తితో ముడిపెట్టారు. కర్మ తనంతట తాను ఫలాన్నియ్యదని, ఫలదాత ఈశ్వరుడని బోధిస్తున్నారు. కర్మనుండి భక్తికి మళ్ళిస్తున్నారు. ఇక భక్తి మార్గంలో ఉన్నవారికి నా దేవుడు, నీ దేవుడనే భేదభావం ఉండకూడదని నీ ఇష్టమూర్తిని మాత్రం కొలువుమని, అందరు దేవతలూ పరమాత్మ స్వరూపులుగానే చూడుమని హెచ్చరిక చేస్తున్నారు. అనగా భక్తి మార్గం నుండి జ్ఞానమార్గానికి మళ్ళిస్తున్నారు. ఈ అభిప్రాయాన్ని బలపరుస్తూ తరువాతి శ్లోకాన్ని చెబుతున్నారు.

"ఇష్టా విశిష్ట మతయోపి యయా దయార్ద్ర
దృష్ట్యాత్రి విష్టపపదం సులభం భజంతే
దృష్టిః ప్రహృష్ట కమలో దరదీప్తి రిష్టాం
పుష్టిం కృషీష్ఠ మమ పుష్కర విష్టరాయాః"

ఇందు ఇష్టిని అనగా యజ్ఞ కర్మను చేసి స్వర్గమనే ఫలాన్ని లక్ష్మీ యొక్క కటాక్షం వల్లనే పొందుతున్నారు. కర్మ తనంతట తాను ఫలం ఇస్తుందన్నవారికి అట్లా కాదని, అమ్మవారి శక్తి వల్లనే అట్టి ఫలాన్ని పొందుతున్నారని చెప్పారు.

తరువాత శ్లోకంలో అందరు దేవతలు, ఒకే ఒక పరమాత్మ స్వరూపాలని చెప్పారు.

"గీర్దేవతేతి గరుడధ్వజ సుందరీతి
శాకంభరీతి శశిశేఖరవల్లభేతి
సృష్టిస్థితి ప్రలయకేళిషు సంస్థితాయై
తస్యై నమస్త్రి భువనైక గురోస్తరుణ్యై"

ఇందులో ఒకే పరమాత్మ త్రిమూర్తులుగా ఉన్నాడని, సృష్టి, స్థితి, సంహారాలను వారు చేస్తున్నారని వారిట్టి పనులు చేసేటపుడు వారలకు శక్తిగా ఈమె ఉంటోందని అన్నారు.

నాల్గు శక్తులు, ముగ్గురికి ఉండడమేమిటి? గీర్దేవత యనగా సరస్వతి - బ్రహ్మ యొక్క శక్తి. గరుడధ్వజుడైన విష్ణువునకు మహాలక్ష్మి; రుద్రునకు శాకంభరి, శశి శేఖరవల్లభ అనే ఇద్దరూ భార్యలు.

శాకంభరిని గురించి దేవీపురాణం చెప్పింది. కఱవుకాటకాలలో శాకములను తన ఒంటి పై పండించి ప్రజలనాదుకునేది. అందువల్ల ఆమె శాకంభరి. శివుని శక్తి.

త్రిమూర్తులకు మూడు శక్తులుగా ఉండగా నాల్గవ దానిని ఎందుకు పేర్కొన్నట్లు?

ప్రజలు ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి మొదలైన అష్టలక్ష్ములను అడుగుతారని శంకరులకు తెలుసు. డబ్బంటే లక్ష్మియే గుర్తుకు వస్తుంది. అయితే కేవలం, డబ్బును తింటారా? కనుక అన్నం ఇచ్చే శాకంభరిని పేర్కొన్నారు. తరువాత రుద్రుని శక్తిని శశిశేఖర వల్లభగా చంద్రుణ్ణి నెత్తిపై పెట్టుకున్న సంహారమూర్తియైనవాని భార్యను పేర్కొన్నారు. సంహారమూర్తియనగా మాయతో కూడిన మహేశ్వరుడే. సదాశివుడై మోక్షాన్నిస్తాడు. అపుడతడు శశిశేఖరుడు. ఇపుడు శేఖర వల్లభయనగా ఆమె ప్రళయశక్తి. తిరోధాన శక్తి, అనుగ్రహ శక్తి. ముందుగా బ్రహ్మ శక్తియని చెప్పడం వల్ల, అట్లాగే విష్ణు శక్తియని చెప్పడం వల్ల పరబ్రహ్మ శక్తియే పంచ కృత్యాలకు మూలమని ఇట్లా రూపాంతరం చెందిందని చెప్పడం వల్ల అద్వైతాన్ని బోధించినట్లే.

చివరగా త్రిభువనైక గురోస్తరుణి అని ఉంది. అనగా మూడు భువనాలకు విష్ణువు గురువని, అతని భార్య లక్ష్మియని అర్థం. గురువు యొక్క శక్తి యనినపుడు దబ్బునీయడమే కాదు, ఆమె జ్ఞాన శక్తియని అర్థం. శంకరుల గురుపరంపరలో మొదటి నారాయణుని ప్రస్తావన ఉంటుంది. అందువల్ల త్రిభువనైక గురువని విష్ణువును నుతించారు. రామ, కృష్ణ అష్టోత్తర నామాలలో అట్లాగే శివస్తోత్రంలోనూ జగద్గురవేనమః అని యుంటుంది.

త్రిభువనైక గురువని చెప్పడంలో అతడు జ్ఞానోపదేశమే కాదు, మూడు భువనాల తండ్రియని అర్థం. మూడు భువనాలకు తల్లి లక్ష్మి. లక్ష్మీ అష్టోత్తరంలో "బ్రహ్మ - విష్ణు - శివాత్మికాయై నమః" అని చెప్పినట్లుగా ఉందన్నమాట.

తరువాతి శ్లోకంలో

"శ్రుత్యై నమోఽస్తు శుభకర్మఫల ప్రసూత్యై
రత్యై నమోఽస్తు రమణీయ గుణార్ణవాయై
శక్త్యై నమోఽస్తు శతపత్రనికేతనాయై
పుష్ట్యై నమోఽస్తు పురుషోత్తమ వల్లభాయై"

వేదమే శంకరుల ఊపిరి. అవైదిక మతాలను గెంటివేసి శ్రుతిమార్గాన్ని స్థాపించారు. శ్రుతి స్మృతి పురాణానాం ఆలయం కరుణాలయం అని వారిని కీర్తిస్తున్నాం. కనుక వేద స్వరూపిణిని నుతించకుండా ఉంటారా? వారు జ్ఞానావతారులైనా కర్మానుష్ఠానాన్ని కాదంటారా? కర్మానుష్ఠాన ఫలాలను ప్రసాదించేది కనుక శ్రుతి స్వరూపిణిగా నుతించారు. శుభకర్మ ఫలప్రసూత్యై అనే ఈ నామం వల్ల మీమాంసకులకు జవాబు చెప్పినట్లైంది.

ఆమె సద్గుణాల సముద్రమని చెప్పడానికి రత్యైనమోఽస్తు రమణీయ గుణార్ణవాయై అన్నారు.

అన్ని కర్మలూ శ్రుతిపై ఆధారపడ్డాయి. అపుడే అవి శుభకర్మలౌతాయి. వాటివల్లనే మనకు ఇహ పరసుఖాలు లభిస్తాయి.

గుణ కర్మలకు రెంటికీ సంబంధంఉంది. గుణకర్మల వల్లనే నాల్గు వర్ణాలను ఏర్పాటు చేసానని గీతా వాక్యం. గుణాన్ని బట్టి కర్మ ఉంటుంది. ముందు శుభకర్మ ఫలాలనిస్తుందని, సద్గుణాల రాశియనే మాటతో కలిపారు.

దేనికైనా శక్తి కావాలి కదా! కనుక శక్త్యై నమోస్తు అన్నారు. శత పత్రనికే తనాయై అనడం వల్ల పద్మంలో నివాసముంటుందని అర్థం. కుండలినీ యోగం గురించి చెప్పేటప్పుడు సహస్రదళ పద్మంలో పరమశివునితో ఉంటుంది. ఇక్కడ లక్ష్మిని పద్మవాసినిగా పేర్కొన్నారు.

పుష్ట్యై నమోస్తు అనగా పోషణవల్ల బలం వస్తోంది. భువన పోషకునకు భార్యయై సమస్త ప్రాణులను పోషిస్తోంది.

రతి (సంతోషం) పుష్టికావాలంటే శ్రుతియే ఆధారం కనుక ముందుగా శ్లోకంలో శ్రుతిని పేర్కొన్నారు. అనగా పుష్టి, రతులు, శ్రుతికి అనుగుణంగా ఉండాలన్నమాట.

ఆనందరూపిణిగా శక్తిరూపిణిగా, పూర్ణ రూపిణిగా ఉన్నావని చివర ప్రతిదానికి నమోఽస్తు అని నమస్కరించారు.

చివరగా పురుషోత్తముని వల్లభగా, అనగా అతని శక్తిగా నుతించారు.

స్తోత్రం అయిన వెంటనే ముహూర్తకాలం (ఒక గంటా నలభై ఎనిమిది నిమిషాలు) వరకూ కనకధార కురిసింది. ఒక్క ఉసరిక, బంగారు ఫలాల వాన అయింది.

వారు స్తోత్రం చేయకపోయినా సంకల్పిస్తే చాలు, బంగారు వర్షం కురిసేది. కాని అమ్మవారు లీలను ప్రదర్శించి స్తోత్రం చేయునట్లుగా చేసింది. దానివల్ల తరతరాలవారు ఆ స్తోత్రాన్ని పఠించే అవకాశం వచ్చింది. మనం కూడా ఈ స్తోత్రాన్ని పఠించి మన పాపకర్మలనుంచి బయటపడేలా ఆచార్యులు ఈ పేద బ్రాహ్మణ దంపతులను అనుగ్రహించే మిషతో మనకు అందించారు.

భౌతిక సంపదలతో బాటు ఆధ్యాత్మిక ఫలాలను అందించారు. ఈ స్తోత్రం డబ్బునిస్తే, సుబ్రహ్మణ్య భుజంగ స్తోత్రం రోగాలను పోగొడుతుంది. సౌందర్యలహరి, అన్నిటిలోనూ విజయాన్ని ప్రసాదిస్తుంది.

ఇట్లా సువర్ణ వర్షం, కాలడికి సమీప గ్రామంలో జరిగింది. ఆ బ్రాహ్మణ దంపతుల ఔరసులుండే చోటును పాళంతోట్టం (పండ్ల తోట) అంటారు. (ఆమె వంశంలో పుట్టినవారిని 'స్వర్ణత్తు మనై' అని నేటికీ పిలుస్తారట)

నదీ గమనం మారుట

ఎనిమిదవ యేట విద్యాభ్యాసం సంపూర్తి అయి ఇంటికి వచ్చారు. ఉపనయనానికి ముందే తండ్రి మరణించారని కొందరు, తరువాతయని కొందరన్నారు.

ముసలితల్లి దగ్గర కొంతకాలమున్నారు. కాలడిలో నేడున్న నది ఆనాడు దూరంగా ఉండేది. దూరంగా నున్న నదిలోనే తల్లి స్నానం చేస్తూ ఉండేది. అనారోగ్యం కారణం వల్ల వెళ్ళలేకపోతున్నానని తల్లి చెప్పింది.

శంకరులు ప్రార్థిస్తే తల్లికి ఆరోగ్యం కలిగి ఆమె వెళ్ళగలుగుతుంది. కాని గ్రామ ప్రజలందరికీ అందుబాటులో ఉండడం కోసం నదిని గమనం మార్చుకుని గ్రామ సమీపంలో వచ్చేటట్లు ప్రార్థించారు. గమనం మారినపుడు దారిలో నున్న కృష్ణాలయానికి కొద్దిగా చేటు వచ్చింది.

కనకధారాస్తవం, నదీగమనం విని ప్రజలలో వీరిపట్ల భక్తిభావం ఏర్పడింది. రాజు కూడా విని వీరి దర్శనం కోసం వచ్చాడు. ఈ కృష్ణాలయాన్ని ఉద్ధరించవలసిందిగా రాజుతో అన్నారు. కృష్ణాలయం నేటికీ కాలడిలో ఉంది. నదీ తీరాన్నే ఎత్తుగా ఉండేటట్లు దాన్ని నిర్మించారు. మరల కృష్ణ ప్రతిష్ఠ జరిగింది. పూర్వం, ఆ నది, ఎంత దూరంలో ఉండేదో నేటికీ ప్రజలు చెబుతారు.

అవతార లక్ష్యం

ఒక తల్లికే బిడ్డనా? ప్రపంచానికీ బిడ్డను కదా అనే భావం వారిలో కలిగింది. ప్రజలకు అద్వైత బోధ చేయాలనే భావం వారిలో అంకురించింది. తల్లిని విడిచి జగత్కల్యాణం చేయాలని సంకల్పించారు. అవతారం, అందరికీ చెందిందే.

వీరికి తండ్రి గతించాడు. అతడు విముక్తుడో కాదో తెలియదు. కాని తల్లికి వీరివల్లనే వైకుంఠ ప్రాప్తి కలగాలని భగవత్సంకల్పం.

బ్రహ్మచర్యాశ్రమం తరువాత గృహస్థాశ్రమం. తల్లి తృప్తికోసం గృహస్థ ధర్మాన్ని స్వీకరించాలా? అయితే అవతార ప్రయోజనం సిద్ధించనట్లే.

ఆమె అనుజ్ఞ లేనిదే సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించకూడదు. ఆమె అంగీకరిస్తుందా? ఇదొక పథకం ప్రకారం సాగాలనుకున్నారు.

ఆ పథకం

తల్లితో నదీ స్నానానికి వెళ్ళారు. ఒక మొసలి వీరి కాలిని పట్టుకుంది. ఆ నదీ ఘట్టాన్ని మలయాళంలో ముదలై (మొసలి) కడవు అని నేటికీ అంటారు.

"అమ్మా! నేను మరణించడం ఖాయం. ఈ దుర్మరణం వల్ల తగిన ఫలాన్ని రాబోయే జన్మలోనూ అనుభవించాలి. నీకు నేను కర్మ చేసే యోగం దక్కదు. నేను సన్న్యాసం పుచ్చుకుంటే మరొక జన్మనెత్తినట్లే. ఈ జన్మలో రావలసిన ఇప్పటి మరణం వాయిదా పడవచ్చు. మొసలి నన్ను విడిచి పెట్టవచ్చు. వంశంలో ఒక సన్న్యాసి పుడితే 21 తరాలు తరిస్తాయని పెద్దలంటారు. ఒకవేళ సన్న్యాసిగా ఉండి మొసలి నన్ను చంపినా నాకు దుర్మరణం ప్రాప్తించదు."

"నీళ్ళల్లో నిలబడి సన్న్యాస దీక్షలో ఉచ్చరించే 'ప్రైష'మంత్రాన్ని ఉచ్చరించాలి. మానసికంగా అన్నిటినీ విడిచి పెట్టాలి. నేనెట్లాగూ నీళ్ళల్లో ఉన్నా. ఈ అవకాశం జారిపోతే మొసలి నన్ను తినడం ఖాయం. నాకు

దుర్మరణమూ ప్రాప్తిస్తుంది. నీ అనుజ్ఞ లేనిదే నేను సన్యాసాన్ని స్వీకరించకూడదు కదా, నిర్ణయించమని" అన్నారు.

తల్లి సందిగ్ధావస్థలో పడింది. బ్రతికుంటే సన్యాసియైన కొడుకునెప్పుడైనా చూడవచ్చు. నేను చూడలేకపోయినా బ్రతికియుంటాడులే అనుకొని, నీ ఇష్టం వచ్చినట్లు చేయమంది. అంటే పరమేశ్వరునకే విడిచిపెట్టింది.

తాను వద్దని చెప్పలేదు. కాబట్టి ఆమె అనుజ్ఞ ఇచ్చినట్లు భావించి ప్రైష మంత్రాన్ని ఉచ్చరించారు.

అనగా నానుండి ఏ ప్రాణికీ భయము గాని, ప్రమాదము గాని లేకుండుగాక "అభయం సర్వభూతేభ్యో మత్తః స్వాహా" అంటే ఇతణ్ణి చూడటంతో అందరూ సంతోషిస్తారన్నమాట. గృహస్థు, కర్మలను చేసేటపుడితరులను బాధ పెట్టవలసి వస్తుంది. అందువల్ల ఇతణ్ణి చూసి ఇతరులు బాధపడతారు. గృహస్థుకు చెట్లు కూడా భయపడతాయి. అవి కాయ కూరలను, పండ్లనిస్తున్నాయి కనుక వాటికి హాని చేస్తాడని భయపడతాయి. కాని అట్టి కర్మలు, సన్యాసికి ఉండవు కనుక భయపడవు. ఎందుకంటే అతడు రాలిన పండునో, రాలిన ఆకునో లేదా ఇతరులు పెట్టిన అన్నాన్నో తింటాడు. జైన బౌద్ధులు చెప్పిన పూర్తి అహింసాధర్మం మన సన్యాసంలోనూ ఉంది.

రెండు రకాల సన్యాసం ఉంటుంది. సన్యాసం పుచ్చుకోవాలంటే కొన్ని శ్రాద్ధాలు, హోమాలు చేసి గురువునుండి పొందాలి. ఒకవేళ మంచం పట్టి విరక్తి కలిగి సన్యాసం పుచ్చుకొంటే దానిని ఆతుర సన్యాసమంటారు. మరొక రకం, అత్యాతుర సన్యాసం. దీనినే ఆపత్ సన్యాస మంటారు. రోగం బాగా ముదిరినా, ఏదైనా ప్రమాదం ముంచుకుని వచ్చినపుడు తీసుకొనేది ఆపత్ సన్యాసం. అట్టి సమయంలో ప్రైష మంత్రాన్ని ఉచ్చరిస్తే చాలు.

ఇట్లా శంకరులు సన్యాసం తీసుకున్నారు. మొసలి పట్టు సడలింది. అది ఆకాశంలో గంధర్వుడై కనబడింది. గంధర్వులు దివ్యదృష్టి కలవారు. దేవయోనులలో గంధర్వులొకరు.

గంధర్వుడు - గత జన్మ

గంధర్వుడు తన కథనిట్లా వివరించాడు. "నేను త్రాగుతూ, స్త్రీలతో క్రీడిస్తూ ఉండేవాణ్ణి. ఇంతలో మహర్షి దుర్వాసుడు వచ్చాడు. అతణ్ణి నేను గౌరవించలేదు. నీళ్ళల్లో విహరించే నన్ను చూసి మొసలిగా పడి యుండమని శపించాడు."

'వెంటనే అతని కాళ్ళు పట్టుకొన్నా. అతడు శంకరావతారం కదా! అతడు రుద్రుడైనా ఆశుతోషియే. అనగా శీఘ్రంగా సంతోషించువాడే. నీవు పరమశివుని కాళ్ళు పట్టుకొన్నపుడు శాపవిముక్తి కల్గుతుందని అనుగ్రహించాడు."

"నా దగ్గరకు పరమేశ్వరుడెట్లా వస్తాడని ప్రశ్నించాను. నిన్ను వెదుకుతూ అతడే అవతరిస్తాడులే అన్నాడు" ఇది చెప్పి ఆ గంధర్వుడు శంకరులకు నమస్కరించి అంతర్థానం పొందాడు. అంటే శంకరుల కాళ్ళు పట్టుకుంటే మనకూ నివృత్తి మార్గం దొరుకుతుందన్నమాట.

గురువునకై అన్వేషణ

అమ్మా! నీవు సన్యాసానికి అంగీకరించావు. కనుక ఇకనుండి ప్రతి స్త్రీ నాకు తల్లియే. వారే భిక్షనిస్తారు. ఇక నీవే తల్లియని భ్రాంతి పడవద్దు. నేను జ్ఞానోపదేశం పొందాలి, గురువునకై వెళ్ళాలి. అతడే నాకు తండ్రి. జ్ఞానాన్ని పొంది ఇతరులకు ఉపదేశిస్తూ ఉంటే విన్నవారందరూ నా బిడ్డలే అవుతారు. నేను శాంతియనే స్త్రీని వివాహమాడాను:

"భిక్షాప్రదా జనన్యః పితరో గురవః కుమారకాః శిష్యాః
ఏకాంత రమణా హేతుః శాంతిః దయితా విరక్త స్య"

కనుక అనుజ్ఞ నిమ్మని అన్నారు. నా చివరి కాలంలో నిన్నెట్లా చూడకుండా ఉండగలనని తల్లి వాపోయింది. నీ చివరి గడియలలో నీవు తలుచుకున్న వెంటనే నీ దగ్గరే ఉంటాను. చివరి కర్మను చేస్తానన్నారు.

అయితే సన్న్యాసి కర్మ చేయవచ్చా? మాతృ ఋణాన్ని ఎవ్వరూ తీర్చుకోలేరని ఉంది. సౌత్రామణియనే మహా యజ్ఞాన్ని చేసి పితృఋణం తీర్చుకోవచ్చు. చాలామంది సోదరులుంటే ఒకనికీ పని అప్పజెప్పవచ్చు. కాని శంకరులకు సోదరులు లేరు. ఒకడున్నపుడు సన్న్యాసమే పనికిరాదు.

అవతారునిగా పుట్టారు. తల్లి అవతార స్త్రీ కాదు. అందువల్ల ఆమె కోరినట్లే వీరు చేయాలి. దహన కర్మ ఒక్కటే చాలు, తర్పణాదులు, శ్రాద్ధాదుల అవసరం లేదు (ఇట్లా చేయవచ్చుని విశ్వేశ్వర స్మృతిలో నున్నట్లు స్వామివారు చెప్పారని ఋషి పీఠం పత్రిక ద్వారా తెలిసికొన్నాను - అనువక్త)

ఒకడు సన్న్యాసం పుచ్చుకుంటే అతని పూర్వాశ్రమ తనయుడు 11వ రోజునగాని 12వ రోజున గాని పార్వణ శ్రాద్ధం ఒక్కటే చేయాలి. అట్లా సన్న్యాసి తండ్రికి, తనయుడా విధి చేసినట్లు తానూ దహనం చేయవచ్చుని శంకరులు భావించారు.

ఇక సన్న్యాసి యొక్క పూర్వాశ్రమ బంధువులలో కొడుకు పోయినా, సన్న్యాసి స్నానం కూడా చేయనవసరం లేదు. అయితే ఇతని తల్లి దండ్రులు పోతే సన్న్యాసి సచేల స్నానం చేస్తే చాలు. అందరూ సన్న్యాసికి నమస్కరించాలి. కాని తిరిగి ఇతడు వారికి నమస్కరించకూడదు. తండ్రి కూడా ఇతనికి నమస్కరించాలి. కాని సన్న్యాసి, తల్లికి ఒక్కతికే నమస్కరించాలి.

"ప్రసూః వంద్యా"

"సర్వావంద్యేన యతినా ప్రసూః వంద్యా హి సాదరం" ఆదరంతో నమస్కరించాలని ఉంది.

ఎక్కువ వ్యాస పూజలు చేసిన సన్న్యాసి చిన్నవాడైనా తక్కువ వ్యాస పూజలు చేసిన సన్న్యాసి ఇతని కన్నా పెద్దవాడు అయినా సరే ఇతనికి నమస్కరించాలి.

అట్లా తల్లికి వాగ్దానం చేసి బయలుదేరాడు.

వీరికి గురువు కావాలా?

ప్రైష మంత్రం ఉచ్చరించి తమంత తామే సన్యాసం పుచ్చుకున్నపుడు ప్రత్యేకంగా గురువు కావాలా? ఏదైనా ఆపదలో నున్నపుడు ఆపత్ సన్యాసం పుచ్చుకొన్నా, ప్రమాదం తప్పినపుడు గురువునుండి ప్రణవోపదేశాన్ని, మహా వాక్యాలను ఉపదేశం పొందాలనే విధి యుంది.

వారవతార పురుషులు కదా, వారికి గురువు కావాలా? అని సందేహం. అవతారమైనా మానవ రూపంలో ఉన్నారు కనుక లోకానికి ఆదర్శంగా ఉండడం కోసం లోక మర్యాదను పాటించాలి. అట్లా వారు చేయకపోతే వారిననుసరించి ఇతరులు కూడా గురువక్కరలేదనుకుంటారు. ఏ పుస్తకం చూసో మనమూ వేదాంతాన్ని నేర్చుకోవచ్చనే భ్రాంతి పడతారు. కనుక లోకాచారాన్ని పాటించారు.

మూడు భువనాలలో నేను చేయవలసిన కర్తవ్యం లేదని గీతాచార్యుడు "నమే పార్థాస్తి కర్తవ్యం త్రిషులోకేషు కించన" అంటూ "అనేకమైన పనులు చేస్తున్నాను చూసావా? నీ రథాన్ని నడుపుతున్నా, మొన్న రాయబారిగా వెళ్ళాను, ఒకరితో యుద్ధం, మరొకరితో సఖ్యం ఇట్లా చేస్తూనే ఉన్నా. ఇందు వ్యక్తిగతమైన లాభమేమైనా ఉందా? నేనిట్టా చేయకపోతే కృష్ణుడే పనులు చేయలేదు, మనమెందుకు చేయాలని ఇతరులు కూడా తమ తమ ధర్మాలను పాటించరు కదా! సంఘంలో ఒక నియమం పోతుంది. అస్తవ్యస్థ పరిస్థితులేర్పడతాయి. కనుక నాకోసం నేనేమీ చేయనవసరం లేకపోయినా ఇతరులను తీర్చిదిద్దడం కోసం అనేకమైన పనులు చేస్తున్నాను. ఏ పనీ చేయని నన్ను ఆదర్శంగా భావించి ప్రజలు చెడిపోకుండా ఉండడం కోసం చేస్తూ ఉంటానని" కృష్ణుడన్నాడు.

ఆవిధంగానే శంకరులు గురువు కోసం అన్వేషణ చేస్తూ కేరళనుంచి నర్మదా తీరం దాకా వెళ్ళి గోవింద భగవత్పాదులను ఆశ్రయించారు. ఎక్కడ

కలిసి కొన్నాడనే విషయంలో శంకర విజయాలలో భిన్నాభిప్రాయా లున్నాయి. కొందరు నర్మదా నదీ తీరమని, మరికొందరు బదరికాశ్రమమని, మరికొందరు వారాణసియని వ్రాసేరు. ఆ పుస్తకాల పేర్లుచెబుతా.

శంకర విజయములు

బృహత్ శంకర విజయం – ప్రాచీన శంకర విజయం – ఆనంద గిరీయ శంకర విజయం – వ్యాసాచలీయ శంకర విజయం – మాధవీయ శంకర విజయం – చిద్విలాసీయ శంకర విజయం – కేరళీయ శంకర విజయం – గోవిందనాథీయ శంకర విజయం – ఇట్లా ఎనిమిది యున్నాయి. ఇక సదానందులు వ్రాసిన శంకర దిగ్విజయ సారం కూడా ఉంది.

బృహత్ శంకర్ విజయం పూర్తిగా దొరకడం లేదు. అందలి విషయాలను మిగిలిన గ్రంథాలు అక్కడక్కడా పేర్కొన్నాయి. అది శంకరుల కాలంలోనే వ్రాయబడినట్లు భావించవచ్చు. అట్లాగే ప్రాచీన శంకర విజయం కూడా.

ఆనందగిరీయం యొక్క కర్త పేరు, అనంతానందగిరి చిద్విలాసుదు, విజ్ఞాన కందుల సంభాషణ పూర్వకంగా చిద్విలాసీయం ఉంటుంది. కేరళలో వ్రాయబడినది కనుక కేరళీయం. గోవిందనాథుడు కేరళీయుడు. వీటిల్లో మాధవ శంకర విజయం ప్రసిద్ధిని పొందింది.

ఇక లోగడ పేర్కొన్న రామభద్ర దీక్షితులు శంకరాభ్యుదయం వ్రాసినవాడు. ఎనిమిది సర్గలతో కవితా మయంగా ఉంటుంది. వీరి పతంజలి చరితంలో సూక్ష్మంగా శంకరుల చరిత్రను వ్రాసేరని చెప్పాను. వీరు నీలకంఠ దీక్షితుల శిష్యులు.

వల్లీయ సాహాయ్య కవి. శ్రీ శంకరాచార్య చంపువును వ్రాసేడు. అనగా గద్య పద్మాత్మకమైన గ్రంథం.

శ్రీ టి.ఎల్. వెంకట్రామ అయ్యర్ గారి తండ్రియైన లక్ష్మణ సూరి ఒక మహావిద్వాంసుడు. వీరు న్యాయ శాస్త్రంలోనూ, సంగీతంలోనూ దిట్ట. వీరికి

సూరి అనే బిరుదుంది. వైకుంఠంలో భగవానునితో ఉండే భక్తులను నిత్య సూరులని అంటారు. శంకరుల గ్రంథాలపై వారు వ్యాఖ్యానం వ్రాసేరు. మైసూర్ దివాన్‌గా పనిచేసిన శేషాద్రి అయ్యర్ వీరికి సూరి అనే బిరుదు నిచ్చినవాడు. మహా మహోపాధ్యాయులు కూడా. వీరు చివరి రోజులలో భగవత్ పాదాభ్యుదయం అనే గ్రంథాన్ని వ్రాసేరు.

భగవత్ పాద సప్తతియనే పేరుతో రెండు గ్రంథాలున్నాయి. సప్తతి యనగా డెబ్బది. వేదాంత దేశికులు రామానుజులపై యతిరాజ సప్తతిని వ్రాసేరు. ఉమా మహేశ్వర శాస్త్రిగారు కూడా ఇట్టి సప్తతి వ్రాసేరు.

250 సంవత్సరాల వెనుక శృంగేరీ స్వామివారి ప్రోద్బలంతో వారి ఆస్థాన విద్వాంసులైన కాశి లక్ష్మణ శాస్త్రిగారు ఏడు సర్గలతో గురువంశ కావ్యాన్ని వ్రాసేరు. మొదటి మూడు సర్గలోనూ శంకరుల జీవిత చరిత్ర యుంది.

ప్రతి శంకర మఠంలోనూ గురు పరంపర ఉన్నాయి. కంచి మఠంలో పుణ్య శ్లోక మంజరి యుంది. అయితే వీటిల్లో కొన్ని అభిప్రాయ భేదాలున్నాయి. ప్రాచీన ఇతిహాస పురాణాలలోనూ పాఠ భేదాలున్నాయి. చెప్పబడినవి అన్నిటిలోనూ ఉంటే వాటిని ప్రమాణంగా భావించవచ్చు. పెద్దగా మాత్రం భేదాలు లేవు.

శంకరులు ఏ ప్రాంతాలను దర్శించారనే విషయంలో అభిప్రాయ భేదాలుండవచ్చు. ఉదాహరణకు శంకరులు నైవేలీ వెళ్ళారని వ్రాసిన పుస్తకం ఉందనుకోండి. అసలు రచనా కాలంలో ఆ పేరుతో నున్నది లేకపోతే దానినెట్లా అంగీకరించగలం? బెర్నార్డు షాతో వివాదం చేసారని ఒకడు వ్రాస్తే నమ్ముతామా? కాని ఆనాటి ప్రాంతాలను కొందరు వ్రాసి, కొందరు వ్రాయనంత మాత్రంచే ప్రమాణం కాదని తిరస్కరించకూడదు. అనేక ప్రాంతాలను వారు దర్శించారు. కనుక అట్టివాటిల్లో వివాదం పడనవసరం లేదు.

పోలగం బ్రహ్మశ్రీ రామశాస్త్రి గారు శంకరులు చూపిన మార్గంలో పయనించడం మన కర్తవ్యమని అన్నారు. ఒక యోగి, అర్చిరాది మార్గంలో

పయనిస్తున్నప్పుడు 13 స్థానాలుంటాయని చెప్పారు. ఆ స్థానాల వరుస విషయంలో ఉపనిషత్తులు రకరకాలుగా చెప్పాయని, ఉపనిషత్తుల్లో కొన్ని యుండి మరికొన్నింటిలో కొన్ని యుంటాయని, శంకరులు దానిని చూసి ఒక వరుసలో పెట్టి అందించారని అన్నారు. అట్లాగే ఒక శంకర విజయంలో కొన్ని ఉంటే మరొక దాంట్లో కొన్నియున్నా యన్న వాటిని శాస్త్రిగారు చెప్పినట్లు ఒక క్రమపద్ధతిలో పెట్టాలి. దేనినీ విడిచి పెట్టనవసరం లేదు. సమన్వయధోరణిని అలవర్చుకోవాలి.

శంకరులు తమ చరిత్రను వ్రాసుకోలేదు. పరంపరగా వారి చరిత్రను లిఖించడంలో కొన్ని మార్పులు, చేర్పులూ ఉండవచ్చు. వారు భారతదేశం అంతా తిరిగారు. ఎక్కడో ఒకచోట వారు నడయాడినదానిని చరిత్ర వ్రాసినవారు పేర్కొని యుండక పోవచ్చు. అంతమాత్రంచే అది దోషం కాదు.

మరొక్క మాట. శంకరుల తరువాత చాలామంది వీరి పేరుతో వ్యవహరింపబడినవారున్నారు. ఎవరు, ఆది శంకరులనే మాటలో సందేహాలు రావచ్చు. ఉదా: సర్వజ్ఞ పీఠాన్ని అధిరోహించిన ప్రదేశాలలోనే అభిప్రాయ భేదం ఉంది. కొందరు కంచియని, మరికొందరు కాశ్మీరమని అన్నారు. దీనిని మూడు విధాలుగానే చెప్పవచ్చు. అసలు కంచి ప్రాంతానికి, కాశ్మీరమని పేరు కూడా ఉంది. ఈ మాట గోవింద నాథీయంలో ఉంది. ఇక కాశ్మీరంలో ఉన్నదానిని శారదా పీఠం అంటారని, కంచిలో ఉన్న దానిని సర్వజ్ఞ పీఠం అంటారని ఉంది. ఈ రెంటినీ ఆరోహించారని భావించవచ్చు. మరొక అభిప్రాయం ప్రకారం ఆదిశంకరులు కంచిలో అధిరోహించారని, అభినవ శంకరులు కాశ్మీరులో నున్న దానిని అధిరోహించారని అంటారు. ఇది తప్పుగా అర్థం చేసుకోబడింది.

అట్లాగే కొందరు, ఆనందగిరులిద్దరున్నారని, మండన మిశ్రులిద్దరని పరిశోధనలు చేస్తున్నారు. శంకర విజయం వ్రాసిన ఆనందగిరి వేరని, శిష్యుడైన ఆనందగిరి వేరని; అట్లే బ్రహ్మసిద్ధి మీమాంసా గ్రంథాలు వ్రాసిన మండన

మిశ్రుడు వేరని, శంకరుల శిష్యులై సురేశ్వరాచార్యులుగా మారిన మండన మిశ్రులు వేరని వీరే నైష్కర్మ్య సిద్ధిని వ్రాసేరని అంటారు.

సురేశ్వర మండన మిశ్రులే శంకరుల మార్గానికి అనుగుణంగా వ్రాసేరు. మరొక మండన మిశ్రుడు వ్రాసినది శంకరుల సిద్ధాంతానికి కొద్దిగా భిన్నంగా ఉంటుంది. ఈ సందేహానికి మరొక కారణం ఉంది. సురేశ్వర మండన మిశ్రులకే విశ్వరూపుడని మరొక పేరు కూడా ఉంది.

ఇట్లా ఉండగా కాలాంతరంలో వ్రాసేవారు. తాము విన్నదానిని వ్రాయడం వల్ల సందేహాలకు తావిచ్చింది. తమ ఇష్టాన్ని బట్టి కూడా కొన్ని మార్పులు చేసియుండవచ్చు. కొన్ని మార్పులుండడం సహజం. లేఖకుల తప్పులూ దొర్లుతూ ఉంటాయి.

రాగద్వేషాలు జయించడం కష్టం. ఇది లేఖకులకూ చెందుతుంది. శంకరులు అన్ని సిద్ధాంతాలను అవలోకించి ఆయా స్థితులలో ద్వైతానికి, భక్తికి, సాంఖ్యానికి, యోగానికి, మీమాంసకు, చివరకు బౌద్ధానికీ తగు ప్రాధాన్యమిచ్చి తుదకు అద్వైతమే పరమ ప్రామాణ్యమని నిర్ధారించారు.

వారిపట్ల భక్తి, విశ్వాస ముంటే చాలు. వీరి సిద్ధాంతంపై అనురక్తి ఉంటే చాలు. వారిపట్ల భక్తి యున్నపుడు వారికి సంబంధించిన ఏ కథ విన్నా ఎప్పుడూ సందేహించదు. కనుక అన్నిటినీ చదువుదాం.

నిష్పాక్షిక దృష్టిని మనమూ కథలను వినినపుడు అలవర్చుకోవాలి.

మన నిర్ణయానికి ఒకడు రానంత మాత్రంచే అతనిపై ద్వేషభావం పనికి రాదు. కనుక సత్యాన్వేషణతో బాటు, ప్రేమ కూడా కలిగియుండాలి. సమన్వయ ధోరణిలో వారు సాగగా మనము కీచులాటలతో, ఒకటి ప్రమాణం ఒకటి కాదనే ధోరణిలో మన ఆలోచన ఉంటే ఎట్లా? మనలను విమర్శించేవారూ ద్వేష భావాల్లేకుండా ప్రేమతో వారి అభిప్రాయాన్ని ప్రకటిస్తే ఇద్దరికీ మంచిది.

మాధవ శంకర విజయం

దీనికి ఎక్కువ ప్రాచుర్యముంది. ఇందు కవిత్వపు పాలుంది. తాత్త్వికమైన విచారణ కూడా ఉంది. దీనికి రెండు వ్యాఖ్యలున్నాయి. అచ్యుత రాయ మోదక్ వ్రాసిన అద్వైత రాజ్యలక్ష్మి వ్యాఖ్యానం ఒకటి, ధనపతి సూరి వ్రాసిన డిండిమ వ్యాఖ్యానం మరొకటి.

ఈ గ్రంథకర్త దానిని సంక్షేప శంకర విజయమన్నాడు. అనేక పూర్వ గ్రంథాలను పరిశీలించాడు. వ్యాసాచలుడు వ్రాసిన శంకర విజయం ఆనంద గిరీయం వంటి గ్రంథాలనుండి విషయాన్ని సేకరించాడు. పూర్వుల శ్లోకాలు చాలా మధురంగా ఉన్నాయని, ఎక్కువగా తీపి తినలేం. నా శ్లోకాలనే ఉప్పుకారాలను చేర్చానని వినయంతో అన్నాడు. కాని వీరి శ్లోకాలింకా మధురం. పూర్వుల వచన భాగానికి శ్లోక రూపమిచ్చాడు, కొన్ని పూర్వుల శ్లోకాలను మార్చాడు కూడా. దీనినొక పారాయణ గ్రంథంగా తీర్చిదిద్దాడు.

ఇది రెండువేల శ్లోకాలతో ఉంటుంది. రాజ చూడామణి దీక్షితులు, రామభద్ర దీక్షితులు, జగన్నాథ కవి రచనలలోని శ్లోకాలూ ఇందుంటాయి.

వ్యాసాచలీయం

"శంకరులనే వృక్షం బాగా ఎదిగియుంది. విద్వాంసులనే తుమ్మెదలు, ఆ మకరందాన్ని ఆస్వాదింతురుగాక, నా బుద్ధికి తగ్గట్లు అందినంత మేర ఆ పువ్వులను కోసి మాలగా కూర్చి ఈ సంక్షేప శంకర విజయాన్ని అందిస్తున్నానని" మాధవీయంలో ముందు ఉన్న మాటలను తిరిగి వ్యాసాచలీయంలో వినయంతో అన్నాడు.

గోవిందనాథుడు కూడా తన శంకర విజయంలో ఈ అలంకారాన్నే వాడాడు:

అత్యున్నతస్య కావ్యతరోః వ్యాసాచల భువోఽఖిలం

అర్థ ప్రసూనాధ్యా ధాతుం అసమర్థోఽహం అద్భుతం

వ్యాసాచలంపై ఆచార్య చరితమనే పెద్ద వృక్షం ఉంది. అందలి అర్థమనే పువ్వులను కోయలేకపోతున్నానని అన్నాడు.

వ్యాసాచలుడైన నేనూ అదృష్టవంతుణ్ణే, దానిని చదివినవారు అదృష్టవంతులే అన్నాడు:

"ధన్యో వ్యాసాచల కవివరః తత్ కృతిజ్ఞాశ్చ"

ఆనంద గిరీయం

దీనిని ప్రామాణికంగా చాలామంది భావిస్తారు. మాధవీయ వ్యాఖ్యానంలో పేర్కొన్న గ్రంథాల విషయాలన్నీ ఇందులో ఉన్నాయి. ఇందు శంకరులు, చివరి కాలంలో కంచిలో ఉన్నట్లుంది. ఈ గ్రంథం, బృహత్ శంకర విజయమే.

మాధవీయానికి ధనపతి సూరి వ్యాఖ్యలో శంకరుల దిగ్విజయ యాత్ర విపులంగా వివరింపబడింది. ఆనందగిరీయ పంక్తులూ చాలా ఇతని వ్యాఖ్యలో ఉన్నాయి.

కాశీ లక్ష్మణ శాస్త్రి వ్రాసిన గురు వంశ కావ్యంలో, వారే దానికి వ్రాసిన వ్యాఖ్యానంలో ఆనందగిరి యతీంద్రుని పేర్కొన్నారు.

సేంద్రకోటస్ అని ముందుగా పరిచయం చేసిన హెచ్.హెచ్.విల్సన్ కూడా ఆనందగిరీయం ప్రామాణికమైనదని అన్నాడు. అయితే సంస్కృతం తాళ ప్రతుల పట్టీని వ్రాసిన 'బర్నల్' దొర, దీనిని ప్రామాణికం కాదన్నాడు. శంకరులు చాలా చోట్ల మఠాలను స్థాపించిన విషయాన్ని ఆనంద గిరీయం పేర్కొనినదని, పెక్కు మఠాలను వారు స్థాపించలేదని అన్నాడు. అసలా మాట ఆనందగిరీయంలో లేదు. చాలా సిద్ధులున్నట్లు ఆనందగిరీయం వ్రాసిందని, అయినా ప్రామాణికమే అని విల్సన్ దొర వ్రాసేడు.

సంస్కృత నిఘంటువు వ్రాసిన మోనియర్ విలియమ్స్, ఆనంద గిరీయంలో ఉన్న దిగ్విజయ యాత్ర సరిగానే ఉందని కితాబు ఇచ్చాడు.

కనుక దేనిని ప్రమాణంగా భావించాలో చూడండి. ఏది ఇతిహాస, పురాణాల విషయాలతో పోలిక కల్గి యుంటుందో దానిని ప్రమాణంగా భావించాలి. ప్రజల విశ్వాసాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రతి దానినీ కాకమ్మ కథగా కొట్టి పారవేయకండి.

మూల గ్రంథాలనే శివ రహస్యానికి, మార్కండేయ సంహితకు భేదాలున్నాయి. ఈశ్వరుని నుండి పంచ లింగాలను శంకరులు గ్రహించినట్లు శివరహస్యంలో ఉండగా, మార్కండేయ సంహితలో వారే కైలాసానికి వెళ్ళి శంకరుని నుండి గ్రహించినట్లుంది. అంతేకాదు, సౌందర్య లహరి గ్రంథాన్ని పొందినట్లుంది. ఈ పంచ లింగాలను ఎక్కడ స్థాపించిన విషయం కూడా, ఈ సంహితలో ఉంది. పంచలింగాలను తీసుకోవడం రెండు గ్రంథాలు వ్రాసినా, ఎక్కడ అనే విషయంలో భేదాభిప్రాయం ఉంది.

అయితే శంకర జయంతిని జరిపే రోజు ఒక్కటే. కాలడి వారి జన్మ స్థలమని అందరూ వ్రాయగా ఆనంద గిరీయంలో మాత్రం, చిదంబరమని యుంది. ఇట్టి మాటను ప్రమాణంగా భావించనవసరం లేదు. ఇట్లా కొన్నిటిని స్వీకరించవచ్చు. కొన్నిటిని తిరస్కరించవచ్చు.

చిదంబరం - శంకరులు

పరమేశ్వరుని నుంచి తెచ్చిన ఐదు స్ఫటిక లింగాలలో ఒకటి శృంగేరిలో, మరొకదానిని కంచి మఠంలో స్థాపించారు. ఒకదానిని కేదారనాథ్‌లో నేపాల్‌లోని నీలకంఠ క్షేత్రంలోనూ ఇంకొకటి స్థాపించారు. ఐదవ దానిని చిదంబరంలో స్థాపించారు. సిద్ధి సమీపించేటపుడు ఐదవ దానిని సురేశ్వరులకిచ్చి చిదంబరంలో ప్రతిష్ఠింపుమని అన్నట్లుగా ఆనందగిరీయంలో ఉంది.

చిదంబరం అంటేనే, వేదాంత వీథిలో విహరిస్తున్నట్లుగా ఉంటుంది. అది జ్ఞానాకాశమే. మిగిలిన పుణ్యక్షేత్రాలు, అక్కడున్న స్థలపురాణాలతో సంబంధం కలిగి ఉంటాయి. కాని చిదంబరమే వేదాంతార్థంతో కూడియుంది. దీనికి వ్యాఘ్ర పురమని, పులియూరని పురాణాల బట్టి యున్నా చిదంబరంగానే ప్రసిద్ధి. పంచకృత్యాలు చేసే నటరాజునకు సమీపంలో వట్టి ఆకాశాన్ని తలపింపచేయడమే కాకుండా, ఆత్మ తత్త్వాన్ని తెలివిడి చేస్తుంది. ఆ ఆత్మ తత్త్వమే ఆకాశము. యోగతారావళి గ్రంథంలో శ్రీశైలాన్ని స్మరించినట్లు, వివేక చూడామణిలో చిదంబరం ప్రస్తావింపబడింది. ఇందు జీవన్ముక్తుని గురించి చెబుతూ, అతడు జ్ఞానాకాశంలో స్థిరంగా ఉంటాడని, అతడే విధంగానైనా ప్రవర్తించవచ్చని, దిగంబరంగా లేక చర్మాంబర ధారిగానైనా ఉంటాడని చెప్పబడింది. అక్కడ వారు "చిదంబరస్థ" అనే పదం వాడారు. అనగా జ్ఞానాకాశంలో ఉన్నవాడని.

కేరళ సమీపంలో కొంగునాడులో పేరూర్ అనే నటరాజు క్షేత్రం ఉంది. దీనిని ఆది చిదంబరం అంటారు.

దేవతా సన్నిధులను కేరళలో అంబళం అంటారు. తమిళనాడులో పొన్నంబళం, చిత్రంబళం అని నటరాజ సన్నిధిని అంటారు. ఇతర ఆలయాలకు, తమిళనాడులో ఉన్నట్లుగా ఈ సన్నిధులకు గోపురాలుండవు. కేరళలోని ఆలయాలుగా ఉంటాయి.

చిదంబరంలోని అర్చకులను దీక్షితార్‌లని అంటారు. వీరికి శిఖ, వెనుక భాగంలో కాకుండా ముందు భాగంలో ఉంటుంది. నంబూద్రీలు, ఊర్ధ్వ శిఖ కలిగియుంటే వారికి ముందు భాగంలోనే కొంచెం ప్రక్క కుంటుంది.

ఈ దీక్షితార్లకు కేరళకు ఒక సంబంధాన్ని పెరియ పురాణం వెల్లడించింది. చోళ దేశంలో కూట్రువ నాయనార్ అనే చిన్న రాజుండేవాడు. అతడు చోళరాజునకు పన్ను కడుతూ ఉండేవాడు. పంచాక్షర జపం వల్ల ఇతడనేక ప్రాంతాలను జయించి, తుదకు చోళరాజును కూడా జయించాడు.

అయితే చోళులకు కులదైవం, నటరాజు. చోళరాజులకు తంజావూర్, ఉరైయూర్ మొదలగునవి రాజధానులైనా పట్టాభిషేకాన్ని చిదంబరంలోనే నిర్వహించేవారు. అప్పటి కిరీటం పట్టాభిషేకంలోనే ఉంటుంది. మిగిలిన సమయంలో చిదంబరంలోని దీక్షితుల ఆధీనంలో ఉంటుంది.

కురువ నాయనార్, చోళ రాజును జయించిన తరువాత, తనకూ పట్టాభిషేకం చేయమని దీక్షితులనడిగాడు. చోళ రాజ్యంలో వంశపరంపరగా వస్తున్నవారికే చేస్తాము గాని ఇతరులకు చేయమని అన్నారు. ఇట్లా రాజునకు, ఇష్టం లేని మాటను చెప్పి అక్కడ ఉండడం మంచిది కాదని, ఒక్క దీక్షితుణ్ణే ఉంచి ఆ చిదంబరాన్ని విడిచి పెట్టారు. ఆలయంలో కిరీట రక్షణకై ఒక్కణ్ణి యుంచారు. అట్లా అతనిచేత, రాజు పట్టాభిషేకం చేయించుకోలేదు. సంస్కృతిని ఎట్లా గౌరవించాడో చూసారా?

వారు, చేర రాజ్యమైన మలయాళ దేశం వెళ్ళారు. ప్రక్కనున్న పాండ్య దేశానికి కాకుండా దూరంగానున్న మలయాళ దేశానికి వెళ్ళారు. ఇట్లా వీరికి ఈ దేశంతో అనుబంధం ఏర్పడింది.

ఆనందగిరీయంలో శంకరులు, చిదంబరంలో పుట్టారని, వారి తండ్రి విశ్వజిత్ అని, తల్లి విశిష్టయని యుంది. పరిశోధించగా ఈయన శంకరులు కాదు. క్రీస్తు తరువాత 788 నాటివాడు. శంకరులను, అభినవ శంకరులను ఎట్లా కలిపేసారో చూసారా?

చిదంబరంలో శంకరులు, నటరాజు మాదిరిగా వెలుగొందుతున్నారని "సాక్షాత్ చిదంబరేశ ఇవవి రాజమానః" అని ఆనంద గిరీయంలో ఉంది.

ఇందులో గోవింద భగవత్పాదులను చిదంబరంలో కలిసినట్లుంది. మిగతా శంకర విజయాలలో నర్మదా నదీ తీరంలో కలిసినట్లుంది. దీనిని గమనించండి.

అయితే చిదంబరానికి, గోవిందులకు సంబంధం ఉంది. ఆయన పతంజలి అవతారం కదా! పతంజలికి చిదంబరానికి సంబంధాన్ని చెప్పాను. శంకరులకు

పరమ గురువులు, గౌడపాదులు, వ్యాకరణోపదేశాన్ని చిదంబరంలోని పతంజలి నుండియే స్వీకరించారని ఐతిహ్యం. వీటినట్లా ఉంచినా వీరెల్లపుడూ చిదంబరస్థులే. అనగా జ్ఞానాకాశంలో ఉండేవారే. ఇట్లా భావించి శంకరులకు చిదంబరంలో ఉపదేశం ఇచ్చినట్లు ఆనందగిరీయం వ్రాసిందని భావించవచ్చు.

విశ్వనాథుడు, చండాలునిగా రావడం, మరణ సమయంలో శంకరులు తల్లి దగ్గరకు వెళ్ళడం మొదలైన విషయాలు ఆనంద గిరీయంలో లేవు. మిగతా గ్రంథాలలో ఉన్నాయి.

వీరు షణ్మతస్థాపనాచార్యులని వివరంగా చెప్పబడింది. షణ్మతాలలో కౌమారం (కుమార స్వామికి సంబంధించినది) ఉండగా ఇందు దానికి బదులు కాపాలికం ఉంది. 72 మతాలను వీరు తిరస్కరించారని, అందు కాపాలికం కూడా ఉందని ఉంది. అయితే కాపాలికుడైన వడక్కునాథర్ తన మతాన్ని ప్రచారం చేయవలసినదిగా ప్రార్థిస్తే నీవు నీ మతాన్ని ప్రచారం చేసుకొనమని శంకరులనగా అతడు శంకరుల ఐదుగురు శిష్యులను సేవిస్తూ ఉండేవాడట. కాని ప్రసిద్ధమైన షణ్మతాలలో స్కాందం (కౌమారం) ఉంది. పరాశర మాధవీయంలో కూడా అట్లాగే ఉంది. శాస్త్ర ప్రకారం నడిచే శంకరులు, కౌమారాన్ని విడిచి పెడతారా?

ఈ ఆనందగిరీయంలోనే శంకరులు అనంతశయన క్షేత్రం నుండి సుబ్రహ్మణ్య క్షేత్రానికి (ఉడిపి దగ్గరిది కావచ్చు) వెళ్ళారని, అందు కుమార ధారలో స్నానం చేసారని, అక్కడ సర్పాకారంలో నున్న సుబ్రహ్మణ్య స్వామిని ప్రార్థించారని ఉంది. ఇది కర్ణాటక కావచ్చు, లేదా ఆంధ్ర ప్రాంతం కావచ్చు. శంకరుల సుబ్రహ్మణ్య భుజంగ స్తోత్రం ప్రసిద్ధి. ఇది తిరుచెందూర్‌లో నున్న మూర్తిపై వ్రాసినది. వేరే మతానికి చెందిన వ్యక్తి, వీరిపై అభిచార ప్రక్రియ (చేతబడి మొదలైనవి) చేయగా కొంతకాలం వీరు బాధపడ్డారని, సుబ్రహ్మణ్య స్వామిపై స్తోత్రం వ్రాసేరని, అక్కడొక విశిష్ట విభూతి ద్వారా వీరి రోగం నయమయిందని అంటారు. ఒక ఆకుపై పెట్టి విభూతినిస్తారు. అది పత్ర

భూతి దానిని ఒంటికి రాయకున్నా, చూస్తే చాలని, రోగాలు పోతాయని, భూతప్రేత బాధలుండవని వ్రాసేరు:

"అపస్మార కుష్ఠ క్షయార్శ ప్రమేహ
జ్వరో న్మాద గుల్మాది రోగాః మహాంతాః
పిశాచాశ్చ సర్వే భవత్పత్ర భూతిం
విలోక్య క్షణాత్ తారకారే ద్రవంతే"

వీటివల్ల కౌమారాన్ని షణ్మతాలలో ఒకటిగా స్థాపించారని తెలుస్తోంది.

ఇట్లా శంకర విజయాలను తులనాత్మక పరిశీలన చేసి పరస్పర విరుద్ధాంశాలు లేనివాటికి ప్రాధాన్యం ఇస్తూ నిర్ధారించాలి.

కేవలం బుద్ధితో నిర్ణయానికి రాకూడదు. భక్తిని, వినయాన్ని ఆధారంగా చేసుకొని నిర్ణయించాలి.

గురు సన్నిధి - సన్న్యాసదీక్ష - వ్యాఖ్యానం

శంకరులు, నర్మదా తీరం వెళ్ళి గోవింద భగవత్పాదులను కలిసారు. వారు యోగనిష్ఠలో ఉన్నారు. ఇంతలో నర్మదకు, వరదలు రాగా ప్రజలు వచ్చి రక్షించండని శంకరులను ప్రార్థించారు. వీరు తమ దివ్యశక్తిచే నర్మదను, తన కమండలువులో బంధించారు. బాహ్య ప్రపంచంలో అడుగిడిన గురువుకు వీరు సాష్టాంగ నమస్కారం చేయగా ఆయన నువ్వు ఎవరని అడిగారు.

తాను, అవతారాన్నని పది శ్లోకాలలో పరోక్షంగా పేర్కొన్నారు. దీనిని దశశ్లోకియని అంటారు. "తదేకోఽవశిష్టః శివః కేవలోఽహం" అని చివర ఉంటుంది. 'అవశిష్టం' అనగా అదే మిగిలినది. మిగిలినదంతా మాయ. అది 'కేవలం', అనగా పవిత్రం, మిశ్రితం కానిది. తత్ ఏవో – అది ఒకటే నేనే శివుని రూపాన్ని.

శివావతారం నీ దగ్గరకు రాబోతుందని గోవిందులతో లోగడ వ్యాసుడన్నాడు. లోకాచారం ప్రకారం ఉపదేశమీయాలి కనుక శాస్త్రాచారాన్ని పాటించి ఉపదేశించారు. సన్యాస దీక్ష నిచ్చారు.

మహా వాక్యాలను గురువు ఉపదేశిస్తాడు. దాని అర్థంపై దృష్టి పెట్టి శిష్యుడు దానితో తాదాత్మ్యం చెందాలి. ఆ మహావాక్యాలు వేదశాఖ చివరలో ఉంటాయి. సర్వజ్ఞాత్మ మునియనే ఒక మహానుభావుడు సంక్షేప శారీరకం అనే గ్రంథాన్ని వ్రాసేడు. అందులో శిష్యుడు ఏ శాఖను లోగడ అధ్యయనం చేసాడో లేదా దానికి చెందినవాడో, అట్టివానికి అతని వేద శాఖలోని మహావాక్యాన్ని అందీయాలని, అది నిజ వేదశాఖ మహావాక్యమౌతుందని వ్రాసేడు. అట్లాగే మధు సూదన సరస్వతి కూడా అన్నారు. ఆ పుస్తకానికి వీరే వ్యాఖ్యానం చేసారు.

వేదాలలో అనేక మహావాక్యాలున్నాయని శంకరులనగా, అందు ముఖ్యంగా నాల్గింటిని ప్రధానంగా పేర్కొంటారు.

"మహావాక్య శతేన కథ్యతే

బ్రహ్మాత్మనో రైక్య మఖండ భావః" (వివేక చూడామణి 249)

మాధవీయ శంకర విజయంతో వీరికి నాల్గు మహావాక్యాల ఉపదేశం జరిగినట్లుంది. ఇట్టి ఆచారం, మా మఠంలోనూ ఉంది. సోఽహంలో ప్రణవం ఉంది. అది జీవబ్రహ్మాల ఐకమత్యాన్ని చెబుతుంది కనుక సోఽహం కూడా మహావాక్యమే.

బ్రహ్మ సూత్రాలకు భాష్యం వ్రాయవలసిందిగా శంకరులను గోవిందులా జ్ఞాపించారు. లోగడ పరమేశ్వరుడు దేవతలతో చెప్పాడు కదా! ఆ కాలం కోసం ఎదురు చూసారు.

శంకరులు భాష్యం వ్రాసి గోవిందుల చరణ సన్నిధిలో ఉంచారు. ఇది కాశిలో వ్రాసినట్లుంది. (నర్మదా నదీతీరంలో సూత్రభాష్యం, కాశిలో

ఉపనిషద్భాష్యం వ్రాసి యుంటారని మహాస్వామివారి అభిప్రాయం - ఆంగ్లానువాదకుడు)

శంకరులింటిదగ్గర ఉంటే వారి ఆయుర్దాయం ఎనిమిది సంవత్సరాలే. సన్యాసం పుచ్చుకోవడంవల్ల మరల 8 సంవత్సరాలు పొడిగించబడ్డాయి. కాశీయాత్రకు గురువులనుమతి ఇచ్చారు.

కాశిలో వైదిక మత ప్రచారం

కాశీక్షేత్రం, పవిత్రం, విద్వాంసులకు నిలయం. అనేక మతాచార్యు లుంటారు. అందువల్ల అక్కడకు వెళ్ళవలసిందిగా గురువులాదేశించారు. అక్కడ వైదిక మతాన్ని స్థాపిస్తే కలకాలం ఉంటుందని, పునఃప్రతిష్ఠింపబడాలని పంపారు.

గంగాతీరంలోని మణికర్ణికా ఘట్టం దగ్గర ఉన్న ముక్తి మంటపంలో వీరుపదేశించేవారు.

ఇది మోక్షపురి. అయోధ్య, మధుర, హరిద్వార్, అవంతి, ద్వారకలు కూడా మోక్షపురులే. ఏడవది దక్షిణ దేశంలో నున్న కంచి. సప్తమోక్ష పురులలో కంచిని, వైష్ణవ గురువులైన వేదాంత దేశికులు నుతించారు. కాశిలో ఉన్నట్లే కంచిలోనూ ముక్తి మంటపముంది. కంచి వచ్చినపుడు శంకరులుండేవారు. కనుక ఇప్పటికీ ఇక్కడే వ్యాస పూజ; కామాక్షి ఆలయంలోని శంకరులు విగ్రహాన్ని ఇక్కడికే తీసుకొని వస్తారు.

ఏదైనా కష్టమైన విషయం ఉంటే ఇదేమైనా సూత్రభాష్యమా అని ప్రశ్నిస్తూ ఉంటారు. కాశిలో శంకరులే భాష్య ప్రవచనం చేస్తూ ఉంటే ఇక చెప్పేదేముంది?

అంగ, వంగ, కళింగాది 56 దేశాలనుండి విద్వాంసులు పాల్గొన్నారు. వీరి ప్రతిభను చూసి సాష్టాంగ వందనాలనర్పించారు. వారు తమ ప్రాంతాలకు వెళ్ళి అద్వైత వేదాంతాన్ని ప్రచారం చేసారు. ఇట్లా మన మతం

పునరుద్ధరింపబడింది. అనేక దేశాలు హిట్లర్‌కి కూడా మోకరిల్లాయి. అది భౌతికశక్తి, వీరిది ఆత్మశక్తి, అనుగ్రహశక్తి సాత్త్వికమైనది కూడా.

శంకరుల వాఙ్మయసేవ

ఉపనిషత్తులపై, గీతపై భాష్యం వ్రాసేరు. సూక్ష్మాతి సూక్ష్మ విషయాలను కూడా బహుస్పష్టంగా వివరించారు. ఉపనిషత్తులలో ఒకదానికి మరొకదానికి సరిపడనట్లుండే ఘట్టాలను, గీతలో కూడా ఒక మూల చెప్పినదానికి, మరొక మూల చెప్పినదానికి సంఘర్షణ వచ్చే సందర్భాలలోనూ వీరు సమన్వయం చేసిన తీరు మేధావంతులను ఆశ్చర్య చకితులయేటట్లుగా చేస్తుంది.

సిద్ధాంతం మాట అటుంచండి, సంస్కృత భాషకే వన్నె తెచ్చారని, క్లిష్టమైన విషయాలనూ సరళ సంస్కృతంలో విశదీకరించవచ్చుని వీరు నిరూపించారని విద్వాంసులు పొగుడుతారు.

ఈనాడేది జాతీయ భాష అని తర్జన భర్జనలు జరుగుతున్నాయి. ఈ దేశంలో పెక్కు భాషలున్నా ఆసేతు హిమాచలంలో నున్న ప్రజలను కలిపేది సంస్కృతమే. అందువల్ల దానిలోనే రచనలు చేసారు.

వీరి భాష్యాలు, స్వీయ రచనలు, జ్ఞాన మార్గాన్ని అందిస్తాయి. భాష్యాలలో పూర్వ పక్ష సిద్ధాంతాలున్నా సుదీర్ఘంగా ఉండవు. వారొక సిద్ధాంతాన్ని ప్రతిపాదించేటపుడు దానికి విరుద్ధంగా నున్న ప్రశ్నలనన్నింటినీ లేవనెత్తి వాటికి సూటిగా సమాధానాన్ని అనగా సిద్ధాంతాన్ని అందిస్తారు. అట్లా వివిధ మతాలను, వైదిక మతాలుగా కనబడేవాటినీ ఎదుర్కొన్నారు. అయితే అన్నిటినీ అన్నివిధాల నివారించలేదు. ఇతర మతాలలో నున్న కొన్నిటిని హృదయ పూర్వకంగా స్వీకరించారు. అంతేకాదు, అద్వైతంలో ఒక్కొక్క దశలో భిన్న భిన్న సిద్ధాంతాలకు చోటుందని నిరూపించారు.

గౌడభగవత్పాదులవారు మాండూక్యోపనిషత్తుపై కారికలు వ్రాయగా దానిపై శంకరులు విపులంగా వ్యాఖ్యానించారు. అందులో గౌడులు, అద్వైతులు

కానివారు పరస్పరం వాదులాడుకొందురు గాక మాకు వానితో పేచీ పూచీలు లేవని వ్రాస్తే శంకరులు అందరూ అద్వైతానికి ఒకవిధంగా దోహదం చేసినవారే అని తరువాతి శ్లోకంలో ద్వైతులకు ఆత్మ అద్వైతమని ప్రేమతో వ్రాసేరు.

"తతః పరమార్థతో బ్రహ్మవిద్ ఆత్మైవ ద్వైతినాం"

సూత్రభాష్యంలో తగు విధంగా ఇతర సిద్ధాంతాలపట్ల గౌరవాన్ని ప్రదర్శించారు. మీమాంసా శాస్త్రంపై భాష్యం వ్రాసిన శబరులను "ఆచార్యేణ శబర స్వామినా" అని; ఉపవర్షులను "భగవతో ఉపవర్షేణ" అని న్యాయ సూత్రాలు వ్రాసిన గౌతముని "ఆచార్య ప్రణీతం" అని, వారందరినీ ఆచార్య, స్వామి భగవాన్ అని పేర్కొన్నారు.

జ్ఞానానికి సంబంధించిన స్వీయ రచనలలో ప్రధాన సత్యాన్ని స్పష్టంగా పేర్కొంటూ, వాద ప్రతివాదాల పట్ల పెద్దగా దృష్టి పెట్టకుండా వ్రాసేరు. ఉపదేశసాహస్రి వంటి గ్రంథాలలో అనుభూతిపైనే దృష్టిని సారించినట్లు తెలుస్తుంది. వివేక చూడామణి వంటి గ్రంథాలలో కూడా అదేవిధంగా చేసారు. జీవన్ముక్తా నందలహరి, ధన్యాష్టకం, యతి పంచకంలలో కేవలం అద్వైతానుభూతిని పొందినవారి స్థితిని పేర్కొన్నారు. యతి పంచకంలో కౌపీనవంతుల కంటె భాగ్యవంతుడెవడైనా ఉన్నాడా? అని ప్రశ్నించారు.

"కౌపీనవంతఃఖలు భాగ్యవంతః"

"తదేకోవశిష్టః శివః కేవలోఽహం"

"సాక్షిణ్యతః ప్రత్యగాత్మా శివోఽహం"

"అహం పరంబ్రహ్మ వాసుదేవాఖ్యం అవ్యయం"

"అహం ఆనంద సాధ్యాది లక్షణః కేవలః శివః"

"చిదానంద రూపశ్శివోహం శివోహం"

(పై ఉదాహరణలు దశశ్లోకి, అద్వైత పంచరత్న, బ్రహ్మానుచింతనం, అద్వైతాను భూతి, నిర్వాణ షట్కంలలో ఉన్నాయి)

అవి చదువుతూ ఉంటే ఒక అలౌకిక అనుభూతికి లోనవుతాం.

ఏక శ్లోక ప్రకరణంలో, ఒక్క శ్లోకంలో చైతన్య స్వరూపాన్ని వర్ణిస్తూ, కనబడే జగత్తు, దానిని చూచువాడు, అంతా చైతన్యమే అని వర్ణించారు.

వారి బాల ప్రబోధ సంగ్రహం, ఒక అధ్యాపకుడు, ఒక చిన్న పిల్లవానికి బోధించునట్లుగా ఉంటుంది.

ఇక వారి ప్రశ్నోత్తరమాలికలో అనేక విషయాలు ప్రశ్న - సమాధాన రూపంలో ఉంటాయి.

వారి భక్తి స్తోత్రాలు, అందరికీ ఉపయోగించివే. జ్ఞానానికి సంబంధించిన రచనలను కేవలం విద్వాంసులే అర్థం చేసుకోగలరు. భక్తి స్తోత్రాలను చిన్నపిల్లలు కూడా నేర్చుకోవచ్చు. కానీ వీటిలోని విషయం గురించి విద్వాంసులు కూడా ఆశ్చర్య చకితులౌతున్నారు.

దేవతలపై కేశాంతస్తవం చేసారు. ఇక భాష్యాలు వచనంలో ఉన్నా, వారి ప్రకరణ గ్రంథాలు ఎక్కువ శ్లోకాల్లోను, కొద్దిగా వచనంలోను ఉంటాయి. స్తోత్రాలన్నీ శ్లోకరూపంలో ఉంటాయి. అవి అన్నీ అర్థవంతాలు. అవి మనశ్శాంతిని ప్రసాదించే శక్తి గలవి.

మూడు మార్గాల స్థాపకులు

జ్ఞానానికి సంబంధించిన గ్రంథాలలో కూడా ముందు కర్మానుష్ఠానాన్ని చేయాలని, వర్ణాశ్రమ ధర్మాలను పాటించాలని అన్నారు.

సమత్వం అనే పేరుతో భౌతిక జీవనానికీ ప్రాధాన్యం ఇచ్చే నేటి సంస్కర్తల వంటివారు కాదు. పనులలో సమత్వానికి పాటుబడుతున్నాం. మనసులలో అట్టి భావన మనకుందా? అని ఆలోచించండి. ఉంటే ఈ ద్వేషాలూ, యుద్ధాలూ ఉంటాయా? శంకరులన్నది ఏమిటి? గత జన్మల సంస్కారాల వల్ల కర్మలు రకరకాలుగా ఉంటాయని, వాటినన్నిటినీ ఏకం చేస్తే రోగికి, పంచభక్ష్య పరమాన్నాలు పెట్టినట్లవుతుందని అన్నారు. అందరూ పై మెట్టు

ఎక్కువలసినవారే. అది క్రమక్రమంగా సాగాలి. ముందు భావనలో అంతటా ఒక చైతన్యముందని, ప్రేమతో పరికిస్తే, ఒకడు ఎక్కువ, ఒకడు తక్కువ అనే భావం పనికిరాదని క్రియలలో తేడాలుంటాయని, అందరూ ఒక పనికి ఎగబడరాదని అన్నారు.

"భావాద్వైతం సదాకుర్యాత్, క్రియాద్వైతం నకర్హి చిత్" అనగా భావంలోనే అద్వైతంగాని, క్రియలలో కాదని స్పష్టంగా చెప్పారు. అసలు అద్వైతం. అంటేనే నిష్క్రియత్వం కాని ఈనాడు అంతా తలక్రిందులైంది. మనకు భావ సమైక్యం లేదు. బాహ్యంగా అంతా ఒకటని భ్రమిస్తున్నాం. వేదాల ఆదేశాన్ని అనుసరించి ఆయా వ్యక్తులు, కర్మలు చేయాలన్నారు. ఉన్న సిద్ధాంతాన్నే పునరుద్ధరించారు. ఇట్లా కర్మ, జ్ఞాన, భక్తులకు సమన్వయం తీసుకొని వచ్చారు.

భక్తి స్తోత్రాలలోనూ కొంతవరకూ అద్వైతాన్ని చొప్పించారు. ఇది రెండు విధాలుగా చెప్పారు. ఒకటి దేవతలలో భేదం చూడవద్దని, రెండవది జీవుడు, బ్రహ్మమూ ఒకటని. ఏ దేవతను నుతించినా అతడు పరబ్రహ్మమనే చెప్పారు. దీనికంటె మరొక దానిని చూడడం లేదని అన్నారు. 'నజానే', 'నజానే' అన్నారు. లక్ష్మిని పొగుడుతూ ఈమె సరస్వతి, ఈమె పార్వతి అన్నారు. అట్లాగే మిగతా దేవతలను నుతించినా సమస్త దేవతా స్వరూపిణిగానే ఒక్కొక్క దేవతను నుతించారు.

భక్తి మార్గం, ద్వైతాన్ని సూచిస్తున్నా, చివరకు అద్వైతంలోనే పరిణమిస్తుందని అన్నారు. శివానందలహరిలో భక్తిని గురించి చెబుతూ నదులన్నీ కలిసి సముద్రంలో ఏకమవుతున్నట్లుగా అని అన్నారు. సౌందర్య లహరిలో చమత్కారంగా "భవానిత్వం" అనే శ్లోకంలో అమ్మా నీవని ఆరంభించి భవానిత్వం = నేను నీవగుచున్నానని తేల్చారు.

స్తోత్రాలలో నిర్గుణ బ్రహ్మమే సగుణ సాకార బ్రహ్మమౌతుందని అన్నారు. అనగా రూపం లేనివాడు, సత్త్వాది గుణాలు లేనివానిని రూపవంతునిగా, కల్యాణ గుణాలు కలిగినవానిగా ధ్యానిస్తున్నామని అర్థం. గోవిందాష్టకంలో

కృష్ణుని బాల్య లీలలను వర్ణిస్తూ నిష్క్రియుడైన పరబ్రహ్మమిట్లా అవతరించిందని అన్నారు. దీని ఆరంభమే సత్యం, జ్ఞానం, అనంతం, నిత్యం అనే పదాలతో ఉంటుంది.

విష్ణు సహస్రనామాలకు భాష్యం వ్రాస్తూ నిర్గుణము, సగుణము, భక్తి-జ్ఞానమూ ఒక్కటే అని ప్రతిపాదించారు.

అద్వైతము, భక్తి ఎట్లా కలిసాయో చూడండి. లక్ష్మీ నృసింహ పంచరత్న స్తోత్రం ఉంది. కాని ఇది వీరి కరావలంబ స్తోత్రం అంత ప్రచారాన్ని పొందలేదు. దీనిలో ఒకచోట ఇలా అన్నారు. ముఖంలో బొట్టు లేదని గుర్తించామనుకోండి. దానికి మనమేమి చేస్తాం? అద్దం మీద గుర్తు పెడతామా? అట్లా చేస్తే అద్దం, మురికిగా ఉండదా? ఏం చేయాలి? మన ముఖానికి తిలకం పెట్టుకుంటే ప్రతిబింబంలోనూ కన్పిస్తుంది కదా! అట్లాగే ఒక చైతన్యం యొక్క ప్రతిబింబమే ఈ జగత్తంతా మాయవల్ల భిన్నంగా కన్పిస్తోంది. అలంకరించుకోవాలంటే ఆ తిలకాన్ని నీవు తీర్చిదిద్దుకోవాలి. లోనున్న ఆత్మకు, ఇంద్రియాలూ, శరీరం, ప్రతిబింబాలవంటివి. వీటినే అలంకరిస్తే అద్దాన్ని మురికిచేసినట్లౌతుంది. అయితే లోనున్న చైతన్యానికి అలంకరించడం ఎట్లా? అది లోపల ఉన్నట్లు నాకు తెలియలేదంటావా? లక్ష్మీ నరసింహమూర్తి ఆకారంతో ఉన్నాడు. అతణ్ణి నిరంతరం భజించు, ధ్యానించు. అట్లా అతణ్ణి అలంకరిస్తే, అతనికి కల్యాణం చేస్తే మనకే కల్యాణం, శుభం, ఆనందం కల్గుతాయి. పరమేశ్వరునిలో నున్న కల్యాణ గుణాలను భావిస్తే నీవే కల్యాణ గుణ సంపన్నుడవౌతావు.

అయితే అన్ని స్తోత్రాలకు భిన్నంగా దక్షిణామూర్తి అష్టకాన్ని వ్రాసేరు. అందు భగవల్లీలలుండవు. అంతా వేదాంత తత్త్వం ప్రతిపాదకంగా ఉంటుంది. ప్రతి శ్లోకం చివర "శ్రీ గురుమూర్తయేనమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే" అని యుంటుంది.

వీరి భజ గోవింద స్తోత్రం, అంతా భక్తి జ్ఞానాలను అందిస్తుంది.

అందువల్ల ఇంతకు ముందున్న మార్గాన్నే మరల ప్రతిష్ఠించారు గాని క్రొత్త దానిని చెబుతున్నానని అనలేదు. క్రొత్త మత స్థాపకుడనని జబ్బలు చరచలేదు.

పద్మపాదుల వృత్తాంతం

శంకరులు, కాశిలో ఉండగా పద్మపాదుడు కలిసాడు. అప్పటికింకా శంకరులకు 16 సంవత్సరాలు నిండలేదు. పద్మపాదుని అసలు పేరు సనాతనుడు. చోళ ప్రాంతానికి చెందిన వాడు. అతనికి చిన్నపుడొక వృద్ధుడు నృసింహ మంత్రాన్ని ఉపదేశించాడు. దానిని జపించి స్వామి యొక్క సాక్షాత్కారాన్ని పొందాలనుకున్నాడు. ఇంటిని విడిచి కొండ శిఖరం ఎక్కి తపస్సు చేస్తూ ఉంటే ఒక బోయవాడు వచ్చి జంతువులు తిరిగే ఈ ప్రదేశంలో ఉన్నారేమిటి, ప్రమాదకరం, వద్దని అన్నాడు.

తపస్సనేమాట అతనికి అర్థం కాదనుకుని సింహం యొక్క ముఖం, మిగిలినదంతా మానవ శరీరం కలిగిన మృగం కోసం వెదుకుతున్నానని అది కావాలని అన్నాడు.

"మీరు నిజం మాట్లాడుతున్నారా? అటువంటిదానిని నేనెపుడూ చూడలేదే, అది యుండడం సత్యమైతే నేను తీసుకుని వస్తానని" బోయ అన్నాడు. సనాతనుడు నవ్వాడు. ఇతడు దూరంగా పోతే తపస్సు నిర్విఘ్నంగా సాగుతుందని భావించాడు. "నీ పని నీవు చూచుకోవయ్యా రేపు సాయంకాలం లోపుగా తీసుకొని వస్తా. కాకపోతే ఉరి పోసుకుని చనిపోతా" అంటూ బోయ బయలుదేరాడు.

ఆ నిష్కపటియైన ఆటవికుడు అడవిలో వెదకటం మొదలు పెట్టాడు. గడువు తీరిపోతోంది. ఇక తాను ఉరి పోసుకుని చనిపోవాలని నిర్ణయించి సిద్ధమయ్యాడు. ఇంతలో నృసింహమూర్తి సాక్షాత్కరించాడు. ఆయనను త్రాటితో కట్టి బోయ పద్మపాదుని ముందుంచాడు. "చూడండి స్వామి మీరడిగిన

జంతువును తెచ్చాను" అని బోయ అంటున్నా పద్మపాదునకు, ఆ మూర్తి కనబడలేదు. ఇది భ్రాంతా? బోయ, అబద్ధం చెబుతున్నాడా? అని వితర్కించాడు. ఎన్నో సంవత్సరాలు తపస్సు చేస్తేనేగాని లభించని దివ్య దర్శనం, ఈ బోయకు లభించిందని బాధపడుతూ ఉంటే ఒక అశరీరవాణి వినిపించింది. అవసరమైనపుడు, నీకు సాక్షాత్కారిస్తానులే అనే మాట వినబడింది.

భగవానుడు, నిష్కపటియైన బోయకు చిక్కాడు.

హంతపై దయ

ఏ సందర్భంలో ఆ నృసింహుడు పద్మపాదుల ఎదుట అవతరించాడో చెబుతా.

ఒక ప్రముఖ కాపాలికుడున్నాడు. పచ్చి మాంసం తినేవాడు, నరబలులిచ్చేవాడు. అట్టి కాపాలికులను ఎందరినో సాత్త్విక మార్గంలో శంకరులు పెట్టారు. కాని అట్టివారు వీరి వాదాన్ని అంగీకరిస్తారా? ఈ కాపాలికుడు శంకరుల వంటివారిని బలియిస్తే శివుడు, ప్రత్యక్షమౌతాడని భావించాడు. ఒక ఆత్మజ్ఞానిని గాని, లేదా ఒక రాజును గాని బలియిస్తే తన కోరిక నెరవేరుతుందని, రాజును బలియీయడం కుదరదు కనుక, మీరు కరుణామూర్తులు కనుక మిమ్ములనడుగుతున్నానని శంకరులతో అన్నాడు.

ఈ శరీరాన్ని అర్పిస్తే మరొకరికి ఈశ్వర సాక్షాత్కారం లభిస్తే ఇంతకంటె కావలసిందేముంది? ఎండుకట్టె ఉపయోగపడడం లేదా? చనిపోయిన జంతువు యొక్క కొమ్ము, ఏనుగు దంతమూ ఉపయోగిస్తున్నాయి. జంతువుల చర్మాలు ధ్యానానికి ఉపయోగిస్తున్నాయి. చనిపోయిన మానవ శరీరం మాత్రం ఎవ్వరికీ ఉపయోగపడడం లేదు. నా శిష్యులకు తెలియకుండా నేను ఏకాంతంగా ఉన్నపుడు నీ పని నీవు చేసుకోవచ్చని శంకరులన్నారు.

కాపాలికుడు శంకరులు ఏకాంతంగా ఉన్నపుడు కత్తి నెత్తాడు. ఎక్కడో ఉన్న పద్మపాదునకు, గురువునకు ఏదో ఆపద వస్తోందని అనిపించగా అతణ్ణి నృసింహుడావహించి ప్రత్యక్షమయ్యాడు. నరసింహస్వామి, ఆ కాపాలికుని సంహరించాడు.

ఏమిటి నీకు నృసింహ ఉపదేశం ఉందా? అని ప్రశ్నించారు శంకరులు. నేను గంగా తీరంలో ఉండగా మీకేదో కీడు జరిగిపోతోందని అనిపించింది. వెంటనే ఇక్కడ నాకు తెలియకుండానే కనబడ్డానని అన్నాడు.

నాకు నృసింహపదేశం ఉందని, అది జపిస్తూ తపస్సు చేస్తున్నప్పుడు స్వామి బోయకు కనపబడిన విషయం, తనకు అవసరం వచ్చినపుడు సాక్షాత్కరిస్తానని స్వామి అపుడు చెప్పిన విషయం గురువునకు చెప్పి పద్మపాదుడు స్వామికి ఆచార్యులకు ప్రణామాలు అర్పించాడు.

వ్యాసునితో చర్చ - ఆయుర్దాయం పొడిగింపు

బ్రహ్మ సూత్రకర్తయైన వ్యాసుడు, శంకరులు వ్రాసిన సూత్రభాష్యం వ్యాప్తి చెందాలని, సరియైన అర్థం, అందరికీ తెలియాలని, ఒక వృద్ధ బ్రాహ్మణుని రూపంలో వచ్చి అనేక ప్రశ్నలను సంధించాడు. సమాధానానికి సంతోషించినా మాటి మాటికీ అడ్డుకొనేవాడు. వితండవాదం చేసేవాడు.

వాదం అంటే ఋజుమార్గంలో వాదించడం. జల్పం అంటే అడ్డదిడ్డంగా వాదించడం. ఇక వితండమంటే అవతలివాణ్ణి తప్పు పట్టడంలోనే తృప్తి కాని, తన సిద్ధాంతం అంటూ ఏదీ చెప్పకపోవడం.

ఇట్లా రోజులు దొర్లిపోతున్నాయి. పద్మపాదుడు తన అలౌకిక శక్తితో వచ్చినవాడు వ్యాసుడని గ్రహించి అతడు నారాయణుడేయని, తన గురువు సాక్షాత్తు శంకరావతారమేనని, కింకరులమైన మేమేమి చేయగలమని ఒక శ్లోకం చదివాడు

"శంకరః శంకరః సాక్షాత్, వ్యాసో నారాయణో హరిః

తయోః వివాదే సంప్రాప్తే కింకరః కింకరో మ్యహం"

ఇట్లా వారిద్దరికీ నమస్కరించాడు. మీ నిజ రూపాలను చూపించండని ప్రార్థించాడు. వ్యాసుడు ప్రత్యక్షమై ఎందుకిట్లా వాదించానంటే ఎవరే ప్రశ్నలు వేసినా అన్నిటికీ నీ భాష్యం సమాధానం చెప్పగలగాలని, నేను దీనిని సంపూర్ణంగా అంగీకరించానని తన ఆమోదాన్ని, ప్రమోదాన్ని తెలిపాడు.

ఎందరో విద్వాంసులు నీ దగ్గరకు వస్తారు. ఏదో పుస్తకం వ్రాసి ఊరుకోవడం కాదు, ఎందరినో నీవు ఉద్ధరించాలి కనుక, మరల 16 సంవత్సరాలు నీ ఆయుర్దాయాన్ని పొడిగిస్తున్నానని వ్యాసుడు అన్నాడు. నీవు దిగ్విజయం చేయాలి. నీవల్ల ధర్మోద్ధరణ జరగాలని ఆయుర్దాయాన్ని పొడిగించే బ్రహ్మను ఆ పనికి పురమాయించాడు. ఈశ్వర అవతారానికి నేను ఆయుర్దాయం పొడిగించడమేమిటని, ఎంతకాలం ఉండదలచుకుంటే అంతకాలం ఉండుగాక అని బ్రహ్మ చెప్పగా ఇద్దరూ అంతర్ధానమయ్యారు.

ఇట్లా కాశిలో వీరుండగా భాష్యోపదేశము, పద్మపాదుడు శిష్యుడగుట, వ్యాస శంకరుల చర్చ, వీరి ఆయుర్దాయం పొడిగింపు మొదలైనవి జరిగాయి. మరో సంఘటనను వివరించే ముందు పద్మపాదుల పూర్తి వృత్తాంతం వినిపిస్తా.

పద్మపాదుల గురించి

సనాతనుడు, పద్మపాదుడెట్లా అయ్యాడు? ఒకనాడితడు, గంగకు అవతలి ఒడ్డున ఉన్నాడు. శంకరులు స్నానం చేస్తున్నారు. వీరి పొడిబట్టలతనిదగ్గర ఉన్నాయి. ఇతని అచంచల భక్తిని లోకానికి తెలియజేయడం కోసం పద్మపాదా! బట్టలు తీసుకొని రా అని సంజ్ఞ చేసారు. గంగ, వేగంగా ప్రవహిస్తోంది. ఆ పైన లోతుగా ఉంది. గురువు యొక్క మాట వినీవినగానే తడుముకోకుండా నేల మీద నడిచినట్లే నీటిపై నడవడం మొదలు పెట్టాడు. నీళ్ళున్నాయని కాని, నది దాటడానికి నావ కావాలని కాని, ఆలోచించలేదు. ఇతని భక్తిని

చూసి పరవశించిపోయి, గంగ, అతని పాదాల క్రింత తామరలను మొలిపించిందట. అంటే ఇతని పాదాలు పద్మాలపై ఉన్నాయన్నమాట. గంగను దాటి గురువునకు వస్త్రాలనర్పించాడు. ఎట్లా దాటావని శంకరులు ప్రశ్నించారు. ఎవరిని స్మరిస్తే సంసారమనే సముద్రమే మోకాలి బంటిగా మారుతుందో, అట్టివారి పనులకు గంగ, ఆటంకంగా ఉంటుందా? అని జవాబిచ్చాడు. అప్పటినుండి అతనికి పద్మపాదుడనే వ్యవహారం.

జ్ఞానియైన పంచముడూ గురువే

ఒక ఉదయం శంకరులు శిష్యులతో గంగా స్నానానికై బయలుదేరారు. దారిలో ఒక చండాలుడు ఎదురయ్యాడు. ప్రక్కకు తొలగమని అడుగగా చండాలుడు ఇలా అన్నాడు.

"అన్నమయా దన్నమయం, అథవా చైతన్యమేవ చైతన్యాత్
ద్విజవర! దూరీకర్తుం వాంఛసి, కింబ్రూహి గచ్ఛగచ్ఛేతి"

- మనీషా పంచకం

అనగా "ఓ బ్రాహ్మణ శ్రేష్ఠ! దేనిని ప్రక్కకు తొలగమంటున్నావు? అన్నం తినే శరీరం దగ్గరకు మరొక శరీరం రాకూడదంటావా? లేదా రెండు శరీరాలలోనూ ఉండేది చైతన్యమే. నీ చైతన్యం దగ్గరకు పంచముని శరీరంలోని చైతన్యం రాకూడదంటావా?"

"ఉన్నది ఒక చైతన్యమే. శరీరాలు భిన్నంగా ఉండవచ్చు. ప్రాణం ఒక్కటే. నీ వేదాంతం, పెక్కు ఆత్మలున్నాయని చెబుతోందా? అందువల్ల రాకూడదంటోందా? ఎవరి శరీరమైనా మాంసం, చర్మం, ఎముకలతో నిర్మింపబడిందే కదా! లోనున్నదంతా మురికియే. శరీర భావనయే వేదాంతికి ఉండకూడదు. జ్ఞానమార్గం బోధించేవాడు మరొకణ్ణి పొమ్మనడం ఏమిటి?"

బ్రహ్మ జ్ఞానం వల్ల పండితుడని, కేవలం చదవడం వల్ల కాదని గీత అంది:

"విద్యావినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని

శునిచైవ శ్వపాకేచ పండితాః సమదర్శినః"

పండితుడు, అందరి పట్ల సమభావంతో ఉంటాడు. అంతా బ్రహ్మమనినపుడు, మరొకవిధంగా వర్తించడు. జంతువులును తీసుకుంటే ఆవు, ఏనుగు, ఎక్కువస్థాయిలో ఉన్నాయని కుక్క అధమ జంతువుని భావిస్తాం. మానవులలో బ్రాహ్మణుని ఉత్తమునిగా భావిస్తారు. చండాలుణ్ణి నీచుడని భావిస్తారు.

జంతువులకంటె మానవులుత్తములని భావిస్తారు. కాని జ్ఞానికి, ఇట్టి ఎక్కువ తక్కువలుండవు. జంతువులను, మానవులను విడివిడిగా చూడడు. అన్ని ప్రాణులను ఒకటిగానే భావిస్తాడు.

ఇట్టి సమదృష్టి కలిగియుండాలని బోధించే అద్వైత స్థాపనాచార్యుడు నన్ను పొమ్మనడం ఏమిటని ప్రశ్న.

"ఏదో బాధపడి నన్ను వాదంలోకి దింపుతున్నాడా? అందువల్ల శాస్త్ర నియమాలను చెప్పినా అతడు వినే పరిస్థితిలో లేడు. అతడు తొలగకపోతే మనమే తొలగాలి. అయితే అతడేదో బాధపడి మాట్లాడడం లేదు. వేదాంత సత్యాలను చెబుతున్నాడు, కనుక అతడు చెప్పేది వినాలని" భావించారు శంకరులు.

చండాలుడు ఇంకా ఇలా అన్నాడు:

"కింగంగాబుని బింబితోఽంబరమణౌ చండాలవాటీ పయః

పూరే చాంతరమస్తి కాంచన ఘటీ మృత్కుంభయోర్వాంబరే

ప్రత్యగ్వస్తుని నిస్తరంగ సహజానంద బోధాంబుధౌ

విప్రోఽయం శ్వపచోఽయ మిత్యపి మహాన్ కోఽయం విభేదభ్రమః"

తా: గంగాజలంలో, చండాల వాటికలో నున్న జలాశయంలోనూ ప్రతిబింబించిన సూర్యునిలో ఏమైనా భేదం ఉంటుందా? ఎట్టి తరంగాలు

లేని సహజానంద బోధ సముద్రమగు ఆత్మలో ఇతడు చండాలుడు, ఇతడు బ్రాహ్మణుడనే భేదం అనే భ్రమ నీకు ఎట్లా కలిగింది?

శంకరులు తరువాత అద్వైతంలో రెండు భేదాలు కన్పిస్తాయి. లక్ష్యంలో తేడా యుండదు. పరమాత్మ జీవాత్మగా ఎట్లా కన్పిస్తున్నాడు? రెండు సిద్ధాంతాలూ అవిద్యయే కారణమంటాయి. అయినా భిన్నంగా చెబుతాయి.

పద్మపాదులు, శంకరుల సూత్రభాష్యంలో ఐదు అధికరణాలకు భాష్యం వ్రాసేడని, అది పంచపాదిక యని చదువుకున్నాం. ప్రకాశాత్ముడు, పంచపాదికపై వివరణ వ్రాసేడు. దీనిని వివరణ ప్రస్థానమంటారు.

వాచస్పతి మిశ్రులు, సూత్ర భాష్యంపై భామతి యనే పేరుతో భాష్యం వ్రాసేరు. ఇందు చెప్పబడిన వాటిని భామతి ప్రస్థానమంటారు.

వివరణ పద్ధతిని ప్రతిబింబవాదమని; భామతి సిద్ధాంతాన్ని అవచ్ఛేద వాదమని అంటారు. ఈ రెండూ పరమాత్మకు, మనకు భేదం లేదని చెప్పేవే.

నేలపై కొన్ని నీళ్ళను చల్లామనుకోండి. అనేక జలకణాలు నేలపై ఉంటాయి. కొన్ని పెద్దవి, కొన్ని చిన్నవి. అన్నిటిలోనూ ఆకాశంలోని ఒక్క సూర్యుడూ వీటిల్లో చిన్నవాడుగా, పెద్దవాడుగా ప్రతిబింబిస్తూ ఉంటాడు. నీటికణాలు నేలలో ఇంకిపోతే ప్రతిబింబాలుండవు. అవిద్య నీటి వంటిది. అట్లా పరమాత్మ, జీవుల అంతఃకరణాలలో లేదా మనస్సులలో ప్రతిబింబిస్తాడు, జీవాన్నిస్తాడు. ఇక అంతఃకరణం పోతే ప్రతిబింబం ఉండదు. బింబం ఒక్కటే ఉంటుంది. బింబమైన పరమాత్మ, రెండు లేనిదై ప్రకాశిస్తుంది. దీనిని బింబ ప్రతిబింబ వాదమంటారు.

ఇక అవచ్ఛిన్నవాదం. ఆకాశం అంతటా ఉంది. దీనిని మహాకాశం అంటారు. కుండలోని ఆకాశాన్ని ఘటాకాశమంటారు. కుండ ఉన్నంత వరకూ ఘటాకాశముంటుంది. అది పగిలిపోతే మహాకాశమే ఉంటుంది. ఘటం పగిలినపుడు ఘటాకాశం మహాకాశం ఒక్కటైనట్లుగా మనస్సు నశిస్తే ఒక్క పరమాత్మయే యుంటాడు. కుండలో ఉన్నది చిన్న ఆకాశంగా, బయట

ఉన్నది పెద్దదిగా కన్పిస్తుంది. కుండలు, మహాకాశాన్ని పంచుకున్నట్లుగా ఉంటాయి. ఇది అవచ్ఛిన్న వాదం.

మరొక ఉదాహరణ చూపిస్తారు. ఒక కుండను నీటిలో ముంచాం. అది నీటితో నిండింది. అందులోనున్నది, నూతిలో నున్నది నీరే. కాని కుండ ఒక హద్దును సృష్టిస్తూ, కుండలో నున్న, నీటిని నూతిలో నున్న నీటిని వేరు వేరుగా చూపిస్తోంది. పెద్ద కుండలో ఎక్కువ నీరు, చిన్న కుండలో తక్కువ నీరు ఉన్నట్లు కన్పింప చేసినట్లు ఒకే పరమాత్మ, జీవుల యొక్క అంతః కరణాలను బట్టి భిన్న భిన్నంగా కన్పిస్తాడు.

వీరి వాదాలతో మనకు పనిలేదు. నీళ్ళ చుక్కలను తొలగిస్తే ఉన్నది ఒక్క సూర్యుడే. మాయవల్ల ఏర్పడిన జీవాత్మ భావాన్ని తొలగిస్తే మనమూ, పరమాత్మ ఒకటౌతాము. ఇది ప్రతిబింబవాదం వారనేది. ఇక కుండ పగిలితే మహాకాశమైనట్లని అవచ్ఛిన్నవాదం వారంటారు.

ఆ చండాలుడు, రెండు రకాల వాదాలను పేర్కొన్నాడు. 'కింగంగాంబుని' అనినపుడు, ప్రతిబింబవాదాన్ని పేర్కొన్నాడు. గంగ నీటిలో, చండాలవాటిక నీటిలో సూర్యుడు ప్రతిబింబిస్తున్నాడు కదా! రెండు ప్రతిబింబాలలోనూ తేడా ఉందా? తరువాత అవచ్ఛిన్న వాదాన్ని పేర్కొన్నాడు. రాజుగారి బంగారు కలశంలోనూ ఆకాశముంది. మా మట్టికుండలోనూ ఆకాశముంది. ఈ రెంటి ఆకాశాలకు తేడా ఉందా? బ్రాహ్మణ శరీరమైనా, చండాల శరీరమైనా కుండవంటిదే. లోనున్న ఆత్మకాశానికి తేడా ఉందా? రెండు శరీరాలు నీటి చుక్కలు వంటివే. రెంటిలోనూ ఆత్మ సూర్యుడొకడే.

లోనున్నది జ్ఞాన సముద్రమే సహజానంద అవబోధఅంబుధి. అది తరంగాలు లేని సముద్రం. సంసార సముద్రం తరంగాలతో ఉంటుంది. జ్ఞాన సముద్రానికి అవి ఉండవు. ఇది అంతటా వ్యాపించింది. దీనిపై మామూలు గాలి, తన ప్రభావాన్ని చూపదు. మామూలు సముద్రం, నీళ్ళతో, ఉప్పుతో ఉంటుంది. ఆత్మ సముద్రంలో జ్ఞానానందాలే ఉంటాయి. జ్ఞానమే

ఆనందం. ఆనందమే జ్ఞానమని అర్థం చేసుకోవాలి. ఇది వ్యాపించని చోటుండదు. కాని మామూలు సముద్రం అట్లా కాదు. ఇది అందరిలోనూ ఉంది. బాహ్య భేదాన్ని చూడమని నీ వేదాంతం చెప్పిందా? అని అడిగాడు.

ఓహో! నీవు బ్రహ్మవేత్తవు. ఇట్టివారు ఎవరైనా మా గురువులే. నీ జ్ఞాన స్థాయిని తెలిసికోలేక ఆచారం ప్రకారం తొలగుమని అన్నా. నేను నీకు నమస్కరిస్తున్నా. అని ఐదు శ్లోకాలు చెప్పారు. శంకరులు. దీనినే మనీషా పంచకమంటారు.

"జాగ్రత్ స్వప్న సుషుప్తిషు స్ఫుటతరా సంవిత్ ఉజ్జృంభతే
యాబ్రహ్మాది పిపీలికాంత తనుషు ప్రోతా జగత్సాక్షిణీ
సైవాహం నచ దృశ్య వస్త్వితి దృఢప్రజ్ఞాఽపి యస్యాస్తిచేత్
చండాలోఽస్తు సతుద్విజోఽస్తు గురురిత్యేషా మనీషామమ"

జాగ్రత్ స్వప్న సుషుప్తులలో ఏ చైతన్యం అత్యంత స్ఫుటంగా ప్రకాశిస్తూ ఉందో, పిపీలికాది బ్రహ్మ పర్యంతమూ ఏది ఓతప్రోతంగా (పడుగు పేకలుగా) అన్ని శరీరాలలోనూ వ్యాపించి సాక్షిగా ఉందో, నేనా చైతన్య స్వరూపాన్ని. నేను జడదృశ్యాన్ని కాను అని ఎవనికి గట్టి జ్ఞానం కలుగుతుందో, అతడు చండాలుడే అవుగాక, ద్విజుడే అగుగాక. అతడు నాకు గురువు. ఇది నిశ్చయం

వాది ప్రతివాదులు కలహించుకుంటూ ఉంటారు. కాని సాక్షి మాత్రం చూస్తూ ఉంటాడు. అట్లా ఇంద్రియాలు, మనసు సంఘర్షణ పడుతున్నా నేను మాత్రం సాక్షిని, చైతన్యాన్ని. ఆత్మయే నేను. మిగతాదంతా బాహ్యమైనది. ఇంద్రియాలు, అంతఃకరణలు చూడబడేవి. చూచేది ఆత్మయే. ఆ ఆత్మయే నేను. ఇది మొదటి శ్లోకం. ఇక చివరి దానిని చెబుతాను.

యత్ సౌఖ్యాంబుధి లేశ లేశ ఇమేశ క్రాదయోనిర్వృతా
యచ్చిత్తే నితరాం ప్రశాంత కలనే లబ్ధ్వా మునిర్నిర్వృతః
యస్మిన్నిత్య సుధాంబుధౌ గలితధీః బ్రహ్మైవన బ్రహ్మవిత్

యః కశ్చిత్ స సురేంద్ర వందిత పదో నూనం మనీషా మమ

ఏ సుఖ సముద్ర కణలేశాన్ని పొంది ఇంద్రాది దేవతలు, ఆనందంలో మునిగిపోయారో, ప్రశాంతచిత్తుడైన ముని, తన చిత్తంలో దేనిని పొంది ఆనందిస్తున్నాడో, ఆ నిత్య అమృత సముద్రంలో ఎవని చిత్తం కరిగి పోయిందో అతడు బ్రహ్మవేత్తే కాదు, బ్రహ్మమే. అట్టి మహాత్ముని పాదాలకు ఇంద్రుడు కూడా నమస్కరిస్తున్నాడని నా నిశ్చితాభిప్రాయం.

పంచముడు ఆనందాంబుధి యన్నాడు. శంకరులు సుధాంబుధియన్నారు. గురువు చెప్పినది శిష్యుడనాలి కదా! అతని మాటలనే ఉట్టంకించారు.

ఇంద్ర భోగాలు కూడా ఆనంద సముద్రంలో ఒక కణం వంటివి. లేశమనే మాటలతో దానిని సూచించారు.

లలిత సహస్ర నామాలలో అమ్మవారు "స్వాత్మానందలవీభూత బ్రహ్మాద్యానంద సంతతిః" అనగా బ్రహ్మాది దేవత ఆనందం, ఆమె ఆత్మానందంలో ఒక చుక్క వంటిదే.

ఇంద్రుని కట్టి అనుభూతి లేదు. రెండవ వాక్యంలో జ్ఞానిని మునిగా పేర్కొన్నారు. ఇంద్రుని ఆనందాన్ని ముందుగా, జ్ఞాని ఆనందాన్ని తరువాత పేర్కొన్నారు. ఇంద్రాది దేవతలు బుద్ధితో ఆనందాన్ని అనుభవిస్తే జ్ఞాని యొక్క బుద్ధి, శాశ్వతానందంలో మునిగిపోయి ఉంటుంది. బుద్ధి లీనమై పోతుంది.

ఎంతవరకూ, ఇంకొకదానిని తెలిసికొంటుందో, తెలిసికొనేది వేరు, తెలియబడేది వేరనే విభజన ఉండనే యుంటుంది. ఇది ద్వైతం. బుద్ధి లేకపోతే దేనితో తెలిసికోవడం? బుద్ధి కనుమరుగైతే ఉండేది ఆత్మయే కదా! దానికి రెండంటూ లేదు. కనుక బ్రహ్మవిత్ అవుతాడు. బ్రహ్మవిత్ కూడా కాదు బ్రహ్మమే అవుతాడు.

"బ్రహ్మైవ న బ్రహ్మవిత్"

అట్టి బ్రహ్మ స్వరూపమే నా గురువని శంకరులన్నారు. అట్టివానికి బ్రహ్మ కూడా శిష్యుడై యుంటాడని అన్నారు. అట్టివారిని జాతి, వర్ణ, స్థాయి, వయస్సులనే కొలబద్దలతో లెక్కపెట్టరాదని సిద్ధాంతం.

సమదృష్టి వేరు, సాంఘిక సమానత్వం వేరు

ఈ సంఘటనకు ఆధునిక సంస్కర్తలు మరొకవిధంగా అర్థం చెబుతారు. శంకరులు వర్ణాశ్రమ విభజన వద్దు అన్నారని అర్థం తీస్తారు .వారి రచనలను చదవితే వీరు చెప్పినది తప్పనిపిస్తుంది. ఈ సంస్కర్తలకు వర్ణాశ్రమ విభజన తప్పనిపిస్తే వారు చెప్పవచ్చు గాని ఈ కథతో ముడిపెట్టడం అన్యాయం. పూర్వులు దేనిని సమత్వమన్నారు? అందరిపట్లా ఎక్కువ తక్కువలు చూడకుండా ప్రేమను పంచి పెట్టాలన్నారు. వర్ణాశ్రమాలు వద్దని, వివిధ ప్రజలు వివిధ వృత్తులను చేసుకోనవసరం లేదని చెప్పలేదు. మామూలు నడవడికలోనే భేదాలను పాటిస్తాం. వండే పదార్థాన్ని కార్య క్రమానికి అనుగుణంగా తీర్చి దిద్దుతారు. జ్వరంతో బాధపడే వానికి వేడినీళ్ళు ఇయ్యాలి. అన్నాశయ సంబంధమైన రోగంతో బాధపడేవానికి చన్నీళ్ళు ఇయ్యాలి. పూజకు విడిగా నీరు. అసలు, పప్పు ఉడకడానికే ప్రత్యేకమైన నీటిని వాడతారు. స్నానానికి, బట్టలుతకడానికి నీరు వేరుగా ఉంటుంది. ఇట్లా ప్రతి వ్యవహారంలోనూ విభజనను పాటిస్తాం.

ఇతర దేశాలలో మన వంటి వర్ణ విభజన లేకపోవచ్చు. అయితే వారిలో ఐకమత్యం ఉందని చెప్పగలరా? సమానత్వం పేరు పెట్టినదగ్గరనుండి పరస్పర కలహాలు వస్తున్నాయి. సమానత్వం పేరుతో ఉద్యమాలున్నా పోటీ మనస్తత్వం ప్రబలిపోయి సంఘర్షణలకు దారితీస్తోంది.

వర్ణ విభజన యొక్క మౌలిక తత్త్వం పోయి గందరగోళ పరిస్థితులేర్పడినపుడు మరల దానిని శంకరులు పునరుద్ధరించారు. వాటి గోడలను బ్రద్దలు కొట్టాలని అనలేదు. ఈ మాటలు చెబితే ఇవి మీకు

రుచింపకపోవచ్చు. బుద్ధుడు, గాంధీ మాదిరిగా చెబితే వారికీ బహుళ ప్రచారం లభించి యుండేది. అట్టి పొగడ్తలను, ప్రచారాన్ని వారాశించలేదు.

శంకరులు చెప్పినదేమిటి? జ్ఞానావస్థలో ఉన్నవారికి అంతా సమానంగా కన్పిస్తుందని అన్నారు. జ్ఞానికి జాతి లేదు, ఎక్కువ తక్కువలు లేవు. తల్లి, తల్లి కాదు, తండ్రి తండ్రి కాదని చివరి దశలో నున్నవానికి వేదం చెప్పింది. ఫలానా కోరిక లేనివానికి దేనిని పడితే దానిని తినవచ్చని చెప్పింది. ఆ జ్ఞాని స్థితి ఎక్కడ? మనమెక్కడ? నూటికి 99 పాళ్ళు, అందరూ రాగద్వేషాలతో కూడి యున్నవారే.

అందరి కార్యక్రమాలూ ఒకటని గీత చెప్పలేదు. నీవు క్షత్రియుడివి, నీ ధర్మం నీవు నిర్వర్తించమని ఎందుకన్నాడు? జాతి భేదం లేకపోతే ఇట్లా అంటాడా? మనం, ద్వంద్వ ప్రపంచంలో ఉన్నాం. ఇది నడవాలంటే ఎవరి ధర్మాలు వారు నిర్వర్తించవలసిందే. అద్వైతానుభవాన్ని నిత్య వ్యవహారంలో చూపిస్తే ఎలా?

తామనుకొన్నవి శాస్త్రాలలో ఉన్నాయని, ఆధునికులు నిర్ణయానికి వస్తారు. ఏ సందర్భంలో అవి చెప్పబడ్డాయో అని విచారణ చేయరు.

ఆ పంచముడు, మామూలు వాడైతే శంకరులు ఇట్లా సమాధానం చెప్పి యుండేవారు. "నీవన్నట్లు రెండు శరీరాలు రక్త మాంసమయములే. లోనున్న చైతన్యమూ ఒక్కటే. అయితే లోనున్న దానిని చూడగలుగుతున్నావా? చూడలేవు. ఎందుకు చూడలేవు? గత జన్మ సంస్కారాలు చూడలేకుండా చేస్తున్నాయి. సంస్కారాలకనుగుణంగా జన్మనెత్తుతున్నావు. వచ్చిన జన్మకు అనుగుణంగా ప్రవర్తించి పాపాలను పోగొట్టుకో. నీవు చూడలేనట్లే అందరూ చూడలేకపోతున్నారు. వారి వారి కర్మలను చేస్తూ చిత్త శుద్ధిని పొందగలిగితే చూస్తారు. మానసికంగా అందరూ ఒక్కటే అని భావించాలి గాని, భౌతిక వ్యవహారాలలో భేదాలు తప్పవు. సంఘం సరిగా సాగాలంటే భిన్న భిన్న కార్యకలాపాలలో ఎవరి పాత్రను వారు నిర్వహించవలసిందే. అందరి

శరీరాలలోనూ చైతన్యం ఒకటైనా సంఘం యొక్క మంచి కోసం మంత్రానుష్ఠానం చేయాలంటే మిగిలిన వారికంటె బ్రాహ్మణులు తప్పక ఆచారాలు పాటించ వలసినదే. అట్టివారు దూరంగా ఉన్నా తప్పు లేదు, మనస్సు నణిగినవాని దృష్టిలో మాత్రం అంతా ఒకటంటే చెల్లుతుంది.

శంకరులు చూసినది, మనస్సును పోగొట్టుకొన్న రాగద్వేషాలు లేని అసాధారణ పంచముణ్ణి. కాబట్టి అట్టివానిని గురువని కీర్తించారు. జాతి భేదాన్ని వద్దని శంకరులు, ఈ మనీషా పంచకంలో ప్రవచించారని అనడం సాహసం.

విశ్వనాథుని లీల

ఇక పంచముడంతర్ధానమై విశ్వనాథుడు సాక్షాత్కరించాడు. ఆచార్యులను పరీక్షించడం కోసం శంకరుడట్లా వేషం వేసుకొని వచ్చాడు. శంకరులు జ్ఞానియైనా, ఇతరులకు ఆదర్శంగా ఉండడం కోసం కొన్ని ఆచారాలను పాటించాలని, ప్రపంచ వాసనల కతీతంగా ఉన్నవారి పట్ల వినయంతో ఉండాలని, తామాచార్యులమని భావించకూడదని, అటువంటి వారికి శిష్యులుగా భావించాలని తెలివిడి చేయడం కోసం అట్లా వచ్చాడు. ఆచార్యులు శంకరుణ్ణి స్తోత్రాలతో పూజించారు. ఆచార్యులను దీవించి శంకరుడు అదృశ్యుడయ్యాడు.

కుమారిల భట్టు వృత్తాంతము

దిగ్విజయం చేయవలసినదిగా వ్యాసుడే శంకరులతో అన్నాడు. నివృత్తి మార్గంలో నున్న శంకరులు ప్రవృత్తి మార్గంలో ఉన్న కుమారిలుని ప్రదేశానికి వెళ్ళారు. ఆనందగిరీయంలో కుమారిలుడు అపుడు ప్రయాగలో ఉన్నాడు. అది రుద్రపురం అని యుంది.

కుమారిలుడు, అద్వైత వేదాంతాన్ని అంగీకరిస్తే తన అవతార ప్రయోజనం సిద్ధించినట్లే. కానీ అతడు ప్రాయశ్చిత్తం చేసుకుంటున్నాడని విని వెళ్ళారు.

కుమారిలుడు బౌద్ధాన్ని ఖండించడం కోసం, వైదికునిగా వెడితే వారంగీకరించరని తాను బౌద్ధుడనని, తత్త్వం తెలిసికోవాలని బౌద్ధ విహార కేంద్రంలో ప్రవేశించాడు. అయితే అతడు వైదిక కర్మానుష్ఠానాలను రహస్యంగా చేస్తూ ఉండేవాడు. దీనిని బౌద్ధులు పసిగట్టారు. ఇతణ్ణి భవనంలోని ఏడవ అంతస్తు నుండి త్రోసివేసారు. వేదాలే ప్రమాణమైతే తాను సురక్షితంగా బయట పడాలని అన్నాడు.

"పతన్ పతన్ సౌధతలాన్యరో రుహం
యది ప్రమాణం శ్రుతయో భవంతి
జీవేయమస్మిన్ పతితో సమస్థలే
మజ్జీవనే తచ్ఛ్రుతి మాన్యతా గతిః"

అంత ఎత్తునుండి కింద పడినపుడు బ్రతికాడు కానీ కంటికి గాయం అయింది. ఎందుకిట్లా జరిగిందని కోపగించాడట. వేదాలే ప్రమాణమైతే అని శంకించావు. కిందపడి చనిపోలేదు. కాని కంటికి గాయం అయింది. నీలో సందేహం ఉంది కనుక ఇట్లా జరిగిందని అశరీరవాణి విన్పబడిందట.

విద్యాశాలలో తాను బౌద్ధుడనని గురువులను నమ్మించి మోసం చేసానని, అనగా గురు ద్రోహం చేసానని, దానికి తగిన ప్రాయశ్చిత్తం మండుతున్న ఊకలో పడి మరణించడమే మేలనుకొని అట్లా చేస్తున్న సమయంలో శంకరులు వెళ్ళారు.

వీరి దర్శనం వల్ల ఆమంటలో చల్లదనం అలముకుంది. అంతేకాదు వీరు జ్ఞానామృతాన్ని పంచి పెట్టారు, వెదజల్లారు కూడా.

శంకరుల ఉపదేశ సారాంశం:

వేదాలలో చెప్పిన కర్మలను అనుసరించవలసిందే. దేనికోసం! చిత్తశుద్ధి కోసం. కేవలం అనుష్ఠానమే లక్ష్యమని మీమాంసకులంటారు. వారు పొందే

స్వర్గాది సుఖాలు కూడా నిత్యం కావని, ఆత్మను తెలిసికోవడమే అంతిమ లక్ష్యమని శంకరులున్నారు.

వేదంలో చెప్పిన కర్మకాండకే మీమాంసకులు ప్రాధాన్యం ఇచ్చారుగాని అందలి జ్ఞాన కాండను తడమరు. అయితే అది ఎందుకుందని వారిని ప్రశ్నిస్తే వాటిని అర్థవాదాలంటారు. అనగా వేదంలోని విధి నిషేధ వాక్యాలను బలపరచి బోధించడానికి నిందా రూపంలో గాని స్తుతి రూపంలోగాని చేసే వివరణ, అర్థవాదం. అనగా స్తుతిగాని, నిందగాని యోజనంగాగల లౌకిక వాక్యం. జ్ఞాన కాండగురించి వీరేమంటారంటే నీవు దేవుడవవుతావని, కర్మలను ప్రోత్సహించినట్లే ఆ మాటలుంటాయని అర్థం చెబుతారు.

శంకరుల ఉపదేశ సారాంశం: శంకరులు కర్మలను కర్మల కొరకే చేయడం లేదని, స్వర్గాది సుఖాల కోసం చేస్తున్నారని అన్నారు. కర్మకాండ ఇది చేయి ఇవి చేయి అని అంటే, ఏది చేయకూడదో అది వద్దని జ్ఞానకాండ చెబుతోంది. వేదంలో సత్యం పలుకుమని విధి వాక్యం ఎట్లా ఉందో పరదార సంగమం వద్దనీ ఉంది. చేయకూడని వాటిని ఎట్లా చేయకుండా ఉంటున్నామో అనగా అక్కడ నిష్క్రియత్వం ఎట్లా ఉందో అట్లాగే చివరి దశలో అనగా జ్ఞాన దశలో నిష్క్రియంగా ఉండడమే అద్వైతలక్ష్యమని శంకరులన్నారు. ఆత్మ సుఖం కోసం అన్నిటినీ విడిచి పెట్టాలని వీరంటారు. అటువంటప్పుడు జ్ఞానకాండ, ఎట్లా అర్థవాదమౌతుంది? కర్మవల్ల వచ్చే ఫలాన్ని, జ్ఞానం వల్ల వచ్చే ఫలాన్ని బేరీజు వేసుకోవద్దా? కర్మల వల్ల వచ్చే సుఖం తాత్కాలికం. జ్ఞానం వల్ల ఆత్మానందం కల్గుతుంది. అది శాశ్వతం. ముందుగా కర్మలను చిత్తశుద్ధికై చేయాలి. ఇది చిక్కిన తరువాత వాటిని విసర్జించాలని వేదాంతులంటారు.

ఆపైన మీమాంసకులు కర్మయే ఫలమిస్తుందని, దేవునితో నిమిత్తం లేదని అంటారు. ఈ సమస్త ప్రపంచం ఒక నియతితో సాగుతోందని, దీనిని నడిపేవాడున్నాడని, కర్మలకు తగిన ఫలమిస్తాడని వేదాంతులంటారు. కర్మ

ఫలాలనాశించకుండా కర్మలను చేయాలని, ఫలాలను స్వామికి అర్పించాలని, చిత్తశుద్ధిని ప్రసాదింపుమని ప్రార్థించాలని వేదాంతులంటారు.

ఆ అద్వైత జ్ఞానం వచ్చే వరకూ భక్తితో ఉండాలని, ప్రేమ కలిగియుండాలని చివరకు ఇద్దరూ (జీవాత్మ పరమాత్మలు) ఒక్కటే అనే జ్ఞానం వస్తుందని వీరంటారు. మీమాంసలో ప్రేమతో కూడిన భక్తి లేకపోవడం ఒక లోపం. శరీరంతో పనులు చేస్తూ ప్రేమతో కూడిన మనస్సుంటే, చివరకు ఆ మనస్సే మటుమాయమై శాంతంతో కూడినపుడు ఆత్మ సాక్షాత్కారమని ఇట్లా సమగ్ర ప్రణాళికను అందించింది వేదాంతం. అదేమీ లేకుండా వట్టి కర్మలు చేసి ఏం ప్రయోజనం? జీవునకు పరిపూర్ణ తృప్తి ఎట్లా వస్తుంది?

కర్మ భక్తులతో స్వామిని ఆరాధించాలి. ఈ ప్రపంచాన్ని అతని స్వరూపంగా భావించాలి. సంఘానికి మేలు చేయాలి. ఇదంతా ఇతరుల కోసం చేస్తున్నామనే భావన పోయి ఆత్మోద్ధరణకై చేస్తున్నామనే భావన రావాలి. ఆ స్థితిలో నిష్క్రియత్వం. ఇది అభ్యాసం వల్ల గాని పట్టుబడదు. ఎంతవరకూ శరీరం, మనస్సు ఉందో అంతవరకూ జనన మరణాలు తప్పవు. ఆకారం, భావం లేనపుడు కర్మ ఏమిటి? ఫలాలేమిటి? సంసారంతో సంబంధమేమిటనే స్థితి ఏర్పడుతుంది. శాశ్వత సుఖం, మన లక్ష్యమని భావించవద్దా? కర్మలతో నిరంతరం మునిగిపోవడం చిత్తాందోళనలతో జీవితాన్ని చివరి కంటా గడపడమా? అని వేదాంతులు ప్రశ్నిస్తారు.

"మాతే సంగోస్త్వ అకర్మణి" (2-47) అనగా కర్మలను చేయకపోవడంతో అనగా కర్మత్యాగంలో పట్టుదల వద్దు. ఇది ప్రాథమిక దశలో నున్న సాధకుణ్ణి ఉద్దేశించింది. అతడు పుట్టినప్పటినుండి గిట్టేవరకూ భౌతిక సుఖాల కోసం చేస్తూనే ఉంటాడు. అట్టివానిని వెంటనే కర్మలు వద్దని చెబితే సాధ్యమా?

నేనన్నీ మానేస్తాను. జ్ఞానినౌతానంటే అది సాధ్యం కాదు. దానికి తగినంత బలం లేదు. ఎంతవరకూ దేహంతో సంబంధం ఉంటుందో అంతవరకూ పని చేయకుండా ఉండలేరని చెప్పింది గీత:

"నహి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణి అశేషతః" (18-11)

శరీరం పనిచేస్తూ ఉండకపోయినా మనస్సు పనిచేస్తూ ఉంటుంది. కనుక ఇంద్రియాలకు సుఖం ఉంటుంది. ఆ మనస్సు అణగలేదు. పైకి మాత్రం జ్ఞానిలా ఉంటూ లోలోపల మనస్సు, ఇంద్రియాల వెంట తిరుగుతూ ఉంటే ఇంతకంటె కపటి మరొకడు ఉంటాడా? అని గీత ప్రశ్నించింది.

"కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసాస్మరన్

ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచారః స ఉచ్యతే" (3-6)

కనుక అర్జునా! ప్రస్తుతం నీవు భ్రాంతిలో పడి యుద్ధ ధర్మం చేయనంటే, నీ సహజ గుణాలు నీ అదుపు లేకుండా నిన్ను కర్మవైపు లాగుతూ ఉంటాయి:

"స్వభావ జేన కౌంతేయ నిబద్ధః స్వేన కర్మణా

కర్తుం నేచ్ఛసి యత్ మోహాత్ కరిష్యతి అవశోఽపితత్ (18-60)

అందువల్ల ప్రస్తుత దశలో కర్మలను విడిచిపెట్టకు. అయితే ఆ కర్మలను నీ ఇష్టం వచ్చినట్టు చేయకు. శాస్త్ర ప్రకారం చేయాలి సుమా! ఏది చేయాలో శాస్త్రం చెబుతుంది:

"తస్మాత్ శాస్త్రం ప్రమాణం తే" (16-24) నేను నీతో చెప్పేదేమంటే సంగ బుద్ధి లేకుండా ఫలాన్ని నాకర్పించు.

"తతః కురుష్వ మదర్పణం" (9-27) ఇట్లా చేస్తూ ఉంటే ఒకనాటికి పాపం నిన్ను అంటకుండా ఉంటుంది. తామరాకుపై నీటిబొట్టులా ఉండగలవు.

"లిప్యంతే నస పాపేన పద్మపత్రమి వాంభసా" (5-10)

ఇట్లా శాస్త్ర ప్రకారం ప్రతి వ్యక్తి చేస్తూ ఉంటే అతనికి యోగ్యత లభిస్తుంది: జ్ఞానమార్గంలోకి అపుడు వెళ్ళగలడు: 'స్వకర్మణా తం అభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః" (18-46) ఇది చిన్న స్థాయిలో ఒక సిద్ధి వంటిది. ఇక కర్మలను విడిచి జ్ఞాన విచారంలో గట్టిగా అడుగిడినపుడు అది మహాసిద్ధి మోక్షం ప్రాప్తిస్తుంది.

"నైష్కర్మ్య సిద్ధిం పరమం సన్న్యాసేన అధిగచ్ఛతి" (18-49)

నైష్కర్మ్య సిద్ధియే పరమసిద్ధి. అది సన్న్యాసియైన వెనుక సిద్ధిస్తుందని అన్నాడు.

కనుక పరిపక్వమనస్సు లేనివారు కర్మలను చేయాలన్నాడు. అదైనా శాస్త్రం ప్రకారం అన్నాడు. అంతేనే కాని కర్మలను చేయడమే అంతిమ లక్ష్యమని చెప్పలేదు. చిట్టచివరి దశలోనే అన్ని కర్మలనూ విడిచిపెట్టుట:

"ఆరురుక్షో మునేర్యోగం కర్మకారణ ముచ్యతే

యోగా రూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే (6-3)

అన్ని కర్మలు, బ్రహ్మజ్ఞానికి సాధనంగా ఉండి అందులో లీనమై పోతాయి.

"సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే" (4-33)

జ్ఞానికి కర్మతో పని లేదు. "తస్య కర్మన విద్యతే" (3-17) అని సారాంశం గీతాచార్యుడందించాడు.

ఇట్లా కుమారిలునకు శంకరులు బోధ చేసారు. ఉపనిషత్తులలో కర్మయోగం ఉన్నా అదే అంతిమ లక్ష్యం కాదని అన్నారు. ఈశావాస్యం ఆరంభ మంత్రంలో జీవించిన వంద సంవత్సరాలు కర్మలు చేస్తూ ఉండాలని ఉంది. "జిజీవిషేత్" అని కూడా ఉంది. అంటే ప్రాపంచిక జీవితం కావాలనుకున్న వానికని అర్థం. అంతేనే కాని నివృత్తి మార్గంలో ఉన్నవానికని కాదు. దీనితో శంకరులు ఏకీభవించారు. దీని వెనుక మంత్రంలో ఆత్మను తెలుసుకొనలేనివాడు, అనగా జ్ఞాన మార్గాన్ని గుర్తించనివాడు, ఆత్మహత్య చేసుకున్నవానితో సమానమని ఉంది. తరువాత ఆత్మ గురించి అద్వైత ధోరణిలో వివరింప బడింది. కనుక జ్ఞాన మార్గానికి ముందు అనగా ప్రాథమిక దశలో కర్మమార్గం ఉంది.

కుమారిలునకు ఈ విధంగా శంకరులు ఉపదేశించారు. క్రియలలో మునిగినా, తన నిష్క్రియత్వ లక్ష్యాన్ని శాంత స్థితిని మరిచిపోలేదు. అది పనిచేస్తూ చేయని స్థితి. అది ఎట్టిదో వారి నడవడికవల్ల తెలుస్తుంది.

కుమారిలుడు శాంతించాడు. వీరి మాటలు, వీరి దర్శనం వల్ల, అతని తాపం తగ్గింది. అప్పర్ స్వామిని ఒక సున్నపు బట్టీలో శత్రువులు తోసివేస్తే ఈశ్వర పాదాలను ఆశ్రయించిన నాకు చల్లగా ఉందని అనలేదా? ఆ పాదాలే శంకరుల పాదాలు.

నేనెందుకు జ్ఞానమార్గాన్ని ఖండించానో మీకు తెలుసు. కర్మలను తుంగలో త్రొక్కిన బౌద్ధుల నెదిరించడం కోసం, కర్మ మార్గానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చాను. నేనీ ప్రాయశ్చిత్త కర్మ చేసుకునేటపుడు, ఫలదాతయైన శంకరుడే వచ్చాడని భావిస్తున్నా. అయితే నా శిష్యుడు మీమాంసను బాగా వ్యాప్తి చేసి యజ్ఞ యాగాలను చేసినవాడు, మాహిష్మతీ నగరంలో ఉన్నాడు. అతణ్ణి నివృత్తి మార్గంలో త్రిప్పగలిగితే దిగ్విజయయాత్ర సఫలమౌతుందని కుమారిలు డన్నాడు.

(హస్తినా పూర్ దగ్గరగా నున్న విద్యాలయంలో మండనుడున్నాడని కొందరు, మరొక చోటని కొందరు చెబుతారు. ఇతని శిష్యుడని కొందరు, బావ మఱిది అని కొందరు వ్రాసేరు. వాటికేమి గాని, అందరూ అతడు మీమాంసకుడని అన్నారు-అనువక్త)

సీతాదేవి ఆశీస్సులవల్ల హనుమంతుని తోకకు నిప్పంటించినా ఎట్లా చల్లగా ఉందో, శంకరుల సమక్షంలో కుమారిలుడంత చల్లదనాన్ని పొందాడు. అగ్ని రూపుడైన ఎవడు పరమశివుని నేత్రాగ్నినుండి సుబ్రహ్మణ్యుడై కుమారిలుడుగా అవతరించాడో, ఆ అవతారం ఆ అగ్నిలోనే లీనమై పోయింది.

ధర్మశాస్త్ర ప్రమాణాన్ని అనుసరించి చూపించాడు. అట్టివారే మన మతానికి పునాదులని మరువకండి.

మండన మిశ్రుల ప్రాంతం - పండితుల నిలయం

కర్మ మార్గంలో బద్ధులైన వారిని ఉద్ధరించడం కోసం, దయతో వారితో వాదించడం కోసం శంకరులు బయలుదేరారు. మాహిష్మతీ నగరంలో మండన

మిత్రుల ఇంటిని వెదుకుతూ ఉండగా కొంతమంది స్త్రీలు నీళ్ళ బిందెలతో కనబడ్డారు. మండనుల ఇల్లు ఎక్కడ? అనగా వారు శ్లోకరూపంలో సమాధానం ఇచ్చారు:

"స్వతః ప్రమాణం పరతః ప్రమాణం

కీరాంగనా యత్ర గిరం గిరంతి

ద్వారస్థ నీడాంతర సంనిరుద్ధా

జానీ హి తన్మండన పండి తౌకః"

అనగా ఏ ఇంటి ద్వారంలో పంజరాలలో నున్న చిలుకలు, వేదం స్వతః ప్రమాణమా? పరతః ప్రమాణమా అని వాదిస్తూ ఉంటాయో అదే వారిల్లని సమాధానం చెప్పారు. చూసారా? న్యాయ మీమాంసపరిచయం స్త్రీలకు, తుదకు పక్షులకు కూడా ఆనాడుండేదని తెలియడం లేదా?

ఇది ఆనంద గిరీయంలో ఉన్న శ్లోకం. స్వతః ప్రామాణ్యావాదం, పరతః ప్రామాణ్యావాదం అని ప్రామాణ్య వాదం రెండు రకాలుగా ఉంటుంది.

ఒక వస్తువును చూస్తే మనకు కలిగిన జ్ఞానం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి సరియైనదని, రెండవది కాదని తెలుస్తుంది. ఒక తగరపు చిప్పపై సూర్యకాంతి పడిందనుకోండి. అది వెండిలా కనిపిస్తుంది. కాని అది తగరపు చిప్పయని తెలుసు. మన బుద్ధి, ముందు వెండిదని చెప్పినా అట్టి బుద్ధి ప్రమాణం కాదని తెలుస్తుంది. వెండి పాత్ర, వెండి పాత్రయే. తగరపు చిప్ప, తగరపు చిప్పయే అని తెలిసి కొనుట ప్రమాణమవుతుంది.

సరియైన జ్ఞానాన్ని 'ప్రమ' అని అంటారు.తప్పైన జ్ఞానాన్ని 'భ్రమ' అని అంటారు. భ్రమ తప్పైనా ఆ సమయంలో అది నిజమే అనిపిస్తుంది. ప్రమాణంగా కన్పిస్తుంది. కాని ఆలోచిస్తే అది భ్రమ అని తెలిసి అప్రమాణమై పోతుంది.

ఒక వస్తువు కనబడితే ఇది తప్పా? లేక ఒప్పా అని తెలుస్తుంది. రెండు భిన్న వస్తువులను చూసినపుడు అది వేరు, ఇది వేరని మొదట కలుగుతుంది. వెంటనే అది నిజం అనే మరొక జ్ఞానం కలుగుతోంది. ఒక చెట్టును చూసాం. ఇది చెట్టే, నిజం అనే రెండవ జ్ఞానం కల్గుతోంది. ఈ రెండవ జ్ఞానానికి చెట్టును చూడడం కారణమా? లేక మరొక దానివల్ల ఇది కల్గుతోందా? చెట్టును చూడడమే రెండవ జ్ఞానానికి కారణమనేవారు స్వతః ప్రమాణవాదులు, అట్లా కాదు. వేరొక దాని వల్ల ఈ రెండవ జ్ఞానం ఏర్పడుతుందని చెప్పేవారు పరతః ప్రమాణవాదులని సారాంశం.

(ఒక జ్ఞానం యొక్క యథార్థాన్ని రుజువు పరచడానికి పర ప్రమాణం కావలసి వస్తుందని ఇది అంతు పట్టదని మీమాంసకులు లేవనెత్తి వేదం యొక్క ప్రామాణాన్ని సాధించడం కోసం ఈ చర్చ సాగింది. శబ్దం, స్వతః ప్రమాణమైతే శబ్ద రూపమైన వేదం యొక్క ప్రామాణికతను ప్రశ్నింపతగదని; శబ్దం పరతః ప్రమాణమైతే వేదాలయొక్క ప్రామాణ్యాన్ని సాధించడం కోసం ఈశ్వరుడు వీటి కర్తయని చెప్పాలని, రెండు వాదాలు. మొదట దీనిని స్థాపించినవారు మీమాంసకులు. వేదం తనంతట తానే ప్రమాణమనేవారు. ఈశ్వరుడు కర్త అవడం వల్ల ఇవి ప్రమాణములని చెప్పేది నైయాయికమతం- అనువక్త)

మండనులను, సరసవాణిని ఓడించుట

కుమారిలుడు ప్రతివాదులను గౌరవించునట్లుగా మండనుడు స్వాగతం పలుకలేదు. అసలు సన్న్యాసులంటే ఇష్టపడడు. వారు వేద కర్మలను విడిచారని కోపం. వీరిని చూడడమే పాపమని భావించేవాడు. పిలువకుండా శంకరులు అతని ఇంటికి వెళ్ళారు. ఆనాడతని ఇంట్లో శ్రాద్ధకర్మ. ఆనాడు సన్న్యాసులను చూడడం మహాపాపమని భావించాడు. ఇంటి తలుపులు మూసేసి యున్నాయి.

ఇతనికి ఉపదేశించాలని శంకరులు వెళ్ళారు. ఆనాటికాలంలో కల్లుగీత గీసేవారికి ఒక విద్య తెలుసు. కొబ్బరి చెట్టు మొదట్లో ఒక మంత్రం చదివితే వెంటనే చెట్టు నేలకొరిగేదట. కొబ్బరికాయలను, కల్లును అట్లా సులభంగా తీసుకునేవారు. మరొక మంత్రం చదివితే లేచి నిలబడేదట.

మండనుల ఇంట్లో కొబ్బరి చెట్టు ఒకటుండేదని, ఆ వీధిలో పోతున్న కల్లుగీత గీసేవాడిని. తనకా విద్య నేర్పమని అడిగారని, దానినతడు నేర్పాడని, మండన మిశ్రుల ఇంట్లో వాలేరని ఒక కథ ప్రచారంలో ఉంది. యోగశక్తి ద్వారా ప్రవేశించారని మరొక కథ.

శ్రాద్ధంలో భోక్తలుగా జైమిని మహర్షి, వ్యాసాచార్యులున్నారు.

పరీక్షిత్తు ఎంత జాగరూకత వహించినా తక్షకుడు నిమ్మకాయలో దూరలేదా? అట్లాగే శంకరులూ ప్రవేశించారు. తక్షకుడు విషం కక్కడానికి వెడితే, శంకరులు అమృతాన్ని పంచడం కోసం వెళ్ళారు.

ఓ సన్యాసీ ఎక్కణ్ణుంచి వచ్చావని శ్లేషతో కూడిన ప్రశ్నలు, శంకరుల సమాధానాలూ అయ్యాయి. శ్రాద్ధంలో విష్ణుస్థానంలో సన్యాసిని నియమించవచ్చని జైమిని, వ్యాసులన్నారు. భిక్ష స్వీకరింపుమని మండనుడు అన్నాడు.

నేను కేవలం భిక్ష కోసం రాలేదు. నాకు కావలసింది వాద భిక్ష, కుమారిలుడు పంపగా వచ్చానన్నారు. ముందీ భిక్షను గ్రహించండని తరువాత వాద భిక్షయని అన్నాడు మండనుడు.

ఇక వాదానికి కూర్చున్నారు. మధ్యవర్తి ఉండాలి కాబట్టి ఇతని భార్యయైన సరసవాణియే మధ్యవర్తినిగా ఉంచారు. మండనుడు, బ్రహ్మయని, ఆమె సరస్వతియని శంకరులకు తెలుసు. కనుక సరస్వతి మాట శిరోధార్యమే.

తన భర్త ఓడిపోయాడన్నా తనకి ఇబ్బందియే, సన్న్యాసి గెలిచాడని గట్టిగా చెప్పగలదా? వారిద్దరి మెడలలో పూలమాలికలను వేసి ఏది వాడిపోతే అతడోడినట్లని నిర్ణయించింది.

శంకరులు ఓడిపోతే మరల గృహస్థాశ్రమాన్ని స్వీకరించాలని, మండనుడు ఓడిపోతే సన్న్యాసం పుచ్చుకోవాలని నియమం పెట్టుకున్నారు.

వాదం మొదలైంది. రెండు పర్వతాలు ఢీకొన్నట్లుగా 21 రోజులు చర్చ జరిగింది.

శంకరులు అద్వైతాన్ని ప్రతిపాదించారు. కొన్ని వేద మంత్రాలను ఆధారంగా వీరిని ఖండించడం సబబు కాదు. ఎవడగ్నులను ఆరాధించకుండా ఉంటాడో అతనికి వీరహత్యాదోషం వస్తుందనే తైత్తిరీయ మంత్రాన్ని వీరిపట్ల అన్వయించకూడదు. ఎవడు వైదిక కర్మలను విడిచిపెట్టాడో అట్టివానికి ఆ మంత్రం అన్వయిస్తుంది. అట్టివారిని కర్తవ్యోన్ముఖులను చేయడం కోసం అట్టి మంత్రాలున్నాయి. ఇక నివృత్తి మార్గంలో శంకరులు ఉన్నారు. బాహ్యమైన అగ్నిని విడిచి జ్ఞానాగ్నితో నిరంతరం వెలుగొందుతూ ఉన్నారు. ఒక పచ్చి కాయ, పండు, కావడం రంగు రుచి మారడం జరిగి పక్వమైన తరువాత క్రిందబడితే మరల చెట్టునకు తగిలిస్తారా? అదేవిధంగా, జ్ఞానం పండేదాకా కర్మలు చేస్తూ ఉండవలసిందే. పండు పక్వానికి (పూర్తిజ్ఞానం) వచ్చిన తరువాత కర్మలు తమంత తామే తొలగిపోతాయి. ఇట్టి జ్ఞానం కలిగినవారు అన్నిటినీ సమంగా చూడగలరు. ప్రేమతో చూస్తారు. తరువాత నిష్క్రియులై యుంటారు. సర్వభూతములు, తననుండి భయం లేకుండా ఉండుగాక అని వారు ప్రైష మంత్రాన్ని పలికినవారు కదా.

మండనుడు అద్వైతాన్ని పూర్తిగా అంగీకరించాడు. ఇతని మెడలో పూలమాల వాడిపోయింది. ఇక ఇతనిలో సగభాగమైన ఆమె ఊరుకొంటుందా? ఆమె కూడా అంగీకరించింది. తల ఒగ్గింది. ఆమె అంగీకరించడం ఎటువంటి దంటే వసిష్ఠుడు తనను బ్రహ్మర్షియని పిలవాలని విశ్వామిత్రుడన్నట్లుగా భావించాలి.

శంకరులు, సర్వజ్ఞ పీఠారోహణం చేసినపుడు సరస్వతి ప్రత్యక్షమై వీరిని సర్వజ్ఞులని చెప్పినట్లున్న కథ కూడా ఉంది.

తన భర్త ఓడిపోయాడని ప్రత్యక్షంగా చెప్పకుండా ఇద్దరూ నా భిక్షను స్వీకరించండని గడుసుగా చెప్పింది. ఇద్దరికీ నమస్కరించింది.

భోజనానికి రండని గృహస్థు ఇతరులను పిలవకూడదు. వైశ్వదేవానికో, లేదా దేవతార్చనకో దయ చేయండని అనాలి. మండనుడు ఓడినట్లు సున్నితంగా చెప్పినట్లైంది.

ఏ భార్యయైనా తన భర్త, సన్న్యాసం పుచ్చుకుంటున్నాడంటే సహించగలదా? కాని సరసవాణి, ఇంత వరకు యజ్ఞ పత్నిగా ఉంది. ఆమెకు అలౌకిక శక్తి యుంది. కనుకనే 21 రోజులు, పూలమాల వాడిపోకుండా ఉండగలిగి ఉంది. ఆమె ఉభయ భారతిగా ఇప్పుడు ప్రసిద్ధిని పొందింది. ఆమె సరస్వతి యొక్క అవతారమే కదా!

మండనుడు సన్న్యాసం స్వీకరించి సురేశ్వరాచార్యులైనారు. బ్రహ్మలోకానికి, తిరిగి సరసవాణి వెళ్ళాలనుకుంది.

ఇట్లా వెళ్ళిపోతే ఎలా అమ్మా! నీవిక్కడే ఉండి అందరికీ జ్ఞానాన్ని, బుద్ధిని కలిగించాలని నవదుర్గా మంత్రంలో ఆమెను శంకరులు బంధించారు. ఆ మంత్రానికి లొంగినట్లు కనబడింది. అట్లా భక్తి ప్రేమ పాశాలతో శంకరులామెను బంధించగలిగారు.

అయితే నన్నిక్కడ ప్రతిష్ఠించవద్దని, నీవు దేశం తిరుగుతూ ఉండమని, వెనుదిరిగి చూడవద్దని చూస్తే అక్కడే ఉండిపోతానని ఆమె అనడం, శారదా పీఠాన్ని శంకరులేర్పాటు చేయడం మొదలైన కథ మనకు తెలిసిందే అయినా చెబుతున్నాను. వెను దిరిగి చూడకుండా నడుస్తున్నారు. ఆమె అందెల గలగల, వినబడుతూనే ఉంది.

శృంగేరి యొక్క గొప్పదనం

ప్రయాణం సాగిస్తూ తుంగభద్రా నదీతీరంలోని శృంగేరికి చేరుకున్నారు. అక్కడ ప్రసవించే కప్ప పై ఎండ తగలకుండా ఉండడం కోసం పాము

పడగనెత్తిన దృశ్యాన్ని చూసారు. పాముకి, కప్పకు సహజ వైరం. కాని ఇక్కడ రక్షిస్తోందేమిటి? ఇది పరమసాత్త్వికమైన, మహనీయమైన స్థలమని భావించారు. ఇంతలో అందెల చప్పుడు వినబడడం లేదు. శంకరులు వెనుదిరిగి చూసారు.

అక్కడ ఇసుక తిన్నెలలో సరస్వతి పాదాలు చిక్కుకోవడంచే అందెల చప్పుడు వినబడలేదు. ఏది జరిగినా మన మంచికోసమే అంటూ అక్కడే శారదా పీఠాన్ని స్థాపించారు.

వారక్కడ చాలాకాలముండి అమ్మవారిని అర్చించారు. మొదటి 16 సంవత్సరాల వయస్సులో గ్రంథాలన్నిటినీ వ్రాసేరు. మిగిలిన 16 సంవత్సరాలలో దేశాన్ని ముమ్మారు పర్యటించి అనేక ఘన కార్యాలు చేసారు. చాలాకాలం శృంగేరిలోనున్నట్లు శంకర విజయం చెబుతోంది.

శృంగేరీ మఠ ప్రత్యేకత

మిగిలిన మఠాలు, తామెక్కడ స్థాపించాలో ఊహించి ఏర్పాటు చేయబడినవి. భారతదేశంలో నాల్గు మూలలా నాల్గు క్షేత్రాలున్నాయి. వీటిని 'చార్‌ధామ్' అంటారు. ఉత్తరంలో బద్రీనాథ్, పడమర తీరాన ద్వారకానాథం (సోమనాథం); తూర్పున పూరీలో జగన్నాథం, దక్షిణాన రామనాథం (రామేశ్వరం) వీటిల్లో బదరి, ద్వారక, పూరీ క్షేత్రాలలో మూడు ప్రధాన మఠాలను స్థాపించారు.

ఐదు ప్రధాన మఠాలను, ఇంకా చిన్న మఠాలను శంకరులు స్థాపించారని ఉన్నా రామేశ్వరంలో ప్రధాన మఠాన్ని స్థాపించకుండా చిన్న మఠాన్ని స్థాపించారు. మహమ్మదీయుల దండయాత్రలో చిన్నమఠాలు ధ్వంసమైపోయాయి. ప్రధాన మఠాలకు వీరి తాకిడియున్నా అవి పూర్తిగా అదృశ్యం కాలేదు. వాటిని ఇతర ప్రాంతాలకు తరలించారు. లేదా ఆ మఠాలను కొంతకాలం మూసి యుండవచ్చు. మన కంచి మఠాన్ని ఉడయార్

పాలయానికి, తరువాత కుంభకోణానికి మార్చారు. జోషీ మఠాన్ని (బదరి) కూడా కొంతకాలం మూసియుంచి తరువాత తెరిచారు.

రామేశ్వరంలో ప్రధాన మఠమే కనుక ఉంటే అది కనుమరుగైన పరిస్థితి యుండేది కాదు. అందువల్ల శృంగేరిలోనిదే ప్రధాన మఠంగా పరిగణింప బడింది. అయితే దీనిని తమ యూహ ప్రకారం ఏర్పాటు చేయలేదు.

అదంతా దైవికంగా జరిగింది. విద్యా దేవతయే ఇక్కడ మఠాన్ని నెలకొల్పునట్లు చేసింది. ఈ మఠానికి ప్రత్యేక క్షేత్రం, రామక్షేత్రం అనగా రామేశ్వరమే.

కంచి ప్రపంచానికి నాభి వంటిది కనుక అక్కడొక మఠాన్ని స్థాపించారు. ఇవి ప్రధానమైనవి. శారదా సంకల్పానుగుణంగా శారదా మఠం ఏర్పడింది.

సురేశ్వరుల ప్రత్యేక వ్యక్తిత్వం

మానవ స్వభావం ఎంత విచిత్రంగా ఉంటుందో చూడండి. శంకరుల శిష్యులు, సురేశ్వరునే శంకించారు. శంకరుల శారీరక భాష్యానికి వివరణ వ్రాసే సురేశ్వరులు గురించి శంకరులతో శిష్యులు "అతడు పూర్వాశ్రమంలో గొప్ప మీమాంసకుడు కదా, మీ చేత ఓడింపబడ్డాడు. తప్పనిసరై మీకు శిష్యుడు కావలసి వచ్చింది .అతడు, అద్వైత వేదాంతాన్ని హృదయ పూర్వకంగా తమ రచనలలో ప్రతిపాదిస్తాడంటారా? మీ మాదిరిగా బ్రహ్మచర్యం నుండి ఆశ్రమ స్వీకారం చేయలేదు కదా. అతనికి తత్త్వం ఒంటబట్టిందా? సిద్ధాంతానికి చేటు తీసుకొని వస్తాడేమో!" అని గొణిగి యుంటారు. సురేశ్వరులు వీరి హావభావాలను చూసి వ్రాయడానికి పూనుకోలేదు.

కొంతకాలం తరువాత వీరు శంకరులను సమీపించి అయ్యా! మీకు గురుదక్షిణ ఈయాలనుకుంటున్నానంటూ ఒక తాళపత్ర సంపుటిని వీరి ముందుంచారు.

అదే నైష్కర్మ్య సిద్ధియనే గ్రంథం అది నిష్క్రియత్వాన్ని చెప్పే గ్రంథం. అనగా మోక్షాన్ని చెప్పేది. శంకరుల సంకల్పం వీరిలో ప్రవేశించి వ్రాయించి యుండవచ్చు.

సురేశ్వరులకు ఆవిధంగా ఆటంకం వచ్చి శారీరక సూత్రాల వార్తికం వ్రాసి యుండకపోవచ్చు. కాని శంకరుల రెండు ఉపనిషత్ భాష్యాలకు వార్తికం వ్రాసేరు. తైత్తిరీయము అనేది; కృష్ణ యజుర్వేదానికి చెందింది. బృహదారణ్యకం శుక్ల యజుర్వేదానికి చెందింది. దక్షిణాదిన ఎక్కువగా కృష్ణయజుర్వేదం ఉత్తరాది శుక్ల యజుర్వేదం వాడుకలో ఉన్నాయి. శంకరుల దక్షిణామూర్తి శ్లోకాలపైన మానసోల్లాసం వ్రాసేరు.

కంచి, శృంగేరి, ద్వారక మఠాలవారు సురేశ్వరులను ఆచార్య పరంపరలో చేర్చారు. సురేశ్వరులకు పీఠాధిపత్యానికి అర్హత ఉన్నా, సర్వ జ్ఞాత్ముడనే బ్రహ్మచారి, శాస్త్ర సంబంధ విషయాలను చూస్తూ ఉండేవాడు. సురేశ్వరులు సిద్ధి పొందిన తరువాత ఇతడు పీఠాధిపతి అయ్యాడు.

సురేశ్వరులను అన్ని మఠాలకు ప్రధాన వ్యక్తిగా, పర్యవేక్షకునిగా నియమించి యుంటారు.

ఎందుకిట్లా వీరికి ప్రాధాన్యం ఇచ్చి యుంటారు? పూర్వాశ్రమంలో గొప్ప మీమాంసకులు. వయస్సులో, విద్యలో అందరికంటే పెద్దవారు. సంపద నంతటినీ త్యాగం చేసి వచ్చినవారు. కనుక వారికి తగిన స్థానం ఈయాలని పై మూడు మఠాలపై పర్యవేక్షణ చేసే బాధ్యతను వీరికి అప్పగించి యుంటారు. వారి తరపున బ్రహ్మచారిని నియమించి యుండవచ్చు.

మఠాధిపతికి కొన్ని లౌకిక కార్యకలాపాలు ఉంటాయి. అంటే నిత్య కృత్యంలో కార్యకలాపాలు జరగాలి, వాటిని చూసే సురేశ్వరులకు బాధ్యత అట్లా ఉంచగా, వైదిక కార్యకలాపాలకు బ్రహ్మచారియై వచ్చిన సర్వజ్ఞాత్మునకు

పీఠాధిపత్యాన్ని ఇచ్చి యుంటారు. బ్రహ్మచారియై తరువాత సన్న్యాసించిన వ్యక్తిపై ఎక్కువ పూజ్యభావంతో జనులు చూస్తారు.

కంచిలో ఒక వీథికి మండన మిశ్ర అగ్రహారం అనే నామం ఉంది. వీరికి ఆశ్రమ స్వీకారానికి ముందు జరిగియుంటుంది. మాహిష్మతి నుండి రెండు వందల బ్రాహ్మణ కుటుంబాలు ఇక్కడకు వచ్చాయని యుంటారు.

పద్మపాదుని పంచపాదిక

ఇతడు శంకథుల శారీరక భాష్యంపై వివరిస్తూ పంచపాదికను వ్రాసి తీర్థయాత్రలు చేస్తూ రామేశ్వరానికి చేరుకున్నాడు. తనతో బాటు తన గ్రంథాన్ని తీసుకొని వెళ్ళాడు. యాత్రలో జంబుకేశ్వరంలో అతని మేనమామ ఇంట్లో బస చేసాడు. అక్కడ పుస్తకాన్నుంచి తిరిగి వచ్చేటపుడు తీసుకుందామని భావించాడు. ఇతడు లేనపుడు ఇతని మేనమామ ఈ గ్రంథాన్ని చదివి, తాను గొప్ప మీమాంసకుడవడం వల్ల తన సిద్ధాంతానికి ఈ పుస్తకం చేటు తీసుకొని వస్తుందని తనకున్న రెండు ఇండ్లల్లోని పాడైపోయిన ఇంటిలో దీనినుంచి ఇంటిని తగులబెట్టాడు. (తిరిగి వచ్చి మరల వ్రాయకుండా ఉండడం కోసం మేనమామ ఇతనికి విషం ఇచ్చాడనే కథ కూడా కొన్ని శంకర విజయాలలో ఉంది.)

పద్మపాదుడు తిరిగి వచ్చాడు. తీరా చూస్తే పుస్తకం కాలిపోయింది. ఇదంతా సురేశ్వరులను శంకించడం వల్ల శంకరులీ శిక్షను వేసారేమో! జరిగిన కథను శంకరులకు నివేదించాడు.

నీవింతవరకూ మొదటి అధ్యాయంలోని నాల్గు భాగాలను, రెండవ అధ్యాయంలోని మొదటి భాగాన్ని వినిపించావు. అది నాకు గుర్తుంది. తిరిగి వ్రాసుకో, దీనినే ప్రచారం చేయమని అన్నారు. విన్నదంతా తిరిగి చెప్పారు. వారి స్మరణ శక్తి ఎట్టిదో కదా!

సూత్రభాష్యం యొక్క మొదటి ఐదు భాగాలకు ఇది భాష్యం కనుక దీనికి పంచపాదిక అనే మాట వచ్చింది. బ్రహ్మ సూత్రాలలో మొదటి అధ్యాయానికి చెందిన నాల్గు సూత్రాలకే ఇతని వ్యాఖ్యానం మిగిలింది.

ఇతణ్ణి పీఠాధిపతిగా నియమించి యుంటారు. కొందరు ద్వారక మఠానికని, మరికొందరు పూరీ జగన్నాథ మఠానికని అనగా, మార్కండేయ సంహితలో ఆనందగిరీయంలో శృంగేరి మఠానికి ఆచార్యునిగా నియమించినట్లుంది.

హస్తామలకుడు - మౌన జ్ఞాని

శంకరుల ముఖ్య శిష్యులలో హస్తామలకుడొకడు. శిష్యుడని విడిగా చూడడం సబబు కాదు. శంకరులను, శిష్యులను విడదీయడమా? వారు నల్గురు శిష్యులతో అవతరించారని ఉంది కదా! కాని గురు శిష్య సంబంధం ఉంటుంది కనుక విడివిడిగా వీరిని గురించి ముచ్చటించుకుంటున్నాం.

శంకరులు యాత్ర చేస్తూ ఉన్న సమయంలో పశ్చిమ తీరానికి చెందిన శ్రీబలిలో ఇతణ్ణి చూసారు. వయస్సు వచ్చినా ఎట్టి జ్ఞానమూ అబ్బలేదు. చెవిటి, మూగ బాలునిగా ఉండేవాడు. తండ్రి, ఇతణ్ణి తీర్చి దిద్దండని శంకరులను వేడుకున్నాడు. ఇతణ్ణి జడుడని అన్నాడు.

బ్రహ్మ జ్ఞాని కూడా జడునిగానే యుంటాడు. కాని ఇతణ్ణి జ్ఞానిగా శంకరులు గుర్తించారు.

గొప్ప జ్ఞానికి, గొప్ప అజ్ఞానికి భేదం తెలియదు. అజ్ఞానికి బుద్ధి పని చేయదు. ఒక మూర్ఖునిలా ఉంటాడు. కొందరు సాధువులు కూడా ఉంటారు. జ్ఞాని కూడా ఒక్కొక్కప్పుడు గెంతుతాడు, చప్పట్లు కొడతాడు. ఒకనికి బుద్ధి పనిచేసినా నాస్తికుడై యుంటాడు. అతడొక రకం అజ్ఞాని. తిరువణ్ణామలైలో శేషాద్రిస్వామియనే జ్ఞాని యుండేవాడు. అతడు వచ్చేవారిపై రాళ్ళు విసిరేవాడు. దీనిని ఆశీర్వచనంగా జనులు భావించేవారు. బుద్ధిలేనివాడొకడుండగా, బుద్ధిని అణచినవాడొకడు. గెంటివేసిన వాడొకడుంటారు.

కాని పిచ్చివాళ్ళకు, మూర్ఖులకు మానసిక క్లేశ ఉంటుంది. కాని జడునిగా కన్పించే జ్ఞానికి చిత్తశాంతి యుంటుంది. ఎప్పుడూ ఆనందంతో ఉంటాడు. ఇక నాస్తికుడైన అజ్ఞానికి మనమేదైనా హాని తలబెడితే నూరు రెట్లు మనకు హాని చేస్తాడు. కాని జ్ఞానిని, వాతలు పెట్టినా చిరునవ్వుతో మనలనాశీర్వదిస్తాడు. హానిలోనూ ఆనందాన్ని ప్రకటిస్తాడు. అతడు పిచ్చివానిగా, జడునిగా, మూర్ఖునిగా, నాస్తికునిగా పైకి కన్పిస్తాడు.

ఆ పిల్లవాడితో నీ పేరేమిటని ఎక్కడ ఉంటున్నావని అడిగారు శంకరులు. సంవత్సరాలు తరబడి నోరు విప్పనివాడు, "అంతా ఒకటైనపుడు ఎవరని చెప్పను? అంతా కలయై యుండగా ఒక ప్రదేశాన్ని ఎట్లా పేర్కొనగలను? కలనుండి మెలకువ వచ్చిన తరువాత కలలో చూసిన ఏ ప్రదేశాన్ని పేర్కొనాలి?" అంటూ ఒక శ్లోకరూపంలో "నేను మానవుడుగాను, యక్షుణ్ణిగాను, నాల్గు వర్ణాలలో దేనికీ చెందను. నాల్గు ఆశ్రమాలలో చేరను. నేను నిజబోధ రూపుణ్ణి అనగా ఆత్మజ్ఞాన స్వరూపాన్ని" అని సమాధానం ఇచ్చాడు.

తండ్రి, తన పిల్లవాడు మాట్లాడుతున్నాడని సంతోషించి ఇంటికి తీసుకొని వెళ్ళాడు. ఇంటి దగ్గర మళ్ళీ మాట్లాడడం మానేసి ఉన్నాడు. మరల పూర్వధోరణిలో ఇతడుండడాన్ని గమనించి అయ్యో! ఇతడు నా కొడుకు కాదు, మీవాడే అని శంకరులకు అప్పగించాడు. ఇతనికి హస్తామలకుడని శంకరులు నామ కరణం చేశారు.

ఏదైనా పెద్ద పండును చేతిలో పెడితే దాని సమగ్ర స్వరూపం కనబడకపోవచ్చు గాని, ఒక ఉసిరికను పెడితే స్పష్టంగా దాని సమగ్ర స్వరూపాన్ని చూడగలం. గుండ్రంగా ఉంటుంది. నిమ్మకాయ కంటె స్పష్టంగా కనిపిస్తుంది. స్పష్టంగా, సమగ్రంగా తెలిసికొన్నదానిని హస్తామలకంలా ఉంది అని అంటాం. ఆత్మ స్వరూపాన్ని సమగ్రంగా అర్థం చేసుకొన్నవాడని ఆ పేరు పెట్టారు. ఇతడి శ్లోకాలపై గురువులే భాష్యం వ్రాసేరు.

పూరీ జగన్నాథ క్షేత్రంలో ఉన్న మఠంలో పీఠాధిపతిగా ఉంచారు. ద్వారకలో ఉంచారని కొందరి అభిప్రాయం.

తోటకుడు - గురుభక్తి

భావాద్వైతం కాని, క్రియాద్వైతం కాదని శంకరులన్నారు. అయితే ప్రతిదానిపట్లా భావాద్వైతం కుదరదు. ఎక్కడ? "అద్వైతం త్రిషులోకేషు" అని ఉంది. మూడు భువనాలలోనూ భావాద్వైతం ఉండాలి. అయితే గురువు పట్ల మాత్రం తానూ, గురువూ ఒకటని భావించకూడదు.

"నా ద్వైతం గురుణా సహ" (న+అద్వైతం=నాద్వైతం)

తానూ, భగవానుడూ ఒక్కటే అనుకోవచ్చు. అంతేనే కాని, నేనూ, గురువూ ఒకటని భావించకూడదు. గురువుని తనకంటె భిన్నంగా, గొప్పగా చూడాలి. గురువుతో ఇట్లా అనాలని అమ్మవారే చెప్పింది. మీరు వేరు, నేను వేరు, మీరు పాలకులు, నేను సేవకుణ్ణి, మీరు సముద్రం - నేనొక నీటి బిందువును అని అతణ్ణి సేవించాలని ఉంది.

తోటకునికి తల్లిదండ్రులు ఆ పేరు పెట్టలేదు. ఇతని అసలు పేరు ఆనందగిరి.

పైకి మూర్ఖునిలా కనబడేవాడు. శంకరుల చుట్టూ ఆరువేల మంది శిష్యులుండేవారు. వారికి పాఠాలను చెబుతూ ఉండేవారు. శిష్యులు చాలా తెలివైనవారు. ఆచార్యులు చెప్పింది శ్రద్ధగా విని అపుడపుడు సందేహ నివృత్తి చేసుకునేవారు. ఇతడేనాడూ గురువుని సందేహాలు అడుగలేదు. అందుచేత ఇతనిని మందబుద్ధిగా మిగతా శిష్యులు భావించారు.

ఒకనాడు ఇతడు పాఠానికి రావడం ఆలస్యమైంది. శంకరులు ఏడితడని ప్రశ్నించారు. అతని కోసం వేచియుండడం దండుగని, వచ్చినా, రాకపోయినా ఒక్కటే అని మిగిలిన శిష్యులు అన్నారు.

శిష్యులలో గర్వం పనికిరాదని, వారికొక గుణపాఠం చెప్పాలనుకున్నారు. ఆపైన ఇతనిపై వారికొక అపారమైన దయ యుండేది.

ఇంతలో తోటకుడు, నృత్యం చేస్తూ, శంకరులపై స్తోత్రం చేస్తూ వచ్చాడు. అప్రయత్నంగానే అతని నోటివెంట శ్లోకాలు వచ్చాయి. అవి తోటక ఛందస్సులో ఉన్నాయి. అవి ఎనిమిది శ్లోకాలు. దానినే తోటకాష్టకమని అంటారు. అందువల్ల ఇతడు తోటకాచార్యుడయ్యాడు.

అందొక శ్లోకాన్ని పేర్కొంటా. ఇతడు చెప్పినదాని కంటె ప్రత్యేకంగా నేను చెప్పేదేమీ లేదు. ఈ మధుర శ్లోకాన్ని అందరూ ఆస్వాదింతురుగాక. ఇది భక్తితో కూడినది, మనోల్లాసాన్ని కల్గిస్తుంది.

"జగతీమవతుం కలితా కృతయో
విచరంతి మహామహసః ఛలతః
అహిమాంశురివాత్ర విభాసి గురో
భవ శంకరదేశిక మే శరణం"

మహామహస్ అనగా పెద్ద జ్యోతి. అది అందరినీ అనుగ్రహిస్తుంది. చెడ్డ దారిలో జనులు వెళ్ళకుండా అట్టి జ్యోతిస్సులు మానవాకారం ధరించి యుంటాయి. కనుక మహస్. ఛలతః = ఒక మిషతో నిజరూపాన్ని కప్పుకొని వస్తారు. అట్టివారు మానవాకారంలో రావడం మనలను మోసగించడం కాదా? అసలు వారికీ వేషంతో పనేమి? తీర్థయాత్రలవల్ల వారికేమి లాభం? అయినా చేస్తారు. ఇదంతా ప్రజలకు మోసంగా కనబడడం లేదా?

వారు నక్షత్రాలు, గ్రహాలూ తిరుగుతున్నట్లుగా తిరుగుతూ ఉంటారు. అయితే సూర్యుడుదయిస్తే నక్షత్రాల కాంతి వెలవెలబోవడం లేదా? అట్లా వెలవెల పోకుండా వెలిగే వాటిల్లో మీరు సూర్యుని వంటివారని పొగడ్త.

"అహిమాంశురివ అత్ర విభాసి గురో"

అవి అన్నీ తిరుగుతూ ఉన్నట్లు కన్పిస్తాయి. కాని తిరగకపోయినా నక్షత్ర వీధి సంచారం ఉంటుంది.

మరొక సంగతి గుర్తుకు వస్తోంది. అగస్త్యో దయం కాగా మురికి నీటిలో మురికి అంతా పోతుంది. తేటగా నీళ్ళుంటాయి. అట్లాగే శంకరులనే సూర్యులుదయించగా మురికి ఐట్టిన బుద్ధులు కలవారికి తేటదనం వస్తుంది.

చివరి శ్లోకంలో నేను మూర్ఖుణ్ణి. నాకేమి తెలుసునని మిమ్ము గానం చేస్తున్నా? 64 కళలు తెలిసిన సర్వజ్ఞులు మీరు "విదితా నమయా విశదైకకలా" ఎంత విద్వాంసుడైనా సమగ్రంగా సత్యాన్ని తెలుసుకోలేదని అర్థం.

సర్వజ్ఞులైన ఆచార్యులు సర్వజ్ఞుడైన శంకరునితో "నాకేం తెలుసు? స్మృతులా? శాస్త్రాలా? వైద్యమా? కవిత్వమా? సంగీతమా? పురాణమా? శాస్త్రమా? ఏమీ తెలియకుండా నేను పశువులా ఉన్నానని, నీవు పశుపతివని, అందువల్ల నాపై దయ చూపించుమని అన్నారు. ఇదంతా నిజరూపాన్ని కప్పి పుచ్చి మనలను మోసం చేయడం కాదా!

అందుకే చివరి శ్లోకంలో నా బుద్ధితో మిమ్ము సంతృప్తి పరచలేను. డబ్బిచ్చి సంతృప్తి పరచలేను. "న కించన కాంచన మస్తి గురో" అయినా మీనుండి వచ్చిన అనుగ్రహమే నన్ను రక్షిస్తుంది. అన్ని వేళలా దానిని నాకిత్తురుగాక:

"ద్రుతమేవ విధేహి కృపాం సహజాం"

"భవశంకర దేశికమే శరణం" అని కాళ్ళమీద పడ్డాడు. శిష్యులందరూ ఈ దృశ్యాన్ని చూసి ఆనందాశ్చర్యాలను ప్రకటించి యుంటారు, ఆనందాశ్రువులను రాల్చి యుంటారు. ఎందుకంటే ఇవి ఇతని పట్ల దయతో కూడినవి. ఇన్నాళ్ళూ ఇతణ్ణి మూర్ఖుడని భావించాం. ఎంత పొరపాటు జరిగిందని బాధపడి యుంటారు. ఇతడు "శ్రుతిసార సముద్ధరణం" అనే గ్రంథాన్ని వ్రాసాడని అంటారు. అదీ తోటక ఛందస్సుతో ఉంటుంది.

ఇతణ్ణి జ్యోతిర్మఠానికి అధిపతిని చేసారు.

మరో ఇద్దరు శిష్యులు

వీరికి పై నల్గురే కాకుండా ఇంకా శిష్యరత్నాలున్నారు. అందిద్దర్ని పేర్కొంటాను. వారూ సురేశ్వరుని మాదిరిగానే వాదించి ఓడింపబడ్డవారే. తరువాత శిష్యులైనారు. అందొకరు శంకరుల కంటే పెద్ద కూడా. అతని పేరు పృథ్వీధరుడు. మరొకడు శంకరులకంటె చిన్నవాడు, సర్వజ్ఞాత్ముడు.

కంచిలో పీఠాన్ని ఆరోహించిన వెనుక చాలామంది శంకరులతో వాదాలు చేసారు. తామ్రపర్ణీనదీతీరం నుండి ఒక తండ్రి, ఏడేళ్ళ కొడుకు వచ్చారు. ఆ పిల్లవాని పేరు మహాదేవుడు. ఇతని తండ్రి పెద్ద మీమాంసకుడు. అయన బౌద్ధ జైనులతో వాదించినపుడు ఈ పిల్లవాడూ పాల్గొంటూ ఉండేవాడు. తండ్రి, శంకరులతో వాదించి ఓడిపోయినపుడు ఈ పిల్లవాడు నాల్గు రోజులపాటు శంకరులతో వాదించి చివరగా ఓడిపోయాడు.

వీరిచే ఓడింపబడ్డానని కుఱ్ఱవాడు కలత పడలేదు సరికదా, వీరిపట్ల భక్తితో ఉన్నాడు. సన్న్యాస దీక్ష నిమ్మని అడుగగా శంకరులు ఇచ్చారు.

శంకరులు సిద్ధి పొందడానికి ముందుగా సురేశ్వరుల పర్యవేక్షణలో ఇతడు కంచి మఠాన్ని అధిరోహించాడు. అందువల్ల సురేశ్వరులను గురువుగా భావించి ఆయనను 'దేవేశ్వరుడని' ఇతడు కీర్తించాడు.

ఈయన సన్న్యాసనామం సర్వజ్ఞాత్ముడు ఇతడు సంక్షేప శారీరకాన్ని వ్రాసేడు. ఇది శంకరుల శారీరక భాష్యాన్ని ఆధారంగా చేసుకుని వ్రాసినది. పేరులో సంక్షేపం (చిన్నది) అని యున్నా వేయి శ్లోకాలతో ఉంటుంది. శ్లోక రూపంలో అద్వైతం గురించి చాలా తక్కువ పుస్తకాలున్నాయి. ఇతడేకాదు, విద్యారణ్య స్వామివారొక అద్వైత గ్రంథాన్ని వ్రాసారు.

పంచ ప్రక్రియయనే అద్వైత గ్రంథాన్ని కూడా రచించాడు. మీమాంసపై ప్రమాణ లక్షణాన్ని వ్రాసేడు.

వ్యాస పూజలో ఇతణ్ణి కొలుస్తారు. వ్యాస పూజలో 30 మంది ఆచార్యులను కొలుస్తారు. అవి ఆరు పంచకాలుగా ఉంటాయి. ద్రవిడ పంచకంలో ఇతని పేరుంటుంది. ఈయనను సంక్షేప శారీరకాచార్యుడని సర్వజ్ఞాత్మముని అని కూడా కొలుస్తారు.

పృథ్వీధరాచార్యుడు, శంకరుల కంటే పెద్ద. శంకరుల ముందే చాలామంది సూత్రభాష్యాలు వ్రాసేరు. అవి అద్వైతానికి భిన్నంగా ఉంటాయి. ఈయన వ్రాసిన భాష్యానికి పృథ్వీధర భాష్యమంటారు. పృథ్వీధరుని భాష్యం, అభినవగుప్తుని భాష్యంతో కలిపి 99 మంది భాష్యాలను ఆచార్యులు ఖండించారని. తత్త్వ చంద్రికలో ఉంది. ఇందు పృథ్వీధరుణ్ణి పేర్కొనడం వల్ల ఈయన ఉన్నతస్థానం తెలుస్తోంది. తంత్రాలోకం, అలంకారశాస్త్ర వ్యాఖ్యానం వ్రాసిన అభినవగుప్తుడు గీతాభాష్యాన్ని కూడా వ్రాసాడు.

పృథ్వీధరుడు శంకరుల చేతిలో ఓడిపోయాడు. శిష్యుడయ్యాడు.

వంద సంవత్సరాల Aufrecht వెనుక అనే దొర మా మఠ తాళపత్ర పట్టికను తయారు చేసాడు. అట్లాగే జర్మనీలో ఉన్నవాటికీ, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఉన్నవాటికీ పట్టికలు తయారయ్యాయి. జర్మనీలో ఉన్న విశ్వవిద్యాలయ గ్రంథాలలో 'గురు పాదాది నమస్కారం' అనే గ్రంథం ఉంది. అందు పృథ్వీధరుని పేరుంది. శంకరుల శిష్యులతో బాటు ఇతని పేరూ ఉంది.

ఇంకా మరేదైనా పుస్తకం వ్రాసాడో లేదో తెలియదు. పై పట్టికనుండి 'ద్వాదశ మహావాక్య వివరణం' అనే తాళ పత్ర ప్రతి ఉన్నట్లు తెలిసింది. దానిని వైకుంఠ పురి వ్రాసేడు.

దీనిని బట్టి శంకరులు, దశ నామి సన్యాసి పద్ధతిని ప్రవేశ పెట్టారని, సన్యాసి పేరు చివర, దశనామి నామాలలో ఒకటి ఉందని తెలుస్తోంది. తీర్థ – ఆశ్రమ – వన – అరణ్య – గిరి– పర్వత– సాగర– సరస్వతి – భారతి –

పురి అనేవి దశనామి సంప్రదాయాలు. వీరందరూ పృథ్వీధరుని శిష్యులే అని యుంది.

"పృథ్వీధరాచార్యః తస్యాపి శిష్యాదశ"

వీరిని ఒక క్రమపద్ధతిలో పెట్టాదంటే అర్థమేమిటి? శంకరుల మనోగతానికి అనుగుణంగా వీరిని పరివిధాలుగా విభజించి కొన్ని సంప్రదాయాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. సిద్ధాంతం ఒక్కటైనా బాహ్య నియమాలలో కొద్దిగా భేదం ఉంటుంది. ఇందు కొందరు తెల్లని బట్టలు కట్టుకుంటారు. దండానికి వస్త్రానికి ఎట్లా ముడి వేయాలనే నియమాల వంటివి యుంటాయి.

ఈనాటికీ, అట్టి కట్టుబాట్లున్నాయంటే వీరి సంఘటనాశక్తి, కార్య నిర్వహణ సామర్థ్యం గొప్పదనే కదా.

పృథ్వీధరుణ్ణి శృంగేరీ పీఠాధిపతిగా చేసారని జర్మనీకి చెందిన పుస్తకాల పట్టికలో "శృంగేరీ పృథ్వీ ధరాచార్య" అని ఉంది.

ఇతణ్ణి పృథ్వీధర భారతియని కూడా అంటారు. శృంగేరిలోనున్నవారికి, భారతియని చివర ఉంటుంది. తీర్థ సంప్రదాయం వారూ ఇందున్నారు.

దిగ్విజయం - భారతీయ సమైక్యం

ఆరువేల మంది శిష్యులతో ఆసేతు హిమాచలం పర్యటించి 56 దేశాలలో ఉన్న విమతాలను ఖండించి వేదధర్మాన్ని ప్రతిష్ఠించారు. ఎవరినీ హింసించి కాదు. వారు జయశాలి.

72 మతాలున్నాయంటే ప్రజలు 72 వర్గాలుగా చీలిపోయారన్నమాట. వీరినందరినీ సనాతన ధర్మంవైపు మళ్ళించారు. దానిని పూర్తిగా నిర్వహించినవారు శంకరులు. ఇదంతా ఏ రాజుల యొక్క అండదండలు లేకుండా నిర్వర్తించగలిగారు. దీనినందరూ ప్రశంసిస్తున్నారు. ఆధునిక భావాలు కలిగిన నెహ్రూగారు. ఆయన వ్రాసిన 'Glimpses of world History' లో

"I have spoken about Kings and Royal Dynasties. But more than all these Kings and Emperors this young man from the south did more for national life. What is surprising in this is that without givivng room to emotions, intellectually he attracted even the ordinary people and not Brahmins or scholars"

నెహ్రూగారు చెప్పినది ముమ్మాటికీ సత్యమే. ప్రేమతో బుద్ధుడు ప్రజలను ఆకట్టుకుంటే బుద్ధితో వీరాపని చెప్పారు. తత్త్వం గురించి చెప్పేటపుడు భావావేశాలకు లోనుగాక శ్రుతి, యుక్తి, అనుభవాన్ని జోడించి ఒప్పించారు. ఆలయ పునరుద్ధరణ, పూజాపద్ధతులు, భక్తి స్తోత్రాల రచన – ఇదంతా ప్రేమతోనే చేసారు. ఇక్కడ భావాలకు ప్రాధాన్యం. భక్త్యావేశంతోనే వ్రాసేరు.

వారు ప్రేమ మూర్తులు కనుకనే వారిని 'కరుణాలయం' అంటారు. శుష్క వేదాంతియనడం సబబు కాదు. ప్రేమమూర్తియని మరువకూడదు. ఇక నెహ్రూ తన Discovery of India లో శంకరుల సమగ్ర స్వరూపాన్ని గుర్తించి వ్రాసినట్లు ఇట్లా ఉంది:

A Philosopher, a mystic and a poet all rolled into one. Among with all this instead of remaining aloof in a corner he acts in the practical way to bring about reforms and he was a great expert in this.

మఠాల నేర్పరచడంలో, తద్వారా మత సంరక్షణలో వీరు ఘటికులని అన్నారు నెహ్రూ. శంకరుల ముందు మఠవ్యవస్థ లేదు. మతం, తపశ్శక్తి ద్వారానే వృద్ధి పొందుతుందని గుర్తించండి. శంకరులు సనాతనవాదియైతే నెహ్రూ భౌతికవాది.

జాతీయ సమైక్యమనేది, యుద్ధాలవల్ల, రాజకీయాల వల్ల, ఆర్థిక సాంఘిక సంస్కరణల వల్ల సాధ్యమయ్యేది కాదు. భక్తిద్వారానే. అందరూ భగవంతుని సంతానమే అని భావించడం ద్వారానే ఇది సాధ్యం. వీరు జ్ఞాన, భక్తి స్వరూపులు కనుక దానిని సాధించగలిగారు.

కేవలం భక్తి జ్ఞానాల గురించి చెబితే సరిపోయిందా? పరస్పర ద్వేషాలు లేని, ఎక్కువ తక్కువలు లేని వర్ణాశ్రమ వ్యవస్థ వల్లనే ఇది సాధ్యమని భావించారు. ఇట్టి దానిని ఆధునిక సంస్కర్తలు గుర్తించరు. వారికి, వీరికీ గల తేడాను గుర్తించండి.

వారు తలపెట్టిన పనులేమీ చేయకుండా వారి పేరును స్మరిస్తూ జయంతిని జరుపుకున్నా ఏం లాభం?

మాకేమీ 6,000 మంది శిష్యులు లేరు. మేమూ తిరుగుతున్నాం. ఏదో ఒక మహాశక్తి, అందర్నీ నడిపించునట్లుగా మేమూ ధర్మప్రచారం చేస్తున్నాం. అయినా గట్టిగా చెప్పలేకపోతున్నాం. మమ్మల్ని చూసి విశాల దృక్పథం కలవారని మీరు పొగుడుతున్నారు.

ఈనాడు, చాలా కొద్ది సంవత్సరాలలోనే ఎంతో మార్పు వచ్చింది. ఆచారాలు సన్నగిల్లుతున్నాయి. పద్ధతి మార్చుకోండని చెప్పలేక పోతున్నాం. వారు శాస్త్ర ప్రకారం పాటిస్తూ భిక్ష, పూజలకై ప్రాకులాడకుండా శాస్త్ర విరుద్ధమైన ప్రదేశాలకు కూడా వెళ్ళి వాదించి, శత్రువులను మిత్రులుగా చేసుకొని, కొందరిని శిష్యులుగా తీర్చిదిద్ది, జగత్తునంతా ఒక కుటుంబంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నించారు.

శాస్త్రజ్ఞులతోనే చర్చలు. వారి సంఘసేవ విస్తృతమైనది. నరబలులిచ్చే వారిని, శరీరంపై తప్తముద్రలు వేసుకునేవారినీ సంస్కరించారు.

ఉగ్రమూర్తులను సౌమ్యమూర్తులుగా మార్చుట

ప్రజలలో క్రూర మార్గాలను మాన్పించడమే కాదు, ఉగ్రరూపంలో నున్న దేవతా మూర్తులను కూడా సౌమ్యమూర్తులుగా తీర్చిదిద్దారు. ఆనాడేమి జరిగింది? ప్రజలు ధర్మమార్గాన్ని విడిచి పెట్టారని, అసత్ ప్రవర్తనతో ఉన్నారని ఆలయాలలోని దేవతామూర్తులు కోపగించాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో

ఇట్లా జరిగింది. దయ చూపించే అమ్మవారే ఉగ్ర స్వరూపురాలైంది. శంకరుల గొప్పదనాన్ని చూపడం కోసం అవి ఉగ్రరూపాన్ని ధరించాయా? కాదు. కాని మంత్ర శాస్త్ర మహిమను లోకానికి చాటాలని అనేక యంత్రాలను స్థాపించి సౌమ్య మూర్తులుగా వారిని తీర్చిదిద్దారు.

కంచిలో, కామాక్షి ఉగ్రంగా ఉంటే ఆమె ముందు శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించి చల్లని తల్లిగా చూపించారు. ఆమెకు సాహాయ్యంగా ఎనిమిది దిక్కులలో ఎనిమిది శక్తులుండగా వారిని శ్రీచక్రంలో నియంత్రించారు. అందుకే ఉగ్రరూపంలో ఉన్న ఉత్సవ మూర్తిని ఊరేగించినపుడు ఒక నిముషం శంకరుల సన్నిధిలో వారి అనుమతి తీసుకున్నట్లుగా ఉంచి మరల కదులుస్తారు.

జంబుకేశ్వరంలోని అఖిలాండేశ్వరి కూడా ఉగ్రంగా ఉంటే ఆ ఉగ్రకళను తాటంకంలో బంధించి వాటిని రెండు చెవులకు ఆభరణాలుగా చేసియుంచారు. అట్లాగే కొల్లూరులోని మూకాంబికకు, అస్సాంలోని కామాఖ్యకు కూడా.

తిరువెట్రియూర్‌లో (చెన్నై) కూడా అమ్మవారిని త్రిపురసుందరిగా చూపించారు. ఆ ఉగ్రకళను ఒక నూతిలో బంధించారు. సంవత్సరానికి ఒకరోజున ఆ మూర్తికి పూజ కూడా ఏర్పాటు చేయించారు.

ఎక్కడ ఇట్లా చేసినా అక్కడ వైదికమైన అర్చనా పద్ధతినే ప్రవేశపెట్టారు. అక్కడ ఆగమ విధానానికి ప్రాధాన్యం కాక వైదికమైన పద్ధతే ఉంటుంది. ఆది శైవులు (గురుక్కుల్) వారు, స్మార్త బ్రాహ్మణులే అర్చకులుగా ఉంటారు.

ఆచారాలను పాటించడంలో నంబూద్రీలు నిష్ణాతులు. వీరిని చాలాచోట్ల అర్చకులుగా నియమించారు. తిరువొత్రియూర్‌లో, బదరిలోని అర్చకులు కేరళలోని నంబూద్రీ బ్రాహ్మణులే. బదరిలోనున్నవానిని 'రావల్' అని గౌరవసూచికంగా పిలిచి రాచమర్యాద చేస్తారు.

కొన్నిచోట్ల దేవాలయ పునరుద్ధరణలు చేసారు. గురువయూర్‌లో శంకరులేర్పాటు చేసిన పూజా పద్ధతియే నేటికీ ఉంది.

పంచాయతన మూర్తులు

చాలామంది ఒక్కొక్క ఇష్టమైన మూర్తిలోని కొలుస్తూ ఉంటారు. శంకరులు అందరి మనస్తత్వాలకు అనుగుణంగా భిన్న దేవతలపై స్తోత్రాలు చేసారు. వారు వ్రాసిన ప్రపంచ సారతంత్రంలో భిన్న దేవతల పూజా పద్ధతులున్నాయి. ఈశ్వర, శక్తి, విష్ణు, సూర్య, గణపతి, సుబ్రహ్మణ్యులు ఆర్గురు మూర్తులు. అందుకే షణ్మతస్థాపనాచార్యులైనారు. స్మార్తులకు, ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అనే భేదం ఉండకూడదు. కనుక వారికి పంచాయతన పూజ ఏర్పాటు చేసారు. ఈ విషయం, మార్కండేయ సంహితలో ఉంది.

ఇందు తమ ఇష్టదైవాన్ని మధ్యలో పెట్టి మిగిలిన మూర్తులను నాల్గు దిక్కులా ఉంచుతారు. ఏ కోణంలో ఏ మూర్తిని పెట్టాలో కూడా చెప్పారు. మా మఠంలో చంద్రమౌళీశ్వర లింగం, మధ్యలో ఉంటుంది. అమ్మవారిని ఒకమూల ఉంచకుండా, అయ్యవారి ప్రక్కనే ఉంచుతారు. అనగా ఆమెకు సమ ప్రాధాన్యమిచ్చినట్లే.

ఈ ఐదు మూర్తులూ ఐదు రాళ్ళ రూపంలో ఉంటాయి. అంతేనేకాని కన్నులు, ముక్కులూ ఉన్న మూర్తులు కావు. విష్ణుమూర్తి యొక్క శిల, నేపాల్‌లోని గండకీ నదిలో దొరుకుతుంది. అమ్మవారి స్వర్ణ రేఖాశిల, గూడూరు దగ్గర స్వర్ణముఖీనదిలో లభిస్తుంది. గణపతి శిల, శోణ భద్రలోని ఎర్రని శిలయే. తుంగభద్ర అన్నట్లుగా శోణభద్ర. అది శోణ్ నది. ఈ నది గంగలో కలుస్తుంది. సూర్యమూర్తి, స్ఫటికాకారంలో ఉంటుంది. ఈ స్ఫటికాన్ని త్రవ్వి తీయనవసరం లేదు. ఇది తంజావూర్‌లో వల్లం దగ్గర సరస్సులో లభిస్తుంది.

ఈశ్వర లింగం ('బాణం',) నర్మదలో లభిస్తుంది. నర్మద, భారతదేశం మధ్యలో ప్రవహిస్తుంది. అది ప్రపంచానికే గుండె వంటిది. అక్కడ సహజంగా ఈశ్వరుడు లింగాకారంలో ఉంటాడు. అందువల్ల ఈశ్వరుణ్ణి మధ్యలో ఉంచి శంకరులు పూజించారేమో!

కాని మా మఠంలోని చంద్రమౌళీశ్వరుడు బాణం కాదు, స్ఫటిక లింగమే. ఆ కథ తరువాత చెబుతా.

ఇట్లా నేపాల్ నుండి, తంజావూర్ వరకూ దొరికిన శిలలను దేవతామూర్తులుగా భావించి యావద్భారతాన్ని మన ఇంటికే తెచ్చినట్లయింది.

భారతదేశం మధ్యలోనున్న బాణలింగం, నాల్గు దిక్కులా జ్యోతిర్లింగాకారంలో ఉన్నాడు. సోమనాథ్, శ్రీశైలం, ఉజ్జయిని, ఓంకారం, మాంధాత (నర్మదా నదీతీరంలో) పర్లి, నాగేశం, కాశి, భీమ శంకరం, రామేశ్వరం, త్ర్యంబకం (నాసిక్ దగ్గర), కేదార్ నాథ్, ఘుశ్మేశ్వర్ (ఎల్లోరా)లలోని 12 క్షేత్రాలలో ఈశ్వరుడు జ్యోతిర్లింగాకారంలో ఉంటాడు. శంకరులు జ్యోతిర్లింగాలను అన్నిటినీ దర్శించి ఒక్కొక్క లింగానికి ఒక్కో స్తోత్రం చేసారు. అది మొత్తం ద్వాదశ జ్యోతిర్లింగ స్తోత్రం అని ప్రసిద్ధి. ఇట్లా నలుమూలలా భక్తిరస ప్రవాహంతో ముంచెత్తారు.

అందర్నీ, అద్వైతులుగా కేవలం తీర్చిదిద్దలేదని, అందరినీ పంచాయతన పూజా పరాయణులుగా తీర్చిదిద్దారని ఒక చక్కని మాట ఆనందగిరీయంలో ఉంది.

వీటితో నిత్య కర్మల ఆవశ్యకతను బోధించారు. శ్రౌత స్మార్తకర్మలకు ప్రాధాన్యం ఇచ్చారు.

ఇట్లా కర్మ, భక్తులలో ఆరితేరితే జ్ఞాన మార్గంలోకి అడుగు పెట్టడానికి అవకాశం వస్తుందని, బోధించారు. స్వధర్మకర్మయే ఈశ్వరునికి పూజ చేయడం, ఈశ్వరార్పణ చేయడం. సోపాన పంచకంలో 'కర్మ స్వనుష్ఠీ యతాం' అని చెప్పి వెంటనే 'తేనేశస్య విధీయతామపచితిః' = ఈ కర్మాచరణమే ఈశ్వర పూజయగుగాక అని చెప్పారు. ఇదే నిష్కామ కర్మ యోగం. ఇందు కర్మఫలాలు ఈశ్వరునకు అర్పింపబడతాయి. అతడు ఫలదాత. అందువల్లనే 'పరమేశ్వర ప్రీత్యర్థం', 'జనార్దనః ప్రీయతాం' అనే మాటలను ప్రతికర్మ చివరా అంటున్నాం.

ఇట్లా రెండూ అనడం, అనగా మొదట్లో ఈశ్వరుడు, తరువాత జనార్దనుడని అనడం వల్ల శివవిష్ణు భేదాన్ని తొలగించినట్లే కదా! పరమేశ్వర ప్రీత్యర్థం అనే సంకల్పం శంకరులనుండే మొదలైందని లోగడ ఉపన్యాసాలలో చెప్పాను.

అన్ని స్థాయిలలో అందరికీ జగద్గురుత్వం

వీరిని 'అద్వైత జ్ఞాన మార్గాచార్య' అని అంటూ ఉంటారు. అది సరికాదు. ఇది కేవలం నివృత్తి మార్గంలో ఉన్నవారికే. అందరూ అట్లా ఉండలేరు. సామాన్యులందరికీ కర్మ, భక్తులను బోధించి చివరకు జ్ఞానమార్గాన్ని చేరుకోవాలన్నారు. మిగిలిన సిద్ధాంతులకూ వీరికీ గల భేదాను గమనించండి. మిగిలినవారు, తమ సిద్ధాంతాలను ప్రచారం చేసారే గాని, సామాన్య జనులందరికీ ఉపయోగించే ప్రక్రియను చూపలేదు. కాని సామాన్య జనులనుద్దేశించి అనేక మార్గాలను అందించారు శంకరులు.

వీరందరికీ చెందినవారు. కేవలం విద్వాంసులకే పరిమితులు కారు. అన్ని మార్గాలలోనూ ఒక్కొక్క దశలో పయనించాలని, అద్వైతమనే గమ్యాన్ని మరువకూడదని అన్నారు. అన్ని మార్గాలకు వేద శాస్త్రానుగుణంగానే ఉండేటట్లు తీర్చిదిద్దారు.

మతాలపై సంక్షిప్త వివరణ

ఆత్మ, పునర్జన్మ, స్వర్గం, మోక్షం వంటివి వట్టి మాటలని జీవితాన్ని సుఖంగా అనుభవించడమే లక్ష్యంగా చెప్పింది చార్వాక మతం.

భౌతిక వాదం, ఆధ్యాత్మికవాదం అనే మాటలు వట్టివని, అంతా కల్పనయని, అంతా శూన్యమని చెప్పేది బౌద్ధం.

ఇక జైనులు అర్థ బౌద్ధులు. వీరిని శంకరులు అర్ధ వైనాశికులని అన్నారు.అంతా శూన్యమని బౌద్ధులనగా కావచ్చు, కాకపోవచ్చు అనే ధోరణిలో

వీరి సిద్ధాంతం సాగుతుంది. శరీరాన్ని అన్నివిధాలా శుష్కింపచేయాలని, అపుడాత్మనుండి కర్మను అట్లా విడదీయాలని వీరంటారు. దానిని Stoicism అంటారు. అనగా సుఖదుఃఖాల వలన వికారం పొందని స్థితి.

ఇక మీమాంసకులకు భక్తి లేదు, ఈశ్వరుడు లేడు, కేవలం వైదిక కర్మలనే చేయాలంటారు. సాంఖ్యయోగాలు, అద్వైతంలా కనబడినా పెక్కుమంది జీవులుంటారని అందువల్ల ద్వంద్వస్థితియని అంటారు. న్యాయ వైశేషికాలు కేవలం బుద్ధికి సంబంధించిన సిద్ధాంతాలు.

అన్ని సిద్ధాంతాలూ బుద్ధినుండి ప్రభవించినవే. ద్వైత, విశిష్టాద్వైతాలు కేవలం భక్తికే ప్రాధాన్యం ఇస్తాయి. వీరు ప్రేమకు, భక్తికి ప్రాధాన్యం ఈయగా పైవారందరూ బుద్ధికే ప్రాధాన్యం ఇస్తారు.

అయితే అద్వైతం ఏమంటోంది? ఇది ఒక ప్రత్యేక సిద్ధాంతమనే చట్రంలో ఇమడదు. జీవుడు, బ్రహ్మము వేరు కాదని, బ్రహ్మము నిరాకార నిర్గుణమని అద్వైతం చెబుతుందని అన్నా జీవుడు, సచ్చిదానందునిగా మారే దానిని గురించి చెప్తుతుందని అనడం సబబు.

ఇది జ్ఞాన మార్గం ప్రవచించిందని అన్నా, అది కేవలం బుద్ధి వల్లనే సాధ్యం కాదని, అభ్యసించిన దానిని, ఆంతరంగికంగా అనుభవంలోకి వచ్చినపుడు పట్టుబడినట్లని చెబుతుంది.

ఇందు చివరిదశలో మనస్సుండదు. ఆనందానుభవమే. దానినెట్లా వివరించగలం? అయితే ఇది కర్మమా? అట్లాగూ చెప్పలేం.

పై సిద్ధాంతాలలో ఒకటి జ్ఞానానికి, ఒకటి ప్రేమకు, ఒకటి కర్మకు ప్రాధాన్యం ఈయగా అద్వైతాన్ని శాంతమందామా? ఇది మామూలుగా మనమనుకునే శాంతి కాదు. అద్వైత శాంత స్థితిలో ప్రేమ, క్రియలు, అన్నీ సంపూర్ణ వికాసంతో, శక్తితో ఉంటాయి. అందుకే శంకరులు సర్వజ్ఞులై అందరిపట్లా ప్రేమను చూపిస్తూ నిరంతరం కార్యమగ్నులైనట్లుంటారు.

బ్రహ్మము అసత్యమని, జగత్తు సత్యమని చార్వాకం చెప్పగా, ఈ రెండు అసత్యములని బౌద్ధం చెప్పింది. బ్రహ్మము, జగత్తు సత్యమని న్యాయశాస్త్రం అంటోంది. జగత్తు అసత్యమని, అది ప్రకృతివల్ల ఏర్పడిందని బ్రహ్మము అనగా పురుషుడే సత్యమని సాంఖ్యంచెప్పింది.

అయితే అద్వైతం మాటేమిటి? సామాజిక, రాజకీయ, మత విశ్వాసాలను తెలిపే నామవాచకాల చివర చేర్చు పదభాగం వంటిది కాదు. అనగా సోషలిజం, బుద్ధిజమ్ వంటిది కాదు. దీనిని Non-dualism అన్నా సంపూర్ణార్థాన్ని ఈయదు.

బ్రహ్మమే సత్యమని, జగత్తు మిథ్యయని అనగా అసత్యమని చెబుతుంది. అయితే అంతా అసత్యమా? కాదు. జగత్తు అసత్యమైనా జ్ఞానం కలిగేటంత వరకూ సత్యంగానే కన్పిస్తుంది. ఆ మాట గుర్తించండి. అంటే జగత్తు కనుమరుగు కాదు. అసత్యమైనదిగానే జ్ఞాని భావిస్తాడు. అంతేకాదు, సమదృష్టితో జగత్తును సత్యమైన బ్రహ్మముగా చూస్తాడు. బ్రహ్మమే సత్యమని; జగత్తును బ్రహ్మ సత్యమని చూస్తాడు.

బౌద్ధంలో, మీమాంసలో సగుణ బ్రహ్మమైన ఈశ్వరుడు లేడు; నిర్గుణ బ్రహ్మమూ లేదు. సాంఖ్యంలో సగుణ బ్రహ్మము లేదు. యోగ, న్యాయ, వైశేషికాలలో సగుణ నిర్గుణ బ్రహ్మల ప్రస్తావన యున్నా ఒకదానికి మరొక దానికి సంబంధం చెప్పకుండా, జీవ జగత్తులకు సమన్వయించకుండా ఉంటాయి. భక్తి సిద్ధాంతాలలో కేవలం సగుణ బ్రహ్మయే ఉంటాడు. నిర్గుణ బ్రహ్మము గురించి ఎత్తుకోరు.

అద్వైతంలో రెండూ ఉన్నాయి. మాయ యనగా జడ ప్రకృతి, ప్రపంచాన్ని బ్రహ్మము నాధారంగా చేసుకుని సృష్టిస్తోందని అంటుంది. అనగా నిర్గుణ బ్రహ్మము, సగుణంగా మాయతో మారి జగత్తును చూపిస్తోందని అంటుంది. ఇట్లా నిర్గుణ సగుణ బ్రహ్మలకు, జీవ జగత్తులకు సమన్వయం ఉంటుంది.

ఇక సృష్టి గురించి - జగత్తును, ఈశ్వరుడు సృష్టించడమేమిటి? జగత్తు అనాదిగా ఉందని, కర్మలు చేస్తే ఫలాలు వస్తాయని మీమాంసకులంటారు.

జడ ప్రకృతిలోనున్న సహజ శక్తియే నడిపిస్తోందని చార్వాకులంటారు. ఇక స్వామి లేదు, కర్మలవసరం లేదు. కర్మ ఫలాలూ వట్టిమాటయని అంటారు. న్యాయ వైశేషికాలు జగత్తంతా అణుమయమని, ఈశ్వరుడు వీటిని కలుపుతున్నాడని, క్రొత్త వాటిని సృష్టిస్తున్నాడని అంటాయి. దీనిని ఆరంభ వాదమని అంటారు. సాంఖ్య, యోగాలు, సృష్టికి, ఈశ్వరునకు సంబంధం లేదని క్రొత్తవాటిని సృష్టించడం అంటూ లేదని అంటాయి. ప్రకృతి (మాయ) ప్రపంచంగా మారిందని దీనిని పరిణామవాదమంటారు.

అద్వైతం ఏమంటుంది? నిజమే లేనిదానిని సృష్టించడం అంటూ ఉండదు. అణువూ సత్యం కాదు, వీటిని కలపడం వల్ల జగత్తు ఏర్పడిందని అనడమూ తప్పే. పరిణమించడం అంటూ లేదు. అదే నిజమైతే మొదటి ప్రకృతి, కనుమరుగు కావాలి కదా! కనుక సృష్టి లేదు, మార్పులేదు. అయితే ఏమిటి? ఒక వస్తువు, మరొక వస్తువుగా అనగా చీకట్లో త్రాడు, పాముగా కనబడడమే జరుగుతోంది. అట్లా బ్రహ్మము, జగత్తుగా కన్పిస్తోంది. దేనివల్ల? మాయవల్ల. మరొక విధంగా చెప్పాలంటే మాయతో కూడిన నిర్గుణ పరబ్రహ్మము, సగుణ బ్రహ్మమై జగత్తుగా కన్పింపచేస్తున్నాడు. చీకట్లో త్రాడు, పాముని సృష్టించలేదు. ఇక త్రాడు, పాముగా మారలేదు. అట్లా జగత్తు సృష్టింపబడలేదు. పరిణామం చెందనూ లేదు. అట్లా కేవలం కన్పిస్తోంది. దీపం తీసుకుని వచ్చినపుడు చీకటి పోతోంది. త్రాడును, పాముగా చూడడమూ పోయింది. అట్లే జ్ఞానం కలిగినపుడు చీకటియనే మాయలేదు. ఇంతకుముందు జగత్తుగా కనబడినది, బ్రహ్మమే అనే అనుభూతి కల్గుతుంది.

సృష్టి లేకుండా, పరిణామం లేకుండా కేవలం ఇట్లా కనబడడాన్ని వివర్త వాదమంటారు.

ఒక ఎర్రని పువ్వును స్ఫటికం దగ్గర పెట్టామనుకోండి. స్ఫటికం, ఎర్రగా కనబడదం లేదా? సత్యమైన వస్తువు లేకుండా ఇట్టి భ్రాంతులు కలగవనే మాటను గుర్తించండి. ఇట్లా బ్రహ్మమునందు ఆరోపింపబడిన జగత్తు, అసత్యము. అజ్ఞానంలో దేనిని సత్యమని భావిస్తున్నాడో జ్ఞానం కలిగిన తరువాత అది అసత్యమైపోతుంది. దానిని ప్రాతిభాసిక సత్యమన్నారు. ఎండలో ఆలుచిప్ప వెండిగా కనబడినట్లు. (మనకనుభవంలో ఉన్న సత్యం, కొంతకాలమే ఉంటుంది. అనగా వ్యావహారిక సత్యం. నిత్య సత్యం, పరబ్రహ్మమే. వ్యావహారిక సత్యం ఇళ్ళూ వాకిళ్ళూ వంటివి. కొంతకాలం ఉండి కనుమరుగై పోతుంది).

ఇట్లా భేదాలను వివరించాను. అయితే భిన్న మతాలలోని కొన్ని సూత్రాలను గ్రహించింది అద్వైతం. మీమాంసనుండి కర్మను; బౌద్ధులనుండి జగత్తు యొక్క అసత్యాన్ని; భక్తి సిద్ధాంతాన్ని; అట్లాగే న్యాయ, వైశేషిక, సాంఖ్యయోగాలలోని విషయాలను తగువిధంగా స్వీకరించింది. గీతాభాష్యంలో సాంఖ్యం గురించి చెబుతూ, వారిసిద్ధాంతంతో విభేదించినా వారు చెప్పిన త్రిగుణాల వల్ల (సత్త్వ రజస్తమోగుణాలు) జీవుడు సంతోషిస్తున్నాడనే మాటను స్వీకరిస్తున్నామని అన్నారు. మీమాంసనుండి ఆరు ప్రమాణాలను స్వీకరించింది.

వీరి యోగ తారావళిని చూస్తే, యోగాభ్యాసాన్ని వీరంగీకరించినట్లే. ఇట్లా అన్ని సిద్ధాంతాలూ అద్వైతానికి దోహదం చేసాయి. ఒక దశలో మిగిలిన వారు చెప్పినవి స్వీకరింపదగినవే అని వీరి అభిప్రాయం. వాటిని అనుసరిస్తూ లక్ష్యమైన అద్వైతాన్ని విస్మరించవద్దని అన్నారు. ఇది వీరి నిశ్చితమైన అభిప్రాయం.

అన్ని శాస్త్రాలను పరిశీలించారు. ద్వేషభావాన్ని ప్రకటించలేదు. ఉదాహరణకు, అమరసింహుని కథ చెబుతా. ఇతదు జైనుడు. శంకరుల చేతిలో ఓడిపోయి తాను వ్రాసిన గ్రంథాలను తగుల బెట్టాడు. అరెరె!

సిద్ధాంతాలను లేకుండా చేయడమేమిటని శంకరులక్కడికి వెళ్ళారు. అతని చేతిలో 'అమరకోశం' ఒక్కటే ఉంది. అది సంస్కృత నిఘంటువు. దీనిని అగ్నిలో వేయకుండా ఆ పుస్తకాన్ని రక్షించగలిగారు.

అయితే వీరు నిర్మూలించిన 72 మతాల గ్రంథాలూ కనబడడం లేదు. వీరికి ముందు వ్రాసిన వారి సూత్ర భాష్యాలూ దొరకడం లేదు. అట్లా అని వాటిని తగుల బెట్టారనే భ్రాంతి పడవద్దు సుమా! పైవారి అనుయాయులే వీరు వచ్చిన తరువాత వాటిని లేకుండా చేసియుండవచ్చు.

ఎందుకిట్లా చెబుతున్నానంటే అద్వైతి అట్టి పని చేయడు. విద్యారణ్య, అప్పయ్య దీక్షిత, వాచస్పతి మిశ్ర వంటివారు అద్వైత దిగ్గంతులు. అయినా వారికి భిన్నమైన సిద్ధాంతాలపై వ్యాఖ్యలు వ్రాసేరు. ఇది స్పష్టాతి స్పష్టం.

మరొక చిత్రమేమిటంటే అద్వైతులు కానివారు, భక్త్యావేశంలో అద్వైత సత్యాలను అప్రయత్నంగా పలికారు. బౌద్ధిక స్థాయిలోనే వారు అద్వైతాన్ని ఎదుర్కొన్నారు.

కవులు, రచయితలే కాదు, ఆధునిక కాలానికి చెందిన ఐన్‌స్టైన్, సర్ జేమ్సు జీన్సు వంటివారి రచనలలో అద్వైత వాసనయే కనబడుతుంది. ఒకే శక్తి, భిన్న పదార్థాలుగా కన్పిస్తోందని అనలేదా? శక్తికి, ద్రవ్యానికి అభేదాన్ని ప్రతిపాదించారు కదా. సాపేక్షిక సత్యం అని సైన్సు అనగా అద్వైతులు దానిని ప్రాతిభాసిక సత్యమన్నారు. అన్ని మతాల సారాంశమైన అద్వైతాన్ని అందించారు. మతానికి విరుద్ధం అనబడే సైన్సులోనూ అద్వైత సత్యం ఉంది.

శంకరులంటేనే ప్రేమ, అనురాగం, సంతోషం. ఇట్లా జగత్తునకు అన్నిటినీ సమకూర్చారు.

అందరినీ ప్రేమతో బంధించారు. వీరిపై ఏవో పరిశోధనలు చేసి ఆ పేరుతో ఏదో వ్రాయడం కంటె వీరి సమన్వయ ధోరణిని గుర్తించండి. మనమూ

వారి సిద్ధాంతానుగుణంగా పరస్పరం ప్రేమించుకుంటే ఇంక కావలసినది ఏముంది?

శంకర మఠాలు

సిద్ధాంతాలు కలకాలం ఉండాలని మఠాలను స్థాపించారు. శిష్యులనందుంచారు. ఇవి అద్వైత సిద్ధాంతాన్ని మాత్రమే బోధించేవి కావు. సిద్ధాంత ప్రచారానికి ప్రత్యేక వ్యక్తులుంటారు. సామాన్య ప్రజలలో కర్మానుష్ఠానం, భక్తి, వేద శాస్త్రాలపై విశ్వాసం, శాస్త్ర సందేహాలను నివారించుట మొదలైన పనులుంటాయి.

ప్రసిద్ధమైన ఐదు మఠాలనే కాక ఎన్నిటినో స్థాపించి యుంటారు. విదేశీయుల దండయాత్రలలో అవి నేలమట్టమై పోయి ఉండవచ్చు. కాశిలోని విశ్వనాథ ఆలయాన్ని ఎన్నిసార్లు కూలగొట్టారు? ఎన్నిసార్లు మన వాళ్ళు పునరుద్ధరించారో తెలుసు కదా. అట్లాగే అయోధ్య, మథురలలో కూడా జరిగింది.

అట్లా ఎన్నో మఠాలు నేడు కనబడడం లేదు. మొత్తం దేశంలో ఐదు మఠాలున్నట్లుగా కాశీలోనే ఐదు మఠాలు, త్రిచూర్‌లో ఐదూ ఉన్నాయి.

గత శతాబ్దంలో ఇంద్ర పరంపరంలో ఉండే స్వాములు కాశీలో ఉండేవారు. శివాలయ ఘాట్‌లోని బ్రహ్మేంద్ర మఠంలోని శాసనంతో వీరి ప్రస్తావన ఉంది. చంద్రశేఖర స్వామి యొక్క శిష్యుడైన విశ్వనాథ స్వామి గురించి యుంది.

కాశీలో సుమేరు మఠమని, పాదుకా మఠమని ఉన్నాయి. వీటిని పునరుద్ధరించాలని చాలామంది స్వాములు, పండితులు విజ్ఞప్తి చేస్తూ కాశీలో శంకరులు కొంతకాలం ఇక్కడ ఉన్నారని చెప్పబడింది.

గత శతాబ్దంలో ప్రచురింపబడిన Light of the East సంపుటాలలోని ఒక సంపుటంలో శంకరులు జ్యోతిర్మఠమే కాక, గంగోత్రిలోనూ ఒక మఠాన్ని స్థాపించినట్లుంది. గోరఖ్ పూర్‌లోని గీతా ప్రెస్‌వారు ప్రకటించిన తీర్థాంక్‌లోని ఉపోద్ఘాతంలో గంగోత్రి మఠం, సుమేరు మఠాల గురించి యుంది.

త్రిచూర్‌లో ఐదు శంకర మఠాలున్నట్లు కొచ్చిన్ స్టేట్ మాన్యువల్ అనే పుస్తకం ప్రచురించింది. ప్రస్తుతం రెండే ఉన్నాయి. ఇందున్న దక్షిణ మఠంలో ఈ పీఠాన్ని 80 మంది అధిరోహించినట్లుంది. ఉత్తర మఠం, ఈనాడు బ్రహ్మస్వమఠంగా పిలువబడి, అది వేద పాఠశాలగా మారింది.

పూరీ జగన్నాథంలో ప్రధానమైన గోవర్ధన మఠంతో బాటు శంకరానంద మఠం, శివతీర్థమఠం, గోపాల తీర్థమఠాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ అద్వైత సంప్రదాయానికి చెందినవే.

ఇక విద్యారణ్య స్వామివారు, క్రొత్త మఠాలను స్థాపించారని, పాత వాటిని పునరుద్ధరించారని 'నవమాది నాథులు' అనే బిరుదు వారికి వచ్చిందని కన్నడ ప్రాంతంలో, దానికి చేరువగానున్న తెలుగు ప్రాంతంలో అంటారు. పై తీర్థాంక్‌ని బట్టి కర్ణాటక, ఆంధ్ర, కేరళ, మహారాష్ట్ర ప్రాంతాలలో 15 మఠాలున్నట్లు తెలుస్తోంది. దాని భూమికలో ఇవే కాకుండా రామేశ్వరం, శ్రీశైలంతో కలిపి 21 మఠాలున్నట్లు తేలింది.

పై మఠాలు శంకరుల శిష్యుల పేర్లతో ఉన్నాయి. త్రిచూర్ మఠాలను పద్మపాదుడు, సురేశ్వరాచార్యులు స్థాపించారని అంటారు. జ్యోతిర్మఠానికి అనుబంధంగా శకటపురం మఠాన్ని తోటకాచార్యులు స్థాపించినట్లుంది.

ఇట్లా పరిశోధన చేసినకొలదీ ఎవరే మఠాన్ని స్థాపించారనే విషయం తెలియవచ్చు. అయినా ఇట్టి పరిశోధన, జ్ఞానాన్ని గాని, భక్తిని గాని కలిగించదు. చాలావాటిని శంకరులు స్థాపించి యుండవచ్చు. ఇట్లా శంకరులు లేదా వారి శిష్యులు స్థాపించి యుండవచ్చు.

మాతృ మరణం

వీరి మాతృమూర్తికి చివరి ఘడియలలు రానే వచ్చాయి. అంత్యక్రియలను చేస్తానని మాట ఇచ్చారు కదా. గ్రహించి కాలడి వచ్చారు. స్తోత్రాలను వినిపించారు. అద్వైత ముక్తి రావాలనే వీరు కోరారు. అయితే ఆమెకది దక్కలేదు. అందువల్ల శివసంబంధ స్తోత్రాలను పఠించారు.

కైలాసం నుండి భూత గణాలు రాగా ఆమె భయపడింది. విష్ణు స్తోత్రమైన కృష్ణాష్టకాన్ని పఠించగా విష్ణు దూతలు వచ్చినట్లు, ఆమెకు వైకుంఠ ప్రాప్తి కల్గినట్లు ఐతిహ్యం.

అంత్య క్రియలు చేయబోతే అక్కడున్న పండితులు సన్యాసికి ఇట్టి అర్హత లేదని ఎదుర్కున్నారు. వారు సహకరించలేదు.

అందుచేత వీరు మాతృశవాన్ని ఇంటి పెరటిలోనికి తీసుకొని వెళ్ళి అంత్యక్రియలు జరిపారు. ఈనాటికీ నంబూద్రీలు అట్లా చేస్తారు.

అక్కడ రెండు కుటుంబాల వారు వీరికి సహాయానికి వచ్చారని, ఇంటి పెరడులోని శరీరం తలదగ్గర, కాళ్ళ దగ్గర వారు నిలబడ్డారని అంటారు.

భారత యాత్ర

రామేశ్వరం నుండి కైలాసం వరకూ యాత్ర సాగించారు. ద్వాదశ లింగ క్షేత్రాలను దర్శించారని చెప్పాను కదా. తిరువనంతపురం (అనంత శయనం) వెళ్ళి అక్కడున్న వైష్ణవులను అద్వైతులుగా మార్చారు.

ప్రాత మైసూర్ రాష్ట్రంలో ఒక విష్ణు క్షేత్రముంది. అందున్న అర్చకులు వీరి ప్రవేశాన్ని అడ్డుకున్నారు. నన్నొక మారు దర్శనం చేయనీయండి, తరువాత మీతో వాదిస్తానని అన్నారు. తరువాత చూడగా మూర్తిలో కుడివైపు శివమూర్తి కనబడ్డాడు. క్షమించండని వీరిని అర్చకులు గౌరవించారు. అదే హరిహర

క్షేత్రమైంది. మదురైలో మీనాక్షి సుందరేశ్వరులను దర్శించుకొని అమ్మవారిపై పంచరత్న స్తోత్రం చేసారు. అందున్న విద్వాంసులను అద్వైతులుగా తీర్చిదిద్దారు.

తిరుచిరాపల్లిలో తాయుమానవర్ కోవెలలో వీరికి గల సంబంధానికి రుజువు దొరుకుతోంది. ఆలయంలోని సౌందర్యలహరిలోని మొదటి 41 శ్లోకాల ఆనందలహరి, అక్కడ రాతిపై చెక్కబడి యుంది. ఇట్లా వీరి శ్లోకాలు లిపిబద్ధంగా ఉన్నాయి. తరువాత జంబుకేశ్వరం వెళ్ళి అమ్మవారికి తాటంకాలను మార్చారు. సౌమ్యమూర్తిగా అఖిలాండేశ్వరిని తీర్చిదిద్దారు. మిగిలిన 51 శ్లోకాలను పూర్తి చేసారని జనశ్రుతి.

శ్రీరంగంలో వైష్ణవులెదుర్కొనగా వారిని శాంత పరిచారు. అక్కడ జనాకర్షణ యంత్రాన్ని ప్రతిష్ఠించారు. ఆ క్షేత్రం, భూలోక వైకుంఠంగా ప్రసిద్ధిని పొందింది.

వైష్ణవులే కాదు, శైవులూ, శాక్తేయులూ వీరి నెదుర్కొన్నారు. అట్లాగే మధ్యార్జునంలో కూడా వివాదానికి దిగారు. ఓ స్వామి! నీవే సత్యాన్ని చెప్పాలని శంకరులు ప్రార్థించగా "సత్యం అద్వైతం" అనే మాట లింగం నుండి వినబడింది. ఆ లింగం నుండి అభయ హస్తం కనబడింది. అందరూ వీరి తత్త్వాన్ని ఆమోదించారు.

వీరి శివానంద లహరిని బట్టి వీరు మాయవరాన్ని దర్శించినట్లుంది. ఆ శ్లోకాన్ని బట్టి ఈశ్వరుడు మయూర రూపంలో నృత్యం చేసినట్లు, అమ్మవారు మయూరిగా ఉందని తెలుస్తోంది. అమ్మవారు, మయూరిగా మారిన ప్రాంతాన్ని మయూరం, లేదా గౌరీమయూరం, లేదా మాయవరం అంటారు. ఇపుడు దీనిని తమిళంలో తిరమయిలాడుతురై అంటారు.

చెన్నైలోని మైలాపురంలో అమ్మవారు, మయూరియై పూజించినట్లు కథ. తిరువొత్రియూర్ వెళ్ళిన శంకరులు, అక్కడకూ వెళ్ళే యుంటారు.

శివానందలహరిని, శ్రీశైలంలో వ్రాసి యుంటారు. ఆలయ గోపురం ముందు ద్వారంలో శంకరుల మూర్తి యుంది. శ్రీశైలం దగ్గర హాటకేశ్వరంలో ఒక మల్లీ చెట్టు దగ్గర, ఒక వాగు సమీపంలో కొంతకాలం నిష్ఠలో గడిపారు.

కన్నప్ప అనే భక్తుణ్ణి స్మరించారు కనుక కాళహస్తి వెళ్ళియుంటారు. అక్కడ అమ్మవారు జ్ఞానాంబ. అది ప్రసిద్ధ క్షేత్రం. తిరుపతి స్వామిని దర్శించి ధనాకర్షణ యంత్రాన్ని అక్కడ ప్రతిష్ఠించారు. అందుకే ఎప్పుడూ అక్కడ కానుకల వర్షం

పండర్ పూర్‌లో పాండురంగాష్టకం; ఒరిస్సాలో జగన్నాథాష్టకం వ్రాసేరు. ఆ ప్రదేశాలను దర్శించినట్లే.

ద్వారకలో మఠాన్ని స్థాపించారు. అచ్యుతాష్టకం, గోవిందాష్టకం, ఇంకా పెక్కు స్తోత్రాలు కృష్ణునిపై ద్వారకలో, మధురలో, బృందావనంలో వ్రాసి యుంటారు. అయోధ్యలో రామభుజంగ స్తోత్రం వ్రాసి యుండవచ్చు.

శివ స్తోత్రాలను కాశీలో వ్రాసేరు. దీనికి సాక్ష్యం, అన్న పూర్ణా స్తోత్రమే. కాశీ పంచకం, గంగాష్టకం, మణి కర్ణికాష్టకం మొదలైనవి వ్రాసేరు. యమునపై వీరి అష్టకం ఉంది. నర్మదలో సన్యాసం పుచ్చుకున్నారు కదా. నర్మదాష్టకం వ్రాసేరు.

తరువాత కాశ్మీరునకు వెళ్ళారు. విద్వాంసుల నోడించారు. అక్కడే శారదా పీఠాన్ని అధిరోహించారు. అక్కడ ఒక విద్వాంసురాలైన యువతికి తలమీద తలపాగా ఉన్నట్లుగా ఉండే ఒక ఆభరణాన్ని బహూకరించారు. దానిని తరంగం అంటారట. ఇప్పటికీ ప్రజల వాడుకలో ఇది ఉంది.

శ్రీనగర్‌లో శంకరాచార్య గిరి అనే పర్వతముంది. సుదూరమైన ఉత్తర ప్రాంతంలో వీరికట్టి గౌరవం లభించింది.

బదరి వెళ్ళినపుడు ఒక ముఖ్య సంఘటన జరిగింది. అక్కడ జ్యోతిర్మఠాన్ని స్థాపించారు. అక్కడ బదరీ నారాయణ విగ్రహం, అలకనందలో పడిందని,

స్వామియే శంకరులకు కలలో కనబడి చెప్పాడని దానిని వీరు వెలికి తీసి ప్రతిష్ఠించారని అంటారు. అక్కడ వేడి నీటికుండం ఉంది. దానిని తప్త కుండమని అంటారు.

అక్కడ ఎందరో వీరికి పాదాభివందనాలు చేసి జగద్గురువని కీర్తించారు. శంకరులు తమ గురు, పరమ గురువులకు వందనాలను చెయ్యాలని సంకల్పించగానే వారూ వీరిపై అనుగ్రహంతో అక్కడ సాక్షాత్కరించారు. వీరు దక్షిణమూర్తి అష్టకాన్ని చదివి ప్రతి శ్లోకానికి ఒకమారు సాష్టాంగ నమస్కారం వారి గురువులకు చేసారట.

శివ - శక్తి దర్శనం

'మాతా చ పార్వతీ దేవీ! పితాదేవో మహేశ్వరః' అని వీరు వ్రాసేరు. వీరు అవతార పురుషులైనా పిల్లవాని మాదిరిగా ఉండి భక్తిని ప్రదర్శించవద్దా? ఇంతవరకు అర్చామూర్తులను దర్శించారు. ఇపుడు సాక్షాత్తు శివపార్వతుల దర్శనానికి కైలాసానికి యోగశక్తి ద్వారా వెళ్ళినట్లు చెబుతారు.

అక్కడే శంకరుడు ఐదు స్ఫటికలింగాలనిచ్చాడు. ఈ మాట శివ రహస్యంలో, మార్కండేయ సంహితలోనూ ఉంది. కాశీలో ఇచ్చినట్లు శివరహస్యం చెప్పింది. వీటిని కైలాస లింగాలని అంటారు. ఇవి యోగలింగం, భోగలింగం, వీరలింగం, ముక్తి లింగం, మోక్ష లింగాలు, యోగలింగాన్ని కంచిలో భోగలింగాన్ని శృంగేరీ మఠంలో; వరలింగాన్ని నేపాల్‌లోని నీలకంఠ క్షేత్రంలో; ముక్తి లింగాన్ని కేదారంలో; మోక్షలింగాన్ని చిదంబరంలో ప్రతిష్ఠించారు. ఇవి అన్నీ స్ఫటిక లింగాలే.

శివపూజా సమయంలో మనం, ఈ దిగువ శ్లోకాన్ని పఠిస్తాం:

ఆపాతాళ నభస్థలాంత భువన బ్రహ్మాండమావి స్ఫురత్

జ్యోతిస్ఫాటిక లింగమౌళి విలసత్ పూర్ణేందు వాంతామృతై:

అస్తో కాప్లుత మేక మీ శమనిశం రుద్రానువాకాన్ జపన్

ధ్యాయే దీప్సిత సిద్ధయే ధ్రువపదం విప్రో భిషించేచ్ఛివం

ముందు భాగంలో ఎట్లా శివుణ్ణి ధ్యానం చేయాలో చెప్పింది. స్వామిని అంతటా వ్యాపించిన జ్యోతి స్వరూపునిగా ధ్యానించాలి. స్ఫటిక లింగంగా ఉన్నట్లు భావించాలి. అతని నెత్తిపై పూర్ణ చంద్రుడున్నట్లు ధ్యానించాలి. ఆకారం లేని మూర్తిపై పూర్ణచంద్రుడు ప్రకాశిస్తున్నాడు. ఆకారం ఉన్న మూర్తిపై తదియనాటి చంద్రుడుంటాడు. అందుకే వాటిని చంద్రమౌళీశ్వర లింగాలని అంటారు.

పూర్ణచంద్రుని నుండి అమృత స్రావం – ఆప్లుతం, అనగా దానిచే అభిషేకింపబడ్డాడు.. అందుకే అతనికి అభిషేకం చేస్తాం. ఒక్క చుక్క వేసినా సంతోషిస్తాడు.

ఈశ్వరుని లింగాకారంగానే ధ్యానించాలి. అందుకే ఆయన స్ఫటిక లింగాలనిచ్చాడు.

నిరాకారమైనదే అద్వైతానికి చేరువగా ఉంటుంది. అది ఆది, అంతము లేనిదని శ్లోకం అంటోంది. ఆ మాట అద్వైతానికి దగ్గరే. నిర్గుణ బ్రహ్మమునే పరమాత్మయని అద్వైతులంటారు. స్ఫటిక లింగానికి రంగు లేదు. అదీ అద్వైతానికి ఇష్టమే. పరబ్రహ్మలా శుద్ధమైనది. ఏ పువ్వును దాని దగ్గర పెడితే అదే రంగును చూపిస్తుంది.

అమృతంలో నెత్తి తడుపబడుట దయను చూపిస్తుంది. ఏది జ్ఞానామృతమో, ఏది చల్లనైనదో దానిచేత తడుపబడుతున్నాడు.

పంచ భూతాలున్నట్లుగా పంచలింగాల నిచ్చాడు. అతడు పంచ కృత్యపరాయణుడు. అతనికి ఐదు ముఖాలు.

తెలిసి కొన్నవాడు, తెలియబడేది, తెలిసికొను బుద్ధి, ఒక్కటే అంటుంది అద్వైతం. అదే త్రిపుటి. ఇక్కడ కూడా త్రిపుటి యుంది. ఇచ్చినవాడు శివుడు. తీసుకున్నవాడు శివుడు, ఈయబడినది శివతత్త్వము.

అసలు శంకరులే స్ఫటిక చంద్రమౌళీశ్వరులని ఒక శ్లోకం గుర్తుకు వస్తోంది. ఇది మాధవీయ శంకర విజయంలో ఉంది:

"మూర్ధని హిమకర చిహ్నం, నిటలే నయనాంక మంసయో శ్శూలం

వపుషి స్ఫటిక సవర్ణం ప్రాజ్ఞాస్తం మేనిరే శంభుం"

జ్ఞానులు, శిశురూపంలో నున్న శంకరులను చూసి రాబోవు విజయ చిహ్నాలను చూసారట. మూర్ధని హిమకర చిహ్నం = నెత్తిపై చంద్రుని గుర్తుంది. అనగా చంద్రమౌళిత్వం; నిటలేనయనం = నుదుటిపై మూడవనేత్రముంది. అంసయోః శూలం = భుజాలపై శూలముంది. వపుషి స్ఫటిక సవర్ణం = మొత్తం శరీరం అంతా స్ఫటికంలా ఉందని. ఇతణ్ణి శంభునిగా గుర్తించారు పెద్దలు.

అయ్యవారు లింగాలనిస్తే అమ్మవారు ఊరుకొంటుందా? ఆమె ఒక తాళపత్ర సంపుటినిచ్చింది. అదే దేవీ స్తోత్రాలలో మకుటాయమానంగా ఉండే సౌందర్యలహరి. మార్కండేయ సంహితలో సౌందర్య సారమని ఉంది. ఆనంద గిరీయం, దానిని అంబికాస్తవ సారం అన్నది. జగత్తును అనుగ్రహించడానికని = జగత్యను గ్రహాయ.

సౌందర్యలహరి యనగా సౌందర్యం యొక్క తరంగాలు. ఆమె సౌందర్య సముద్రం. స్తోత్రంలోని ఒక్కొక్క శ్లోకం, ఒక్కొక్క తరంగంలా ఉంటుంది.

ఆమెకనేక నామాలున్నాయి. ఇందు సుందరిగానూ నుతింపబడింది. సుందరీ విద్యకు ఆమె అధిష్ఠాత్రి. ఇది దశమహావిద్యలలో ఒకటి. దీనినే శ్రీవిద్యయని అంటారు. ఈమెయే త్రిపుర సుందరి. మూడు భువనాలలోనూ

ఇంతకుమించిన అందగత్తె లేదు. స్థూల సూక్ష్మ కారణ శరీరాలలో జ్ఞానానికి, దయకు నిలయమై అందమైన తల్లిగా అనగా త్రిపుర సుందరియైనది. ఆమె లలితాంబ.

శ్రీ చక్రాన్ని పూజ చేసేటపుడు చంద్రమౌళీశ్వరునకు శక్తిగా త్రిపుర సుందరిని ధ్యానిస్తాం. ఈమెకు చంద్రునితో సంబంధం ఉంది. పూర్ణ చంద్రుడు ఆయన నెత్తిపైనుండగా అందు మధ్యలో ఈమె యుంటుంది. "చంద్రమండల మధ్యగా" అని లలితా సహస్రనామాలలో ఒక నామం. ఈమెకు ప్రత్యేకమైన తిథి, పూర్ణిమయే. సాధన యొక్క చివరి దశలో చంద్రుని మాదిరిగా మన నెత్తిపై అమృతాన్ని కురిపిస్తుంది.

ఆ దివ్యదంపతులు, మధ్యాహ్నంలో తాపంతో బాధపడేవారికి అమృత కిరణాలను ప్రసరింపజేసి చల్లదనాన్ని కురిపిస్తారు. ఆయన చంద్రమౌళి. ఈమె త్రిపుర సుందరి. ఈమె నెత్తిపై చంద్రుడుంటాడు. లలితా సహస్రనామాలలో "చారు చంద్ర కళాధరా" అని యుంది.

దీనిని వీరు వ్రాసేరా? అమ్మవారిచ్చిందా? ఆమె ఈయగా లోకంలో వ్యాప్తి చేసారా? అనే సందేహాలు కల్గుతూ ఉంటాయి. ఈ కథ, అనేక శంకర విజయాలలో లేకపోయినా పరంపరగా వస్తోంది.

కథ ఇట్లా ఉంది. అమ్మవారు తాళపత్ర సంపుటినీయగా అది తీసుకొని వీరు తిరిగి వస్తూ ఉన్నప్పుడు కైలాసం నుండి మంత్రశాస్త్రం తరలింపబడుతూ ఉందని నందికేశ్వరుడు అడ్డుకొని దానిని లాగుకున్నాడట. కాని శంకరుల చేతిలో కొన్ని యుండిపోయాయట. 100 తాళ పత్రాలలో 59 నందికేశ్వరుడు లాగుకుంటే మిగతా 41 పత్రాలను శంకరులు తీసుకొని వచ్చారట.

అంతా చిక్కలేదని వీరు బాధపడుతూ ఉండగా అశరీరవాణి వినబడింది. "ఇదంతా నా క్రీడ. నీవు నా మిగతా 59 శ్లోకాలూ వ్రాయవలసింది. నీ మాటలలో వ్రాస్తే విందామని యుంది. మిగిలిన శ్లోకాలకు దీటుగా నీవు

వ్రాస్తే సంతోషిస్తాను" ఇది అమ్మవారే అందిట. వీరు వ్రాసి, ఇవి నేను వ్రాసేనా? అవి నీ పలుకులే అన్నారు.

'త్వదీయాభిర్వాగ్భి స్తవ జనని వాంచాంస్తుతిరియం'

ఈ 59 శ్లోకాలూ అమ్మవారి శిరస్సునుండి పాదాలవరకూ ఆమె రూపవర్ణనతో ఉంటాయి. అందు మూడవ శ్లోకంలో అనగా మొత్తం వందలోని 44వ శ్లోకంలో సౌందర్యలహరి అనే మాట ఉంటుంది. మొత్తం దీనిని సౌందర్యలహరి అని; మొదటి 41 శ్లోకాలను ఆనందలహరియని మిగిలిన 59 శ్లోకాలను సౌందర్య లహరియని అంటారు. మొదటిభాగంలో ఎనిమిదవ శ్లోకంలో ఆనందలహరి అనే పదం 'చిదానంద లహరీం' వాడబడింది.

మార్కండేయ సంహితలోనూ, ఆనందగిరీయంలోనూ సౌందర్యలహరి యని పేర్కొనబడకుండా సౌందర్య సారమని, అంబికాస్తవసారం అని చెప్పడం వల్ల ఈ కథకు బలం చేకూరింది. ఇది వాడుకలో నున్న కథ.

మొదటి భాగం అంతా మంత్రశాస్త్రమయం. నందికేశ్వరుడు కొంత దానిని తీసుకొని పోవడానికి విని సంతోషిస్తున్నాను. వీరు పూరించిన భాగం, కవిత్వంతో, భక్తితో, ఆమె సుందర రూపాన్ని వర్ణించడంలో దీనికి సాటివచ్చే గ్రంథం మరొకటి కనబడదు. వీరి గొప్పదనం లోకానికి ఇట్లా వెల్లడైనందులకు సంతోషం.

పరమేశ్వరుని ఆజ్ఞానుసారం శంకరులు శృంగేరిలో, కేదారంలో నీల కంఠంలో, కంచిలో నాల్గు లింగాలను స్థాపించారు. ఇక సిద్ధి పొందుతున్నా రనగా మోక్ష లింగాన్ని సురేశ్వరులకు చిదంబరంలో ప్రతిష్ఠించ వలసిందిగా ఇచ్చారట. ఈ మాట ఆనందగిరీయంలో ఉంది.

కంచి యొక్క ఘనత

దిగ్విజయ యాత్రయైన వెనుక చివరగా కాంచీపురానికి వచ్చారు. ఈ నగరం, ప్రాచీన సాహిత్యంలోనే పేర్కొనబడింది. ఇది ఒక గొప్ప విద్యాకేంద్రం. దేశం నలుమూలలనుండీ విద్యార్థులు వచ్చేవారు.

ఈ విద్యాకేంద్రానికే మరో పేరు ఘటికాస్థానం. సంస్కృత విశ్వవిద్యాలయం ఇక్కడ ఉంది. తమిళ గ్రంథమైన మణిమేఖలైలో అనేక మతనాయకులిందుండే వారని చెప్పబడింది. చరిత్ర పునరావృతం అవుతుందని అన్నట్లుగా శంకరుల కాలంలో జైన బౌద్ధాలు అస్తమించినా అవి తరువాతి కాలంలో తల ఎత్తినట్లు మత్తవిలాస ప్రహసనంలో కంచిలోని జైన బౌద్ధాల ప్రస్తావన ఉంది. ఇప్పటికీ బుద్ధ శిల్ప సంపద కంచిలో గోచరిస్తుంది. కంచిలో కొంత భాగానికి జినకంచియని పేరు.

ఈశ్వరుడు, అమ్మవారు, విష్ణువు – ఈ ముగ్గుర్నీ రత్నత్రయం అంటారు. వీరికి చెందిన దేవాలయాలు, ఇక్కడ ప్రసిద్ధిని పొందాయి. ఏకామ్రనాథుని ఆలయంలో పరమేశ్వరుని పృథ్వీలింగం ఉంది. కామకోష్ఠం, అమ్మవారికి చెందింది. విష్ణు కంచిలో వరదరాజ స్వామి యున్నాడు. వైష్ణవుల దివ్యదేశాలలో ఇది యొకటి. శ్రీరంగం, తిరుపతి తరువాత ఈ ఆలయాన్ని వైష్ణవులు తప్పక దర్శిస్తారు.

ఆనాడు విష్ణు కంచిని చిన్న కంచియని; శివకంచిని పెద్ద కంచియని అనేవారు. ఇవే కాకుండా షణ్మత మూర్తులున్నాయి.

కంచిలో వినాయకుని ఆలయం ఉంది. కొంత ప్రాంతాన్ని పిళ్ళైయార్ పాలయం అంటారు. కామాక్షి ఆలయంలో ఆరేడు వినాయక మూర్తులున్నాయి. కంచి పృథ్వీక్షేత్రం. గణపతి, పృథ్వీ తత్వానికి చెందినవాడు.

ఇక్కడ కుమార కొట్టంగా పిలువబడే ప్రాంతంలో సుబ్రహ్మణ్య స్వామిని కొలుస్తారు. తమిళంలో స్కంద పురాణాన్ని వ్రాసింది ఇక్కడే అని అంటారు. విశిష్టత ఏమిటంటే ఈశ్వరాలయం, అమ్మవారి ఆలయం మధ్యలో కుమారస్వామి ఆలయం ఉంది.

కంచిలో కచ్ఛపేశ్వరాలయంలో సూర్యాలయం ఉంది. ఇందే మయూరుడు వ్రాసిన మయూర శతకం, గోడలపై చెక్కబడింది. కనుక ఇది సూర్యక్షేత్రం కూడా.

ఇట్లా షణ్మతాలకు నిలయంగా కంచి ప్రసిద్ధి పొందింది. షణ్మతాలకు శంకరులకు ముందే ప్రసిద్ధి యుండడం వల్ల ఇక్కడికి చివరి రోజులలో శంకరులు వచ్చారు. లేదా షణ్మత స్థాపనాచార్యులైన తరువాత ఇది ప్రసిద్ధిని పొంది యుండవచ్చు. సప్తమోక్షపురులలో ఇది యొకటని చెప్పాను కదా!

ఇట్లా మతంలో, విద్యలో, రాజకీయాలలో వర్తకవాణిజ్యాలలో ప్రసిద్ధిని పొందడం వల్ల 'నగరేషు కాంచీ' అన్నారు.

కంచిలో శంకరులు

అన్ని పుస్తకాలూ, కంచిలో శంకరులున్నట్లు పేర్కొన్నాయి. ఆనంద గిరీయం, గురువంశ కావ్యం (శృంగేరి)లో కంచినుండే ఆర్గురు శిష్యులను పంపారని, షణ్మతాలను స్థాపించారని ఉంది. ఇక శంకరాభ్యుదయం, గోవింద నాథీయం, చిద్విలాసీయం, గురురత్న మాల గ్రంథాలు శంకరులిక్కడ సర్వజ్ఞ పీఠాన్ని అధిరోహించారని పేర్కొన్నాయి. బృహత్ శంకర, ప్రాచీన శంకర విజయాలను బట్టి జ్ఞాన పీఠం కాశ్మీరులో ఉంది. అయినా వారి జీవిత విశేషాలను బట్టి చూస్తే కొంతకాలం కంచిలో గడిపినట్లుంది. అసలు కంచినే కాశ్మీరమంటారని గోవింద నాథీయంలో ఉంది.

శివరహస్యం, మార్కండేయ సంహితలు ఇతిహాస పురాణాల వంటివి. వాటిల్లోను, కొన్ని శంకర విజయాలలోనూ కంచిలోనే వీరు తమ అవతారాన్ని చాలించారని చెప్పబడింది. కొన్ని పుస్తకాలలో కేదారనాథ్‌లో లేక బదరీ నాథ్‌లో అవతారం చాలించారు అని ఉంది.

వీటికి ఏకవాక్యత తీసుకొని రావడం కష్టం. వారేమీ స్వీయ చరిత్ర వ్రాయలేదు. తరువాత వచ్చినవారు అనేకాధారాలననుసరించి వ్రాసేరు. ప్రధానంగా చెప్పవలసిందేమిటంటే మనం వారి భక్తులం, శిష్యులం, పిల్లలం అని భావిస్తే చాలు. మనలో అణుమాత్రం ఎవరిపట్లా శత్రుత్వం లేకుండా అందరిపట్లా ప్రేమ, భక్తి ఉంటే చాలు. ఇక ఎట్టి పరిశోధన చేసినా అంతా దండుగే. సిద్ధ పురుషులు రెండు మూడు స్థలాలలో సిద్ధి పొందునట్లు కథలున్నాయి.

ముక్తి క్షేత్రంగా పిలువబడే కంచిలో వీరు ముక్తిని పొందారు. వీరికి ముక్తి అంటే ఏమిటి? వారే ముక్తి స్వరూపులు కదా! వారెప్పుడూ జీవన్ముక్తులే అట్లా భౌతిక శరీరాన్ని విడిచి పెట్టారు. నేను విదేహ ముక్తిని గురించి మాట్లాడుతున్నాను. కామాక్షి సన్నిధిలో జరిగినట్లుంది. బృహత్ శంకర విజయంలో అమ్మవారి సన్నిధిలో బ్రహ్మతత్వంలో లీనమైనట్లుంది.

'దేవ్యాః పురః పరతరే పురుషే విలీయే'

ప్రాచీన శంకర విజయంలోనూ ఇట్లాగే ఉంది.

కామాక్ష్యా సవిధే సజాతు నివసన్ ఉన్ముక్త లోక స్పృహో

దేహం స్వంవ్యపహాయ దేవ్యాస్సుధామ ప్రపేదేపరం

ఉన్ముక్తలోక స్పృహ=ప్రపంచ సంబంధం విడిచి పెట్టి అని ఉంది. వారికెప్పుడైనా బంధం ఉందా? లేదు. లోకానుగ్రహం కోసం పర్యటించారు. ధర్మ మార్గంలో నడిపించారు. అట్టి కోరికనూ విడిచి పెట్టారన్నమాట.

దేహం స్వంవ్యపహాయ – అమ్మవారి ఎదురుగా నిలబడి విడిచారని, ధామ ప్రపేదే పరం – స్వస్థలానికి వచ్చారు. అది ఏది? బ్రహ్మ స్వరూపమే కేరళీయ శంకర విజయంలో అట్టి పరమ పదాన్ని వీరు పొందినా, కాంచీపురంలో ఉన్న ఆలయంలో మోక్షదాతగా నున్నారని చెప్పబడింది. అనగా వారి మూర్తి ఆలయంలో ఉంది కదా.

కంచిలోని పూజా పద్ధతులను సంస్కరించారు. ఉగ్రరూపంలో నున్న అమ్మవారిని రాజరాజేశ్వరిగా తీర్చిదిద్దారు. వినాయకుని ఆలయం, ముక్తి మంటపం కాశీలో ఉన్నట్లు ఇక్కడా ఉంటాయి. విష్ణు కంచిలోని వరద రాజస్వామి ఆలయంలోని పూజాపద్ధతిని సంస్కరించారు. దానికి పడమరగా మా మఠం ఉంది.

వారక్కడ ఉండగా, అందరి క్షేమాన్ని కోరి అక్కడి రాజుతో కాంచీపురం శ్రీ చక్రాకారంగా నిర్మించాలని, అందు బిందుస్థానంలో కామాక్షి ఆలయం ఉండేటట్లు పట్టణాన్ని నిర్మించాలని చెప్పారట. ఆ రాజు, రాజసేనుడు అనే చోళరాజు.

శ్రీ చక్రాకారంగానే ఉంటుంది కంచి. ఎందుకిట్లా చేసారు? ఎన్నో దేవతామూర్తులున్నా ఇది ప్రధానంగా దేవీ క్షేత్రమే. శక్తిపీఠాలు 3, 18, 36, 51, 56, 64, 96, 108, 6400 సంఖ్యలో ఉన్నాయని అంటారు. ఇందు ప్రధానంగా కంచి పేర్కొనబడింది. ఇది అమ్మవారి నాభి పడినచోటు. ఇది నాభిపీఠం, నాభి శరీరం మధ్యలోనే ఉంటుంది. అట్లాగే కంచి ప్రపంచానికే నాభి వంటిది. కాంచి యనగా మొలనూలు. అదే ఒడ్డాణం. ఇది నాభికి కవచంలా ఉంటుంది. ఇట్లా మేరుతంత్రం, కామాక్షీ విలాసం, కంచి మాహాత్మ్యం చెప్పాయి. కంచి కామాక్షి జనరేటర్ వంటిది. అన్ని బల్బులు వెలగడానికి ఈమెయే కారణం .ఇది తెలివిడి చేయడం కోసం కంచి ప్రాంతంలో 50

శివాలయాలున్నా అమ్మవారి మూర్తి అక్కడ ఉండదు. సుందరేశ్వర ఆయలంలో మీనాక్షి; జంబుకేశ్వరంలో అఖిలాండేశ్వరి; కపాలీశ్వర కోవెలలో కర్పగ అంబాళ్ ఉంటారు కాని, కామాక్షి ఆలయంలో ఈశ్వరుడుండడు. నాల్గు వైపులా గోపురముంటుంది. నాల్గువైపులా రాజవీథి యుంది. ఇట్టి గౌరవం, ఏకామ్రనాథునికి గాని, వరద రాజస్వామికి గాని లేదు.

శ్రీ విద్యా శాస్త్రంలో చెప్పబడినట్లుగా నాల్గు చేతులలో ధనుస్సు, అంకుశం, పాశంతో ఉంటుంది. తానిచ్చిన విద్యా శాస్త్రాన్ని, సౌందర్య లహరిగా అందించారు శంకరులు. ఇట్లా అన్ని కారణాల వల్ల ఇది శంకరులకు ప్రధాన కేంద్రమైంది.

(నవ్వుతూ ఇట్లా అన్నారు స్వామి) – ఇదేమిటి? నిష్క్రియత్వాన్ని బోధించే అద్వైతమెక్కడ? క్రియాశక్తి స్వరూపమైన అమ్మవారెక్కడ? క్రియారహితురాలై, క్రియతో కూడినట్లుగా ఉంటుంది. శంభువుని నిష్క్రియుని శంకరునిగా మార్చి క్రియాసహితునిగా చేసింది. పరబ్రహ్మము, అవతారంగా వస్తే పరాశక్తినుండే శక్తిని పొంది నిర్వహిస్తాడు. ఇట్లా చేయడానికి ఆమె దయయే కారణం. జీవుణ్ణి స్వస్వరూపునిగా తెలిసికొనేటట్లు చేసేది ఆమెయే. అద్వైత మోక్షాన్ని ఇచ్చేది ఆమెయే. ఆమెయే జ్ఞాన దాత్రియని శంకరులకు తెలుసు.

శ్రీవిద్య, బ్రహ్మవిద్య రెండూ అద్వైతానికి దారి చూపించేవే. శివ శక్తుల సమ్మేళనాన్ని ప్రతిపాదించేవే. జ్ఞాన మార్గానికి దారి చూపిన శంకరులే ఉపాసన మార్గం యొక్క ప్రాముఖ్యాన్ని గుర్తించారు.

శివశక్తుల సమ్మేళనాన్ని గుర్తించే మఠాలలో చంద్ర మౌళీశ్వర అర్చనతో బాటు శక్తిపీఠాల అర్చన కూడా ఉంటుంది. కంచిలో కామాక్షి పీఠం; ద్వారకలో భద్రకాళి పీఠం, పూరీలో విమలాపీఠం, శృంగేరీలో శారదాపీఠం, బదరిలో పూర్ణగిరి పీఠాలున్నాయి.

అమ్మవారు, గర్భగృహంలో గుహలో, ఒక బిలాలయంలో ఉన్నట్లుంటుంది. ఆమె దగ్గర శ్రీ యంత్రాన్ని ప్రతిష్ఠించి ఉగ్రకళను బంధించి, సౌమ్యమూర్తిగా, ఆమెను తీర్చిదిద్దారు. గురు రహస్యంలో ఇట్లా శంకరులు చేసారని ఉండగా, మాకు పుణ్యం అయ్యేటట్లు చేసారని గురు రత్నమాలలో ఉంది:

"ప్రకృతించ గుహాశ్రయాం మహోగ్రాం
స్వకృతే చక్రవరే ప్రవేశ్య యోఽగ్రే
అకృతాశ్రిత సౌమ్యమూర్తిం ఆర్యాం
సుకృతం నః సచినోతు శంకరార్యః

అమ్మవారి ఎదురుగా ఇట్టి యంత్ర ప్రతిష్ఠ చేసినట్లు చిద్విలాసీయంలో ఉంది.

'కామాఖ్యా పురతో దేశే శ్రీచక్రం స్వయమాలిఖత్' ఆనంద గిరీయంలోనూ అట్లాగే ఉంది. ఇట్లా కామకోటి పీఠాన్ని ఉజ్జ్వలంగానే చేసారు.

వీరి శిష్యులు నలుమూలలా పర్యటించి గురువులందించిన షణ్మతాలను వైదిక పద్ధతిలో కొనసాగేటట్లు చేసారు.

ఒకే ఒక పరమాత్మ, నానా రూపాలను ధరిస్తున్నాడని, దానిని గుర్తించినవాడు సర్వజ్ఞుడౌతాడు. శంకరులీ అర్థంలోనే కాదు;శ్రు ఒకటి నుండే అనేక శాస్త్రాలు ఆవిర్భవించాయి. అన్ని శాస్త్రాలను అవలోకనం చేసినవాడు సర్వజ్ఞుడౌతాడు కదా! అతడే సర్వజ్ఞ పీఠాన్ని ఎక్కడానికి అర్హుడు.

ఏదైనా పని చేయాలన్న ఇదేమైనా బ్రహ్మవిద్యా అని అంటాం. అట్టి బ్రహ్మ విద్యలోనూ వీరు పారంగతులే. సర్వజ్ఞ పీఠం ఎక్కేటపుడు దాని క్రింద అనేకమైన మెట్లుంటాయి. ఒక్కొక్క మెట్టెక్కినపుడు ఒక్కొక్క విద్యలో, నిష్ణాతుడు ప్రశ్నిస్తాడు. వానికి సమాధానం చెప్పి పై మెట్టునెక్కాలి. చివరగా, సరస్వతియే ప్రశ్నిస్తుంది. సమాధానం చెప్పగలిగితే సింహాసనం మీద కూర్చుండడానికి అర్హత వస్తుంది. అట్లా ఎక్కగలిగారు.

వారి వాఙ్మయాన్ని పరిశీలిస్తే అనేక శాస్త్రాలలో పారంగతులైనట్లు తెలుస్తుంది. జ్యోతిశ్శాస్త్రంపై శంకరాచార్యం అనే పేరుతో పుస్తకమొకటుంది. ఒక సంగీత శాస్త్రజ్ఞుడు వచ్చి సంగీత శాస్త్రంలో గతి – గమనం – గీతం అనే మాటలు వస్తాయని వాటి సాంకేతిక విషయాలు మాకే తెలియవని అన్నపుడు శంకరులు 'గళే రేఖాః త్రిసో' అనే శ్లోకంలో సంగీత శాస్త్ర విషయాలను ముచ్చటించారని ఆశ్చర్య పడ్డాడు.

అంతేకాదు, కొబ్బరి చెట్టును వంచడమనే విద్యను నేర్చుకొన్నారని చెప్పాను. అట్లే చెప్పులు కుట్టేవాని విద్య గురించి చెప్పినట్లు లోగడ ఉపన్యాసాలలో చెప్పాను.

రామునకు పట్టాభిషేకం జరిగిన తర్వాత రాజ్యాన్ని పాలించాడు కాని శంకరులు అన్ని పనులూ నిర్వర్తించిన తరువాత వీరికి పీఠారోహణ ఉత్సవం జరిగింది. అనగా జ్ఞాన రాజ్యానికి తుది అంకం. శంకరాభ్యుదయం ఇట్లా చెప్పింది.

'కంపాతీరనివాసినీం అనుదినం కామేశ్వరీం అర్చయన్

బ్రహ్మానందమవిందత త్రిజగతాం క్షేమం కరో శంకరః'

రోజూ కంపా నదీతీరాన్ని ఆవాసంగా చేసుకొన్న కామేశ్వరిని అర్చించినట్లుంది.

ఇక్కడున్న మా మఠంలో చంద్రమౌళీశ్వర లింగాన్ని యోగ లింగమంటారు.. దీని ప్రస్తావన శ్రీహర్షుని నైషధంలో కూడా ఉన్నట్లు లోగడ ఉపన్యాసాలలో చెప్పాను.

రక్తాక్షి నామ సంవత్సరంలోని వైశాఖ మాసంలో పంచమినాటికి 32 సంవత్సరాలు పూర్తి అయ్యాయి. ఆ మాసంలో వచ్చే ఏకాదశినాడు సిద్ధి పొందారు.

చివరి ఘడియలలో ఉపదేశ మిమ్మనగా 'వేదో నిత్యమధీయతాం... మొదలైన అయిదు శ్లోకాలను చెప్పారు. దానినే సోపాన పంచకమని, ఉపదేశ పంచకమని అంటారు.

వాటి సారాంశం: ప్రతి దినమూ వేదాధ్యయనం చేయి. వైదిక కర్మలను ఆచరించు. వాటిని స్వలాభం కోసం కాకుండా ఈశ్వరపూజ చేస్తున్నట్లు భావించి ఫలితాలను వదులు. కోరికలతో కర్మలను విడిచి పెట్టు. పాపాలను పోగొట్టుకో.

సజ్జనులతో కలిసి యుండు. భక్తిని కలిగియుండు. శాంతాది గుణాలను అలవర్చుకో. ఓంకార మంత్రాన్ని అర్థించు. ఉపనిషద్వాక్యాల అర్థాలను విచారించు. కుతర్కాన్ని విడిచిపెట్టు. బ్రహ్మననే భావనతో ఉండు. గర్వాహంకారాలను వీడు. ఆకలి దప్పికలనే వ్యాధికి చికిత్స చేయి. లభించిన పదార్థంతో తృప్తి పడు. ద్వంద్వాల పట్ల ఓర్పుతో ఉండు. ఏకాంత ప్రదేశంలో మౌనంగా కూర్చుండి బ్రహ్మము పట్ల చిత్తాన్ని లగ్నం చేయి. ఈ జగత్తంతా పూర్ణ బ్రహ్మలో లీనమైనట్లుగా భావించు. ప్రారబ్ధ కర్మను అనుభవిస్తూ బ్రహ్మ నిష్ఠుడవై యుండు. జ్ఞానాన్ని ఆశ్రయించు. ఇట్లా వీరి ఉపదేశం సాగుతుంది.

ఆనందగిరీయంలో వీరు స్థూల శరీరాన్ని సూక్ష్మ శరీరంలో, మరల దానికి కారణ శరీరంలో లీనం చేసారని, అఖండ చైతన్యంలో లీనమైనారని ఉంది.

వారి చరిత్రలను విన్న తరువాత చిత్తశుద్ధి, శాంతి, ప్రేమలు మనలో కలిగితే వినిన ఫలం అపుడు దక్కుతుంది. వారు చెప్పినవి ఆచరణలో పెట్టినపుడే వినడమనేది సార్థకమౌతుంది. ఎంతో జ్ఞాన భక్తులకు సంబంధించిన సాహిత్యాన్ని అందించారు.

ఎవరేది చెప్పినా నీవు మోక్ష స్వరూపుడవే అని మాయవల్ల తెలిసికోలేక

పోతున్నావని, జ్ఞానం వల్ల అట్టి చీకటి తొలగించగలిగితే, నీవే బ్రహ్మవని తెలిసికొంటావని అన్నారు.

ఏదో శాశ్వత నరకం ఉంటుందని, అందు పాపులుంటారని చెప్పడం కాకుండా, అట్టి పాపులను కూడా పరమాత్మ స్వరూపులుగా తీర్చిదిద్దారు. 'మంగలం గురు శంకర' అనే కన్నడంలోని పాటలో మహాపాపిని కూడా పరమాత్మగా వీరు మార్చారని ఉంది.

జయ జయ శంకర అంటేనే మనలో నూత్న ఉత్సాహం వస్తుంది. అనండి. అంటూ మంచి పనులను చేయండి.

నమః పార్వతీ పతయే

హరహర మహాదేవ

అనువాదకుని పరిచయం

దేవరకొండ శేషగిరిరావు, గోకులం దగ్గర, అశోక్ నగర్, వెంకటాద్రి రెసిడెన్సీ,
కాకినాడ. సెల్ :- 9959288443, 9490908040 ఫోన్: 0884-2558423

రచనలు

1. శివసంహిత 2. ఘేరండ సంహిత 3. అనేక రామాయణాలలో సుందరకాండ 4. విజ్ఞానభైరవ తంత్రం 5.యోగయాజ్ఞవల్క్య సంహిత 6. పద్యావళి (అచ్చులో) 7. కబీర్ దోహాలు (అచ్చులో)

ప్రచురణ : విజ్ఞాన మంజూష, హైదరాబాద్

8. శాక్తానందతరంగిణి 9. కంచి మహాస్వామి వారి అద్వైత సాధన 10. గురుసంప్రదాయం 11. అద్వైతం 12. నమో నమః 13. షట్పదీ స్తోత్రం 14. సనాతనధర్మంలో సంఘసేవ 15. గణపతి 16. సాక్షి పరమాత్మ

ప్రచురణ : మహావిద్యాపీఠం, హైదరాబాద్

17. దశమహావిద్యలు 18. ఉత్పలదేవుని శివస్తోత్రావళి 19. అప్పయ్య దీక్షిత వరద రాజస్తవం 20. ఆత్మార్పణస్తుతి

ప్రతులకు: ఋషిపీఠం ప్రచురణలు, చిక్కడపల్లి, హైదరాబాద్

21. దినచర్య 22. యక్షప్రశ్నలు 23. ధర్మ సందేహాలు 24. గోరుముద్దలతో 25. వసుభాగుని పంచతంత్రకథలు 26. మంత్రయోగ సంహిత 27. పురాణాలలో రత్న పరీక్ష 28. పండుగలు – ఓషధులు – వైద్యం 29. సుభాషితరత్నాకరం 30. చాణక్య నీతిసూత్రాలు 31. తీర్థ యాత్ర 32. అభినవ గుప్తుని గీతార్థసంగ్రహం

ప్రతులకు: గొల్లపూడి వీరాస్వామి, కోటగుమ్మం, రాజమండ్రి

33. విగ్రహ పరమార్థం 34. శివస్వరోదయం

ప్రతులకు: రోహిణీ పబ్లికేషన్స్, కోటగుమ్మం, రాజమండ్రి

35. ఆనంద రామాయణం

ప్రతులకు: శివకామేశ్వరి గ్రంథమాల, కృష్ణలంక, విజయవాడ

36. మనదేవతలు – గణపతి 37. నటరాజు 38. శివుడు 39. విష్ణువు 40. కుమారస్వామి 41. సూర్యుడు 42. శక్తి 43. బ్రహ్మాది దేవతలు 44. లలితా సహస్రనామాలు 45. కబీర్‌పాటలు పాండురంగవిఠల 46. పార్వతి + లక్ష్మి + సరస్వతి

ప్రతులకు: రామకృష్ణ మఠం, దోమలగూడ, హైదరాబాద్

47. తంత్రపరిచయం 48. కులార్ణవతంత్రం

ప్రతులకు: శ్రీ జె. జగన్నాథ శర్మ, మాధవరం, వయా అంబాజీపేట

49. తంత్రం – వైద్యం 50. పురాణాలు – పర్యావరణం

ప్రతులకు: సాహితీ ప్రచురణలు, సూర్యారావుపేట, విజయవాడ

51. భారతీయ సంస్కారములు 52. శివసహస్రనామములు

ప్రతులకు: తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి

53. భారత కథలు– అంతరార్థం 54. భావమయం జగత్ 55. భావాంబర విహారం (ఇవి నేడు లేవు)

వృత్తి: (విశ్రాంత) ఆంధ్రోపన్యాసకత్వం

ప్రవృత్తి : భారతీయ సంస్కృతికి అర్చకత్వం

విజ్ఞాన మంజూష
ప్రచురణలు

1.	[illegible]	[illegible]	రూ. 75
2.	[illegible]	[illegible]	రూ. 75
3.	[illegible]	[illegible]	రూ. 100
4.	[illegible]	[illegible]	రూ. 100
5.	[illegible]	[illegible]	రూ. 75
6.	[illegible]	[illegible]	రూ. 100
7.	[illegible]	[illegible]	రూ. 100
8.	[illegible]	[illegible]	రూ. 100
9.	[illegible]	[illegible]	రూ. 100
10.	[illegible]	[illegible]	రూ. 100

ప్రతులకు:

అన్ని ముఖ్యమైన పుస్తక విక్రయ కేంద్రాలు

కంచి పరమాచార్య
అమృతవాణి

అనువక్త: దేవరకొండ శేషగిరిరావు

ప్రథమ భాగము
అద్వైతం

ద్వితీయ భాగము
నమో నమః

తృతీయ భాగము
షట్పదీ స్తోత్రం

చతుర్థ భాగము
సనాతన ధర్మంలో సంఘసేవ

పంచమ భాగము
గణపతి

షష్ఠ భాగము
సాక్షి పరమాత్మ

అష్టమ భాగము
అద్వైత సాధన

నవమ భాగము
గురు సంప్రదాయం

దశమ భాగము
అమృతవాణి-ఆణిముత్యాలు

ప్రచురణ
మహా విద్యాపీఠం
ఎయిర్‌ఫోర్స్ అకాడమీ రోడ్, దుండిగల్, హైదరాబాద్ - 500 043

అమృతవాణి-సప్తమ భాగము
శంకర విజయం